www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బుధవారం | 29-10-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 210 | వరంగల్

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, శుక్లపక్షం, తిథి: సప్తమి ఉ.9.23 తదుపరి అష్టమి, నక్షత్రం: ఉత్తరాషాఢ సా.5.30 తదుపరి శ్రవణం, వర్జ్యం: రా.9.40-11.20, దుర్ముహూర్తం: ఉ.11.35-12.21, అమృతఘడియలు: ఉ.10.38-12.21, రాహుకాలం: ఉ.12.00-1.30, సూర్యోదయం: 6.16, సూర్యాస్తమయం: 5.41

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem |Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



లొంగిపోయిన మావోయిస్టు నేతలు పుల్లూరి ప్రసాదరావు, బండి ప్రకాశ్‌లతో డీజీపీ శివధర్‌రెడ్డి, అదనపు డీజీపీ మహేశ్ భగవత్, ఎస్ఐబీ చీఫ్ సుమతి

మావోయిస్టు అగ్రనేతల లొంగుబాటు

జనజీవన స్రవంతిలోకి పుల్లూరి ప్రసాదరావు, బండి ప్రకాష్

మా సిద్ధాంతం ఓడిపోలేదు: పుల్లూరి 10

టికెట్ల పెంపు ఆదాయంలో కార్మికులకు 20 శాతం!

అలాగైతేనే ధరల పెంపునకు అనుమతిస్తాం

సినీ కార్మికుల వెల్ఫేర్ ఫండ్‌కు రూ.10 కోట్లు ఇస్తాం

వారి పిల్లలకు కృష్ణానగర్‌లో కార్పొరేట్ స్థాయి స్కూల్

జబ్బు పడ్డ వారికి ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్య సౌకర్యం

భారత ఫ్యూచర్ సిటీలో ఫైటర్స్ ట్రైనింగ్ కోసం స్థలం

నవంబరు ఆఖర్లో సినీ కార్మికుల సమస్యలపై చర్చిస్తాం

ఏమేం చేయబోతున్నామో డిసెంబరు 9న ఆదేశాలిస్తాం

అందరూ అండగా ఉంటే హాలీవుడ్‌ను హైదరాబాద్‌కు తెస్తా

సినీ కార్మిక సంఘాల అభినందన సభలో సీఎం రేవంత్



హైదరాబాద్‌లోని నల్లకుంట శంకరమఠంలో శృంగేరీ పీఠాధిపతి విధుశేఖర భారతీ స్వామి ఆశీర్వాదం తీసుకుంటున్న సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సినీ కార్మికులు తమ సంక్షేమం కోసం వెల్ఫేర్ ఫండ్‌ను ఏర్పాటు చేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆ సంక్షేమ నిధికి రూ.10 కోట్లు ఇస్తామని తెలిపారు. ఆ ఫండ్ నుంచే కష్టాల్లో ఉండే కార్మికులను ఆదుకోవాలని సూచించారు. సినిమాలకు టికెట్ల ధరలు పెంచడం ద్వారా వచ్చే ఆదాయం నుంచి కూడా 20 శాతాన్ని కార్మికుల వెల్ఫేర్ ఫండ్‌కు ఇవ్వాలన్నారు. అలా ఇస్తేనే టికెట్ల ధరల పెంపునకు ప్రభుత్వం

మిగతా 13వ పేజీలో...

డివిజన్‌కు ఇద్దరు మంత్రులు

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసం బాధ్యతలు అప్పగించిన మహేశ్‌గౌడ్, మీనాక్షీ నటరాజన్ 13

జూబ్లీహిల్స్‌లో మా మద్దతు కాంగ్రెస్‌కే

సీఎం రేవంత్‌తో భేటీలో కమ్మ సంఘాల నేతల ప్రకటన

కాంగ్రెస్ అభ్యర్థికే సూపర్‌స్టార్ కృష్ణ, మహేశ్ సేన మద్దతు 13

కులాల వారీగా ఓట్లపై దృష్టిపెట్టిన ప్రధాన పార్టీలు 13

సీఎం రేవంత్‌కు విధుశేఖర భారతీస్వామి ఆశీస్సులు

వేములవాడ ఆలయ అభివృద్ధి వివరాలను ఆయనకు తెలిపిన ముఖ్యమంత్రి 13



పది కోట్ల దిర్హామ్స్ చెక్‌తో అనిల్‌కుమార్

యూఏఈలో తెలుగోడికి 240 కోట్ల లాటరీ

అమ్మ సెంటిమెంట్‌తో జాక్‌పాట్ కొట్టిన బోళ్ల అనిల్ కుమార్

తల్లి పుట్టినరోజు తేదీ నెంబరునే లాటరీ టికెట్‌కు ఎంచుకున్నానని వెల్లడి

లాటరీలో దక్కిన మొత్తంలో కొంత భాగం సేవా కార్యక్రమాలకు అందజేస్తానని వెల్లడి

అబుదాబి, అక్టోబరు 28: అదృష్టం ఎప్పుడు, ఎవరిని వరిస్తుందో చెప్పలేం! అబుదాబిలో నివసిస్తున్న ఓ తెలుగు యువకుడికి అమ్మ సెంటిమెంట్ అనుకోని అదృష్టాన్ని తెచ్చిపెట్టింది. ఏకంగా రూ. 240 కోట్ల జాక్‌పాట్ వరించేలా చేసింది. యూఏఈ లాటరీ చరిత్రలోనే అతిపెద్ద మొత్తాన్ని గెలుచుకున్న ఈ అదృష్టవంతుడి పేరు అనిల్ కుమార్ బోళ్ల. 29 ఏళ్ల ఈ యువకుడి జీవితం ఒక్క రాత్రిలో పూర్తిగా మారిపోయింది. ఆయన ఇప్పుడు యూఏఈ దేశంలోనే అతిపెద్ద ధనవంతులలో ఒకరిగా నిలిచారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అనిల్‌కుమార్ చాలా కాలంగా అబుదాబిలో ఉంటున్నారు. అనిల్‌కు లాటరీ టికెట్లు కొనే అలవాటు ఉంది. ఈ క్రమంలోనే ఈనెల 18న జరిగిన లక్కీ డే డ్రాలో విజేతగా నిలిచారు. అందులో యూఏఈలోనే రికార్డు స్థాయిలో 100 మిలియన్ దిర్హామ్స్ (రూ. 240 కోట్లు) గెలుచుకున్నారు. "ఇందులో నా ప్రత్యేకత ఏమీ లేదు. అందరిలానే టికెట్ కొన్నాను. కానీ, అందులో ఆఖరి నంబరు చాలా

మిగతా 10వ పేజీలో...



సాగునీటి ప్రాజెక్టులపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

80 టీఎంసీలు తరలించేలా తుమ్మిడిహెట్టి

బ్యారేజీ ప్రతిపాదనలు సిద్ధం చేయండి

150 మీటర్ల ఎత్తుతో నిర్మించేలా ప్రణాళికలు

ఆ తర్వాతే మహారాష్ట్ర సీఎంను కలుద్దాం

తుమ్మిడిహెట్టి నుంచి మైలారం మీదుగా సుందిళ్లకు నీరు.. ప్రాజెక్టులపై సమగ్ర నివేదిక

సమీక్షలో అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం

హైదరాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రాణహిత ప్రాజెక్టులో భాగంగా చేపట్టనున్న తుమ్మిడిహెట్టి బ్యారేజీని 80 టీఎంసీల నీటిని తరలించేలా నిర్మించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆ మేరకు తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మాణ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని చెప్పారు. మంగళవారం ఆయన పోలీస్ కమాండ్ కంట్రోల్‌రూమ్‌లో నీటిపారుదల ప్రాజెక్టులపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో పాటు నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్‌పాటిల్, ఈఎన్‌సీ మహ్మద్ అంజద్ హుస్సేన్‌తో

మిగతా 14వ పేజీలో...

ప్రభుత్వ భూములకు జీఐఎస్ ఆధారిత డిజిటల్ రికార్డులు 14



చేయని నేరానికి శిక్షకు గురైతే నష్ట పరిహారం

యోచిస్తున్న సుప్రీంకోర్టు 2

ప్రాథమిక హక్కులు కోల్పోయిన కేసులను పరిగణనలోకి తీసుకునే చాన్స్

సహకరించాలని ఏజీకి సూచన

తప్పుడు సాక్ష్యాలు సృష్టిస్తారా? 2

ముగ్గురు పోలీసులపై మద్రాస్ హైకోర్టు ఆగ్రహం.. రూ.10 లక్షలు జరిమానా

నెల రోజుల్లో బాధితునికి ఇవ్వాలన్న బెంచ్

పోలీసులపై శాఖాపరమైన విచారణ జరపాలని డీజీపీకి ఆదేశం

కర్ణాటక సీఎం సిద్ధరామయ్యకు ఎదురుదెబ్బ 2

ప్రభుత్వ స్థలాల్లో ప్రైవేటు కార్యకలాపాల నిషేధంపై ఆ రాష్ట్ర హైకోర్టు స్టే

ప్రాథమిక హక్కులకు భంగమని వ్యాఖ్య

కోర్టు స్టేతో ఆర్‌ఎస్ఎస్ పథసంచలనాలకు తొలగిన అడ్డంకి

అర్హత ఉంటేనే.. సోషల్ మీడియా కామెంట్!

చట్టాలు, ఆరోగ్యం, ఆర్థిక అంశాలపై మాట్లాడాలంటే తగిన నైపుణ్యం ఉండాలి

డిగ్రీ పట్టా, ప్రొఫెషనల్ లైసెన్స్ లేదా సర్టిఫికేషన్ వంటి ఆధారాలు చూపాలి

సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లకు చైనా కొత్త నిబంధనలు 2





గాలులకు విశాఖ నగరంలోని సీతమ్మధార ప్రాంతంలో కారుపై పడిన భారీ వృక్షం; ఓ పునరావాస కేంద్రంలో ఆహార పంపిణీ

మొంథా బీభత్సం

గాలులు, వర్షాలతో ఏపీని కుదిపేసిన తుఫాన్

అర్ధరాత్రి సమయానికి తీరం దాటిన 'ముప్పు'.. బందరు వద్ద 100 కిలోమీటర్ల వేగంతో గాలులు

పలు తీర గ్రామాల్లో అలుముకున్న చీకట్లు.. నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో భారీగా వర్షాలు

ప్రభావిత ప్రాంతాల్లో కుప్పకూలిన వృక్షాలు.. గోదావరి జిల్లాల్లో చెట్లు కూలి ఇద్దరు మృతి..

నెల్లూరు జిల్లాలో వాగులో ఒకరి గల్లంతు.. ఉలవపాడు, కావలిలో 17 సె.మీ. వర్షం

నేడూ కొనసాగనున్న భారీ వర్షాలు.. పునరావాస కేంద్రాలకు 75 వేల మంది 12

విమానాలకు అంతరాయం

విజయవాడ, విశాఖ, రాజమండ్రికి రాకపోకలు సాగించే 18 సర్వీసుల రద్దు 12

పలు రైళ్లను రద్దుచేసిన దక్షిణమధ్య రైల్వే

రేపు, ఎల్లుండి హైదరాబాద్-విశాఖ మధ్య మరో 3 ఎక్స్‌ప్రెస్ రైళ్ల రద్దు

నేడు రాష్ట్రవ్యాప్తంగా భారీ, అతి భారీ వర్షాలు

రష్యా సహకారంతో పౌర విమానాల తయారీ

దేశంలో ఇదే తొలిసారి

200 ఎస్‌జే-100 విమానాల తయారీకి రష్యా సంస్థ యూఏసీతో హాల్ కీలక ఒప్పందం 2

టైర్-2, టైర్-3 నగరాల అనుసంధానం కోసం..

ఉడాన్ పథకంలో ఇది గేమ్ ఛేంజర్: హాల్

ఒక్కో విమానంలో 103 సీట్లు.. నిర్వహణ ఖర్చు తక్కువ



ఎస్‌జే-100 విమానాల తయారీకి మాస్కోలో ఎంవోయూ ప్రతాలను మార్చుకుంటున్న యూఏసీ, హాల్ ప్రతినిధులు



ట్రంప్ చెప్పినట్లే..?

రష్యా చమురు కొనుగోళ్లు బంద్!

అమెరికా ఆంక్షలతో నిలిపేసిన భారత రిఫైనరీలు

ఇతర దేశాల నుంచి కొనుగోలుకు ఏర్పాట్లు

స్పాట్ మార్కెట్లో కొనుగోళ్లు చేపట్టిన రిలయన్స్!

రెండు కంపెనీలపైనే ఆంక్షలు.. ఇతర రష్యా కంపెనీల నుంచి దిగుమతికి ప్రయత్నిస్తామంటున్న రిఫైనరీలు!

అమెరికా నుంచి పెరిగిన చమురు దిగుమతులు

న్యూఢిల్లీ, అక్టోబరు 28: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పినట్టుగానే రష్యా నుంచి చమురు దిగుమతులను భారత్ తగ్గించుకుంటోందా? రష్యా చమురు కంపెనీలపై అమెరికా ఆంక్షల ప్రభావంతో భారత రిఫైనరీలు ఇతర దేశాల నుంచి చమురు కొనుగోళ్లు చేపట్టక తప్పడం లేదా? ఇదే సమయంలో అమెరికా నుంచి భారత్‌కు భారీగా చమురు దిగుమతులు పెరిగాయా?.. ఈ ప్రశ్నలన్నింటికీ భారత రిఫైనరీ, పెట్రోలియం

మిగతా 2వ పేజీలో

సమాచారం ఇవ్వని అధికారులకు జరిమానా

సమాచార హక్కు చట్టం అమలులో నిర్లక్ష్యంపై కమిషన్ సీరియస్

ఒక కేసులో డీఈఈకి రూ. 5 వేల జరిమానా

మరో కేసులో పీఆర్‌వోకు రూ. 2 వేలు

కమిషనర్ పీవీ శ్రీనివాసరావు ఆదేశాలు

రాష్ట్రం ఏర్పాటైన తర్వాత ప్రభుత్వ అధికారులకు జరిమానా విధించడం ఇదే ప్రథమం



హైదరాబాద్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం అమల్లో నిర్లక్ష్యం వహించిన ఇద్దరు ఉన్నతాధికారులకు రాష్ట్ర సమాచార కమిషన్ జరిమానా విధించింది. నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన వివరాలు ఇవ్వాలని ఎస్.జంగయ్య అనే వ్యక్తి 2024 ఫిబ్రవరి 24న నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఎస్ఈ కార్యాలయంలో ఆర్టీఐ యాక్ట్ కింద దరఖాస్తు సమర్పించారు. దానికి సంబంధించిన సమాచారాన్ని నెలరోజుల్లో

మిగతా 12వ పేజీలో...

8వ వేతనసంఘం విధివిధానాలకు కేంద్రం ఆమోదం

వచ్చే ఏడాది జనవరి 1 నుంచి సిఫారసులు అమలయ్యే అవకాశం

కమిషన్‌కు జస్టిస్ రంజనా దేశాయ్ సారథ్యం

50 లక్షల మంది ఉద్యోగులు, 69 లక్షల మంది పింఛనుదార్లకు ప్రయోజనం

యూరియాయేతర ఎరువులపై సబ్సిడీ పెంపు

బిహార్ ఎన్నికల వేళ ఎన్డీఏ సర్కారు కీలక నిర్ణయాలు



న్యూఢిల్లీ, అక్టోబరు 28: లక్షలాది మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదార్లకు కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. 8వ వేతన కమిషన్ విధివిధానాలకు ఆమోదం తెలిపింది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి రంజనా ప్రకాశ్ దేశాయ్ కమిషన్‌కు సారథ్యం వహించనున్నారు. వచ్చే ఏడాది జనవరి 1వ తేదీ నుంచి కమిషన్ సిఫారసులు అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. ఫలితంగా 50 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 69 లక్షల మంది పింఛనుదార్లకు ప్రయోజనం చేకూరనుంది. మంగళవారం ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర క్యాబినెట్ 8వ వేతన సంఘం విధివిధానాలకు ఆమోదం తెలుపుతూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రభుత్వం ఒక ప్రకటన విడుదల చేసింది. దీని ప్రకారం.. 8వ వేతన సంఘం ఏర్పాటైనప్పటి నుంచి 18 నెలల్లోపు తుది నివేదికను ప్రభుత్వానికి

మిగతా 2వ పేజీలో...

అమెజాన్‌లో 30 వేల ఉద్యోగుల తొలగింపు? 2

అర్హత ఉంటేనే సోషల్ మీడియా కామెంట్!

- ఆరోగ్యం, ఆర్థిక అంశాలపై మాట్లాడాలంటే నైపుణ్యం ఉండాలి
- డిగ్రీ పట్టా, ప్రొఫెషనల్ లైసెన్స్ లాంటి ఆధారాలు చూపాలి
- సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల విషయంలో చైనా కొత్త రూల్స్



న్యూఢిల్లీ, అక్టోబరు 28: నేటి టెక్ యుగంలో సోషల్ మీడియాలో ఇన్‌ఫ్లుయెన్సర్లు చేసే పోస్టులు, వారు చెప్పే అంశాలు ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతుంటాయి. ఎక్కువ మంది ఫాలోవర్లను సంపాదించుకొనేందుకు తగిన అర్హతలు లేకుండానే క్రియేటర్లు ఆరోగ్య సూచనల నుంచి ఆర్థిక పరమైన అంశాలపై వరకు సూచనలు చేస్తుంటారు. వారు చెప్పేవన్నీ నిజమని కొంత మంది భావిస్తుంటారు. ఈ విధంగా తప్పుడు సమాచారం వ్యాప్తి అవుతున్న నేపథ్యంలో చైనా పలు కీలక నియంత్రణలు తీసుకొచ్చింది. ఆరోగ్యం, చట్టాలు, విద్య, ఆర్థికం వంటి కీలక అంశాలపై ఇన్‌ఫ్లుయెన్సర్లు తమ సోషల్ మీడియా ఖాతాల్లో చర్చించాలంటే తగిన అధికారిక అర్హత ఉండాలని పేర్కొంది. ఈ మేరకు ఈనెల 25 నుంచి 'కొత్త ఇన్‌ఫ్లుయెన్సర్ చట్టం' ఆ దేశంలో అమల్లోకి వచ్చింది. దీని ప్రకారం ఇన్‌ఫ్లుయెన్సర్లు పైన పేర్కొన్న అంశాలపై పోస్టులు చేయాలంటే తమ నైపుణ్యానికి సంబంధించిన డిగ్రీ పట్టా, ప్రొఫెషనల్ లైసెన్స్ లేదా సర్టిఫికేషన్ వంటి ఆధారాలు చూపాల్సి ఉంటుందని మొరాకో న్యూస్ నివేదించింది. నకిలీ సమాచారాన్ని కట్టడి చేసేందుకు, తప్పుదారి పట్టించే సలహాల నుంచి ప్రజలను కాపాడే లక్ష్యంతో ఈ నిబంధనలు తీసుకొచ్చినట్లు సైబర్‌స్పేస్ అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ చైనా (సీఏసీ) పేర్కొంది. క్రియేటర్ల వివరాలు, వారి పోస్టులను వెరిఫై చేయాల్సిన బాధ్యత డౌయిన్ (టిక్‌టాక్ చైనా వెర్షన్), బిలిబిలి, వీబో వంటి సామాజిక మాధ్యమ వేదికలపై ఉంటుంది. ఉదాహరణకు అధ్యయనాల నుంచి సమాచారం ఎప్పుడు స్వీకరించారో, వారి వీడియోలు ఏఐ ఆధారిత కంటెంట్‌ను ఎప్పుడు ఉపయోగిస్తాయో ఇన్‌ఫ్లుయెన్సర్లు స్పష్టంగా చెప్పాలి. 'ఎడ్యుకేషన్' కంటెంట్ పేరుతో కోవర్ట్ ప్రమోషన్లను నియంత్రించేందుకు మెడికల్ ఉత్పత్తులు, సప్లిమెంట్లు, ఆరోగ్యకరమైన ఆహారంపై ప్రకటనలను సీఏసీ నిషేధించింది.

ప్రామాణికత కోసమా.. నియంత్రణా?

ఆన్‌లైన్ కంటెంట్‌పై విశ్వాసాన్ని పెంపొందించడం, కచ్చితత్వాన్ని నిర్ధారించేందుకు కొత్త నిబంధనలు తీసుకొచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. అయితే ఇవి డిజిటల్ సెన్సార్‌షిప్‌కు కొత్త రూపమని విమర్శకులు చెబుతున్నారు. కొన్ని అంశాలపై ఎవరు చర్చించాలనే దానిపై పరిమితి విధించడం ద్వారా.. స్వతంత్ర గొంతులను ప్రభుత్వం అణచివేయాలని అనుకుంటోందని పలువురు విమర్శిస్తున్నారు. 'నైపుణ్యం' అనేదానికి నిర్వచనం అస్పష్టంగా ఉందని, ఆన్‌లైన్‌లో ఎవరు మాట్లాడాలనే దానిపై అధికారులకు అమితమైన అధికారాన్ని ఇస్తోందని అంటున్నారు. ఇదే సమయంలో నూతన చట్టాన్ని కొంత మంది చైనీస్ నెటిజన్లు స్వాగతిస్తున్నారు. ఇది ఆన్‌లైన్ చర్చలకు మరింత విశ్వసనీయత తీసుకొస్తుందని పేర్కొన్నారు.

ఈపీఎఫ్‌వో వేతన పరిమితి 25 వేలకు పెంపు?

న్యూఢిల్లీ, అక్టోబరు 28: ఈపీఎఫ్‌వో పరిధిలోకి వచ్చే ప్రైవేటు ఉద్యోగులు, కార్మికుల గరిష్ఠ మూల వేతనాన్ని (బేసిక్ పే) రూ.25 వేలకు పెంచేందుకు రంగం సిద్ధమవుతోంది. ప్రస్తుతం గరిష్ఠంగా రూ.15 వేల వరకు మూల వేతనమున్న ఉద్యోగులంతా తప్పనిసరిగా ఈపీఎఫ్‌వో పరిధిలోకి వస్తున్నారు. ఆపై వేతనమున్న ఉద్యోగులు, కార్మికులు ఈపీఎఫ్‌లో చేరడం తప్పనిసరికాదు. ఈపీఎఫ్‌వో పరిధిలోకి వచ్చిన ఉద్యోగులకు వారి పదవీ విరమణ తర్వాత ఈపీఎఫ్ కింద ఏకమొత్తంలో సొమ్ము చేతికి అందుతుంది. దానికితోడు ఎంప్లాయీస్ పెన్షన్ పథకం (ఈపీఎస్) కింద జీవితాంతం నిర్ణీత మొత్తంలో పెన్షన్ కూడా వస్తుంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా కనీస వేతనాలు పెరిగిన నేపథ్యంలో.. చాలా మంది ఈపీఎఫ్‌వోలో పరిధిలోకి రాకుండా పోతున్నారని, దీనితో జీవిత చరమాంకంలో వారికి ఆదాయం, స్థిరమైన పెన్షన్ అందకుండా పోతున్నాయనే భావన ఉంది. ఈ క్రమంలోనే ఈపీఎఫ్‌వో పరిధిలోకి వచ్చే మూల వేతన పరిమితిని రూ.25 వేలకు పెంచాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు ఈపీఎఫ్‌వో వర్గాల సమాచారం. మరో రెండు నెలల్లో జరిగే ఈపీఎఫ్‌వో సెంట్రల్ బోర్డు సమావేశంలో దీనిపై నిర్ణయం వెలువడనున్నట్లు తెలిసింది. ఈ పెంపు వల్ల సుమారు 10 లక్షల మంది అదనంగా ఈపీఎఫ్‌వో పరిధిలోకి వస్తారని అంచనా.

భారత్‌లో పౌర విమానాల తయారీ

- రష్యా సంస్థ యూఏసీతో హాల్ కీలక ఒప్పందం
- దేశంలోనే 200 ఎస్‌జే-100 విమానాల ఉత్పత్తి

న్యూఢిల్లీ, అక్టోబరు 28: భారత్‌లోనే తొలిసారిగా పూర్తిస్థాయి ప్రయాణికుల విమానాలు తయారు కాబోతున్నాయి. రష్యాకు చెందిన యునైటెడ్ ఎయిర్‌క్రాఫ్ట్ కార్పొరేషన్ (యూఏసీ) సహకారంతో హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హాల్).. భారత్‌లోనే ఎస్‌జే-100 విమానాలను తయారు చేయనుంది. ఈ మేరకు ఇరు సంస్థలు ఒప్పందం చేసుకున్నాయి. ట్విన్ ఇంజన్, న్యారో బాడీతో నిర్మించనున్న ఈ విమానాలు ఉడాన్ పథకం కింద స్వల్ప దూర ప్రయాణాలకు మరింత ఊతమివ్వనున్నాయని హాల్ మంగళవారం తెలిపింది. టైర్-2, టైర్-3 నగరాల మధ్య ప్రాంతీయ అనుసంధానం పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం 2016లో ఉడాన్ పథకాన్ని ప్రారంభించింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 200కిపైగా ఎస్‌జే-100 విమానాలను 16 విమానయాన సంస్థలు నడుపుతున్నాయి. రష్యాకు చెందిన యూఏసీ వెబ్‌సైట్‌లో పొందుపరచిన వివరాల ప్రకారం ఎస్‌జే-100 చిన్న పరిణామం కలిగిన విమానం. దీనిలో 103 మంది ప్రయాణించవచ్చు. 3,530 కిలోమీటర్ల పరిధిలోని ప్రయాణాలకు ఇది అనుకూలంగా ఉంటుంది. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేస్తున్నందున అమెరికా అదనపు సుంకాలు విధిస్తున్న తరుణంలో భారత్-రష్యా మధ్య ఈ కీలక ఒప్పందం కుదరడం గమనార్హం.

లుఫ్తాన్సా విమానంలో ఘర్షణ

- ఇద్దరు టీనేజర్లను ఫోర్క్‌తో పొడిచి, మహిళను కొట్టిన తెలుగు యువకుడు


ప్రణీత్

న్యూఢిల్లీ, అక్టోబరు 28: షికాగో నుంచి ఫ్రాంక్‌ఫర్ట్ వెళుతోన్న లుఫ్తాన్సా విమానంలో ప్రణీత్ కుమార్ ఉసిరిపల్లి(28) అనే తెలుగు యువకుడు శనివారం ఇద్దరు టీనేజర్లను ఫోర్క్‌తో పొడిచి గాయపరిచాడు. అంతేగాక విమానం సిబ్బందిపైనా దాడికి ప్రయత్నించాడు. దీంతో ఆ విమానాన్ని అత్యవసరంగా బోస్టన్ అంతర్జాతీయ విమానాశ్రయానికి మళ్లించారు. మారణాయుధంతో ఇతరులకు హాని చేసేందుకు ప్రయత్నించినట్లు అతడిపై మసాచుసెట్స్ డిస్ట్రిక్ట్ అటార్నీ కార్యాలయం అభియోగాలు మోపింది. విమానంలో ఇద్దరు 17 ఏళ్ల బాలురపై మెటల్ ఫోర్క్‌తో దాడి చేసిన ప్రణీత్ కుమార్ వారిలో ఒకరి భుజంపై, మరొకరి తల వెనుక పొడిచాడు. పరిస్థితిని అదుపు చేసేందుకు వచ్చిన విమానం సిబ్బందికి తన చేతివేళ్లను తుపాకీలా చూపుతూ ట్రిగ్గర్ నొక్కినట్లు చేసి బెదిరించాడని అధికారులు చెప్పారు. అంతేగాక మరో మహిళా ప్రయాణికురాలిని కూడా చెంపపై కొట్టి విమానం సిబ్బంది ఒకరిని కూడా కొట్టేందుకు ప్రయత్నించాడని పేర్కొన్నారు. ప్రణీత్ గతంలో విద్యార్థి వీసాపై అమెరికాలో మాస్టర్స్ చదివాడని, ప్రస్తుతం ఎటువంటి వీసా లేకుండానే ఉంటున్నాడని తెలిపారు. అతడి నేరాలు నిర్ధారణ అయితే దాదాపు 10 ఏళ్ల జైలుశిక్ష, 2,50,000 డాలర్ల జరిమానా విధించే అవకాశం ఉంది.

కేసులో తప్పుడు సాక్ష్యాలు సృష్టిస్తారా?

- ముగ్గురు పోలీసులపై మద్రాస్ హైకోర్టు ఆగ్రహం
- రూ.10 లక్షల ఫైన్.. బాధితుడికి ఇవ్వాలని ఆదేశం

చెన్నై, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఒక వ్యక్తిని దోషిగా నిర్ధారించేందుకు మూకుమ్మడిగా తప్పుడు సాక్ష్యాలు సృష్టించిన ఓ ఎస్సైతో పాటు ఇద్దరు కానిస్టేబుళ్లకు మద్రాస్ హైకోర్టు రూ.10 లక్షల జరిమానా విధించింది. ఆమొత్తాన్ని నెల రోజుల్లో బాధితునికి చెల్లించాలని ఆదేశించింది. అంతేగాక ఆ ముగ్గురిపైనా శాఖాపరమైన విచారణ జరిపి, నెల రోజుల్లోగా చర్యలు తీసుకోవాలని, ఆ వివరాలను తమ ముందుంచాలని రాష్ట్ర డీజీపీని ఆదేశించింది. తప్పుడు సాక్ష్యాల కారణంగా జైలు శిక్ష అనుభవిస్తున్న వ్యక్తిపై ఉన్న కేసును కొట్టివేసింది. ఈ మేరకు హైకోర్టు మదురై ధర్మాసనం న్యాయమూర్తి జస్టిస్ కేకే రామకృష్ణన్ ఇటీవల తీర్పు వెలువరించారు. 2021 జూన్ 26వ తేదీన మదురై నగరంలోని ఢిల్లీర్ నగర్ పోలీస్ స్టేషన్ ఎస్సైకు ఓ ప్రాంతంలో గంజాయి అక్రమ వ్యాపారం జరుగుతున్నట్టు సమాచారం అందింది. ఆ మేరకు తన బృందంతో కలిసి వెళ్లిన ఎస్సై.. అక్కడ 24 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఏ1 ఇచ్చిన సమాచారం మేరకు మొత్తం ఏడుగురిని అరెస్టు చేశారు. ఈ కేసును విచారించిన కిందికోర్టు 2023 మార్చి 15వ తేదీన కొంతమంది నిందితులను జువెనల్‌కు తరలించింది. దీనిని సవాల్ చేస్తూ ఒకరు మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ అప్పీలుపై విచారణ జరిపిన ధర్మాసనం ఇటీవల తీర్పు వెల్లడించింది. ఈ కేసులో సహనిందితుడైన ఏ1 ఇచ్చిన సమాచారం తప్ప అప్పీలుదారు వద్ద గంజాయి ఉన్నట్టు నిరూపించే ఎలాంటి ఆధారాలు లేవని పేర్కొంది. గంజాయి స్వాధీనం చేసుకున్న సమయంలో ఎస్సై తన చేతిరాతతో రికార్డు రాసినట్టు పేర్కొన్నారని, కానీ కోర్టులో టైప్ చేసిన పత్రాలు సమర్పించారని తద్వారా ఆ పత్రం కల్పితమైనదని తేలిపోయిందని పేర్కొంది.

మొంథా ప్రభావంతో చెన్నైలో 12 విమానాలు రద్దు

చెన్నై, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): 'మొంథా' తుఫాన్ ప్రభావంతో తమిళనాడు రాజధాని చెన్నైతోపాటు తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్పట్టు, కడలూరు తదితర జిల్లాల్లో మంగళవారం విస్తారంగా వర్షం కురిసింది. భారీ వర్షాలకు చెన్నై శివారు ప్రాంతాలు, తిరువళ్లూరు జిల్లాలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. బడులకుసెలవులు ప్రకటించారు. చెన్నై నుంచి రాకపోకలు సాగించాల్సిన 12 విమానాలు, కొన్ని రైళ్లు రద్దయ్యాయి. చెన్నై నుంచి విశాఖపట్నానికి వెళ్లే 3 విమాన సర్వీసులు, విశాఖపట్నం నుంచి చెన్నైకి వచ్చే 3 విమాన సర్వీసులు, రాజమండ్రికి ఉదయం 10గంటలకు వెళ్లి మధ్యాహ్నం తిరిగి రావాల్సిన సర్వీసులు, విజయవాడ వెళ్లి చెన్నైకి తిరిగొచ్చే నాలుగు విమాన సర్వీసులను కూడా రద్దు చేశారు. ఇక తుఫాన్ కారణంగా పలు రైళ్లు ఆలస్యంగా బయలుదేరి వెళ్లాయి.

ట్రంప్ చెప్పినట్లే?



(మొదటి పేజీ తరువాయి)

సంస్థలు అవుననే సమాధానమే ఇస్తున్నాయి. రష్యా నుంచి చమురు దిగుమతులు నిలిపివేస్తామని ప్రధాని మోదీ తనకు హామీ ఇచ్చారని ఇటీవల ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. మరోవైపు రష్యాకు చెందిన భారీ చమురు సంస్థలు ల్యూకోయిల్, రాస్‌నెఫ్ట్‌లపైనా ఆర్థిక ఆంక్షలు విధించారు. అటు యూరోపియన్ యూనియన్ కూడా పలు ఆంక్షలు విధించింది. ఈ క్రమంలో రష్యా నుంచి చమురు కొనుగోళ్లు నిలిపివేయక తప్పడం లేదని పెట్రోలియం మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. ప్రభుత్వ రంగం సంస్థ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) ఇప్పటికే బహిరంగ మార్కెట్ నుంచి చమురు కొనుగోలు కోసం టెండర్ నోటీసు జారీ చేసిందని గుర్తు చేశాయి. మూడేళ్లుగా రష్యా నుంచి భారీగా చమురు దిగుమతి చేసుకుంటున్న రిలయన్స్ కూడా.. స్పాట్ మార్కెట్లో చమురు కొనుగోళ్లు చేపట్టిందని వెల్లడించాయి. అటు రష్యా సరఫరాదారుల నుంచి, ఇటు భారత ప్రభుత్వం నుంచి ఈ అంశంలో స్పష్టత వచ్చే వరకు కొత్తగా చమురు కొనుగోళ్లకు ఆర్డర్లు పెట్టే పరిస్థితి లేదని తెలిపాయి.

ఆంక్షలు వర్తించని కంపెనీల నుంచి కొనే యత్నాలు..

అయితే రష్యా చమురుపై టోకున ఆంక్షలు విధించలేదని, కేవలం రెండు పెద్ద కంపెనీలపైనే విధించిందని భారత రిఫైనరీ వర్గాలు అంటున్నాయి. అందువల్ల ఆంక్షలు వర్తించని ఇతర రష్యా కంపెనీల నుంచి చమురు కొనుగోళ్లకు ప్రయత్నిస్తామని పేర్కొంటున్నాయి. అంతేగాకుండా రష్యా నుంచి కొని ఇతర దేశాలకు సరఫరా చేసే యూరోపియన్, గల్ఫ్ దేశాల కంపెనీల నుంచీ చమురు కొనుగోలు చేయవచ్చని.. కానీ రష్యా నుంచి నేరుగా కొనే చమురుకు వస్తున్న రాయితీ లభించకపోవచ్చని స్పష్టం చేస్తున్నాయి. నిజానికి రష్యా నుంచి భారత్‌కు దిగుమతి అవుతున్న చమురులో 70శాతం వరకు రాస్‌నెఫ్ట్, ల్యూకోయిల్ సంస్థల నుంచే వస్తుండటం గమనార్హం. మిగతా 30శాతం ఇతర రష్యా కంపెనీల నుంచి దిగుమతి అవుతోంది. కాగా, అమెరికా ఆంక్షల నేపథ్యంలో విదేశాల్లో ఉన్న తమ ఆస్తులను విక్రయించేస్తున్నట్టు ల్యూకోయిల్ సంస్థ ప్రకటించింది. 11 దేశాల్లో ఉన్న తమ చమురు, గ్యాస్ ప్రాజెక్టులపై ఇప్పటికే కొనుగోలు దారులతో చర్చలు ప్రారంభించినట్టు తెలిపింది.

అమెరికా నుంచి భారీగా పెరిగిన చమురు కొనుగోళ్లు..

ట్రంప్ డిమాండ్ చేస్తున్న మేరకు రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్లు నిలిచిపోతుండగా.. మరోవైపు అమెరికా నుంచి భారత్‌కు చమురు దిగుమతులు భారీగా పెరుగుతున్నాయి. చమురు సరఫరా గణాంకాల సంస్థ కెప్లర్ డేటా ప్రకారం.. ఈ ఏడాది అక్టోబర్ 27 నాటికి అమెరికా నుంచి భారత చమురు దిగుమతులు సగటున రోజుకు 5.4 లక్షల బ్యారెళ్లకు (బీపీడీ) చేరాయి. గత ఏడాది సగటు దిగుమతులు 3 లక్షల బీపీడీ మాత్రమే కావడం గమనార్హం.

సీఎం సిద్దరామయ్యకు ఎదురుదెబ్బ

- బహిరంగ స్థలాల్లో సభల నిషేధంపై హైకోర్టు బెంచ్ స్టే
- ప్రాథమిక హక్కులకు భంగం కలిగించడమేనని వ్యాఖ్య
- ఆర్‌ఎస్ఎస్ పథసంచలనాలకు తొలగిన అడ్డంకి



బెంగళూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఆర్‌ఎస్ఎస్ కార్యకలాపాలకు చెక్ పెట్టాలని భావించిన కర్ణాటక ప్రభుత్వం, సీఎం సిద్దరామయ్యకు ఎదురుదెబ్బ తగిలింది. ప్రభుత్వ స్థలాల్లో అనుమతి లేకుండా పది మందికి మించి గుమికూడదంటూ రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన ఆదేశాలపై ధారవాడ హైకోర్టు సింగిల్ బెంచ్ స్టే విధించింది. దీంతో ఆర్‌ఎస్ఎస్ పథసంచలనంతో పాటు ఇతర సభలు, ఊరేగింపులకు ఏర్పడిన అడ్డంకి తొలగిపోయింది. హుబ్బళ్లికి చెందిన పునఃచైతన్య సేవా సంస్థ దాఖలు చేసిన రిట్‌పై విచారించిన న్యాయమూర్తి జస్టిస్ ఎం.నాగప్రసన్న నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం ఈ మేరకు మంగళవారం తీర్పు ప్రకటించింది. నిషేధం విధించడం అంటే ప్రాథమిక హక్కులకు భంగం కలిగించడమేనని కోర్టు అభిప్రాయపడింది. తదుపరి విచారణను నవంబరు 17కి వాయిదా వేసింది. రాష్ట్ర మంత్రి ప్రియాంక ఖర్గే రాష్ట్రంలో ఆర్‌ఎస్ఎస్ కలాపాలను నియంత్రించాలని ఈ నెల 4న ముఖ్యమంత్రికి లేఖ రాయడంతో క్యాబినెట్‌లో చర్చించారు. ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలు, ప్రభుత్వ పాఠశాల మైదానాలు, పార్కులు, రోడ్లపై ప్రైవేటు సంస్థలు అనుమతి లేకుండా ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించకూడదని, పదిమందికి మించి ఊరేగింపులు చేయరాదని ఈ నెల 18న ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. తాజాగా హైకోర్టు తీర్పుతో ఆయా సంస్థలకు ఉపశమనం లభించినట్లయింది. ఇదిలా ఉండగా, ఆర్‌ఎస్ఎస్ సహా ఏ సంఘమైనా ప్రభుత్వ స్థలాల్లో సభలు, ఊరేగింపులు నిర్వహించేందుకు ముందస్తు అనుమతి పొందాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ధారవాడ హైకోర్టు బెంచ్ స్టే ఇవ్వడంపై సీఎం సిద్దరామయ్య స్పందించారు. దీనిపై తాము హైకోర్టు ఫుల్ బెంచ్‌లో పిటిషన్ దాఖలు చేస్తామని ఆయన తెలిపారు.

లోకం తీరు



8వ వేతనసంఘం విధివిధానాలకు కేంద్రం ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

సమర్పిస్తుంది. ఈ మధ్య కాలంలో పూర్తయిన తాత్కాలిక నివేదికలను ఎప్పటికప్పుడు అందజేస్తుంది. ఈ ఏడాది జనవరిలోనే వేతన సంఘం ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. 8వ వేతనసంఘంలో ఐఐఎం బెంగళూరుకు చెందిన ప్రొఫెసర్ పులక్ ఘోష్ తాత్కాలిక సభ్యులుగా, కేంద్ర పెట్రోలియం శాఖ కార్యదర్శి పంకజ్‌జైన్ సభ్య కార్యదర్శిగా వ్యవహరిస్తారు. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రస్తుతం అమలులో ఉన్న జీతభత్యాలు, ప్రభుత్వరంగ సంస్థలు, ప్రైవేటు రంగంలోని ఉద్యోగులకు అందుతున్న ప్రయోజనాలు, వేతనాలు, దేశంలోని ఆర్థిక పరిస్థితులు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలకు అందుబాటులో ఉన్న నిధులు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని వేతనసంఘం సిఫారసులు చేయనుంది. కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ క్యాబినెట్ నిర్ణయం తాలూకు వివరాలు వెల్లడిస్తూ.. వేతనసంఘం తాత్కాలిక నివేదికలు వచ్చిన తర్వాత సిఫారసుల అమలు తేదీని నిర్ణయిస్తామని.. అయితే, 2026 జనవరి 1వ తేదీ నుంచే అమలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలను, పింఛనుదార్ల పింఛన్లను సవరించటానికి ప్రతీ పదేళ్లకోమారు కేంద్రం వేతనసంఘాన్ని నియమిస్తుంది. బిహార్ ఎన్నికల వేళ వేతన సంఘంపై కేంద్రప్రభుత్వం నిర్ణయం తీసుకోవటం గమనార్హం.

ఎరువులకు సబ్సిడీ పెంపు

2025-26 రబీ సీజన్‌కు సంబంధించి ఫాస్ఫరస్, సల్ఫర్ వంటి యూరియా యేతర ఎరువులపై సబ్సిడీని పెంచుతూ కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. ఫాస్ఫేట్‌పై ప్రస్తుతం కిలోకు ఇస్తున్న సబ్సిడీ రూ.43.60 కాగా.. దీనిని రూ.47.96కు పెంచారు. సల్ఫర్ ఎరువులపై ప్రస్తుత సబ్సిడీ కిలోకు రూ.1.77 కాగా.. రూ.2.87కు పెంచారు. మొత్తంగా ఈ రెండు రకాల ఎరువులకు ఇస్తున్న సబ్సిడీ కోసం రూ.37,952 కోట్లను కేటాయించారు. కాగా, నైట్రోజన్ (కిలోకు రూ.43.02), పొటాష్ (కిలోకు రూ.2.38)ల మీద ఉన్న సబ్సిడీలో ఎటువంటి మార్పుల్లేవు.


అమెజాన్‌లో 30 వేల ఉద్యోగుల తొలగింపు?

- సంస్థ కార్పొరేట్ ఉద్యోగాల్లో 10 శాతం కోత
- కంపెనీ చరిత్రలో ఇదే అత్యధికం

న్యూఢిల్లీ, అక్టోబరు 28: అమెజాన్ కంపెనీ సుమారు 30,000 మంది కార్పొరేట్ ఉద్యోగులను తొలగించనుంది. కంపెనీ చరిత్రలో ఇంత ఎక్కువమందిని తొలగించనుండటం ఇదే ప్రథమం. వ్యయాలు తగ్గించుకోవడం, కార్యకలాపాలను క్రమబద్ధీకరించడం, యాంత్రీకరణను వేగవంతం చేయడం లక్ష్యంగా ఇంత భారీ స్థాయిలో ఉద్యోగాల్లో కోత విధించనుంది. ఈ వారమే ఈ-మెయిల్‌ల ద్వారా సంబంధిత ఉద్యోగులకు సమాచారాన్ని పంపించే ప్రక్రియను ప్రారంభించనున్నట్లు తెలిసింది. అమెజాన్‌లో మొత్తం 15.5 లక్షల మంది పనిచేస్తుండగా వారిలో కార్పొరేట్ ఉద్యోగులు 3.5 లక్షల మంది ఉన్నారు. కార్పొరేట్ ఉద్యోగుల్లోనే సుమారు 10 శాతం మందిని తొలగించనుండటం గమనార్హం. అమెజాన్ వెబ్ సర్వీసెస్(ఏడబ్ల్యూఎస్), ఆపరేషన్స్ టు డివైజెస్, సర్వీసెస్, మానవ వనరులు(పీఎక్స్‌టీ-పీపుల్ ఎక్స్‌పీరియెన్స్ అండ్ టెక్నాలజీ) తదితర బిజినెస్ యూనిట్లన్నింటిలోనూ ఉద్యోగాల్లో కోత విధించనుంది. ఒక్క పీఎక్స్‌టీ విభాగంలోనే 15 శాతం ఉద్యోగులను తొలగించనుంది. ఉద్యోగుల హోదాల మధ్య అంతరాన్ని తగ్గించడం, జవాబుదారీతనాన్ని పెంచడం, కృత్రిమమేధ ఆధారిత సమర్థతను పెంపొందించడం కోసం అమెజాన్ సీఈవో ఆండీ జెస్సీ ఉద్యోగాల కోతకు శ్రీకారం చుట్టారు. తొలుత అమెజాన్ కూడా కఠినమైన ఐదు రోజుల ఆఫీసు నియమాన్ని అమల్లోకి తెచ్చింది. అయితే, అది కంపెనీ ఊహించినంత ఎక్కువ మంది స్వచ్ఛందంగా ఉద్యోగాలు వీడేలా చేయలేకపోయింది. దీంతో కంపెనీయే బలవంతంగా ఉద్యోగుల తొలగింపునకు శ్రీకారం చుట్టింది. కృత్రిమ మేధతో అమెజాన్ కార్పొరేట్ రూపురేఖలు మారిపోతున్నాయనేందుకు ఇదే సంకేతమని విశ్లేషకులు పేర్కొంటున్నారు. మైక్రోసాఫ్ట్, మెటా, గూగుల్ తదితర సంస్థలు కూడా ఈ ఏడాది ఉద్యోగుల సంఖ్యను తగ్గించుకొంటున్నాయి.

ఇంటికో ప్రభుత్వ ఉద్యోగం

- అధికారంలోకి వచ్చిన 20 రోజుల్లోనే
- పాత పింఛను విధానం కూడా అమలు
- బిహార్‌లో మహాకూటమి మేనిఫెస్టో
- 'తేజస్వీ ప్రాణ్ పత్ర్'గా అభివర్ణణ


బిహార్‌లో మహా కూటమి మేనిఫెస్టోను ఆవిష్కరిస్తున్న తేజస్వీయాదవ్, కూటమి పార్టీల నాయకులు

పట్నా, అక్టోబరు 28: యువతకు, మైనార్టీలకు ప్రాధాన్యం, భరోసా ఇస్తూ మహా కూటమి మంగళవారం ఉమ్మడి ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసింది. అధికారంలోకి వచ్చిన మొదటి 20 రోజుల్లోనే కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని ఘనంగా ప్రకటించింది. 25 అంశాలతో కూడిన ఈ మేనిఫెస్టోలో ఇదే అగ్రస్థానంలో ఉండడం గమనార్హం. కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న జీవిక దీదీలను పర్మినెంట్ చేస్తామని, వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామని తెలిపింది. ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ కూడా హామీల్లో ఒకటి. కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన వక్ఫ్ సవరణ చట్టాన్ని బిహార్‌లో అమలు చేయబోమని స్పష్టం చేసింది. మరింత పారదర్శకంగా వక్ఫ్ ఆస్తులను నిర్వహించేలా విధానాలు రూపొందిస్తామని తెలిపింది. బోధ్ గయలోని బుద్ధ ఆలయాలు బౌద్ధులకే అప్పగిస్తామని ప్రకటించింది. మైనార్టీల రాజ్యాంగపర హక్కులను కాపాడుతామని తెలిపింది.

హాజరుకాని రాహుల్ గాంధీ

పట్నాలో జరిగిన ఎన్నికల మేనిఫెస్టో ఆవిష్కరణ కార్యక్రమంలో తేజస్వీ యాదవ్, దీపాంకర్ భట్టాచార్యతో పాటు కాంగ్రెస్ నాయకుడు పవన్‌ఖేరా, ఉపముఖ్యమంత్రి అభ్యర్థి, వికాస్‌శీల్ ఇన్సాఫ్ పార్టీ నాయకుడు ముకేశ్ సాహ్నీ పాల్గొన్నారు. మేనిఫెస్టోను 'తేజస్వీ ప్రాణ్ పత్ర్'గా అభివర్ణిస్తున్నారు. సమస్యలకు ఆచరణాత్మక పరిష్కారాలు ఉండేలా దీన్ని రూపొందించినట్టు తేజస్వీ చెప్పారు. అయితే కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ హాజరుకాకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఎన్నికలు జరుగుతున్నా రాహుల్ గత రెండు నెలలుగా బిహార్‌లో అడుగు పెట్టలేదేమని ఇప్పటికే చర్చలు నడున్నాయి. మేనిఫెస్టో మొదటి పేజీపై తేజస్వీ ఫొటోను పెద్దదిగా ప్రచురించి, రాహుల్ ఫొటోను పేజీ పైభాగాన ఓ మూల చిన్నదిగా ముద్రించడాన్ని కూడా పలువురు ఎత్తిచూపుతున్నారు. మారిన రాజకీయ ప్రాధాన్యతలకు ఇది నిదర్శనమని వ్యాఖ్యానిస్తున్నారు. రాహుల్ ఆగస్టులో ఓటర్ అధికార్ యాత్ర నిర్వహించిన తరువాత మళ్లీ రాలేదు. కాగా, రాహుల్ మంగళవారం బిహార్ యువతను ఉద్దేశించి ఎక్స్‌లో పోస్టు పెట్టారు. యువత ఆశలను మోదీ-నీతీశ్ సర్కారు గొంతు నులిమి చంపిందని విమర్శించారు. మరోవైపు, పార్టీ సిద్ధాంతాలను ధిక్కరించినందుకు ఆర్జేడీ నుంచి 17 మందిని సస్పెండ్ చేశారు. వీరిలో ఇద్దరు ఎమ్మెల్యేలు, ఒక ఎమ్మెల్సీ, నలుగురు మాజీ ఎమ్మెల్యేలు ఉన్నారు.

ఓట్ల వివాదంలో ప్రశాంత్ కిశోర్!

బిహార్ ఎన్నికల వేళ జన్‌సురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిశోర్ చిక్కుల్లో పడ్డారు. ఆయనకు రెండు రాష్ట్రాల్లో ఓటు హక్కు ఉన్న విషయం మంగళవారం వెలుగు చూసింది. స్వరాష్ట్రం బిహార్‌తోపాటు పశ్చిమ బెంగాల్‌లోనూ ఆయనకు ఓటు హక్కు ఉందని తెలియడం వివాదంగా మారింది. బెంగాల్‌లోని భవానీపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో పీకేకు ఓటు ఉంది. ఇది బెంగాల్ సీఎం మమత నియోజకవర్గం కావడం గమనార్హం. 2021, బెంగాల్ ఎన్నికల సమయంలో టీఎంసీ పార్టీకి పీకే రాజకీయ వ్యూహకర్తగా పనిచేశారు. ఈక్రమంలో ఆయన భవానీపూర్‌లో ఓటరుగా పేరు నమోదు చేసుకున్నారు.

చేయని నేరానికి శిక్షకు గురైతే నష్ట పరిహారం

- యోచిస్తున్న సుప్రీం.. సహకరించాలని ఏజీకి సూచన



న్యూఢిల్లీ, అక్టోబరు 28: తప్పుడు అభియోగాల కారణంగా శిక్షపడి జైలుపాలైన వ్యక్తికి నష్టపరిహారం చెల్లించే అంశాన్ని సుప్రీంకోర్టు పరిశీలిస్తోంది. వ్యవస్థ ఆ వ్యక్తిని బలపశువును చేసినట్టుగానీ, తప్పుడు సాక్ష్యాలను కావాలని సృష్టించినట్టుగానీ తేలిన కేసుల్లో నష్ట పరిహార అంశాన్ని పరిగణించాలని యోచిస్తోంది. ఒకవేళ ఆ బాధితుడు నిర్దోషిగా అనంతరకాలంలో బయటకు వచ్చినప్పటికీ జైలులో అతడు కోల్పోయిన విలువైన జీవితాన్ని పరిగణనలోకి తీసుకోవాలని భావిస్తోంది. ఇందులోని సంక్లిష్ట అంశాలను, ప్రక్రియలోని చిక్కులను దృష్టిలో ఉంచుకుని ఈ అంశంపై నిర్ణయం తీసుకోవడంలో తమకు సహకరించాల్సిందిగా అటార్నీ జనరల్, సొలిసిటర్ జనరల్‌లను న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన బెంచ్ కోరింది. దేశంలో శిక్షలు పడుతున్న కేసులు కేవలం 54 శాతమే ఉంటున్న విషయాన్ని ఈ సందర్భంగా బెంచ్ గుర్తుచేసింది. పోలీసులు పెట్టిన తప్పుడు కేసులో 12 ఏళ్లు జైలులో గడిపిన వ్యక్తి వేసిన పిటిషన్‌పై బెంచ్ విచారించే సందర్భంలో నష్టపరిహారం అంశం చర్చకు వచ్చింది. ఆ వ్యక్తి పేదవాడు. మైనర్ బాలికపై అత్యాచారం జరిపి హత్య చేసిన కేసులో విచారణను ఎదుర్కొంటూ ఆయన ఇటీవల వరకు జైలులో ఉన్నారు. థానే కోర్టు 2019లో మరణశిక్ష విధించడంతో కారాగారవాసం చేస్తూ సుప్రీంకోర్టులో ఆ తీర్పును ఆయన సవాల్ చేశారు. చివరకు ఆయనపై పోలీసులు నమోదు చేసినవి తప్పుడు అభియోగాలు అని తేలడంతో సుప్రీంకోర్టు తాజాగా విడుదల చేసింది. అయితే, తాను జైలులో ఇన్నాళ్లు కోల్పోయిన జీవితాన్ని పరిగణనలోకి తీసుకుని నష్టపరిహారం ఇప్పించాల్సిందిగా సుప్రీంకోర్టులో ఆయన పిటిషన్ దాఖలుచేశారు. ఆయన తరఫున సీనియర్ అడ్వకేట్ గోపాల్ సుబ్రహ్మణియం వాదనలు వినిపిస్తూ.. ఇలాంటి వ్యక్తులకు తప్పక నష్ట పరిహారం చెల్లించాల్సి ఉంటుందని సూచించారు. జైలు జీవితం ఆయన ప్రాథమిక హక్కులను కాలరాయడాన్ని పరిగణనలోకి తీసుకోవాలని, దీనిపై మార్గదర్శకాలను రూపొందించాలని బెంచ్‌ను కోరారు. ఈ అంశంలో ఒక స్థాయీ అమరిక అవసరమని న్యాయ కమిషన్ కూడా గతంలో సిఫారసు చేసిన అంశాన్ని ఆయన బెంచ్ దృష్టికి తీసుకెళ్లారు. ఇదిలా ఉండగా, 'మానసిక వైద్య చట్టం-2017'ను అమలు చేయాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని ఇదే ధర్మాసనం జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ)కి బదిలీ చేసింది.

వైద్యులను కాపాడకుంటే సమాజం క్షమించదు

వైద్యులు, ఆరోగ్య సిబ్బందికి అండగా నిలిచి, వారిని రక్షించుకోకపోతే సమాజం న్యాయవ్యవస్థను క్షమించదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. కరోనా సమయంలో సేవలు అందించి మరణించిన ప్రయివేటు వైద్య సిబ్బందికి బీమా పరిహారం చెల్లించకపోవడాన్ని తప్పుపట్టింది. వారికి బీమా పరిహారం చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మంగళవారం మౌఖికంగా ఆదేశించింది. వారు ప్రభుత్వ విధుల్లో లేరని, లాభాపేక్ష ఉన్న ఆస్పత్రుల్లో పనిచేస్తున్నందున బీమా పరిహారానికి అర్హులు కారంటూ చెప్పడం తగదని పేర్కొంది. పరిహారం చెల్లించడానికి ప్రధానమంత్రి బీమా పథకం కాకుండా ఇతర పథకాలు ఉంటే వారి వివరాలు ఇవ్వాలని ఆదేశించింది. కరోనాతో మరణించిన వైద్య సిబ్బందికి పరిహారం చెల్లించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ ప్యాకేజీని ప్రకటించింది. దీని కింద ప్రభుత్వం రూ.50 లక్షలు చెల్లిస్తుంది.

హరీశ్‌రావుకు పితృ వియోగం



హరీశ్‌ను పరామర్శిస్తున్న కేసీఆర్

- ఆయన తండ్రి తన్నీరు సత్యనారాయణరావు కన్నుమూత
- కుటుంబ సభ్యులకు కేసీఆర్ ఓదార్పు
- సీఎం రేవంత్, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, సంజయ్, ఏపీ సీఎం చంద్రబాబు సహా రాజకీయ ప్రముఖుల సంతాపం

హైదరాబాద్, సిద్దిపేట కల్చరల్, నార్సింగ్/రాయదుర్గం, అమరావతి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఇంట విషాదం జరిగింది. మాజీ సీఎం కేసీఆర్ బావ, హరీశ్‌రావు తండ్రి అయిన తన్నీరు సత్యనారాయణరావు మంగళవారం కన్నుమూశారు. ఆయన పార్థివదేహాన్ని కోకాపేటలోని క్రిన్స్ విల్లాస్‌లో ఉన్న హరీశ్‌రావు నివాసంలో కుటుంబసభ్యులు, ప్రజల సందర్శనార్థం ఉంచారు. అనంతరం మంగళవారం మధ్యాహ్నం



సత్యనారాయణరావు(ఫైల్)

ఫిల్మ్‌నగర్‌లోని మహాప్రస్థానానికి తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డి సహా పలువురు రాజకీయ ప్రముఖులు సత్యనారాయణ రావు మృతికి సంతాపం తెలిపారు. తన్నీరు సత్యనారాయణరావు కేసీఆర్ అక్క, ఏడో సోదరి అయిన లక్ష్మి భర్త. ఆయన మరణ వార్త తెలిసిన వెంటనే కేసీఆర్ హరీశ్‌రావు నివాసానికి చేరుకొని సత్యనారాయణరావు భౌతికకాయానికి నివాళులర్పించారు. సోదరి లక్ష్మి, మేనల్లుడు హరీశ్‌ను ఓదార్చారు. అలాగే, హరీశ్ నివాసానికి చేరుకున్న బీఆర్ఎస్ కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సాయంత్రం వరకు అక్కడే ఉండి కార్యక్రమాల ఏర్పాట్లు చూసుకున్నారు. ఇక, ఎంపీలు ఈటల రాజేందర్, రఘునందన్‌రావు, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్ రెడ్డి, కౌశిక్‌రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, కొప్పుల ఈశ్వర్, నిరంజన్‌రెడ్డి, జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత, బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు సత్యనారాయణరావు పార్థివదేహానికి నివాళులర్పించారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్క, ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఏపీ మాజీ సీఎం జగన్ తదితరులు ప్రకటనల ద్వారా హరీశ్‌రావుకు తమ సానుభూతి తెలియజేశారు. సత్యనారాయణరావు మృతిపట్ల విచారం వ్యక్తం చేస్తూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఓ ప్రకటన విడుదల చేశారు. ఇక, జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచార కార్యక్రమాలను సత్యనారాయణరావు మరణం నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ రద్దు చేసుకుంది.

తిరుమల అడవుల్లో అరుదైన బల్లి

- వెంకటాద్రిగా నామకరణం



శాస్త్రవేత్తలు కనుగొన్న బల్లి

మంగళం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తిరుమల కొండల్లో అరుదైన ఒక బల్లి జాతిని గుర్తించారు. దట్టమైన చందనపు అడవిలో చెట్టు బెరడు కింద దీనిని జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా శాస్త్రవేత్తలు గుర్తించారు. దీనికి వెంకటాద్రి స్లెండర్ గెక్కో అని పేరు కూడా పెట్టారు. పలుచని తొండలా కనిపించే బల్లి జాతి జీవి ఇది. హెర్పటోజోవా అనే అంతర్జాతీయ జర్నల్‌లో ఈ వివరాలను శాస్త్రవేత్తలు ప్రకటించారు. హైదరాబాద్‌కు చెందిన ఫ్రెష్‌వాటర్ బయాలజీ రీజనల్ సెంటర్, కోల్‌కతాకి చెందిన రెప్టిల్లా విభాగం, ఒడిసాలోని ఫకీర్ మోహన్ యూనివర్శిటీ శాస్త్రవేత్తల ఆ బృందంలో సభ్యులుగా ఉన్నారు.

నష్టపరిహారానికి రైల్వే ట్రైబ్యునల్ బెంచ్‌లు

హైదరాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) రైలు ప్రమాదాలు, ఇతర సందర్భాల్లో నష్టం వాటిల్లినపుడు పరిహారం పొందేందుకు ప్రయాణికులు ఆశ్రయించాల్సిన రైల్వే ట్రైబ్యునల్ బెంచ్‌ల వివరాలను దక్షిణ మధ్య రైల్వే మంగళవారం వెల్లడించింది. తెలంగాణ, ఏపీ, కర్ణాటక, మహారాష్ట్రలకు చెందిన వారు సికింద్రాబాద్, అమరావతి(గుంటూరు), బెంగళూరు, ముంబయి, నాగ్‌పూర్‌లలోని రైల్వే క్లెయిమ్స్ ట్రైబ్యునల్ బెంచ్‌లలో దాఖలు చేయవచ్చన్నారు. సంఘటన జరిగిన ఏడాది లోపు దరఖాస్తు చేయాలన్నారు. ట్రైబ్యునల్ ఆదేశాలపై అప్పీలు చేయాలనుకుంటే సంబంధిత హైకోర్టును ఆశ్రయించాలని సూచించారు.

అండమాన్ ఎక్స్‌ప్రెస్‌లో కొండచిలువ



రైలులో పట్టుకున్న కొండచిలువ

ఖమ్మంక్రైం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): అండమాన్ ఎక్స్‌ప్రెస్ రైలులో కొండచిలువ కనిపించడంతో ప్రయాణికులు భయాందోళన చెందారు. ఈఘటన సోమవారం రాత్రి జరిగింది. వరంగల్ నుంచి విజయవాడ వస్తున్న అండమాన్ రైలులోని ఎస్-2 కోచ్ బాత్‌రూం వద్ద కొండచిలువ కనిపించడంతో ప్రయాణికులు రైల్వేటీటీకి తెలిపారు. రైలు మహబూబాబాద్ దాటడంతో ఖమ్మం ఆర్‌పీఎఫ్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఆర్‌పీఎఫ్ సీఐ బుర్ర సురేష్‌గౌడ్ రైలు ఖమ్మం రైల్వేస్టేషన్‌కు చేరుకునేలోపు నగరానికి చెందిన స్నేక్‌క్యాచర్ మస్తాన్‌ను పిలిపించగా.. మస్తాన్ కొండచిలువను పట్టి అటవీప్రాంతంలో వదిలిపెట్టేందుకు తీసుకెళ్లారు. దీంతో రైల్వే సిబ్బంది, సీఐ సురేష్‌గౌడ్, ప్రయాణికులు స్నేక్ క్యాచర్ మస్తాన్‌ను అభినందించారు.

‘నువ్వొక్కడివే ఎందుకు.. నేను కూడా చస్తా’

- ఆర్థిక ఇబ్బందులు తాళలేక పురుగు మందు తాగిన తండ్రి
- అది చూసి నేను కూడా అంటూ కొడుకు ఆత్మహత్యాయత్నం
- తండ్రి మృతి, కుమారుడి పరిస్థితి విషమం



సయ్యద్ ఆరిఫ్

నర్సాపూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కుటుంబ పోషణకు ఆరోగ్యం సహకరించక, ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి తన కుటుంబసభ్యుల ఎదుటే పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అది చూసిన అతని కుమారుడు.. నువ్వొక్కడివే చావడం ఎందుకు ? నేను కూడా చస్తానంటూ.. క్షణికావేశంలో పురుగు మందు తాగేశాడు. ఈ ఘటనలో తండ్రి కోల్పోగా.. కుమారుడి పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉంది. మెదక్ జిల్లా నర్సాపూర్‌లో జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నర్సాపూర్‌లోని ఎన్‌జీవో కాలనీకి చెందిన సయ్యద్ ఆరిఫ్(48)డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఆరిఫ్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే, ద్విచక్రవాహనంపై వెళుతుండగా రోడ్డు ప్రమాదానికి గురైన ఆరిఫ్ మూడు నెలలుగా పనికి దూరమై ఇంటికే పరిమితమయ్యాడు. దీంతో ఆర్థిక ఇబ్బందులు పెరిగిపోగా తీవ్ర మనస్తాపానికి గురైన ఆరిఫ్ కొద్ది రోజులుగా తన భార్య వద్ద తీవ్ర ఆవేదన చెందుతున్నాడు. ఈ క్రమంలో అక్టోబరు 26న బయటకు వెళ్లి ఇంటికి తిరిగొచ్చిన ఆరిఫ్.. కుటుంబసభ్యులకు ఓ సీసాను చూపించి పురుగు మందు తాగానని, చనిపోతున్నానని చెప్పాడు. తమను బెదిరించడానికే తండ్రి ఇలా చేస్తున్నాడు అనుకొని.. ఆరిఫ్ చిన్న కుమారుడు, సయ్యద్(18.. నువ్వొక్కడివే చావడం ఎందుకు నేనూ చస్తానంటూ.. తండ్రి చేతిలోని సీసాను లాక్కొని అందులోని పురుగు మందు తాగాడు. ఆపై, అస్వస్థతకు గురైన తండ్రీకొడుకులను కుటుంబసభ్యులు హుటాహుటిన నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి సంగారెడ్డి ఆస్పత్రికి, తర్వాత హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఉస్మానియాలో చికిత్స పొందుతూ ఆరిఫ్ మంగళవారం మరణించగా.. ఇంటర్ విద్యార్థి అయిన సయ్యద్ పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉంది. ఆరిఫ్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

కరీంనగర్‌లో వైద్యుడి ఆత్మహత్య

- అప్పుగా తీసుకున్న డబ్బును స్నేహితులు ఇవ్వడం లేదని మనస్తాపం
- గుర్తు తెలియని ఇంజక్షన్ చేసుకొని బలవన్మరణం



శ్రీనివాస్(ఫైల్)

కరీంనగర్ క్రైం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): స్నేహితులు తన వద్ద తీసుకున్న అప్పులు తిరిగి చెల్లించకపోవడంతో తలెత్తిన ఆర్థిక సమస్యలతో మనస్తాపం చెంది కరీంనగర్‌కు చెందిన డాక్టర్ ఎంపటి శ్రీనివాస్(42) అనే వైద్యుడు ఆత్మహత్య చేసుకున్నారు. గుర్తు తెలియని ఇంజక్షన్ చేతి నరాలకు చేసుకుని బలవన్మరణం పొందారు. ఇందుకు సంబంధించి డాక్టర్ శ్రీనివాస్ భార్య విప్లవ శ్రీ అలియాస్ శ్రీనిధి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం వివరాలిలా ఉన్నాయి. డాక్టర్ ఎంపటి శ్రీనివాస్ నగునూర్‌లోని ప్రతిమ వైద్య కళాశాలలో అనస్థీషియా పీజీ రెండో సంవత్సరం చేస్తున్నారు. కరీంనగర్‌కు చెందిన వింజనూరి కరుణాకర్ డాక్టర్ శ్రీనివాస్ వద్ద రూ.1.50 కోట్లు అప్పుగా తీసుకున్నాడు. అలాగే, కిరణ్, కవిత, వెంకటి నరహరి అనే ముగ్గురు స్నేహితులు శ్రీనివాస్ పేరిట రూ.1.35 కోట్లు బ్యాంకులో రుణం తీసుకున్నారు. బంజేరుపల్లికి చెందిన కుమారస్వామి అనే మరో స్నేహితుడు తన వ్యాపారం కోసం శ్రీనివాస్ నుంచి రూ.28 లక్షలు అప్పుగా తీసుకున్నారు. వీరంతా ఆ డబ్బు తిరిగి చెల్లించకపోవడంతో డాక్టర్ శ్రీనివాస్ బ్యాంకు వాయిదాలు కూడా చెల్లించలేకపోయారు. దీంతో బ్యాంకు అధికారుల నుంచి ఒత్తిడి పెరిగింది. అప్పు తీర్చమని స్నేహితులను అడిగితే... డబ్బు ఇవ్వమని, ఏమి చేసుకుంటావో చేసుకో అని శ్రీనివాస్‌ను బెదిరించారు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన డాక్టర్ శ్రీనివాస్ బలవన్మరణానికి పాల్పడ్డారు. సోమవారం రాత్రి కుటుంబసభ్యులతో కలిసి భోజనం చేసి నిద్రించిన డాక్టర్ శ్రీనివాస్.. మంగళవారం ఉదయం తమ ఇంట్లోని మరో గదిలో కుటుంబసభ్యులకు అచేతన స్థితిలో కనిపించారు. శ్రీనివాస్ చేతికి ఇంట్రావీనస్ ఇంజక్షన్ కాన్యులా పెట్టి ఉంది. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టామని కరీంనగర్ టూ టౌన్ సీఐ సృజన్‌రెడ్డి తెలిపారు.


1నుంచి 30 వరకు రైల్వే పెన్షనర్లకు అవగాహన

హైదరాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) రైల్వే మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు నవంబర్ 1 నుంచి 30 వరకు డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ క్యాంపెయిన్ 4.0' నిర్వహిస్తున్నట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతిఏటా నవంబర్‌లో లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాల్సిన పెన్షనర్లకు సులువుగా ఉండేందుకు ఈ ప్రచారాన్ని విస్తృత స్థాయిలో చేపట్టినట్టు వివరించారు.

‘ధర’మల్ విద్యుత్ షట్‌డౌన్!

కేటీపీఎస్, బీటీపీఎస్‌లలో తాత్కాలికంగా ఉత్పత్తి నిలిపివేత

- నెల రోజులుగా ఒక్కో యూనిట్‌లోనే కొనసాగుతున్న ఉత్పత్తి
- ప్రాజెక్టుల్లో సమృద్ధిగా నీటితో కావల్సినంత జల విద్యుత్తు
- ఆర్థిక భారాన్ని తగ్గించుకునేందుకు జెన్‌కో నిర్ణయం



కొత్తగూడెం థర్మల్ విద్యుత్ కేంద్రం

కొత్తగూడెం/హైదరాబాద్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పలు థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో కొన్ని యూనిట్లలో కొద్ది రోజులుగా విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేశారు. ఒకవైపు రోజూ వేల టన్నుల బొగ్గును వినియోగించి మిలియన్ యూనిట్లు ఉత్పత్తికి ఖర్చు అధికమవుతుండగా.. మరోవైపు ఇటీవల కాలంలో ప్రాజెక్టుల్లో నీరు సమృద్ధిగా ఉండటంతో జల విద్యుత్ ఉత్పత్తి పెరిగింది. ఇదేకాకుండా.. బహిరంగ విపణిలోనూ తక్కువ ధరకే విద్యుత్తు లభిస్తోంది. దీంతో స్టేట్ లోడ్ డిస్పాచ్ సెంటర్ (ఎస్ఎల్‌డీసీ-ట్రాన్స్‌కో) రంగంలోకి దిగి... జెన్‌కో థర్మల్ విద్యుత్ కేంద్రాల్లోని కొన్ని యూనిట్లలో ఉత్పత్తిని నిలిపివేయించింది. డిస్కమ్‌ల ఖాతాలో తెలంగాణ పవర్ కోఆర్డినేషన్ కమిటీ ద్వారా కొనుగోళ్లు చేపడుతోంది. దీంతో కేటీపీఎస్, బీటీపీఎస్, ఎన్టీపీసీ వంటి థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో ‘రిజర్వు షట్‌డౌన్’ ప్రకటించారు. పాల్వంచలోని కేటీపీఎస్, మణుగూరులోని బీటీపీఎస్‌లో నెల రోజుల నుంచి కేవలం ఒక్కో యూనిట్‌లో మాత్రమే ఉత్పత్తి కొనసాగిస్తున్నారు. బీటీపీఎస్‌లో నెల రోజులుగా 1,2,4 యూనిట్లలో ఉత్పత్తికి బ్రేక్ వేశారు. కేటీపీఎస్‌లో ఒక్క యూనిట్‌ను మాత్రమే కొనసాగిస్తుండగా.. అందులోనూ 60 శాతం ఉత్పత్తి మించలేదని సమాచారం. ఈ నెల 21 నుంచి యాదాద్రిలో ఒక యూనిట్‌ను రిజర్వు షట్‌డౌన్ చేశారు. రాష్ట్రంలో జల విద్యుత్తు ఉత్పత్తి రికార్డు స్థాయిలో ఉన్న తరుణంలో జెన్‌కో ఆర్థిక భారాన్ని తగ్గించుకునే యోచనలో ఉంది. థర్మల్ విద్యుత్తు ఒక్కో యూనిట్ ఉత్పత్తికి రూ.5 నుంచి రూ.7 వరకు ఖర్చవుతుండగా.. జల విద్యుత్తు ఒక్కో యూనిట్ ఉత్పత్తికి రూ.2 నుంచి రూ.4 మాత్రమే అవుతోంది. దాంతో ప్రభుత్వం జల విద్యుత్తు ఉత్పాదనపై దృష్టి సారించింది. జూరాల, పులిచింతల, నాగార్జునసాగర్ లాంటి జల విద్యుత్తు కేంద్రాల నుంచి చౌకగా లభిస్తున్న కరెంట్‌ను తీసుకుంటోంది. ప్రస్తుతం డిమాండ్ తక్కువగా ఉండడంతో థర్మల్ విద్యుత్తు కేంద్రాల్లోని యూనిట్లలో ఉత్పత్తి తగ్గినట్టు అధికారులు చెబుతున్నారు.

రియల్ టైమ్ మార్కెట్‌లో 10 పైసలకే యూనిట్ కరెంట్

‘రియల్ టైమ్ మార్కెట్‌లో కరెంట్ కొనుగోలు చేసేవారి పంట పండింది. మంగళవారం మధ్యాహ్నం 2.30 నుంచి 3 గంటల మధ్య యూనిట్ 10 పైసలకే అమ్ముడుపోయింది. ఆ సమయంలో 7195 మెగావాట్ల కరెంట్‌ను వినియోగదారులు కొనుగోలు చేశారు. ఇండియన్ ఎనర్జీ ఎక్సేంజ్ (ఐఈఎక్స్)లో ప్రతి 15 నిమిషాలకు ఒక బ్లాకు చొప్పున రోజూ 90బ్లాకులుగా కరెంట్ విక్రయాలు జరుగుతుంటాయి. రియల్ టైమ్ మార్కెట్‌లో కేవలం గంట ముందు కరెంటును కొనుగోలు చేసే అవకాశం ఉంటుంది. సోమవారం అర్ధరాత్రి 12.15 నుంచి 12:30 గంటల బ్లాకులో యూనిట్ కరెంట్ రూ.2.18కు అమ్ముడుపోయింది. మంగళవారం మధ్యాహ్నం 2:30 నుంచి 3 గంటల దాకా రెండు బ్లాకుల్లో యూనిట్ 10 పైసలకు, 3 గంటల తర్వాత 30 పైసలకు లభించింది.

ఏలూరులో నవజాత శిశువు

- శిశు విక్రయం కేసులో పురోగతి
- గుర్తించి తీసుకువచ్చిన నల్లగొండ పోలీసులు
- శిశువు తండ్రి, కొనుగోలు చేసిన దంపతుల విచారణ

నల్లగొండ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : కడుపున పుట్టిన ఆడపిల్లను కన్నవారే విక్రయించిన ఘటనలో చిన్నారిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరుకు చెందిన దంపతుల వద్ద పోలీసులు గుర్తించారు. శిశువు సహా ఆ దంపతులను నల్లగొండకు తీసుకువచ్చి విచారిస్తున్నట్లు తెలిసింది. నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలం ఎల్లాపురం తండాకు చెందిన కొర్ర బాబు, పార్వతి దంపతుల సంతానమైన ఆడ శిశువును రూ.3 లక్షలకు విక్రయించారనే విషయం బయటకు పొక్కడంతో ఐసీడీఎస్ అధికారులు, నల్లగొండ పోలీసులు వెంటనే స్పందించారు. ఈ ఘటనపై సోమవారం మధ్యాహ్నమే ఐసీడీఎస్ అధికారుల ఫిర్యాదు మేరకు చిన్నారి తల్లిదండ్రులపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ మొదలుపెట్టారు. ఏలూరు జిల్లా కేంద్రానికి చెందిన సాంబమూర్తి, రజిత దంపతుల వద్ద శిశువు ఉన్నట్లు గుర్తించి అక్కడికి వెళ్లి వారిని బిడ్డ సహా నల్లగొండకు తీసుకువచ్చారు. శిశువు తండ్రి కొర్ర బాబును, ఏలూరుకు చెందిన దంపతులను పోలీసులు ఐసీడీఎస్ అధికారులతో కలిసి విచారణ చేస్తున్నట్లు తెలిసింది. గుంటూరుకు చెందిన ఆటోడ్రైవర్ కొండలు మధ్యవర్తిత్వంతో సాంబమూర్తి దంపతులను కొర్ర బాబు దంపతులు కలిసి శిశువును అప్పగించే విషయం ఫోన్‌లో మాట్లాడుకున్నట్లు తెలిసింది. ఈ నెల 25వ తేదీ రాత్రి 8 గంటల సమయంలో సాగర్ సమీపంలోని సమ్మక్క సారక్క ఆలయం వద్ద కొర్ర బాబు తమ బిడ్డను ఏలూరు దంపతులకు అప్పగించినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. తమకు పిల్లలు లేకపోవడంతో ఈ శిశువును పెంచుకునేందుకు దత్తత కోసం అడిగి తీసుకున్నామే తప్ప తాము కొనుగోలు చేయలేదని సాంబమూర్తి దంపతులు పోలీసులకు చెబుతున్నట్లు తెలుస్తోంది. కొర్ర బాబును, ఏలూరుకు చెందిన దంపతులను పోలీసులు పూర్తిస్థాయిలో విచారిస్తున్నారు. కాగా, చిన్నారి విక్రయం ఘటనపై లోకాయుక్త సుమోటోగా విచారణ చేపట్టింది. ఘటనకు సంబంధించి నవంబరు నాలుగో తేదీలోగా సమగ్ర నివేదిక అందజేయాలని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారుల్ని ఆదేశించింది.

టీటీడీ కొనుగోళ్లలో అవకతవకలపై ఏసీబీ విచారణ

- విధి విధానాల రూపకల్పనకు కమిటీ ఏర్పాటు
- బోర్డు నిర్ణయాలను వెల్లడించిన చైర్మన్ బీఆర్ నాయుడు

తిరుమల, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): ‘టీటీడీ కొనుగోళ్లలో కొన్ని అవకతవకలు జరిగినట్టు మా దృష్టికి వచ్చింది. దీనిపై ఏసీబీతో సమగ్ర విచారణ చేపట్టాలని బోర్డు నిర్ణయం తీసుకుంది’ అని చైర్మన్ బీఆర్ నాయుడు వెల్లడించారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో మంగళవారం దాదాపు ఏడు గంటల పాటు ధర్మకర్తల మండలి సమావేశం జరిగింది. అనంతరం ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సభ్యులతో కలిసి బీఆర్ నాయుడు మీడియాకు బోర్డు నిర్ణయాలు వెల్లడించారు. ‘కొనుగోళ్ల విషయంలో సిబ్బందిపై ఆరోపణలు వచ్చాయి. మార్కెట్‌లో రూ.350 నుంచి రూ.400 ధర ఉండే శాలువాను రూ.1,334కి కొంటున్నారు. నాకు తెలిసి నాలుగైదేళ్లలో రూ.50 కోట్ల విలువైన మెటీరియల్ కొన్నారు. అక్కడే సందేహం వచ్చి విచారిస్తే కొనుగోళ్లలో చాలా అవినీతి జరిగినట్టు గుర్తించాం. ఇక ఈ విషయాన్ని ఏసీబీ చూసుకుంటుంది’ అని అన్నారు. వైకుంఠ ద్వార దర్శనాలను యథావిధిగా పదిరోజులు కొనసాగిస్తామని, దీనిపై ఓ నిపుణుల కమిటీని ఏర్పాటు చేశామన్నారు. గతంలో జరిగిన తొక్కిసలాట ఘటనను దృష్టిలో పెట్టుకుని అటువంటివి జరగకుండా చర్యలు తీసుకోవాలని నిర్ణయించామని చెప్పారు. అందుబాటులో ఉన్న టెక్నాలజీని ఉపయోగించుకుని ఎన్ని టికెట్లు, ఎక్కడ ఇవ్వాలి, పారదర్శక కేటాయింపు, భక్తులకు ఇబ్బంది లేకుండా ఎలా జారీ చేయాలనే అంశాలపై కమిటీ అధ్యయనం చేసి వారం పదిరోజుల్లో విధివిధానాలను రూపొందిస్తుందన్నారు. టీటీడీ గోశాల నిర్వహణ సరిగా లేదని బోర్డు దృష్టికి వచ్చిందని.. గోశాలను టీటీడీనే నిర్వహించాలా లేదా ఇతర వలంటరీ ఆర్గనైజేషన్లకు కేటాయించాలా అనేది పరిశీలించేందుకు నిపుణుల కమిటీ నియమించామన్నారు. ఈ కమిటీ నివేదిక ఆధారంగా నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.



ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

తాను కోరుకున్నట్టుగానే బిహార్‌లో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (సర్) పూర్తిచేయగలిగిన ఎన్నికల సంఘం ఇప్పుడు రెండో దశలో తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాలలో జాబితా ప్రక్షాళనకు నడుంబిగించింది. బిహార్‌లో ఏడున్నర కోట్ల ఓటర్ల సవరణే వివాదాస్పదమై, వ్యవహారం సుప్రీంకోర్టు వరకూ పోయిన నేపథ్యంలో, ఇప్పుడు నాలుగు నెలల్లో ఏకంగా యాభైకోట్ల మంది ఓటర్ల పుట్టుపూర్వోత్తరాలను పరిశీలించి, ప్రక్షాళించాలని ఈసీ నిర్ణయించింది. నెలకోదశని పూర్తిచేసుకుంటూ ఫిబ్రవరిలోగా పని ముగించబోతోంది. వచ్చే ఏడాది ఎన్నికలకు పోబోతున్న విపక్ష పాలిత రాష్ట్రాలు కూడా ఈ సవరణలో ఉన్నందున దేశం ఇకపై తీవ్రవాగ్యుద్ధాలను చూడక తప్పదు.

బిహార్ దాటిన 'సర్'

'బిహార్ 'సర్' లేవనెత్తిన అనుమానాలూ ప్రశ్నలకూ ఇప్పటికీ జవాబులు లేవు, ఇప్పుడు దానిని మరింత విస్తరించడానికి ఈసీ సిద్ధపడింది, కొత్త ఓటర్లను చేర్చకుండా ఏకంగా అరవైఐదులక్షల మందిని అనర్హులుగా మార్చేసిన బిహార్ దారిలోనే మిగతా దేశాన్నీ ఈసీ నడిపించాలనుకుంటోంది' అని కాంగ్రెస్ విమర్శించింది. పశ్చిమ బెంగాల్‌తో ఈసీకి ఎలాంటి ఘర్షణాలేదని, రాజ్యాంగబద్ధ విధిని తాము నిర్వర్తిస్తున్నామని ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ విలేఖరుల ముందు చేసిన వ్యాఖ్య జరగబోయే రచ్చని ముందే తెలియచెబుతోంది. బెంగాల్‌లో సమగ్ర సవరణకు ఉపక్రమిస్తే రక్తపాతాలైపోతాయన్న తరహాలో మమతాబెనర్జీ గతంలోనే కొన్ని హెచ్చరికలు చేశారు. ఏ మాత్రం లెక్క తేడావచ్చినా ఊరుకొనేది లేదని ఈసీ ప్రకటన తరువాత కూడా ఆమె పార్టీ ఘాటుగానే హెచ్చరించింది. బీజేపీ అసలు లక్ష్యం బెంగాల్ మాత్రమేనని, ముందుగా బిహార్‌లో రిహార్సల్స్ జరిగిందని తృణమూల్ విమర్శ. రాష్ట్రంలో బీజేపీ బలంగా, దూకుడుగా ఉన్న నేపథ్యంలో, ప్రతీ ఓటరు జోడింపు తొలగింపు తీవ్రవివాదం కావచ్చు. తమిళనాడు, కేరళ పాలక పక్షాలు కూడా ఎన్నికల సంఘం నిర్ణయాన్ని గట్టిగా ప్రశ్నించాయి. వచ్చే ఏడాది ఏప్రిల్ లేదా మే నెలలో ఎన్నికలు జరగబోతున్నందున తమిళనాడు, పశ్చిమ బెంగాల్, కేరళ రాష్ట్రాల్లో ఇంత హడావుడిగా జాబితాలను సవరించాల్సిన అవసరం ఏముందని ఆ పార్టీలు అడుగుతున్నాయి. యూపీలో సమాజ్‌వాదీ పార్టీ యావత్ ప్రక్రియమీదా కన్నేసి ఉంచేందుకు పీడీఏ (పిఛ్‌డే, దళిత్, అల్పసంఖ్యాక్) దళాలను రంగంలోకి దింపబోతున్నట్టు ప్రకటించింది. మోదీ ప్రభుత్వం పక్షాన, అది చెబుతున్న రీతిలో ఈ ప్రక్షాళన జరుగుతోందని ఆరోపిస్తున్న విపక్షపార్టీలు తమ వాదనను నిరూపించుకోవడానికి శతథాప్రయత్నిస్తాయి. ఒక రాజకీయ పార్టీగా బీజేపీ కూడా ఎన్నికల సంఘాన్ని ఏ మాత్రం ప్రశ్నించకుండా, దానిని ఏకపక్షంగా వెనకేసుకురావడం విపక్షాలకు ఆయుధంగా ఉపకరిస్తోంది. బీజేపీ, దాని మిత్రపక్షాలు ఈసీ చర్యలను సమర్థించడం, ఇండియా కూటమి పార్టీలు వ్యతిరేకించడంతో, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయవలసిన ఇటువంటి కార్యక్రమాలు సైతం రాజకీయమయమైపోతున్నాయి.

చట్టవిరుద్ధమని తేలితే 'సర్'ను సమూలంగా రద్దుచేస్తానని ఆదిలో ఘాటైన హెచ్చరికలు చేసిన సర్వోన్నత న్యాయస్థానం ఆ తరువాత ఈసీ వాదనలకు లొంగిన కారణంగానే ఇప్పుడు సదరు ప్రక్రియ బిహార్ దాటి దేశమంతా విస్తరించగలుగుతోంది. తన స్వతంత్రతనూ, స్వేచ్ఛనూ అడ్డుకోవద్దన్న ఈసీ వాదనకు సుప్రీం సరేనంటూ, ఏవో చిన్న సవరణలతో పాటు, ఆధార్‌ను కేవలం ఒక గుర్తింపు పత్రంగా చేర్పించగలిగింది. ఓటరు సమర్పించాల్సిన యోగ్యతాపత్రాల జాబితాలో దానిని చిట్టచివరన ఉంచేందుకు ఈసీ అయిష్టంగానే ఒప్పుకుంది. దేశవ్యాప్త ఓటరు జాబితాల శుద్ధీకరణకు ఎన్నికల సంఘానికి బిహార్ ప్రయోగకేంద్రంగా ఉపకరించింది. ఒక పోలింగ్ బూత్‌ను 1200 మంది ఓటర్లకు పరిమితం చేయడం, ఈవీఎంల మీద అభ్యర్థుల కలర్ ఫోటోలు ఇత్యాది 17 కొత్త సంస్కరణలకు కూడా బిహార్ పునాదిగా పనిచేసింది. రాహుల్ చేసిన 'ఓట్ చోరీ' ఆరోపణలు, ఓట్ అధికార యాత్రలు ఎన్నికల సంఘాన్ని ఆత్మరక్షణలోకి నెట్టినమాట నిజం. నిరూపించు లేదా క్షమాపణలు చెప్పు అని రాహుల్ మీద విరుచుకుపడిన ఈసీ కూడా బిహార్ అనుభవాల నుంచి చాలా పాఠాలు నేర్చుకొని, అనేక విధానపరమైన మార్పు చేర్పులతో రెండోదశకు ఉపక్రమించిన నేపథ్యంలో, అన్ని పార్టీలూ సంఘానికి సహకరించాలి. ప్రక్రియ ఆరంభంలో ఆయా రాష్ట్రాల రాజకీయపక్షాలతో చర్చలు జరపడమే కాక, అది పూర్తిగా ముగిసేంత వరకూ వాటి సలహాలు, అభ్యంతరాలను స్వీకరించగలిగినప్పుడే ఈ భారీ కార్యక్రమాన్ని ఈసీ సవ్యంగా, సంతృప్తికరంగా పూర్తిచేయగలుగుతుంది.


ఐరోపా నుండి ఆసియాకు పయనించే జలాంతర ఇంటర్నెట్ కేబుళ్ళన్నీ గల్ఫ్ నుంచి భారత్ మీదుగానే సమస్త ఆసియా దేశాలకు వెళ్తాయి. గూగుల్ డేటా సెంటర్‌తో పాటు కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ సైతం విశాఖపట్టణానికి వస్తున్నందున దుబాయి సభలో జ్ఞాన ఆధారిత ఆర్థిక వ్యవస్థ స్వరూప స్వభావాలను చంద్రబాబు వివరించిన విధానం ప్రతి ఒక్కరినీ ఆకట్టుకున్నది.

చంద్రబాబు 'జ్ఞాన' పథం

సమాజాలు కాలానుగుణంగా ప్రగతి మార్గంలో పయనించేందుకు దార్శనిక పాలకులు అవసరం. దూరదృష్టి, ఆత్మవిశ్వాసం, నిబద్ధత ఉన్న పాలకులే తమ దేశాలకు శీఘ్ర పురోగతి సాధించగలుగుతారు. ఈ విషయంలో గల్ఫ్ దేశాలు ప్రపంచానికే ఆదర్శప్రాయం. ఎడారి దేశాలు సంపద్వంత సీమలుగా వర్ధిల్లుతోన్న తీరుతెన్నులను నిశితంగా గమనించే భారతీయ రాజకీయ నాయకులలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అగ్రగణ్యుడు.

దుబాయితో చంద్రబాబుకు మూడు దశాబ్దాల అనుబంధం ఉంది. పర్యాటక రంగమే జీవనాడిగా ఉన్న దుబాయి, చమురు ఎగుమతి కేంద్రీకృత ఆర్థిక వ్యవస్థగా ఉన్న అబుదాబిల అభివృద్ధి నమూనాలను ఆయన నిశితంగా పరిశీలిస్తూ వస్తున్నారు. ఇటీవల దుబాయిని సందర్శించిన చంద్రబాబు, అక్కడ ప్రవాసులతో జరిగిన ఒక సభలో మాట్లాడుతూ అభివృద్ధి విధానం గురించి చేసిన ప్రసంగం సామాన్యులు, మేధావులు అందరినీ ఆలోచింపజేసింది. జ్ఞాన ఆధారిత ఆర్థిక వ్యవస్థ విషయమై చంద్రబాబు దార్శనికత, విశాఖపట్టణంలో గూగుల్ డేటా సెంటర్ నేర్పాటు చేయనున్న నేపథ్యంలో మరింత ప్రాధాన్యం సంతరించుకున్నది. ఐరోపా నుండి ఆసియాకు పయనించే సముద్రాంతర ఇంటర్నెట్ కేబుళ్ళన్నీ గల్ఫ్ నుంచి భారత్ మీదుగానే సమస్త ఆసియా దేశాలకు వెళ్తాయి, ప్రతిపాదిత గూగుల్ డేటా సెంటర్‌తో పాటు కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ సైతం విశాఖపట్టణానికి వస్తున్నందున దుబాయి సభలో జ్ఞాన ఆధారిత ఆర్థిక వ్యవస్థ స్వరూప స్వభావాలను చంద్రబాబు వివరించిన విధానం ప్రతి ఒక్కరినీ ఆకట్టుకున్నది. వర్షాభావ దుబాయి సిరిసంపదల నెలవుగా పరిణమిస్తుందని ఒకప్పుడు ఎవరూ ఊహించలేదని, అదే విధంగా రైతు బిడ్డలు ఐటీ ఇంజినీర్లుగా ఎదుగుతారని ఒకప్పుడు ఎవరూ భావించలేదని చంద్రబాబు అన్నారు. దూరదృష్టి, వినూత్న ఆలోచనలు, భద్ర భవిష్యత్తు నిర్మాణ సంకల్పంతోనే ఆ మేలు మార్పులు సుసాధ్యమయ్యాయని చంద్రబాబు అన్నారు. కుటుంబానికి ఒక్కరు చొప్పున ఐటీ ఇంజినీర్‌ను చేస్తానని 1990లలో తాను ప్రకటిస్తే హేళన

గల్ఫ్ లేఖ



చేశారని ఆయన గుర్తు చేశారు. భావితరాలకు అవసరమైన అధునాతన సాంకేతికత క్వాంటం కంప్యూటింగ్‌కు తాను నవ్యాంధ్రప్రదేశ్ నుండి శ్రీకారం చుట్టనున్నట్లుగా చంద్రబాబు హర్షధ్వానాల మధ్య ప్రకటించారు.

చమురు ఆదాయం లేని దుబాయికి పర్యాటక రంగమే ప్రధాన ఆదాయ వనరుగా ఉన్నది. కేవలం ఒకే ఒక్క విమానాశ్రయం ఆధారంగా దుబాయి ఏమిరేట్ ఏ విధంగా ప్రపంచ పర్యాటకుల గమ్యంగా ప్రభవించిందో చంద్రబాబు తన ప్రత్యక్ష అనుభవాలను ఉదహరిస్తూ వివరించారు. ప్రపంచవ్యాప్తంగా ఎక్కడా లేని రీతిలో 1,50,000 హోటల్ రూమ్‌లతో పర్యాటక రంగాన్ని ఈ ఎడారి నగరం అభివృద్ధి చేసిన తీరును వివరిస్తూ నీళ్ళు వృక్షాలు లేని దుబాయి శరవేగంగా పురోగమిస్తుండగా అన్నీ ఉండీ మనమెందుకు వెనుకబడి ఉంటున్నామో ఆలోచించాలని చంద్రబాబు అన్నారు. ప్రపంచ చమురు విపణిని శాసించే సౌదీ అరేబియాతో పాటు దుబాయి పొరుగు ఏమిరేట్ అబుధాబి కూడా డేటా సెంటర్ల ఏర్పాటుకు ఎనలేని ప్రాధాన్యమిస్తున్నాయి. ఈ వాస్తవాన్ని గుర్తించిన చంద్రబాబు అబుధాబి చమురు కేంద్రీకృత విధానం నుంచి జ్ఞాన ఆధారిత ఆర్థిక విధానం వైపు పురోగమిస్తున్న వైనాన్ని చంద్రబాబు ప్రశంసాపూర్వకంగా విపులీకరించారు.

రాజకీయాలకు అతీతంగా ఆవిష్కృతమైన చంద్రబాబు మనోగతం సభికులను స్ఫూర్తిదాయకంగా ఆకట్టుకున్నది. భారతీయులు ప్రపంచంలో ఎక్కడ ఉన్నా అక్కడి సంప్రదాయాలు, చట్టాలను గౌరవిస్తూ మెలగాలని హితవు చెప్తుతూ తన ప్రసంగాన్ని ప్రారంభించిన చంద్రబాబు దుబాయిలోని తెలుగు వారికి మాత్రమే కాకుండ ప్రపంచవ్యాప్తంగా ఉన్న సమస్త ప్రవాస భారతీయులకూ ఒక సందేశాన్ని పంపారు. అమెరికాతో సహా కొన్ని దేశాలలో దీపావళి మొదలైన పండుగల సందర్భంగా భారతీయులు కొందరు హద్దులు మీరి వ్యవహరించిన తీరుపై విపుల వార్తా కథనాలు వెలువడిన దృష్ట్యా చంద్రబాబు హితోపదేశం వివేకవంతమైనది. గత మూడు దశాబ్దాలుగా దుబాయికి రాకపోకలు సాగిస్తున్న చంద్రబాబు స్థానిక ప్రవాసులతో సమావేశమవ్వడం ఇదే మొదటిసారి. దుబాయిలో పుట్టిన తొమ్మిదేళ్ళ వేమూరి హంశ్ మొదలు కాకినాడలో పుట్టి పెరిగి దుబాయిలో స్థిరపడ్డ 92 ఏళ్ళ ఫాతిమా వరకు చాలామంది చంద్రబాబుతో భేటీ అయ్యారు. సమావేశ వేదికపై సుమారు ఐదు గంటల పాటు విసుగు, అలసట లేకుండా ఓపిగ్గా నిలబడిన చంద్రబాబు తనను పలకరించేందుకు వచ్చిన ప్రతి ఒక్కరితోనూ విడివిడిగా మాట్లాడి వారితో ఫోటోలు దిగారు.

■ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ప్రజలు వస్తున్నారు జాగ్రత్త...!



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

గత బుధవారం తెల్లవారు జామున ఢిల్లీలోని రోహిణీ ప్రాంతంలో ఢిల్లీ పోలీసులు జరిపిన ఒక ఎన్‌కౌంటర్‌లో బిహార్‌కు చెందిన నలుగురు కరడుగట్టిన క్రిమినల్స్ మరణించారని వార్తలు వచ్చాయి. సిగ్మా ముఠా పేరిట అనేక హత్యలు, దోపిడీకి పాల్పడిన ఈ నలుగురు బిహార్ ఎన్నికలకు ముందు బీభత్సం సృష్టించనున్నారన్న సమాచారం రావడంతో ఢిల్లీ పోలీసులు అప్రమత్తమై ఈ ఎన్‌కౌంటర్‌ను నిర్వహించారు. ఈ నేరగాళ్ల ఎవరి తరఫున హింసాకాండకు పాల్పడాలని అనుకున్నారు.. ఎవరి సుపారీ తీసుకున్నారు అన్న వివరాలు మాత్రం లభ్యం లేదు. అయితే బిహార్‌లో నవంబర్ మొదటి వారంలో జరిగే ఎన్నికల్లో జరగబోయే హింసాకాండ గురించి ఆందోళనలు మాత్రం కొనసాగుతున్నాయి. నేపాల్‌లో సంభవించిన పరిణామాలు భారత్–నేపాల్ సరిహద్దు సమీప ఏడు బిహారీ జిల్లాల్లోని 21 సీట్లపై ప్రభావం చూపవచ్చని భావిస్తున్నారు. కేవలం రెండు దశల్లో జరగాల్సిన ఎన్నికలకు గాను ఇప్పటికే సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్, ఐటీబీపీ తదితర బలగాలకు చెందిన లక్ష మందిని బిహార్‌లో మోహరించారు. దేశంలో ఇంకెక్కడైనా ఎన్నికలు జరగడం ఒక ఎత్తు, బిహార్‌లో ఎన్నికలు జరగడం ఒక ఎత్తు అని అభివర్ణించిన ఎన్నికల కమిషన్ 4.5 లక్షల మంది పోలింగ్ సిబ్బంది, 2.5 లక్షల మంది పోలీసు అధికారులతో పాటు 470 మంది కేంద్ర పరిశీలకులను నియమించింది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోనూ ఇతర రాష్ట్రాలకు చెందిన ఐఏఎస్ అధికారులను నియమించామని వారే తమ కళ్లు చెవులుగా వ్యవహరిస్తారని కమిషన్ ప్రకటించింది. ఈ పరిణామాలను బట్టి చూస్తే కేంద్రంలో అధికారం నెరపుతున్న నరేంద్రమోదీ ప్రభుత్వం బిహార్ ఎన్నికలకు ఎంత ప్రాధాన్యమిస్తున్నదో విశదమవుతోంది.

రాష్ట్ర క్రైమ్ రికార్డ్ బ్యూరో ప్రకారమే ప్రతి నెలా సగటున 229 హత్యలు జరిగే బిహార్‌లో 20 సంవత్సరాలుగా నితీశ్ కుమార్ ముఖ్యమంత్రిగా ఉన్నా పరిస్థితిలో పెద్దగా మార్పు లేదు. హత్యలు, దోపిడీలు, కిడ్నాప్‌లు జరగని రోజు లేదు. బిహార్‌లో 60 శాతం జనాభా 30 ఏళ్ల వయసులో ఉన్నారని, వారికే ఉద్యోగమూ లేనప్పుడు శాంతిభద్రతల సమస్య రాకుండా ఎలా ఉంటుంది.. అని ఆ రాష్ట్ర అదనపు పోలీసు డైరెక్టర్ జనరల్ ఒకరు వ్యాఖ్యానించారు. బిహార్‌లో ప్రస్తుత నేర న్యాయ విచారణ వ్యవస్థ నేరాలను అరికట్టగల స్థితిలో లేదని పోలీసు ఉన్నతాధికారులే ఒప్పుకుంటున్నారు. బిహార్‌లో ఉపాధి దొరకని లక్షలాది యువజనులు ఇతర రాష్ట్రాలకు వలసవెళుతున్నారు. ఒక అంచనా ప్రకారం 74.5 లక్షలమంది బిహారీలు తమ రాష్ట్రానికి వెలుపల పనిచేస్తున్నారు.

బిహార్‌లో ఉపాధి కల్పన ఎంత ఘోరంగా ఉన్నదో అంచనా వేసేందుకు ఛట్ పూజకు హాజరయ్యేందుకు ఆ రాష్ట్రానికి లక్షల సంఖ్యలో ప్రజలు తిరిగి వచ్చిన తీరే నిదర్శనం. ప్రతి రాష్ట్రం నుంచీ బిహారీలు తిరిగి వచ్చేందుకు రైల్వే మంత్రిత్వ శాఖ 12వేల ప్రత్యేక రైళ్ళు నడిపినా ప్రతి రైలూ కిక్కిరిసిపోయింది. నిలబడేందుకు కనీసం చోటు కూడా లేకపోవడంతో అశేష జనం ప్రాణాలకు తెగించి రైళ్లపై కూర్చుని ప్రయాణించారు. 'నేను గత నాలుగు రోజులుగా కేవలం రెండుసార్లే భోజనం చేశాను. సామాను పోతుందన్న భయంతో నిద్ర కూడా పోలేదు. టాయిలెట్‌లో కూడా జనం నిండిపోవడంతో 30 గంటల పాటు మూత్రం చేయలేకపోయాను.. ప్రతి ఏడాదీ ఇదే పరిస్థితి ఎదుర్కొంటున్నాను' అని బిహారీ కార్మికుడు ఒకరు చెప్పారు.

ఇవన్నీ చూస్తుంటే బిహార్ అసలు ఈ దేశంలోనే ఉన్నదా.. అని సందేహం వస్తుంది. 4 ట్రిలియన్ డాలర్లతో ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగామని, జపాన్‌ను సైతం అధిగమించామని సంతోషిస్తున్నవారు బిహార్‌లో పరిస్థితి చూస్తే విషాదంలో కూరుకుపోకతప్పదు. దాదాపు 20 సంవత్సరాల క్రితం లాలూప్రసాద్ యాదవ్ నేతృత్వంలోని ప్రభుత్వంలో ఆటవిక రాజ్యం ఉన్నదని బీజేపీ తీవ్ర ప్రచారం చేసింది. 2005 సంవత్సరం నుంచీ బిహార్‌లో జనతాదళ్ (యు) అధికారంలో ఉన్నది. అందులో 15 సంవత్సరాలు బీజేపీ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్నది. ఇంత సుస్థిరత ఉన్న బిహార్ దేశంలో అత్యంత నిరుపేద రాష్ట్రంగా ఎందుకు మిగిలిపోయింది? ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి నివేదిక ప్రకారం సామాజిక అభివృద్ధి, ప్రజారోగ్య వ్యవస్థ పనితీరు, పాఠశాల విద్యానాణ్యత, సుపరిపాలనా సూచికల్లోను బిహార్ అధమ స్థానంలో ఉన్నది. మూడు సంవత్సరాల క్రితం రైల్వేలో 35వేల ఉద్యోగాల కోసం కోటిమందికి పైగా దరఖాస్తు చేసుకున్నారు. ఉద్యోగాల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా జరగలేదన్న ఆగ్రహంతో విద్యార్థులు బిహార్‌లో అనేక ప్రాంతాల్లో రైళ్లను ఆపి బోగీలకు నిప్పంటించారు. అనేక చోట్ల కాల్పులు జరపాల్సి వచ్చింది. ఎన్నికలకు ముందు ప్రతి పార్టీ పెద్ద ఎత్తున ఉద్యోగాలను కల్పిస్తామని హామీ ఇస్తుంది. అయితే ఆ హామీలు రాజకీయ నినాదాలుగా మాత్రమే మిగిలిపోతాయి. బిహార్‌లోనే అత్యధిక శాతం మంది పేదరికం, నిరుద్యోగంలోనూ కునారిల్లుతున్నారని ప్రపంచ బ్యాంకు నివేదిక వెల్లడించింది. బిహార్ స్థూల దేశీయోత్పత్తి, తలసరి



ఆదాయం దేశంలోని అన్ని రాష్ట్రాలకంటే తక్కువ. నీతీ ఆయోగ్ నివేదిక ప్రకారమే దేశంలో అత్యంత ఘోరమైన ఆర్థిక పరిస్థితి ఉన్న రాష్ట్రం బిహార్. రెండేళ్ల క్రితం జరిగిన కుల సర్వే ప్రకారమే దాదాపు 94 లక్షలమంది రోజుకు రూ.200 కంటే తక్కువ ఆదాయంతో జీవిస్తున్నారు. అక్కడ 12వ తరగతి పూర్తి చేసినవారు కేవలం 10 శాతం మంది మాత్రమే!

దారిద్ర్యం, వలసలు, పాలనా వైఫల్యాలు, హింసాకాండ, కులతత్వం, అవినీతి, ప్రజలను ఉచితాలతో మభ్యపెట్టడం, పేలవమైన విద్యావ్యవస్థ చుట్టూ తిరుగుతున్న బిహార్ రాజకీయాలే ఆ రాష్ట్రం ఆర్థికంగా పరివర్తనం చెందకపోవడానికి కారణం. కుల ఆధారిత, ప్రాంతీయ పార్టీలకు బిహార్‌ను వదిలేసి కాంగ్రెస్ చేతులెత్తేస్తే బీజేపీ ఆ రాష్ట్రంలో ఉనికిని నిరూపించుకోవడానికి నానా కష్టాలు పడుతూ సంకీర్ణ ప్రభుత్వాన్ని ప్రోత్సహించక తప్పని పరిస్థితిలో ఉన్నది. ప్రతి బడ్జెట్‌లోనూ, మోదీ ప్రతి పర్యటనలోనూ రూ.లక్షల కోట్లపైగా ప్రాజెక్టులకు సంబంధించి ప్రకటనలే కాని ఆ మొత్తం బిహార్ రూపురేఖల్ని మార్చేందుకు అక్కడి పరిశ్రమలకు ఉపాధి కల్పనకు దోహదం చేసేందుకు ఉపయోగపడిన దాఖలాలు లేవు. కొన్ని దశాబ్దాల రాజకీయ నిర్లక్ష్యానికి ప్రతీకగా నేటి బిహార్ నిలిచిపోయింది.

ఛట్ పూజ అనంతరం మంగళవారం నుంచి ముమ్మరమవుతున్న బిహార్ ఎన్నికల ప్రచారంలో రాజకీయ పార్టీలకు ఒకరిపై మరొకరు దుమ్మెత్తి పోసుకోవడం, ప్రజలకు వాగ్దానాల వర్షం కురిపించడం తప్ప మరో మార్గం లేదు. యథా ప్రకారం ప్రధానమంత్రి బిహార్‌లో సుడిగాలిలా తిరుగుతూ గతంలో ఉన్న జంగిల్‌రాజ్ గురించి విమర్శలు గుప్పిస్తున్నారు. నిజానికి ఆపరేషన్ సిందూర్ ప్రారంభమైన వెంటనే మోదీ తొలుత బిహార్‌కు వెళ్లి అక్కడ పాక్‌కు మరచిపోలేని గుణపాఠం చెబుతామని గర్జించారు. అప్పటి నుంచీ ఇప్పటి వరకు పలుసార్లు బిహార్‌లో పర్యటించిన మోదీ దాదాపు రూ. లక్షా 26వేల కోట్ల మేరకు ప్రాజెక్టులను ప్రారంభించారు. డబుల్ ఇంజన్ సర్కార్ వల్లే బిహార్ అభివృద్ధి జరుగుతుందని అన్నారు. ఎన్డీఏకు సంబంధించి మోదీయే రథసారథి. మోదీకి సంబంధించి బిహార్ ఆయన రాజకీయ అధ్యాయంలో ఒక కీలకమైన ఘట్టం. ఇప్పటికే ఆయన పార్టీలోనూ, ప్రజలకూ ఎన్నో ప్రశ్నలకు జవాబులు చెప్పాల్సిన పరిస్థితుల్లో ఉన్నారు. అసలు గత పది సంవత్సరాల్లో బిహార్‌లో బీజేపీ చొచ్చుకుపోయేలా ఆయన ఎందుకు చేయలేకపోయారో, కుల సమీకరణాలను బీజేపీ ఎందుకు అధిగమించలేకపోయిందో అన్నది ఒక ప్రశ్న. బిహార్ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించలేకపోతే, ఇతర శక్తులు బలం పుంజుకుంటాయి. బీజేపీ విజయం సాధిస్తే మోదీ తదుపరి రాజకీయ విజృంభణలకు అడ్డుకట్టవేసే వారుండరు. తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌తో సహా అనేక రాష్ట్రాలు ఆయన తదుపరి ఎత్తుగడలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండవల్సి వస్తుంది.

మహాఘట్ బంధన్ తీరేవేరు. ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 1 వరకు బిహార్‌లో 1300 కి.మీ ఉధృతంగా పర్యటించిన కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ఆ తర్వాత దాదాపు రెండు నెలల వరకు అక్కడ కనపడకుండా పోయారు. టిక్కెట్ల పంపిణీ విషయంలో తీవ్ర గందరగోళం జరుగుతున్నా, ఆయన పట్టించుకోలేదు. పొత్తు దాదాపు కూలిపోతుందన్న పరిస్థితుల్లో రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోత్ రంగప్రవేశం చేయాల్సి వచ్చింది. ఓటర్ అధికార్ యాత్ర జరిపిన తర్వాత ఆ ప్రభావాన్ని కొనసాగించేందుకు రాహుల్ బిహార్‌లోనే ఉండి పార్టీని క్రింది స్థాయి నుంచి సంఘటితంగా నిర్మించేందుకు ఎందుకు ప్రయత్నించలేదు? ఒక్కొక్క సీటూ ముఖ్యమైన పరిస్థితుల్లో 9 సీట్లలో స్నేహపూర్వక పోటీ చేస్తామనడంలో అర్థం ఉన్నదా? అసలు రాజకీయాల్లో స్నేహపూర్వక పోటీ అనేది ఉంటుందా? బిహార్ ఎన్నికల్లో కాంగ్రెస్ పోటీ చేసే 61 సీట్లలో సగమైన గెలుచుకోకపోతే రాహుల్‌గాంధీని బిహార్ ప్రజలు తిరస్కరించారని, ఓట్ చోరీ విషయమై మోదీపై ఆయన చేసే ఆరోపణలు గాలికి కొట్టుకుపోయాయని భావించవలిసి ఉంటుంది. ఆయన ప్రయోగిస్తానన్న హైడ్రోజన్ బాంబు ఏమైంది? అత్యంత వెనుకబడిన బిహార్‌లో రాజకీయాలు కులం చుట్టే తిరుగుతాయని వేరే చెప్పనక్కర్లేదు. కులాల లెక్కలు, మనుగడ కోసం వేసే ఎత్తుగడలు, మత విద్వేషాలు, తాయిలాల సమీకరణాలను అధిగమించి పార్టీలు వ్యవహరించినప్పుడే బిహార్‌కు ఉజ్వల భవిష్యత్ ఉంటుంది. లేకపోతే బిహార్ కవి దినకర్ ఒకప్పుడు ఎలుగెత్తిన 'సింహాసన్ ఖాళీకరో.. ప్రజలు వస్తున్నారు' అన్న నినాదం ఆ సేతుహిమాచలం మారుమ్రోగే పరిస్థితి ఏర్పడుతుంది.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

> **ఎన్డీఏకు మోదీయే రథసారథి. బిహార్‌లో బీజేపీ చొచ్చుకుపోయేలా ఆయన ఎందుకు చేయలేకపోయారు?**
> **కుల సమీకరణాలను బీజేపీ ఎందుకు అధిగమించలేకపోయింది?**
> **కాంగ్రెస్ పోటీ చేసే 61 సీట్లలో సగమైన గెలుచుకోకపోతే రాహుల్‌గాంధీని బిహార్ ప్రజలు తిరస్కరించారని, ఓట్ చోరీ విషయమై మోదీపై ఆయన చేసే ఆరోపణలు గాలికి కొట్టుకుపోయాయని భావించక తప్పదు.**

న్యాయం, అన్యాయం చూడాలి!

ఆంధ్రజ్యోతి అక్టోబర్ 23 సంచికలో పి. విక్టర్ విజయ్‌కుమార్ 'హమాస్ దుర్మార్గం – ఇజ్రాయెల్ అమానుషం' పేరుతో వ్యాసం రాశారు. శీర్షిక ఆకర్షణీయంగా కనబడినా, అంతర్లీనంగా వ్యాసం పాశ్చాత్య మీడియా నెరేటివ్‌కు ప్రతిధ్వనిగా, వాస్తవాల వక్రీకరణతో, అర్ధసత్యాల మేళవింపుతో నిండిపోయింది. 'ఇజ్రాయెల్ – ఫలస్తీనా ఘర్షణ' లాంటి సంక్లిష్ట, చారిత్రక అంశంపై రాస్తున్నప్పుడు సమతుల్యత కోసం చూడకూడదు. న్యాయం, అన్యాయం చూడాలి. న్యాయం వైపు నిలబడాలి. కానీ ఈ వ్యాసం ఆ ప్రమాణాన్ని అందుకోలేకపోయింది.

హమాస్‌ను 'ఉగ్రవాద సంస్థ'గా, ఇజ్రాయెల్ చర్యలను 'స్వీయరక్షణ'గా చూడటం పాశ్చాత్య శక్తుల రాజకీయ నిర్వచనానికి అతికినట్లున్న అభిప్రాయం. 1949 జెనీవా ఒప్పందం, 1977 అదనపు ప్రోటోకాల్స్ ప్రకారం... ఆక్రమిత భూభాగంలోని ప్రజలు తమ ఆత్మరక్షణ కోసం సాయుధ ప్రతిఘటన చేయవచ్చు. ఇది అంతర్జాతీయ చట్టబద్ధ హక్కు. అలాంటి న్యాయ పోరాటాన్ని, అన్యాయాన్ని ప్రతిఘటించడాన్ని 'ఉగ్రవాదం'గా చూడటం చట్టానికీ, చరిత్రకూ అవమానం.

1948లో ఇజ్రాయెల్ ఏర్పడినప్పుడు దాదాపు 7.5 లక్షల మంది ఫలస్తీనీయులు తమ ఇళ్ల నుంచి బహిష్కృతులయ్యారు. నేటికీ యూఎన్‌ఓ రికార్డుల ప్రకారం 59 లక్షల మంది శరణార్థులుగా ఉన్నారు. ఇంతటి చారిత్రక పీడనను తట్టుకొని నిలబడిన జాతి ప్రతిఘటనపై 'ఉగ్రవాదం' అనే ముద్ర వేయడం చాలా అన్యాయం. గాజాపై ఇజ్రాయెల్ విధించిన ఆంక్షలను 'భద్రతాపరమైన చర్య'గా రచయిత పేర్కొన్నారు. కానీ వాస్తవం దీనికి విరుద్ధంగా ఉంది. నిజానికి అది భద్రత కాదు, సామూహిక శిక్ష. 2007లో హమాస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గాజా ప్రాంతం సంపూర్ణ నిర్బంధంలోకి నెట్టివేయబడింది. ఆహారం, ఇంధనం, నీరు, విద్యుత్తు, ఔషధాలు అన్నింటిపైనా ఆంక్షలు విధించి, లక్షలాదిమంది నిరపరాధులను అమానవీయంగా నిస్సహాయ పరిస్థితుల్లోకి నెట్టివేశారు. ఈ నిర్బంధం కేవలం ఆర్థికం కాదు, ఇది ఒక జాతిని భూమ్మీద నుంచి చెరిపేయాలనే పగతో నిండిన అమానవీయ, పైశాచిక యుద్ధోన్మాదం.

ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో నిరపరాధులైన పసి పిల్లలు, గర్భిణులు, వైద్యులు, జర్నలిస్టులు కూడా బలయ్యారు. ఆసుపత్రులు, పాఠశాలలు, మసీదులు, శరణాలయాలు, ఏవీ సురక్షితంగా లేవు. చిన్నపిల్లల శరీరాలు మాంసపు ముద్దల్లా చెల్లాచెదురై మట్టిలో కలిసిపోయాయి; తల్లుల కేకలు, ఆర్తనాదాలు మానవ చరిత్ర సిగ్గుతో తలదించుకునే స్థాయిలో ఉన్నాయి. ఇది యుద్ధం కాదు, నరమేధం. ఇలాంటి దారుణాలకు సమర్థనగా 'భద్రత' అనే పదం వాడటం మానవత్వానికే మాయని మచ్చ. 'పరిస్థితులు ఇలాగే కొనసాగితే 2024 నాటికి గాజా నివాస యోగ్యంగా ఉండదు' అని యూఎన్‌ఓ 2012లోనే హెచ్చరించింది. దురదృష్టవశాత్తూ 2025 నాటికి ఇది నిజమై కనబడుతోంది. గాజాలోని 70 శాతం నీటి వనరులు కలుషితమయ్యాయి, 90 శాతం ప్రజలు ఆహారం కోసం ఇతరుల సహాయంపై ఆధారపడుతున్నారు. 65,000 మందికి పైగా మరణించారు. వారిలో సగానికి పైగా పిల్లలు, మహిళలు.

అలా అని హమాస్ హింసను అస్సలు సమర్థించడం లేదు. కానీ ఇజ్రాయెల్ నిర్వహిస్తున్న అత్యంత క్రూరమైన, నిరంతర హింసను, చిన్న పిల్లల హత్యలను, ప్రజల సామూహిక వధను పెద్ద నేరంగా గుర్తించకపోవడం, అంతర్జాతీయ సమాజం అస్సలు పట్టించుకోకపోవడం అన్నిటికన్నా పెద్ద విషాదం. నిజానికి అదే మానవతకు జరుగుతున్న పెద్ద అవమానం.

హమాస్ దాడులే ఫలస్తీనా ప్రజల బాధలకు మూల కారణమని విజయ్‌కుమార్ సూత్రీకరిస్తున్నారు. అయితే ఫలస్తీనా ప్రజలు గత 75 సంవత్సరాలుగా ఆక్రమణ, పీడన, అవమానం, నిర్బంధంలో జీవిస్తున్నారు. నిజానికి హమాస్ పుట్టుకకు మూలకారణం ఈ అన్యాయం, ఆక్రమణ, అణచివేతలే తప్ప మరొకటి కాదు. హమాస్ లేకున్నా ఇజ్రాయెల్ దాడులు ఆగేవి కావు. నక్బా నుంచి నేటి వరకు, ఇదొక చరిత్రాత్మక సత్యం. 1948లో ప్రారంభమైన 'నక్బా' అంటే ఫలస్తీనా జాతి విపత్తు. తరతరాలుగా వారు తమ సొంత నేలపైనే బహిష్కృతులుగా, శరణార్థులుగా జీవిస్తూ వస్తున్నారు.

ఫలస్తీనీయుల భూములు ఆక్రమించుకుని ఇజ్రాయెల్ నిర్మించిన అక్రమ కాలనీలు అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘిస్తూ, వారి జీవన హక్కును కాలరాస్తున్నాయి. యూఎన్‌ఓ తీర్మానాలు ఇజ్రాయెల్ వైఖరిని ఎంత తీవ్రంగా, ఎన్నిసార్లు ఖండించినప్పటికీ, ప్రపంచ సామ్రాజ్యవాద శక్తుల ద్వంద్వ ప్రమాణాలు ఇజ్రాయెల్ దౌర్జన్యాలకే వంత పాడి ప్రోత్సహించాయి. విజయ్‌కుమార్ వ్యాసం ఈ చారిత్రక నేపథ్యాన్ని పూర్తిగా పక్కనబెట్టి, ఒకే కోణం నుంచి తీర్పు చెప్పింది. అది పాఠకులను తప్పుదోవ పట్టించే బలమైన ఎత్తుగడ.

హమాస్ హింస ముమ్మాటికీ తప్పే. కానీ ఇజ్రాయెల్ దుర్మార్గాలు న్యాయ సమ్మతమనడం అత్యంత ఘోరమైన తప్పు. బాంబులు ఎవరి చేతుల్లో ఉన్నా పతనమే సృష్టిస్తాయి. అవి ఎవరినీ రక్షించవు. ప్రపంచం ఈ యుద్ధాన్ని భద్రతా సమస్యగా కాకుండా, మానవతా సంక్షోభంగా చూడాలి. ఇజ్రాయెల్–ఫలస్తీనా ఘర్షణను రాజకీయ కోణంలో కాకుండా, మానవ విలువల దృష్టిలో చూడడం అవసరం. లేకపోతే, చరిత్ర మనందరినీ నిశ్శబ్ద దోషులుగా గుర్తిస్తుంది.

● యండి. ఉస్మాన్‌ఖాన్



> **హమాస్ హింస ముమ్మాటికీ తప్పే. కానీ ఇజ్రాయెల్ దుర్మార్గాలు న్యాయ సమ్మతమనడం అత్యంత ఘోరమైన తప్పు. బాంబులు ఎవరి చేతుల్లో ఉన్నా పతనమే సృష్టిస్తాయి. అవి ఎవరినీ రక్షించవు. ప్రపంచం ఈ యుద్ధాన్ని భద్రతా సమస్యగా కాకుండా, మానవతా సంక్షోభంగా చూడాలి.**

సాగు సమస్యల పరిష్కారంతోనే అధిక ఉత్పాదకత

దేశంలో వెనుకబడిన వంద జిల్లాల్లో వ్యవసాయం, దాని అనుబంధ రంగాల అభివృద్ధే (పంటల ఉత్పత్తి పెంచడం, వాటిలో వైవిధ్యాన్ని ప్రోత్సహించడం, సాగునీరు సదుపాయం, పంటల నిల్వ సామర్థ్యం మెరుగుపరచడం, రైతులకు రుణాలు... వంటివి) ప్రధాన లక్ష్యంగా 'ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన' (పీఎండీడీకేవై), తృణధాన్యాల మిషన్‌లకు కేంద్రం శ్రీకారం చుట్టింది. ఇటీవల ఢిల్లీలో ప్రధాని మోదీ ఈ పథకాలను ప్రారంభించారు. వీటిని రాబోయే రబీ సీజన్ నుంచి మరో ఆరేళ్ల వరకూ అమలు చేస్తారు. 'అన్నదాతలకు అభయం, దిగుమతులు తగ్గించుకోవాలి– ఎగుమతులు పెంచుకోవాలి, తృణ ధాన్యాల సాగు పెంచాలి...' అంటూ ప్రధాని పిలుపునిచ్చారు. ప్రతిపాదిత వంద జిల్లాల్లో ఈ పథకాల ద్వారా 35,440 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తామని చెప్పారు. అయితే, గత పదేళ్లలో 'విత్తనం నుంచి మార్కెట్ వరకూ' దేశంలో అనేక సంస్కరణలు చేశామని మోదీ చెప్పారు. కానీ ఈ సంస్కరణలు రైతులకు ఏ మేరకు లబ్ధి చేకూర్చాయి అన్నదే ప్రశ్న.

దేశీయ అవసరాల కోసం 2024–25లో రూ.48 వేల కోట్ల విలువైన (73 లక్షల టన్నుల) పప్పు ధాన్యాలను భారత్ దిగుమతి చేసుకుంది! ఈ పరిస్థితి మారాలి. గతంలో కేంద్రం పలు పంటలకు మద్దతు ధర కల్పిస్తున్నట్టు ప్రకటించింది. కానీ దేశంలోని ఎనభైశాతం మంది రైతులకు ఆ మద్దతు ధరలో సగం కూడా అందడం లేదు. 'తృణధాన్యాల మిషన్' సత్ఫలితాలు ఇవ్వాలంటే కేంద్రం చిత్తశుద్ధితో కృషి చేయాలి.

వ్యవసాయరంగంలో నిజమైన ఆత్మనిర్భరత సాధించాలంటే 'సాగులో– మౌలిక వసతులు, తక్కువ ఉత్పాదకత, సాగు నీరు, మార్కెట్ సమస్యలు, కౌలు రైతుల సమస్యలు' వంటి అనేక సవాళ్లను పరిష్కరించటంపై కేంద్రం దృష్టి సారించాలి. అధిక దిగుబడినిచ్చే వంగడాలు, ఆధునిక సేద్య పద్ధతులపై పరిశోధనలకు ప్రభుత్వాలు తగినంత ప్రోత్సాహం అందించాలి. చిన్న, సన్నకారు రైతులకు తక్కువ ధరకు సాగు యంత్రాలు అందుబాటులో ఉంచాలి. వారికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందించాలి. ప్రతిపాదిత వంద జిల్లాలకే పరిమితం కాకుండా దేశంలోని అన్ని జిల్లాల్లోనూ వ్యవసాయ ఉత్పాదకత పెంపుదలకు ప్రణాళికలు అమలు చేయాలి. అన్ని రకాల పంటలకు మద్దతు ధరలు కల్పించాలి. స్వామినాథన్ కమిషన్ నివేదిక ప్రకారం 'సమగ్ర ఉత్పత్తి ఖర్చుకు అదనంగా 50 శాతం కలిపి రైతులకు మద్దతు ధర ఇవ్వాలి. దానికి చట్టబద్ధత కల్పించాలి'. అప్పుడే సాగు రంగంలో వికసిత్ భారత్ సాధ్యం.

– బొంతు రాంబాబు

ఉదయం 8 నుంచి రాత్రి 8 వరకు..

12 గంటల పాటు పనిచేస్తున్న హెడ్‌పోస్టాఫీసు

గిర్మాజీపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వరంగల్ రైల్వేస్టేషన్‌రోడ్డులోని వరంగల్ ప్రధాన తపాలా కార్యాలయం ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పనిచేస్తోందని పోస్టల్ సూపరిండెంట్ బి. రవికుమార్ తెలిపారు. తపాలా, జాతీయ, అంతర్జాతీయ పార్సిల్ సేవలను అందిస్తున్నామని, విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని మంగళవారం ఆయన ఒక ప్రకటనలో కోరారు.



క్రమబద్ధీకరణకు నోచని జేపీఎస్‌లు

- నాలుగేళ్ల ఒప్పంద కాలం పూర్తి
- అదనంగా మరో రెండేళ్ల ప్రొబేషన్
- అయినా క్రమబద్ధీకరణకు సర్కార్ మీనమేషాలు
- కామన్ ఎఫెక్ట్ తేదీపై తకరారు
- ఇంక్రిమెంట్లు నష్టపోతున్న జేపీఎస్‌లు

హనుమకొండ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జూనియర్ పంచాయతీ కార్యదర్శుల పరిస్థితి దయనీయంగా ఉంది. నాలుగేళ్ల ఒప్పంద కాలం పూర్తయినా, అదనంగా మరో రెండేళ్ల ప్రొబేషన్ పీరియడ్ దాటినా ఇప్పటివరకు రెగ్యులర్ కాకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నారు. సెలవులు దొరకడం లేదు. ఇంక్రిమెంట్లు నష్టపోతున్నారు. వేతనం సైతం పూర్తిస్థాయిలో అందుకోలేక పోతున్నారు. తమ సర్వీస్ క్రమబద్ధీకరించాల్సిందిగా పెట్టుకుంటున్న మొర అరణ్యరోదనగానే మారిపోతోంది. సర్వీస్ క్రమబద్ధీకరణకు ప్రభుత్వం ముందుకు వచ్చినా పంచాయతీ అధికారులు త్సాతారం చేస్తున్నారు.

జూనియర్ పంచాయతీ కార్యదర్శులంతా పరీక్ష రాసి ప్రతిభ ఆధారంగా ఉద్యోగాలు సాధించిన వారు. అయినా వారిపట్ల అధికారులు చిన్నచూపు చూస్తున్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని ఎంత వేడుకుంటున్నా పంచాయతీ అధికారులు చూద్దాం.. చేద్దాం.. అన్న చందంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత ప్రభుత్వం హయాంలో 2019 ఏప్రిల్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1,280 జేపీఎస్ పోస్టులను భర్తీ చేశారు. ప్రస్తుతం 1,187 మంది ఉన్నారు. ఒక్క హనుమకొండ జిల్లాలోనే తక్కువగా 92మంది వరకు ఉన్నారు. వరంగల్ జిల్లాలో 170 మంది, జనగామ జిల్లాలో 210, మహబూబాబాద్ జిల్లాలో 220 మంది, ములుగు జిల్లాలో 235 మంది, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 260 మంది వరకు ఉన్నారు.

కామన్ ఎఫెక్ట్ తేదీపై తకరారు

జేపీఎస్‌లకు 2023 ఏప్రిల్ వరకు నాలుగేళ్ల కాంట్రాక్టు సమయం పూర్తయింది. అదే ఏడాది ఆగస్టులో స్కేల్ వర్తింపజేసింది. ఆ సమయంలో జిల్లా అధికారులు జేపీఎస్‌లకు రెండు విడతల్లో కలెక్టరేట్లలో సమావేశాలు నిర్వహించి ఆయా తేదీల్లో స్కేల్ ఆర్డర్ జారీ చేశారు. సర్వీసు విషయంలో గందరగోళంగా మారడంతో అందరికీ కామన్ ఎఫెక్టివ్ తేదీ ఇవ్వాలని అప్పటి నుంచి డిమాండ్ చేస్తున్నారు. మే నెలలో జారీ అయిన ఉత్తర్వుల మేరకు డీపీవో కార్యాలయం నుంచి వివరాల సేకరణకు ఎంపీడీవోలకు సంబంధిత నమూనాపత్రాలను పంపించారు. ఆ తర్వాత దానిపై జిల్లా అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, ఎంపీడీవోలు స్పందించకపోవడం, మధ్యలో స్థానిక ఎన్నికల ప్రకటన రావడం వెరసి క్రమబద్ధీకరణ ప్రక్రియ ముందుకు సాగలేదు.

తేదీ జారీ చేస్తేనే..

నాలుగేళ్ల కాంట్రాక్టు సమయం అయ్యాక జేపీఎస్‌లకు క్రమబద్ధీకరిస్తామని అప్పటి ప్రభుత్వం సూచించింది. అది చేస్తే అప్పటి నుంచి రెండేళ్ల ప్రొబేషన్ సమయం ఉంటుంది. ఆ మేరకు ప్రస్తుతం పని చేస్తున్న వారి ప్రొబెషన్ కాలం కూడా పూర్తయినట్లే. ఎఫెక్టివ్ తేదీ ఇస్తూ ప్రొబేషన్ డిక్లేర్ చేస్తేనే క్రమబద్ధీకరణకు మార్గం సుగమం అవుతుంది. కానీ జాప్యం జరుగుతోంది. ఆ తర్వాత సదరు ఉద్యోగులపై శాఖాపరంగా, పోలీసు వాఖ ద్వారా విచారణ ఉంటుంది. దీనికి కూడా ఒక్కోసారి ఏళ్ల సమయం పడుతోందని కొందరు జేపీఎస్‌లు చెబుతున్నారు. ఇంకా మొదటి దఫా ఎఫెక్టివ్ తేదీనే జారీ చేయకపోవడంతో.. తదుపరి ప్రక్రియకు ఎంత సమయం పడుతుందో, ఎప్పటివరకు క్రమబద్ధీకరణ జరుగుతుందోనని వారు నిరాశకు లోనవుతున్నారు. కార్యదర్శులు విధుల్లో నిర్లక్ష్యం చేసినా, తప్పులు చేసినా ఆగమేఘాలపై చర్యలు తీసుకునే అధికారులు సర్వీస్ క్రమబద్ధీకరణలో మాత్రం పట్టింపులేని విధంగా వ్యవహరిస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మళ్లీ ఎన్నికల ప్రకటన రాకముందే క్రమబద్ధీకరణ ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని కోరుతున్నారు. క్రమబద్ధీకరణ జాప్యంవల్ల ఇప్పటికే రెండు ఇంక్రిమెంట్లు నిలిపోయినట్లు వాపోతున్నారు. ప్రొబేషన్ కాలం పూర్తయినా డిక్లేర్ చేయకపోవడంతో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రొబేషన్ డిక్లేర్ కాకపోవడం వల్ల సెలవులు వర్తించడం లేదు. ఇతరత్రా ప్రయోజనాలు లభించడం లేదు. అధికారులు సెలవులు ఇవ్వడానికి నిరాకరించడంతో ఇటీవల నిర్వహించిన గ్రూప్ 1, గ్రూప్ 2 పరీక్షలకు చాలా మంది జేపీఎస్‌లు హాజరకాలేకపోయారు. వాస్తవానికి జేపీఎస్‌ను క్రమబద్ధీకరించాల్సిందిగా పంచాయతీ రాజ్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ ఎఫెక్టివ్ తేదీపై నెలకొన్న అస్పష్టతవల్ల జిల్లా పంచాయతీ అధికారులు జేపీఎస్‌ల సర్వీస్ ఫైళ్లను కలెక్టర్లకు పంపకుండా జాప్యం చేస్తున్నారు. కలెక్టర్ ఆమోదిస్తే క్రమబద్ధీకరణ ప్రొసీడింగ్స్ జారీ కావడమే తరువాయి. కానీ ఈ విషయంలో డీపీవోలు పట్టీపట్టనట్టు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినవస్తున్నాయి.

ఇబ్బందులు

జూనియర్ పంచాయతీ కార్యదర్శులతో ప్రభుత్వం వెట్టిచాకిరి చేయిస్తోంది. కార్యదర్శులు తమ గ్రామాల్లో అందుబాటులో ఉండటం లేదన్న ఫిర్యాదుల నేపథ్యంలో హాజరును పర్యవేక్షించడానికి ఫేస్ రికగ్నేషన్ యాప్‌ను ప్రవేశపెట్టింది. ఇది కార్యదర్శులపై అదనపు ఒత్తిడిని కలిగిస్తోంది. ప్రస్తుతం పంచాయతీ పాలకవర్గాలు లేవు. దీనితో గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం నేరుగా విడుదల చేసే నిధులు ఆగిపోయాయి. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఒక్క పైసా కూడా ఇవ్వడం లేదు. దీనితో గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి నిలిచిపోయింది. మౌలిక సమస్యల పరిష్కారానికి కూడా డబ్బులు లేకపోవడంతో ఆ భారం జూనియర్ పంచాయతీ కార్యదర్శులపై పడుతోంది. గ్రామాల్లో తాగునీటి సరఫరా, విధి దీపాలు, పారిశుధ్య నిర్వహణ తదితర పనుల నిర్వహణకు కావలసి నిధులను జేపీఎస్‌లు తమ జేబుల నుంచి పెట్టుకోవలసి వస్తోంది. అప్పులు చేయాల్సి వస్తోంది.

ధాన్యం కొనుగోళ్లలో సమస్యలకు చెక్

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు



కంట్రోల్ రూమ్ ప్రారంభిస్తున్న కలెక్టర్ స్నేహశబరీష్

హనుమకొండ కలెక్టరేట్, అక్టోబర్ 28 (ఆంధ్రజ్యోతి): వరిధాన్యం కొనుగోళ్లలో ఎదరయ్యే సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ స్నేహశబరీష్ తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోళ్లలో ఎదురయ్యే సమస్యలపై ఫిర్యాదుల స్వీకరణకు ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను మంగళవారం జిల్లా కలెక్టర్ స్నేహశబరీష్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్నేహశబరీష్ మాట్లాడుతూ.. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్‌రూం ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పనిచేస్తుందన్నారు. కంట్రోల్ రూమ్ నంబర్ 7330751364లో సంప్రదించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, సివిల్ సప్లయి కార్పొరేషన్ మేనేజర్ మహేందర్, పౌర సరఫరాల శాఖ అధికారులు, కలెక్టరేట్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎంజీఎంకు కొత్త బాస్

సూరింటెండెంట్‌గా డాక్టర్ పి.హరీష్ చంద్రారెడ్డి



వరంగల్ మెడికల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ పింగిళి హరీష్ చంద్రారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షే మ శాఖ కార్యదర్శి డాక్టర్ క్రిష్టినా మంగళవారం జీవోఆర్‌టీ నెంబర్ 506 విడుదల చేశారు. ప్రస్తుతం హరీష్ చంద్రారెడ్డి మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయనను ఎంజీఎం ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. కరీంనగర్ జిల్లా హుజురాబాద్ మండలం పోతిరెడ్డిపేటకు చెందిన హరీష్ చంద్రారెడ్డి.. 1987-1993లో కాకతీయ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. 1996లో హైదరాబాద్ గాంధీ మెడికల్ కళాశాలలో ఈఎన్‌టీ పీజీ పూర్తి చేశారు. కరీంనగర్ జిల్లాలోని

(మిగతా 6లో..)

కదలిన అధికారులు

- బాలిక అత్యాచార ఘటనపై విచారణ షురూ
- బాధితురాలిని పరామర్శించిన ఐసీడీఎస్ అధికారులు
- సీరియస్‌గా తీసుకున్న మంత్రి సీతక్క
- పరారీలో నిందితుడు.. పోలీసుల గాలింపులు

ఖానాపురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చిన నాలుగేళ్ల బాలికపై 16 ఏళ్ల బాలుడు అత్యాచారానికి పాల్పడిన ఘటన కలకలం సృష్టించింది. ఈ నెల 25న వరంగల్ జిల్లా ఖానాపురం మండలంలోని ఓ తండాలో గల అంగన్‌వాడీ కేంద్రానికి నాలుగేళ్ల బాలిక రోజువారీ లాగే రాగా, అంగన్‌వాడీ టీచర్ కుమారుడు (16 ఏళ్ల బాలుడు) బాలికను పక్కగదిలోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయం సోమవారం వెలుగులోకి వచ్చిన విషయం విదితమే. జరిగిన ఘటనపై స్త్రీ శిశు సంక్షేమాశాఖ మంత్రి సీతక్క ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించడంతో అధికారులు కదిలారు. మంగళవారం శిశు సంక్షేమ శాఖతో పాటు ఇతర శాఖల అధికారులు సంఘటన స్థలంతో పాటు నర్సంపేట ఏరియా ఆసుపత్రిలో విచారణ చేపట్టారు.

అత్యాచారానికి గురైన బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు బాలికను వైద్యపరీక్షల నిమిత్తం నర్సంపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు శాంపిల్స్ సేకరించి హనుమకొండ ల్యాబ్‌కు పంపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలికను సీడబ్ల్యుసీ చైర్మన్ వసుధ పరామర్శించి వివరాలు సేకరించారు. అదేవిధంగా శిశు సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ మోతి, రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఝాన్సీ, డీడబ్ల్యుఓ రాజమణి, డీటీడీవో సౌజన్య, డీసీపీఓ ఉమ, సీడీపీఓ మధురిమ ఆధ్వర్యంలో ఆసుపత్రి వైద్యాధికారులతో మాట్లాడి వివరాలు సేకరించారు. జరిగిన ఘటనపై బాలిక తల్లితో మాట్లాడి వివరాలు సేకరించారు. బాలికకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.25 వేలు కుటుంబ సభ్యులకు అందజేశారు.



నర్సంపేట ఏరియా ఆస్పత్రిలో విచారణ చేస్తున్న అధికారులు

అంగన్‌వాడీ కేంద్రం వద్ద విచారణ

నర్సంపేట ఏరియా ఆసుపత్రిలో విచారణ చేపట్టిన అనంతరం అధికారులు మోతి, ఝాన్సీ, రాజమణి, సౌజన్య సంఘటన జరిగిన తండాలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి అక్కడే స్థానికులతో మాట్లాడి విచారణ చేపట్టారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని తండాలో మరోచోటుకు మార్చడం పట్ల ఐసీడీఎస్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసారు. అంగన్‌వాడీ టీచర్ (మిగతా 6లో..)

బర్త్‌డే వేడుకల్లో ఘర్షణ

- దారికాచి యువకుడిపై మూకుమ్మడి దాడి
- ఎంజీఎంలో చికిత్స పొందుతూ మృతి

ఖిలావరంగల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మిత్రుడి జన్మదిన వేడుకలు అతడికి ఆఖరి గడియలయ్యాయి. స్నేహితుల మధ్య చెలరేగిన ఘర్షణ తీవ్రస్థాయికి చేరి సహచరుడిని హతమార్చే వరకు వెళ్లింది. వరంగల్ తూర్పుకోటలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి మిల్స్‌కాలనీ పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలో మేస్త్రీ పని చేసుకునే సంగరబోయిన సాయి (24) ఆదివారం రాత్రి తన మిత్రుని జన్మదిన వేడుకలకు వెళ్లాడు. తూర్పుకోట శివారు 200ఫీట్ల రోడ్ వద్ద కేక్ కట్ చేసిన అనంతరం మద్యం తీసుకునే క్రమంలో అక్కడికి వచ్చిన బోళ్ళ మహేష్‌తో సాయికి గొడవ జరిగింది. ఈ విషయాన్ని మహేష్ తన సోదరుడైన రాజేష్‌కు చెప్పాడు. దీంతో సాయిపై కక్ష పెంచుకున్న రాజేష్ పథకం ప్రకారం మరుసటి రోజు సోమవారం రాత్రి సాయి కూలి పనికి వెళ్లి తిరిగి వస్తుండగా తూర్పుకోటలోని కోమట్ల బండ వద్ద మరో ముగ్గురితో కలిసి దారి కాచి దాడికి దిగాడు. చేయికి వేసుకునే ఇనుప కడెంతో మొహంపై, చాతిపై తీవ్రంగా కొట్టడంతో సాయి కిందపడిపోయాడు. దీంతో వారు అక్కడినుంచి పరారయ్యారు. సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు వెంటనే సాయిని వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి చనిపోయాడు. మంగళవారం పోస్టుమార్టం అనంతరం అతడి మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు. సంగరబోయిన రజిత-కుమారస్వామికి సాయి ఒక్కడే కుమారుడు కావడంతో తల్లిదండ్రులు విలపించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది. మిల్స్‌కాలనీ సీఐ బొల్లం రమేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. నిందితులు బోళ్ళ రాజేష్, బంగారి నవీన్, బంగారి రాజు, బంగారి వినీత్ పరారీలో ఉన్నారని, త్వరలో పట్టుకుంటామని సీఐ తెలిపారు.




సాయి (ఫైల్)

విద్యుత్ శాఖలో సెలవుల రద్దు

- మొంథా తుఫాన్ నేపథ్యంలో అప్రమత్తం
- ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి



రాంనగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో విద్యుత్ శాఖ ఉద్యోగులను సెలవులు రద్దు చేస్తున్నట్లు ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి తెలిపారు. కంపెనీ పరిధిలోని రెడ్‌జోన్ ప్రాంతాలైన పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, జనగామ, మంచిర్యాల, ఆదిలాబాద్, ఆసిఫాబాద్‌లలో అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున క్షేత్రస్థాయిలో ఉండే అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రధానంగా రాత్రి వేళల్లో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుని 24గంటలు కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. నష్టం సంభవించిన వెంటనే పునరుద్ధరణ చర్యలు చేపట్టే విధంగా సిబ్బందిని, మెటీరియల్‌ను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్రతీ అధికారి ప్రధాన కార్యాలయాల్లో ఉండి అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రధాన సర్కిళ్లల్లోని డివిజన్ అధికారులు గంటకు ఒకసారి విద్యుత్ సరఫరా, నష్టంపై నివేదికలు అందించాలన్నారు. ప్రమాదాల నివారణకు అవసరమైన పోల్స్, మెటీరియల్, క్రేన్‌లు, బ్రేక్‌డౌన్ బృందాలు, ఏజెన్సీలను అవసరమైన చోట జనరేటర్లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు.



స్పోర్ట్స్ చీఫ్ సెక్రటరీ జేయేష్ రంజన్, సాట్ వీసీ అండ్ ఎం.డి. బాలదేవిలను కలిసి వినతిపత్రం అందజేస్తున్న కడియం శ్రీహరి

స్పోర్ట్స్ పాఠశాలకు అనుమతులివ్వండి..

- క్రికెట్ స్టేడియం పనులు త్వరితగతిన ప్రారంభించాలి
- స్పోర్ట్స్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, వీసీ అండ్ ఎమ్డీకి ఎమ్మెల్యే కడియం వినతి

6

భూమి పట్టా మార్పిడి చేయాలని..

వాటర్ ట్యాంక్ ఎక్కిన యువకుడు

6

డ్రెయిన్లలో చెత్త వేస్తే జరిమానా

జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న రైల్వే పోలీసులు

బంగారు గొలుసు చోరీ నిందితుడి అరెస్ట్

కాజీపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రైల్వే స్టేషన్‌లో ఓ మహిళ మెడ ల్లోంచి బంగారు గొలుసును చోరీ చేసిన నిందితుడిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. కాజీపేట రైల్వే ఎస్సై ఎం.అభినవ్ తెలిపిన వివరాల ప్రకారం.. డోర్నకల్‌కు చెందిన కె.విజయ సెప్టెంబరు 18న సింగరేణి రైల్లో డోర్నకల్ రైల్వే స్టేషన్‌లో రైలెక్కి రామగుండం వెళ్తుంది. రైలు కాజీపేట టౌన్ స్టేషన్‌లోకి రాగానే ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు బాధితురాలి మెడల్లోంచి 22 గ్రాముల రెండు వరసల బంగారు పుస్తెల తాడును లాక్కెళ్లారు. ఆమె ఫిర్యాదుతో రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి సీసీ కెమెరాలు, స్పెక్ట్రా మిషన్ టవర్‌డెటా ఆధా రంగా కోమటిపల్లి గ్రామం, కేసముద్రం మండలానికి చెందిన నామాల నవీన్ గా గుర్తించారు. నిందితుడు మంగళవారం కాజీపేట రైల్వే స్టేషన్‌లో ఉన్నట్లు గమనించిన పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు. మరో నిందితుడు పరారీలో ఉన్నాడు. నిందితుడి నుంచి బంగారు గొలుసు, ఒక మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ బంగారం ఆభరణాల విలువ రూ. 2 లక్షల 50 వేలు ఉంటుందని పోలీసులు చెప్పారు. ఈ కేసును ఛేదించిన ఎస్సై ఎం. అభినవ్, పోలీస్ సిబ్బందిని రైల్వే సీఐ వడ్డే నరేశ్, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఛటర్జీ, డీఎస్పీ కృపాకర్, ఎస్పీ చందన దీప్తి అభినందించారు.

వరంగల్ రైల్వేస్టేషన్‌లో..



నిందితుడిని చూపిస్తున్న రైల్వే పోలీసులు

గిర్మాజిపేట, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): వరంగల్ రైల్వే పోలీసులు మంగళవారం దొం గను అరెస్టు చేసి అతడి వద్ద బంగారం స్వాధీనం చేసుకు న్నారు. భద్రతా చర్యల్లో భాగం గా ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ పోలీ సులు మంగళవారం ఉదయం రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారాలపై తనిఖీ చేస్తున్న క్రమంలో అను మానాస్పదంగా కనిపించిన వ్యక్తిని తనిఖీ చేశారు. అతడి వద్ద 11 గ్రాముల బంగారు అభరణాలు లభిం చడంతో జీఆర్‌పీకి తరలించి విచారణ జరిపారు. తను హైదరాబాద్ చార్మినార్ జంగంమెట్ ప్రాంతానికి చెందిన చందునాయక్‌గా నిర్ధారించారు. తాను వరంగ ల్ రైల్వేస్టేషన్‌లో షిరిడి ఎక్స్‌ప్రెస్‌లో ఈ అభరణాలు దొంగిలించినట్లు అంగీక రించడంతో వెంటనే కాజీపేట రైల్వేకోర్టులో రిమాండ్ చేశారు. అభరణాల విలు వ రు. లక్ష 30 వేల రుపాయలు ఉంటుందని జీఆర్‌పీ సీఐ సురేందర్ తెలిపా రు. తనిఖీల్లో ఆర్‌పీఎఫ్ ఏఎస్సై పి.దుర్గాప్రసాద్, హెడ్‌కానిస్టేబుల్స్ ఎస్.శ్రీని వాస్, ఎ.ఏడుకొండలు, ఎన్.రమేష్, జీఆర్‌పీ కానిస్టేబుల్ రాము పాల్గొన్నారు.

అవినీతి నిర్మూలనకు కృషి చేయాలి

వరంగల్ కలెక్టర్ సత్యశారద



సమావేశంలో మాట్లాడుతన్న కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌పై అవగాహన కలిగి ఉండాలని, అవినీ తి నిర్మూలనకు అందరూ కృషి చేయాలని వరంగల్ కలెక్టర్ సత్యశారద అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మా ట్లాడుతూ.. విజిలెన్స్ మనందరి బాధ్యత అనే థీమ్‌తో ఈ నెల 27 నుంచి నవంబరు 2వ తేదీ వరకు విజిలెన్స్ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ప్రభుత్వ ఉద్యోగులకు అవగాహన కల్పించడం, అటవీశాఖ సహకారంతో విజిలెన్స్ అంశంపై అవగాహన కల్పించడం, మొక్కలు నాటడం, పబ్లిక్ సెక్టార్, బ్యాంకులలో నైతిక పద్ధతులు, పారదర్శకతను ప్రోత్సహించడం, అవినీతి నిర్మూలనపై విద్యార్థులకు క్విజ్ పోటీలు లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలి పారు. అనంతరం అవినీతి నిర్మూలించడం, లంచం ఇవ్వచూపడం, తీసుకోవడం నేరం వంటి అంశాలపై కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌ఓ విజయలక్ష్మి, విజిలె న్స్ ఇన్‌ఫోర్స్‌మెంట్ ప్రాంతీయ అధికారి శ్రీనివాసరావు, జిల్లా అధికా రులు ఉద్యోగులు పాల్గొన్నారు.

చదవడం, రాయడం, అంకెలపట్ల అవగాహన కల్పించాలి

వరంగల్ ఎడ్యుకేషన్ (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల కు చదవడం, రాయడంతో పాటు అంకెలపట్ల అవగాహన కల్పించాలని కలెక్టర్ సత్యశారద ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం శంభునిపేట ప్రభుత్వ పాఠశాలలో విద్యాశాఖపై ఎంఈవోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతీ పాఠశాలను సంబంధిత అధికారులు సందర్శించి స్కూల్ ఎడ్యుకేషన్ యాప్‌లో అప్‌డేట్ చేయాలన్నారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి రెమిడీయల్ క్లాసులు నిర్వహించాలన్నారు. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు ఖాన్ అకాడమీ, ఫిజిక్స్ వాలా ద్వారా విద్యార్థులకు డిజిటల్ పాఠాలు అందించాలన్నారు. ప్రతీ పాఠశాలలో లైబ్రరీ పీరియడ్‌ను క్రమం తప్ప కుండా నిర్వహించి విద్యార్థుల్లో పుస్తకాల పఠనాసక్తిని పెంపొందించాల న్నారు. టెన్త్ విద్యార్థుల కోసం ప్రత్యేక క్లాసులు నిర్వహించి 100 శాతం ఫలితాలను సాధించాలన్నారు. పదో తరగతి ఫలితాలతో పాటు విద్యా రంగంలో జిల్లాను రాష్ట్ర స్థాయిలో ముందంజలో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో బి.రంగయ్యనాయుడు, ఏఎంవో సుజన్‌తేజ, డీసీ ఈబీ సెక్రెటరీ కృష్ణమూర్తి, ఎంఈవోలు పాల్గొన్నారు.

కదలిన అధికారులు

(5వ పేజీ తరువాయి)

నిర్లక్ష్యంతోనే ఘటన జరిగిందని నిర్ధారణకు వచ్చా రు. ఈ సందర్భంగా జేడీ మోతి మాట్లాడుతూ బాలిక మెడికల్ రిపోర్ట్ ఆధారంగా చర్యలుంటాయని తెలిపారు.

కాగా, బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన బాలు డు పరారీలో వున్నట్టు తెలిసింది. అతడి కోసం పోలీసు లు గాలింపులు మొదలుపెట్టారు. ప్రస్తుతం పదో తర గతి చదువుతున్న బాలుడు గత నెల రోజులుగా ఇంటి వద్దనే ఉంటున్నట్లు తెలిసింది. తల్లితో కలిసి అప్పుడ ప్పుడు అంగన్‌వాడీ సెంటర్‌కు వచ్చే వాడని, తల్లి బయటకు వెళ్లిన సమయంలో బాలికలతో అసభ్యంగా ప్రవర్తించేవాడని ఆరోపణలున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా కొడుకును అంగన్‌వాడీసెంటర్‌కు తీసుకు వచ్చి అఘాయిత్యానికి పరోక్షంగా కారణమైన అంగన్ వాడీ టీచర్‌పై శాఖాపరమైన చర్యలకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది.

డ్యూటీ డాక్టర్ వాగ్వాదం

కాగా, అత్యాచారానికి గురైన బాలికను స్థానిక పో లీసులు (మహిళా కానిస్టేబుల్) వైద్య పరీక్షల కోసం సోమవారం రాత్రి నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా, విధుల్లో వున్న మహిళా డ్యూటీ డాక్టర్ అందుకు నిరాకరించడంతో కొద్దిసేపు గందరగోళం నెల కొంది. దీంతో అక్కడే ఉన్న ఎస్సై రఘుపతి వెళ్లి కోర్టు అవసరాల రీత్యా వైద్య పరీక్షలు చేయాలని కోరారు. అయినప్పటికీ ఆమె తమ హెచ్‌వోడీ ఉంటేనే పరీక్షలు చేస్తామంటూ వాగ్వాదానికి దిగింది. అయితే అక్కడే వున్న ఇతర పోలీసు అధికారులు జోక్యం చేసుకోవ డంతో గొడవ సద్దుమణిగింది. జరిగిన సంఘటన కలె క్టర్ దృష్టికి వెళ్లినట్లు తెలిసింది.

సైకాలజీ గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

హనుమకొండ, అక్టోబర్ 28 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని ప్రభుత్వ ఉపాధ్యాయ విద్యాకళాశాల (బీఈడీ)లో ఖాళీగా ఉన్న సైకా లజీ అతిథి అధ్యాపక పోస్టును తాత్కాలిక వి ధానం ద్వారా భర్తీ చేసేందుకు అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వా నిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.డి. అబ్దుల్‌హై ఒక ప్రకటనలో తెలిపారు. ఈ గెస్ట్ లెక్చర్ ఎంపిక సమయానికి అభ్యర్థి 65 ఏళ్ల లోపు వయసు కలిగి రిటైర్డ్ లేదా నిరుద్యోగ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొ న్నారు. ఎంపికైన అభ్యర్థికి నెలకు రూ.23,400 గౌరవ వేతనంగా ఇవ్వనున్నట్టు తెలిపారు. అభ్యర్థి ఎంఏ, లేదా ఎంఎస్‌సీ సైకాలజీ, ఎంఈ డీ విద్యార్హతలు కలిగి ఉండాలన్నారు. పూర్తి చేసిన వ్యక్తిగత వివరాలను ఫొటోతో జత చేసి కళాశాలలో సంబంధిత దరఖాస్తును పూరించి విద్యార్హతలకు సంబంధించిన నిజప్రతులతో ఈనెల 30 నుంచి నవంబరు 3లోగా సమర్పిం చాలని, నవంబరు 6వ తేదీన తుది జాబితా ప్రకటిస్తామని, 10వ తేదీన మెరిట్ ప్రాతిపది కన 1:5 నిష్పత్తిలో డెమో లేదా ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు అబ్దుల్‌హై తెలిపారు. ఎం పికైన అభ్యర్థుల జాబితాను 11న ప్రకటించను న్నట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థి ఆదే రోజు బీఈడీ కళాశాలలో రిపోర్టు చేయాలన్నారు.

ఆంగ్ల భాష నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

కేయూక్యాంపస్ అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఆంగ్లభాష నైపుణ్యాలను పెంపొందించుకోవాలని కేయూ వీసీ ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డి చెప్పారు. మంగళవారం కేయూ ఇంగ్లీష్ విభాగం సెమినార్ హాల్‌లో కాన్ఫరెన్స్ జరిగింది. విభాగాధిపతి ఆర్.మేఘనరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వీసీ ప్రతాప్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లా డారు. విద్యార్థుల ఆలోచన, సృజన, భాష పరమైన నైపుణ్యాలను పెంచేదిశగా వర్సిటీ ఆంగ్ల పాఠ్య ప్రణాళిక ఉందని చెప్పారు. కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం మాట్లాడుతూ.. నిత్యం ప్రాక్టీస్ చేస్తూ ఆంగ్లబాషపై భయాన్ని పోగొట్టుకోవాలని ఉద్బోధించారు. ఈసీ మెంబర్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్ మాట్లాడుతూ.. పోటీ ప్రపంచంలో జీవన నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలన్నారు. డాక్టర్ సుకుమారి మాట్లాడుతూ.. వినడం, మాట్లాడటం, చదవడం, రాసే నైపుణ్యాలతో భాషపై పట్టు సాధించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మల్లం నవీన్, బీవోఎస్ చైర్‌పర్సన్ బి.నిర్మల దీపాజ్యోతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలి

హనుమకొండ టౌన్, అక్టోబరు 28 (ఆంధ్ర జ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థుల సమ స్యలు పరిష్కరించడంలో సీఎం రేవంత్‌రెడ్డి విఫలమయ్యారని బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల శరత్‌చంద్ర మంగళవారం ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యార్థుల సమస్యలు పరి ష్కరించాలని ఈ నెల 29న 'హలో విద్యార్థి చలో కలెక్టరేట్' ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహి స్తున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు పాల్గొని విజ యవంతం చేయాలని పిలుపునిచ్చారు. విద్యా ర్థులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడు తున్నా.. రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేద ని పేర్కొన్నారు. వెంటనే ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్‌షిప్‌లు, నిరుద్యోగ భృతి కాంగ్రె గెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

డ్రైన్‌లలో చెత్త వేస్తే జరిమానా విధించండి

జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్

నగరంలోని పలు ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు



ఎల్లంబజార్‌లో డ్రైనేజీని పరిశీలిస్తున్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరం లో డ్రైన్‌లలో చెత్త వేస్తే జరిమానా విధించాలని జీడబ్ల్యూఎంసీ కమిష నర్ చహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కమిషనర్‌తోపాటు సిబ్బంది నగరంలోని పలు ప్రాంతాల్లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. 24వ డివిజన్ పాపయ్యపేట చమన్, ఎల్లం బజార్, పోతన ట్రాన్స్‌ఫర్ స్టేషన్ ప్రాంతంలో పర్యటించి డ్రైన్‌లను పరి శీలించారు. స్వచ్ఛ ఆటోలు ఇండ్ల వద్దకు వెళుతున్నాయా..? లేదా అని అక్కడి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. తర్వాత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. డ్రైన్‌లలో చెత్త వేసేవారికి అవగాహన కలిగించాలన్నారు. ప్రభుత్వ ఆదేశాలు పా టించని వారికి జరిమానా విధించాలని ఆదేశించారు. రోడ్లపై చిరువ్యా పారాలు చేసేవారు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్‌లు మాత్రమే వాడాల ని సూచించారు. పోతన ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లో పనిచేసే సిబ్బంది సమ య పాలన పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, శానిటరీ సూపర్‌వైజర్ గోలుకొండ శ్రీనివాస్, ఏఈ హబీబ్, ఐటీ మేనేజర్ రమేష్, జవాన్ జన్ను ప్రకాశ్ పాల్గొన్నారు.

పన్ను వసూళ్లలో వేగం పెంచాలి

● వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి

● బిల్ కలెక్టర్లు, రెవెన్యూ అధికారులతో సమావేశం



రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న మేయర్ సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వివిధ విభాగాలకు సంబంధించిన పన్నుల వసూళ్లలో వేగం పెంచాలని వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి అధికారులకు సూచించారు. వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్‌తో పాటు బిల్ కలెక్టర్లు, వార్డు ఆఫీసర్లు, రెవెన్యూ అధికారులతో కలిసి పన్నుల వసూళ్ల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మే యర్ మాట్లాడుతూ.. పెండింగ్ పన్నులను సమయానుకూలంగా వసూలు చేయడం ద్వారా బల్దియా ఆదాయం పెరుగుతుందని అన్నారు. ప్రతీ డివిజ న్‌లో పన్నుల చెల్లింపులపై ప్రజలకు అవగాహన కలిగించి వందశాతం వసూ ళ్లు అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ఆస్తి పన్నుతో పాటు నీటి, ఇతర పన్ను లను సేకరించాలన్నారు. సిబ్బంది తీరుపై ఆర్‌వోలు, ఆర్‌ఐలు పర్యవేక్షిం చాల న్నారు. నవంబర్ చివరి నాటికి 45 శాతం పన్నుల వసూళ్లు చేయాలన్నారు.

కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ.. పన్నుల వసూళ్లలో పారద ర్శకత కలిగి ఉండాలన్నారు. పన్నుల వసూళ్ల లక్ష్యసాధనలో వెనకంజలో ఉన్న సిబ్బందిపై చర్యలు తప్పవని కమిషన్ హెచ్చరించారు. ఈ సమావేశంలో అద నపు కమిషనర్ చంద్రశేఖర్, డిప్యూటి కమిషనర్లు ప్రసన్నరాణి, రవీందర్, పన్నుల అధికారి రామకృష్ణ, ఆర్‌వోలు షహజాది బేగం, శ్రీనివాస్‌తో పాటు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ పాఠశాలకు అనుమతులివ్వండి

● క్రికెట్ స్టేడియం పనులు త్వరితగతిన ప్రారంభించాలి

● స్పోర్ట్స్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, వీసీ అండ్ ఎమ్డీకి ఎమ్మెల్యే కడియం వినతి

వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): హనుమకొండ జేఎన్‌ఎస్‌లో స్పోర్ట్స్ పాఠశాల ప్రా రంభం కోసం అనుమతులను ఇవ్వడంతో పాటు ధర్మసాగర్ మండలం ఉనికిచెర్ల సమీపంలోని ప్ర భుత్వ భూమిలో అంతర్జాతీయ స్థాయి క్రికెట్ స్టేడియం నిర్మాణ పనులను త్వరితగతిన ప్రారం భించాలని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కోరారు. మంగళవారం యూత్ అడ్వాన్స్ మెంట్, టూరిజం కల్చర్ అండ్ స్పోర్ట్స్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జేయేష్ రంజన్, సాట్ వీసీ అండ్ ఎం.డి. సోని బాలదేవిలను స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి హైదరాబాద్‌లోని సచి వాలయంలో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా కడియం మాట్లాడుతూ.. హ నుమకొండ జేఎన్‌ఎస్‌లో తాత్కాలిక ప్రాతిపదికన స్పోర్ట్స్ స్కూల్ కం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ కోసం ఇండోర్, ఔట్‌డోర్, క్రీడామైదానాలు, ట్రాక్స్, హాస్ట ల్ వసతికి అవసరమైన మరమ్మతులు ఇప్పటికే పూర్తి చేశామన్నారు. ఇప్పటికైనా వెంటనే స్పోర్ట్స్ పాఠశాల ప్రారంభించేందుకు ప్రభుత్వపరమైన అనుమతులు ఇవ్వాలన్నారు. అదే విధంగా ధర్మ సాగర్ మండలం ఉనికిచెర్ల సమీపంలోని జాతీ య రహదారి 163ను అనుకొని ఉన్న ప్రభుత్వ భూమిలో అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో కూడిన క్రికెట్ స్టేడియం నిర్మాణ పనులు చేపట్టా లని కోరారు.

హనుమకొండ జిల్లాలో క్రికెట్ స్టేడియం నిర్మా ణం చేపట్టడం ద్వారా ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని తెలి పారు. దీనిపై స్పందించిన టూరిజం కల్చర్ అండ్ స్పోర్ట్స్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్.. జేఎన్‌ఎస్‌లో నిర్మాణం పూర్తి అయిన స్పోర్ట్స్ పాఠ శాలను నవంబరు 14 లోపు ప్రారంభించేలా చర్య లు చేపడుతామని చెప్పారు. క్రికెట్ స్టేడియం నిర్మాణం కోసం హనుమకొండ జిల్లా కలెక్టర్ ను ఫీజిబులిటీ రిపోర్టు, స్థల సేకరణపై నివేదికను అందించాలని ఆదేశించామని, ఆ నివేదికలు రాగా నే క్రికెట్ స్టేడియం నిర్మాణానికి త్వరితగతిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఎంజీఎంకు కొత్త బాస్

(5వ పేజీ తరువాయి)

పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్యాధికారిగా విధులు నిర్వర్తించారు. 2002లో వరంగల్ ఎంజీఎం ఆ స్పత్రి ఈఎన్‌టీ విభాగంలో ట్యూటర్‌గా పదోన్నతి పొం దారు. 2003 నుంచి 2017 వరకు ఎంజీఎం ఆస్పత్రిలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తించి, 2017లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా నిజామాబాద్‌కు బదిలీ అ య్యారు. 2021 నుంచి మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో ఈఎన్‌టీ విభాగం ప్రొఫెసర్‌గా సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. హరీష్ చంద్రారెడ్డి శుక్రవారం ఎంజీఎంలో బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది.

కాగా, ఇప్పటివరకు సూపరింటెండెంట్‌గా ఉన్న డాక్ట ర్ కిశోర్‌ను పదవి నుంచి ప్రభుత్వం తొలగించడం చర్చనీయాంశంగా మారింది. కొన్నిరోజులుగా ఎంజీఎం లో జరుగుతున్న వరుస సంఘటనలపై రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ సీరియ స్ కావడంతో వేటు పడినట్లు చెబుతున్నారు. నిర్వ హణ లోపాలు, పరిపాలన వైఫల్యాలు, రోగులకు సరైన వైద్యసేవలు అందకపోవడం, వైద్యులు సమయపాలన పాటించకపోవడం తదితర అంశాలు డాక్టర్ కిశోర్‌ను తొలగించేందుకు కారణాలుగా నిలిచాయని చెబుతు న్నారు. నూతన సూపరింటెండెంట్ అయినా ఎంజీఎం పాలనను గాడిలో పెట్టాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

మనుగొండలో హెల్త్ క్యాంప్

గీసుగొండ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): డెంగీ తో మోక్షిత అనే 3 ఏళ్ల బాలిక మృతి చెందిందన్న ఘటనతో మనుగొండలో ప్రాథమిక ఆరోగ్య కేం ద్రం ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్‌ను మంగళవా రం నిర్వహించారు. ఈ ఘటనపై డీఎంహెచ్‌వో సాంబశివరావు వివరణ ఇస్తూ.. బాలిక డెంగీతో మృతి చెందలేదని చెప్పారు. కాగా, మనుగొండలో చిన్నారి మోక్షితకు ఈ నెల 18న జ్వరం రాగా తల్లిదండ్రులు స్థానిక వైద్యులకు చూపించగా సిర ప్ ఇచ్చారని, దీంతో పాపకు జ్వరం తగ్గినట్లు చె ప్పారు. అనంతరం అంగన్‌వాడీ సెంటర్‌కు పాప ను పంపించినట్లు వివరించారు. 22న మోక్షితకు ర్యాపిడ్ డయాగ్నసిస్ టెస్ట్(ఆర్‌డీటీ) నిర్వహిం చగా నెగిటీవ్‌గా వచ్చిందన్నారు.

పాపకు జ్వరం వచ్చిపోతుండటంతో మళ్లీ ఈ నెల 25న స్థానిక ఏఎన్‌ఎం ఆర్‌డీటీ చేయగా నెగి టీవ్ వచ్చినట్లు ఆమె చెప్పారు. అయితే 27న పాపకు ఆకస్మాత్తుగా జ్వరం వచ్చి వాంతులు కావటంతో వెంటనే తల్లిదండ్రులు ఎంజీఎం ఆసు పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ కార్డియాక్ అరెస్ట్ కావటంతో సీపీఆర్ చేసిన ఫలితం లేక మోక్షిత మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించార న్నారు. కాగా, మనుగొండలో వైద్యులు పలువురికి డెంగీ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో ఎవరికి కూడా డెంగీ నిర్ధారణ కాలేదని మెడికల్ ఆఫీసర్ శౌర్యశరణ్య తెలిపారు.

డెంగీతో బాలిక మృతిచెందలేదు

డీఎంహెచ్‌వో సాంబశివరావు

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	6900	5300
మక్కలు	1920	1521
కందులు	6229	3022
పెసళ్లు	4052	3022
పల్లికాయ (సూక)	4000	3500
పల్లికాయ (పచ్చిది)	----	----
పసుపు (కాడి)	----	----
పసుపు (గోల)	----	----
తేజ మిర్చి	12000	9500
తేజ ఏసీ	----	----
వండర్‌హాట్	----	----
వండర్‌హాట్ ఏసీ	16300	12000
యూఎస్341ఏసీ	16300	9000
దీపిక	----	----
సింగిల్‌పట్టి ఏసీ	----	----
తాలు మిర్చి	6000	4000

- వరంగల్ వ్యవసాయం

భూమి పట్టా మార్పిడి చేయాలని..

వాటర్ ట్యాంక్ ఎక్కిన యువకుడు

ఒంటిపై పెట్రోల్ పోసుకుని

న్యాయం చేయాలని డిమాండ్

ఎస్సై జోక్యంతో దిగొచ్చిన వైనం





వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన వ్యక్తం చేస్తున్న యువకుడు, యువకుడికి నచ్చజెప్పుతున్న ఎస్సై ప్రవీణ్‌కుమార్

ఎల్కతుర్తి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తన పెద్ద తాత పేరున ఉన్న భూమిని తన పేరు మీద పట్టా బదలాయించాలని డిమాండ్ చేస్తూ ఓ యువకుడు వాటర్ టాంక్ ఎక్కి ఆందోళన చేశాడు. మంగళవారం ఒంటిపై పెట్రోల్ పోసు కుని ట్యాంక్ ఎక్కి న్యాయం చేయాలంటూ డిమాండ్ చేసిన ఘటన మండలంలోని చింతల పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్థుల కథనం మేరకు.. చింతలపల్లి లొల్లేటి వీరయ్య, లొల్లేటి రమేష్ దాయాదులు. వీరికి వారస త్వంగా వచ్చిన 3 ఎకరాల భూమిని సమానంగా పంచుకొని సాగు చేసుకుంటున్నారు. వీరయ్య, రమేష్ రెండేళ్ల కిందట మృతి చెందారు. 3 ఎక రాల భూమిలో 1.01 గుంటల భూమి విశ్వతేజ పెద్ద తాత లొల్లేటి చీమయ్య పేరున పట్టా ఉంది. వీరి మధ్య కొన్నేళ్లుగా ఎంచాయితీలు జరి గాయి. పోలీస్‌స్టేషన్‌లో కేసులు సైతం నమోద య్యాయి. ఈ క్రమంలో లొల్లేటి రమేష్ కుమా రుడు విశ్వతేజ పెద్ద తాత చీమయ్య పేరున ఉన్న భూమిని తమ పేరున పట్టా బదలాయిం చాలని డిమాండ్ చేస్తూ గ్రామంలోని వాటర్ ట్యాంక్ ఎక్కాడు. వెంట తీసుకెళ్లిన పెట్రోల్ ఒంటిపై పోసుకుని నిప్పంటించుకుంటానని బెది రించాడు. విషయం తెలుసుకున్న ఎస్సై అకినే పల్లి ప్రవీణ్‌కుమార్ పోలీస్ సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకుని యువకుడికి న్యాయం చేస్తా నని నచ్చజెప్పారు. దీంతో విశ్వతేజ వాటర్ ట్యాంక్ దిగాడు. విశ్వతేజకు పోలీసులు కౌన్సె లింగ్ ఇచ్చారు. సమయస్ఫూర్తిగా పని చేసిన సీఐ పులి రమేష్ ఎస్సై, పోలీస్ సిబ్బందిని గ్రామ స్థులు అభినందించారు.

ఇంకెన్నాళ్లు ఈ పడవ ప్రయాణం?

- వ్యవసాయం చేయాలంటే ఇలా అర చేతిలో ప్రాణం పెట్టుకోని వెళ్లాల్సిందే మరీ..
- అదుపు తప్పితే ప్రమాదమే...
- ఎనభై ఏళ్లుగా నరకం అనుభవిస్తున్న రైతులు
- ప్రభుత్వాలు మారినా పట్టించుకోని పాలకులు

దంతాలపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఓ వాగు సమీపాన శివారు పల్లె ఉంది. అపల్లె వాసులు పడరాని పాట్లు పడుతూ నిత్యం అరచేతిలో ప్రాణం పెట్టి కాలం వెళ్లదీస్తున్నారు. స్వాంత్ర్యం వచ్చిన నాటి నుంచి నేటి వరకు ఎన్నో ప్రభుత్వాలు మారినా ఈ రైతన్నల కన్నీటి గాథ వినే నాథుడే కరువయ్యారు. ఎక్కడో మహా అడవిలో ఉండే ప్రజల బాధల కంటే.. వీరి వ్యథ వినలేనిది. చూడరానిది. వివరాల్లోకి వెళ్లితే..

మహబూబాబాద్‌లోని దంతాలపల్లి మండలం ఉమ్మడి ఆగపేట శివారు నూతనంగా ఏర్పడ్డ రామవరం గ్రామ పంచాయతీ. గ్రామాల పునర్విభజనలో భాగంగా ఏర్పడ్డ రామవరంలో 170 కుటుంబాలున్నాయి. ఇక్కడ వివిధ కులస్తులుంటారు. వీరి వృత్తి ముఖ్యంగా వ్యవసాయం పైనే ఆధారపడి ఉంది. వీరు 1930లో మండలంలోని పెద్దముప్పారం గ్రామం నుంచి వలస వచ్చినట్టు స్థానికులు పేర్కొంటున్నారు. ఈ గ్రామం సమీపంలో ప్రసిద్ధి చెందిన పాలేరు వాగు ఉంది. ఈ వాగు ఇరువైపులా సుమారు 120 మంది రైతులకు 230 ఎకరాల వ్యవసాయ భూములున్నాయి. సాగుకోసం ప్రతీ వర్షాకాలం సమయంలో పాలేరు వాగు ప్రవహించే సమయంలో వాగు వెంబడి రైతులు పొలాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో కొందరు వాగు దాటేందుకు పడవ సహాయం, తెప్ప సహాయంతో వివిధ పనులకు వెళ్తూ కాలం వెళ్లదీస్తున్నారు. మరీ భాగా వర్షాలు వచ్చినప్పుడు వారాల కొద్ది పొలాలను వదిలేసి ఊర్లోనే ఉంటారు. ఈ వాగు దాటేందుకు ఉపయోగిస్తున్న తెప్ప, పడవలు ఒడ్డు దాటే క్రమంలో అదమరిస్తే ప్రమాదం పొంచి ఉంది. సుమారు ఈ పాలేరు వాగు అర కిలో మీటర్ల దూరం పొడువునా ఉండడంతో రైతులు గుంపులు గుంపులుగా ఒకరి చేతులు మరొకరు పట్టుకుంటూ లోతైన వాగు గుండా వ్యవసాయ పనులకు వెళ్లుతున్నారు. ఇలా పలుమార్లు భారీ వర్షం సమయంలో ప్రమాదంలో ఓ యువకుడు 2015లో మృతి చెందాడు. 10 పశువులు సైతం నీటిలో కొట్టుకుపోయాయి. గతంలో పాలేరు ఉధృతికి ట్రాక్టర్లు, రైతులకు సంబంధించిన పరికరాలు సైతం వాగులో కొట్టుకోపోయాయి. ఈ గ్రామ ప్రజలు మండలంలోని పెద్దముప్పారం గ్రామాలకు వెళ్లాలంటే ఆగపేట శివారులోని తండాల నుంచి 7కిలో మీటర్ల దూరం గుండా ప్రయాణం చేయాలి. పాలేరు వాగుపై బ్రిడ్జి నిర్మిస్తే కేవలం ఒక కిలో మీటరు దూరంతోనే పెద్దముప్పారానికి 40 కిలోమీటర్లలో సూర్యాపేటకు చేరుకోవచ్చు. పలుమార్లు ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా ఫలితం లేదని పేర్కొంటున్నారు రామవరం పల్లెవాసులు. ప్రభుత్వాలు మారుతన్నా వీరి బతుకుల్లో వెలుగు లేక రైతన్నలు పడరాని పాట్లు పడుతున్నారు.



ప్రమాదకరంగా ప్రవహిస్తున్న పాలేరు వాగును తెప్ప సహాయంతో దాటుతున్న మహిళా రైతు పగిడిపల్లి ధనమ్మ, రైతు పగిడిపల్లి బాబు

బ్రిడ్జి నిర్మాణం చేయాలి

రామవరం ప్రజలకు బ్రిడ్జిలేకపోవడంతోనే పలుమార్లు మృత్యువాత సంభవించాయి. నాయకులు పట్టించుకోకపోవడంతోనే తాము వ్యవసాయానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. గతంలో చాలా మంది తెప్పతో వెళ్తూ ప్రమాదానికి గురయ్యారు. గ్రామానికి చెందిన పొడుపుగంటి వెంకటయ్య, బొల్ల శ్రీనివాస్‌లు నీటి ప్రవాహానికి కొట్టుకోపాయారు. పొలం పనులకు వెళ్లాలంటే తెప్పలు, చిన్న చిన్న నాటు పడువలు ఉపయోగిస్తున్నాం. నాయకులు, అధికారులు స్పందించాలి. ప్రస్తుత ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ బ్రిడ్జి నిర్మాణానికి హామీ ఇచ్చినా కల సాకారం కలేదన్నారు.

- మాలోతు హరిశ్చందర్‌నాయక్, రైతు, దుబ్బతండా శివారు, రామవరం



ఎన్‌పీడీసీఎల్‌కు ప్రతిష్ఠాత్మకమైన సర్టిఫికెట్లు

రాంనగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎన్‌పీడీసీఎల్‌కు ప్రతిష్ఠాత్మకమైన రెండు అత్యుత్తమైన ఐఎస్‌వో సర్టిఫికెట్లు లభించాయి. మంగళవారం ఖమ్మంలోని మధిరలో జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేతుల మీదుగా సీఎండీ వరుణ్‌రెడ్డి సర్టిఫికెట్లను అందుకున్నారు. విద్యుత్ పంపిణీ కార్యక్రమాలు, సబ్ స్టేషన్‌ల నిర్వహణ, సబ్‌స్టేషన్‌ల నిర్మాణాల్లో అత్యుత్తమ నాణ్యతను గుర్తిస్తూ క్వాలిటీ మేనేజ్‌మెంట్ సిస్టమ్ సర్టిఫికెట్లు ప్రదానం చేయగా, ఉద్యోగుల భద్రతపై అనునిత్యం తీసుకుంటున్న చర్యలకుగాను సంస్థ అనుసరిస్తున్న సురక్షా ప్రమాణాలను గుర్తిస్తూ ఆక్యుపేషనల్, హెల్త్‌అండ్ సేఫ్టీ మేనేజ్‌మెంట్ సర్టిఫికెట్ ప్రదానం చేశారు. ఈ ప్రతిష్ఠాకమైన సర్టిఫికెట్ల ను హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ జారీ చేసింది. తెలంగాణలో మొదటిసారిగా ఐఎస్‌వో సర్టిఫికెట్‌లను ఎన్‌పీడీసీఎల్ పొందడం గర్వకారణంగా ఉందని సీఎండీ వరుణ్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు.



డిప్యూటీ సీఎం భట్టి చేతుల మీదిగా సర్టిఫికెట్ అందుకుంటున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

సామాజిక తెలంగాణే లక్ష్యం



ప్రెస్‌క్లబ్‌లో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జాగృతి నేతలు

- తెలంగాణ జాగృతి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మాధవి
- నవంబరు 8, 9న వరంగల్ జిల్లాలో 'జాగృతి జనం బాట'

వడ్డెపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : సామాజిక తెలంగాణే తమ లక్ష్యమని తెలంగాణ జాగృతి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మారేపల్లి మాధవి అన్నారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. చారిత్రక నేపథ్యం కలిగిన వరంగల్ జిల్లాలోని ఖిలా వరంగల్ కోట, భద్రకాళి, వేయిస్తంభాల దేవాలయాలను కల్వకుంట్ల కవిత సందర్శించనున్నట్లు వెల్లడించారు. వరంగల్ జిల్లాలో నవంబరు 8, 9న నిర్వహించే జాగృతి జనం బాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ జాగృతి రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు మాట్లాడుతూ.. వరంగల్, హనుమకొండ జిల్లాలోని మేధావులు, ప్రొఫెసర్లు, న్యాయవాదులు, డాక్టర్లు, ఇంజనీర్లు, జర్నలిస్టులతో పాటు వివిధ కుల సంఘాల నాయకులను కల్వకుంట్ల కవిత కలిసి జనం బాటలో మమేకం కావాలని కోరినట్లు చెప్పారు.

జాగృతి రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీకాంత్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి కూడా నెరవేర్చలేదని విమర్శించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రాష్ట్రంలో జరుగుతున్న అన్యాయాన్ని ఎదుర్కొనేందుకే తెలంగాణ జాగృతి ఆవిర్భవించిందని పేర్కొన్నారు. జాగృతి జనం బాటకు సంబంధించిన పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జాగృతి నేతలు కూతాడి కుమారస్వామి, ఓని సదానందం తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎస్‌జీఎఫ్ఐ క్రీడా ఎంపిక పోటీలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 500మంది హాజరు

వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) అండర్-19 ఆధ్వర్యంలో హనుమకొండ జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్)లో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి అండర్-19 బాలబాలికల క్రీడా ఎంపిక పోటీలు రెండో రోజు జోరుగా ప్రారంభమయ్యాయి. మంగళవారం జేఎన్ఎస్‌లోని హ్యాండ్‌బాల్ కోర్టులో ఏర్పాటుచేసిన జిల్లా స్థాయి బాలబాలికల హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలను ఎస్‌జీఎఫ్ఐ అండర్-19 క్రీడా పోటీల నిర్వహణ కార్యదర్శి నరెడ్ల శ్రీధర్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. .నాలుగు రోజులు క్రీడా పోటీల నిర్వహణలో భాగంగా రెండోరోజు హ్యాండ్‌బాల్, చెస్, షటిల్ బ్యాడ్మింటన్, హాకీ, బెల్ట్, రెజ్లింగ్, సైక్లింగ్, స్కేటింగ్, బేస్‌బాల్, బీచ్ వాలీబాల్ క్రీడాంశాల్లో పోటీల ను నిర్వహించగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 500మంది క్రీడా కారులు పాల్గొన్నరన్నారు. కాగా, హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చెస్, ములుగు రోడ్డులోని ఎల్బీ కళాశాల క్రీడా మైదానంలో షటిల్ బ్యాడ్మింటన్, వరంగల్ సీకేఎం కళాశాల మైదానంలో సైక్లింగ్ పోటీలను నిర్వహించామన్నారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న ఎంపిక పోటీల్లో పలు జిల్లాల నుంచి బాలబాలికలు హాజరై గెలుపే లక్ష్యంగా లక్ష్యసాధన కోసం చమటోడ్చుతున్నారు. ఈ కార్యక్ర మంలో స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ (ఎస్‌ఏపీఈటీఏ) జిల్లా అధ్యక్ష, కార్య దర్శులు ఎ.ప్రభాకర్ రెడ్డి, కుమార్, గౌరవ అధ్యక్షుడు దేవేందర్, ఎస్‌ఏపీఈటీఏలు రవీందర్, రాముడు, జన్ను బాబు, ప్రేం ప్రసాద్, తెలంగాణ రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ కార్యవర్గసభ్యుడు మర్కాల యాదిరెడ్డి, వివిధ జిల్లాకు చెందిన ఎస్‌ఏపీఈటీలు, పీడీలు కోచ్‌లు, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



హ్యాండ్‌బాల్ పోటీలో తలపడుతున్న వివిధ జిల్లాలకు చెందిన క్రీడాకారులు



సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

అగ్రంపహాడ్ జాతరను ఘనంగా నిర్వహించాలి

- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి
- జాతర ఏర్పాట్లపై సమీక్షలో ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

ఆత్మకూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అగ్రంపహాడ్‌ను మినీ మేడారంగా పిలిచే సమ్మక్క- సారలమ్మ జాతరను ఈసారి ఘనంగా నిర్వహించాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఈ జాతర ఏర్పాట్లపై అధికారులతో గద్దెల వద్ద ఎమ్మెల్యే సమీక్షించారు. ముందుగా అమ్మవారి గద్దెల వద్ద వన దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి పలు ఆదేశాలు జారీ చేశారు. జాతరలో అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అమ్మవార్లను గద్దెలపైకి తీసుకొచ్చే సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా బందోబస్తు నిర్వహించాలని సూచించారు. తాగునీరు, క్లోరినేషన్, 108 వాహనం అందుబాటులో ఉంచడం, వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. భక్తుల వాహనాలు పార్కింగ్ చేయడానికి స్థలం, చలువ పందిళ్లు, క్యూలు, భోజన సౌకర్యం, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయడం తదితర అంశాలపై చర్చించారు. చేతి పంపులు, బోర్ల మరమ్మతు, తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటు, రోడ్లపక్కన చెట్లను తొలగించి సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. భక్తుల సౌకర్యార్థం తాగునీటి ఏర్పాటు, జాతర ప్రాంగణం, వాహనాల పార్కింగ్ స్థలం, అమ్మవార్ల గద్దెల చుట్టూ లైటింగ్, డెకరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. నిరంతరం విద్యుత్ సరఫరా జరగాలని ఎమ్మెల్యే ఆదేశించారు.

ఈ సమావేశంలో పరకాల ఆర్డీవో పి.నారాయణ, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ ఆర్.సునీత, జాతర ఈవో నాగేశ్వర్‌రావు, అన్ని శాఖల అధికారులతో పాటు ఆత్మకూరు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బీరం సుందన సుధాకర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కమలాపురం రమేష్, జాతర మాజీ చైర్మన్ బొరిగం స్వామి, తహసీల్దార్ జగన్మోహన్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, పోలీసులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని ఒకరి దుర్మరణం

ఖమ్మం రహదారిపై ఘటన

మామునూరు అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. మంగళవారం సాయంత్రం వరంగల్ నాయుడు పెట్రోల్ బంక్ వద్ద లారీ ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. ఖిలా వరంగల్‌కు చెందిన ఇమ్మనేని లక్ష్మణ్‌రావు (48) ఇటుక బట్టీలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు.

మంగళవారం సమీప బంధువుల అంత్రక్రియలకు వెళ్ళి వచ్చిన ఆయన పెట్రోల్ బంక్ వద్ద బైక్‌పై రోడ్డు దాటుతుండగా కాకినాడకు చెందిన 14 టైర్ల లారీ ఖమ్మం వైపు వెళ్తూ ఢీకొట్టింది. లారీ ముందుటైరు అతడిపై తలపై నుంచి దూసుకెళ్లడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని అంబులెన్స్ ద్వారా ఎంజీఎంకు తరలించారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఘటనా స్థలంలో లక్ష్మణ్‌రావు మృతదేహం

ఆలయాలను అభివృద్ధి చేయండి..

- చిల్పూర్, జీడికల్ గుళ్లకు రూ.10కోట్లు కేటాయించాలి
- దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి కడియం వినతి

హనుమకొండ, అక్టోబర్ 28 (ఆంధ్రజ్యోతి): స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ పరిధిలోని అతి ప్రాచీనమైన, చారిత్రకంగా సుప్రసిద్ధమైన దేవాలయాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి కోరారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్ చేనేత భవన్‌లోని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ కార్యాలయంలో స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ పరిధిలోని పలు ఆలయాల అభివృద్ధిపై దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యార్, దేవాదాయ శాఖ కమిషనర్ హరీష్, ఇతర అధికారులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా శ్రీహరి మాట్లాడుతూ.. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే అతి ప్రాచీనమైన, ప్రాముఖ్యత గల ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. ముఖ్యంగా స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం పరిధిలోని చిల్పూర్ శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి రూ.5కోట్లతో మాస్టర్ ప్లాన్ రూపొందించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ఆలయ ఆవరణలో ఉన్న ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆలయ అర్చకుల నియామకానికి సంబంధించిన ఫైల్ పెండింగ్‌లో ఉందని, వెంటనే ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. జీడికల్ రామచంద్ర స్వామి ఆలయ అభివృద్ధికి సైతం రూ.5కోట్లతో మాస్టర్ ప్లాన్ రూపొందించి ప్రతిపా దనలు సిద్ధం చేయాలని అన్నారు.వచ్చే నెల 4నుంచి స్వామివారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. నవాబ్‌పేట కోదండ రామస్వామి ఆలయ అభివృద్ధికి సంబంధించిన రూ.1.03 కోట్ల అభివృద్ధి పనులను మంజూరు ఇవ్వాలని కోరారు. ఆలయ ఆవరణలో ప్రహరీ నిర్మాణంతో పాటు కోతుల బెడద అధికంగా ఉన్నందువల్ల సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే స్టేషన్‌ఘన్‌పూర్ పట్టణ కేంద్రంలో కూరగాయల మార్కెట్ ఏర్పాటుకు తిరుమలనాథ స్వామి ఆలయానికి సంబంధించిన 1.09ఎకరాల దేవాదాయ శాఖ భూమి అన్యాక్రాంతం కాకుండా మున్సిపాలిటీకి లీజుకు అనుమతి ఇవ్వాలని కోరారు. మున్సిపాలి టీకి లీజుకు ఇవ్వడం ద్వారా ఆలయ భూమిని రక్షించడంతో పాటు ప్రజలకు ఉపయోగకరంగా మారుతుందని తెలిపారు. నియోజకవర్గం పరిధిలోని జీడికల్ రామ చంద్ర స్వామి ఆలయం, చిల్పూర్ బుగులు వెంకటేశ్వర స్వామి ఆలయం, స్టేషన్ ఘనపూర్ తిరుమలనాథ స్వామి ఆలయం, చిన్నపెండ్యాల లక్ష్మీనర్సింహస్వామి ఆలయాలకు చెందిన భూముల పరిరక్షణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. దేవాదాయ శాఖ భూములు అన్యాక్రాంతం, ఆక్రమణలకు గురి కాకుండా సర్వే చేసి హద్దులు నాటడంతో పాటు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో దేవాదాయశాఖ జాయింట్ కమిషనర్ రామక్రిష్ణారావు, చిల్పూర్ ఆలయ కమిటీ చైర్మెన్ పొట్లపల్లి శ్రీదర్ రావు, ఇతర దేవాదాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.



దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి వినతి పత్రం అందజేస్తున్న కడియం

స్టడీ అవర్‌లో విద్యార్థినికి అస్వస్థత

వెంకట్రాంపురం ఉన్నత పాఠశాల్లో ఘటన

బయ్యారం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుడు చదవమని వారించగా.. స్టడీ అవర్‌లో ఓ విద్యార్థిని అస్వస్థతకు గురైన ఘటన మానుకోట జిల్లా బయ్యారం మండలంలోని వెంకట్రాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పాఠశాల నందు చోక్లాతండాకు చెందిన సంగీత అనే విద్యార్థిని 8వ తరగతి చదువుతోంది. ఎస్ఏ-1 పరీక్షల ప్రిపరేషన్‌లో భాగంగా పాఠశాలలో మధ్యాహ్న సమయంలో నిర్వహించిన స్టడీ అవర్‌లో సదరు విద్యార్థిని అస్వస్థతకు గురైంది. దీంతో విద్యార్థినిని చికిత్స నిమిత్తం బయ్యారంలోని ఓ ఆస్పత్రికి తీసుకొచ్చినట్లు సమాచారం.

అనంతరం విషయాన్ని తల్లిదండ్రులకు తెలపగా వారు జిల్లా కేంద్రంలోని ఓ ఆస్పత్రికి తరలించినట్లు తెలిసింది. ఈ విషయమై పాఠశాల హెచ్ఎం లింగరాజును వివరణ కోరగా.. స్టడీ అవర్‌లో తెలుగు ఉపాధ్యాయుడు చదవమని అనడంతో విద్యార్థిని అస్వస్థతకు గురైందన్నారు. తొలుత బయ్యారంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స నిర్వహించిన అనంతరం తల్లిదండ్రులు జిల్లా కేంద్రంలోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.



ఉపాధ్యాయుడి అసభ్యకర ప్రవర్తనపై విచారణ చేస్తున్న ఎంఈవో వెంకటేశ్వరరావు

ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయుడిపై విచారణ

- పాఠశాల నుంచి తొలగింపు
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన సంఘటన

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయుడు విద్యార్థిని పట్ల ఉపాధ్యాయుడి అసభ్యకర ప్రవర్తనపై ఎంఈవో మంగళవారం విచారణ చేపట్టారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో విద్యన భ్యసిస్తున్న ఓవిద్యారినిపై పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు ఈనెల 25న అసభ్యకరంగా ప్రవర్తించాడనే విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. 26న ఆదివారం కావడంతో ఈ నెల 27న పాఠశాలకు వచ్చి సదరు ఉపాధ్యాయుడికి దేహశుద్ధి చేసినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న డీఎస్ఎఫ్ఐ నాయకులు పాఠశాలకు చేరుకొని మంగళవారం సంబంధిత జిల్లా, ఎంఈవోకు తెలిపి నిరసన వ్యక్తం చేశారు. పాఠశాలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఎంఈవో వెంకటేశ్వర రావును వివరణ కోరగా విచారణ చేపట్టి పూర్తి నివేదికను డీఈవోకు నివేదించనున్నట్లు పేర్కొన్నారు.

తల్లీకూతుళ్ల అదృశ్యం

గీసుగొండ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : 15వ డివిజన్ మొగిలిచర్లలో తల్లి, కూతుళ్ల అదృశ్యమైన ఘటన మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మొగిలిచర్ల గ్రామంలో సెహరూన్ (31) ఆమె కూమార్తెలు సహిస్తా (9), సానియా (6)లు ఈ నెల 27 ఇంటి నుంచి బయటికి వెళ్లి కనిపించకుండా పోయారని సెహరూన్ భర్త షాహిద్‌ఖాన్ ఫిర్యాదు చేశారు. అతడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ విశ్వేశ్వర్ తెలిపారు. కాగా, ఈ నెల 27న బొడ్డుచింతలపల్లిలో ఉమసత్యదుర్గ అనే వివాహిత, గొర్రెకుంటలో బీటెక్ విద్యార్థిని శాతరాసి శ్యామలత అదృశ్యమైనట్లు వారి కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇది ఇలా ఉండగా గత మూడు నెలల్లో 10 మంది వరకు అదృశ్యమైన కేసులు నమోదు కావటం గమనార్హం.



అదృశ్యమైన తల్లి సెహరూర్, కుమార్తె

స్వచ్ఛ హరిత్ విద్యాలయ మదింపు ప్రక్రియను పూర్తి చేయాలి

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ హరిత్ విద్యాలయ రేటింగ్స్ మదింపు ప్రక్రియను 31లోపు పూర్తి చేయాలని వరంగల్ డీఈవో బి.రంగయ్యానాయుడు సూచించారు. మంగళవారం శంభునిపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛ హరిత్ విద్యాలయ రేటింగ్ మదింపు ఇవాల్యూయేటర్లకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన డీఈవో రంగయ్య మాట్లాడుతూ.. ఇవాల్యూయేటర్లు ప్రతీ స్కూల్‌ను సందర్శించి అక్టోబరు 31లోగా మదింపు ప్రక్రియకు సంబంధించిన అన్ని వివరాలను ఆన్‌లైన్‌లో సమర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సెక్టోరల్ అధికారులు శ్రీనివాస్, సుజన్‌తేజ, డీసీఈబీ సెక్రెటరీ కృష్ణమూర్తి, రీసోర్స్ పర్సన్లు మహేష్‌నాయక్, కృష్ణారెడ్డి, శ్రవణ్‌కుమార్, హెడ్మాస్టర్ శారదబాయి తదితరులు పాల్గొన్నారు.


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో రంగయ్య


వీసీ, రిజిస్ట్రార్లకు వినతిపత్రం ఇస్తున్న సెక్రెటరీ మంద శ్రీకాంత్ తదితరులు

30న ఉన్నత విద్యా సంస్థల బంద్

కేయూక్యాంపస్ అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా అక్టోబరు 30న ఎస్ఎఫ్ఐ నేతృత్వంలో నిర్వహిస్తున్న ఉన్నత విద్యా సంస్థల బంద్‌కు అందరు సహకరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సెక్రెటరీ మంద శ్రీకాంత్ కోరారు. ఈమేరకు మంగళవారం వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్ ఎరెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంలను కలిసి బంద్ వినతిపత్రాన్ని అందచేశారు. బంద్‌కు సహకరించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కేయూ అధ్యక్షకార్యదర్శులు చెన్నూరి సాయికుమార్, బిరెడ్డి జశ్వంత్, ఎస్ఎఫ్ఐ జిల్లా కిటీ సభ్యులు పవన్‌కుమార్, రాజేశ్, సూరజ్, రాహుల్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ముగ్గురికి జైలు శిక్ష

వరంగల్ క్రైం, అక్టోబర్ 28 (ఆంధ్రజ్యోతి): డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలోపట్టుబడ్డ 21మందిని మంగళవారంకోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఎ.వేణుగోపాల్ సమ్మయ్యనగర్‌కు చెందిన సింగారపు కిరణ్‌కుమార్, గుంటూరు వినుకొండకు చెందిన వల్లెపు శ్రీను, భీమదేవర పల్లికి చెందిన వరికిల్ల శ్రీనివాస్‌కు రెండు రోజుల జైలు శిక్ష విధించగా మిగతా 18మందికి రూ.18,700 జరిమానా విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ సీఐ సీతారెడ్డి తెలిపారు. అదేవిధంగా డ్రైవింగ్ లైసెన్స్ లేని 10మందిని కోర్టులో హాజరుపరచగా రూ.6,900 జరిమానా విధించామన్నారు.

డ్రగ్స్ కంట్రోల్ టీం తనిఖీలు

వరంగల్ క్రైం, అక్టోబర్28(ఆంధ్రజ్యోతి): మత్తుపదార్థాల నియంత్రణలో భా గంగా వరంగల్ పోలీస్ కమి షనరేట్ డ్రగ్స్ కంట్రోల్ టీం పోలీసులు మంగళవారం వరంగల్ రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. పోలీ స్ జాగిలంతో అనుమానిత వ్యక్తుల బ్యాగులను పరిశీలించారు. మత్తు పదార్థాలు విక్రయించినా, సేవించినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని డ్రగ్స్ కంట్రోల్ టీం ఇన్‌స్పెక్టర్ వై.సతీష్ సూచించారు. తనిఖీలలో ఆర్ఐ శివకేశవులు, ఆర్ఎస్ఐలు పూర్ణ, మనోజ్ పాల్గొన్నారు.

లో వోల్టేజ్ సమస్యలను తగ్గించాలి

రాంనగర్, అక్టోబర్ 28 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ సర్కిల్‌లో లోవోల్టేజ్ సమస్యలను తగ్గించడానికి చర్యలు తీసుకుని వ్యవసాయ కనెక్షన్ పనులు త్వరగా పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాలని హనుమకొండ సర్కిల్ ఎస్ఈ మధుసూధన్‌రావు విద్యుత్ అధికారులకు సూచించారు. మంగవారం హనుమకొండ సర్కిల్ అధికారులతో ఎస్ఈ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ అంతరాయాలు తగ్గింపుతోపాటు డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలపై అధికారులతో చర్చించారు. గత సంవత్సరంతో పోలిస్తే డీటీఆర్ వైఫల్యాలు తగ్గించడంలో ఏఈల కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ టెక్నికల్ విజేందర్‌రెడ్డి, డీఈ ఆపరేషన్ హనుమకొండ టౌన్ సాంబరెడ్డి, హనుమకొండ రూరల్ సామ్యానాయక్, ఎస్ఏఓ పాల్గొన్నారు.

ఉత్సాహంగా కొనసాగుతున్న ఉత్కర్ష

వరంగల్ మెడికల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కాకతీయ వైద్య కళాశాల ఉత్సవం ఉత్కర్ష - 2025 మూడో రోజు మంగళవారం ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు ట్రెడిషనల్ డే కార్యక్రమంలో వివిధరాష్ట్రాల సంప్రదాయ వస్త్రధారణతో హాజరై రంగులమయం చేశారు. సాంస్కృతిక ప్రదర్శనలు, నృత్యాలు విద్యార్థులు ఉత్సాహాన్ని నింపాయి. కేఎంసీ మొదటి బ్యాచ్ అలుమ్నస్ డాక్టర్ అంజనీదేవి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ప్రోత్సహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్య సుంకరనేని విద్యార్థులతో కలిసి ఉత్సవాన్ని తిలకించారు. సాయంత్రం నిర్వహించిన దాండియా నైట్ కార్యక్రమం విద్యార్థుల నృత్యాలతో సందడిగా సాగింది. సాంప్రదాయం, ఉత్సాహంగా వేడుక సాగింది.

ఓటు చోరీపై సంతకాల సేకరణ

కాజీపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కాజీపేట 47వ డివిజన్‌లో కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఓటు చోరీపై సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ముందుగా ఎన్నికల్లో ఓట్లు చోరీ చేసి బీజేపీ ఎలా అధికారాన్ని చేపడుతున్నారో అనే విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రజల నుంచి సంతకాలు సేకరించారు. డివిజన్ అధ్యక్షుడు షేక్ ఈజ్జర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఇప్ప శ్రీకాంత్, తమ్ముడి మధు మానస, మైసారపు సిరిల్ లారెన్స్, కొమురవెల్లి రమేశ్, ఎండి. బిలాన్ పాల్గొన్నారు.

కేయూ డ్రగ్స్ రహిత క్యాంపస్

కేయూక్యాంపస్ అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కేయూ క్యాంపస్ డ్రగ్స్ రహిత క్యాంపస్ అని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం స్పష్టం చేశారు. మంగళవారం కేయూ కోఎడ్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.రమణ అధ్యక్షతన మాదక ద్రవ్య వ్యతిరేక అవగాహన నిర్వహించారు. ఈసందర్భంగా రిజిస్ట్రార్ రామచంద్రం హాజరై మాట్లాడారు. మారక ద్రవ్యాల వల్ల జీవితాలు అంధకారంగా మారుతాయని అన్నారు. కేయూ ఈసీ మెంబర్ కె.అనితారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు ఆరోగ్యకరమైన, బాధ్యతయుతంగా జీవించాలని అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి అప్పయ్య, జిల్లా సంక్షేమ అధికారి జె.జయంతి, డ్రగ్స్ నియంత్రణ విభాగం డీఎస్పీ రమేశ్‌కుమార్, ఎస్సై రవీందర్, ఎన్జీవో అధికారి ఆచార్యులు పాల్గొని విద్యార్థులకు డ్రగ్స్ వల్ల జరిగే నష్టాలను వివరించి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో కేయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ, డాక్టర్ ఆసీం ఇక్బాల్, డాక్టర్ రాధిక, సుమలత, డాక్టర్ వి. మహేందర్, సూపరింటెండెంట్ బొల్నేపాక ప్రభాకర్, విజయ్ పాల్గొన్నారు.

సాగులో మెళకువలు పాటించాలి

హసన్‌పర్తి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పంట సాగులో రైతులు మెళకువలు పాటించి అధిక దిగుబడి సాధించాలని తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ ఎ.విజయభాస్కర్ సూచించారు. మండలంలోని సీతంపేటలో పంటలను సందర్శించి రైతుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతుల సందేహాలను వ్యవసాయ శాస్త్రవేత్తలు నివృత్తి చేసి పంట సాగులో పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ ఆదిరెడ్డి, శాస్త్రవేత్తలు బి.వి.రాజుకుమార్, విశ్వతేజ, ఏవో అడ్లూరి అనురాధ, ఏఈవో భాస్కర్, ఎన్ఎఫ్ఎస్ఎం అధికారి సారంగం, ఆదిరెడ్డి, పాల్గొన్నారు.

ప్రీ రిపబ్లిక్ డే జాతీయ క్యాంపునకు సనా

వడ్డెపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గుజరాత్‌లోని పఠాన్‌లో జరుగుతున్న ప్రీ రిపబ్లిక్ డే జాతీయ క్యాంపునకు హనుమకొండ వడ్డెపల్లి పింగిళి ప్రభుత్వ డిగ్రీ, పీజీ మహిళా కళాశాలలో బీకాం తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఎం.డి. సనా ఎన్ఎస్ఎస్ యూనిట్-2 నుంచి ఎంపికైంది. ప్రిన్సిపాల్ బత్తిని చంద్రమౌళిగౌడ్, వైస్ ప్రిన్సిపాల్ జి. సుహాసిని, అధ్యాపకులు మంగళవారం సనాను అభినందించారు. ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ సురేష్‌బాబు, అకడమిక్ కో-ఆర్డినేటర్ డాక్టర్ అరుణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు రామా రత్నమాల, కవిత, మమత, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళల ముందడుగు

- కలెక్టర్ చొరవతో వ్యాపార రంగంలోకి అడుగులు
- తొలి ప్రయత్నంగా కందులను పప్పుగా మార్చి విక్రయం
- త్వరలోనే ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ(ఎఫ్‌పీసీ)లకు ప్రాసెసింగ్ యూనిట్ కేటాయింపు

హనుమకొండ కలెక్టరేట్, అక్టోబర్ 28 (ఆంధ్రజ్యోతి): ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు ఉపాధి కల్పించడానికి ఐకేపీ సెంటర్లను కేటాయించి ఉపాధి కల్పించిన ప్రభుత్వం.. తాజాగా మహిళలను వ్యాపార వేత్తలుగా మార్చేందుకు అడుగులు వేస్తోంది. దీనిలో భాగంగా హనుమకొండ జిల్లాలోని 68 ఫార్మర్ ప్రొడ్యూసర్ గ్రూపులలోని 952మంది సభ్యులు స్వయం ఉపాధి పొందేందుకు రూపకల్పన చేస్తోంది. కలెక్టర్ స్నేహ శబరీష్ ప్రోత్సాహంతో జిల్లాలోని ఆరు మండలాలు(ఐనవోలు, హసన్‌పర్తి, ఎల్కతుర్తి, భీమదేవరపల్లి, కమలాపూర్, వేలేరు) కలిపి ఐనవోలు కేంద్రంగా ఏర్పాటు చేసిన మహిళా రైతు ఉత్పత్తిదారుల కంపెనీ వారు వ్యాపారవేత్తలుగా ఎదిగేందుకు దోహదపడుతోంది.

కలెక్టర్ స్నేహ శబరీష్ చొరవతో తొలి అడుగులు..

కలెక్టర్ స్నేహ శబరీష్ ఆధ్వర్యంలో ఐనవోలు కేంద్రంగా ఉన్న మహిళా రైతు ఉత్పత్తిదారుల కంపెనీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిన మహిళా రైతు కంపెనీ ఉత్పత్తుల వైపు ఎందుకు వెళ్లకూడదని కలెక్టర్ ఆరా తీసి ప్రోత్సహించడంతో అటు వైపుగా మహిళా రైతుల ఆలోచనలు మళ్లాయి. కలెక్టర్ ఇచ్చిన స్ఫూర్తితో మహిళా రైతులు మొదటగా కందులను కొనుగోలు చేసి వాటిని ట్రయల్ రన్‌లో భాగంగా రూర్బన్ ప్రాజెక్టు కింద మంజూరైన పర్వతగిరిలోని ప్రాసెసింగ్ యూనిట్‌లో పప్పుగా ప్రాసెస్ చేసి ఈ నెల 27వ తేదీన కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ కార్యాలయం ఎదుట అందుబాటులో ఉంచగా ఉద్యోగులు కొనుగోలు చేశారు. మహిళా రైతు ఉత్పతిదారుల కంపెనీలో చైర్‌పర్సన్‌గా పిన్నింటి పావని, వైస్ చైర్‌పర్సన్‌గా అంబీరు రాధిక, కె.రాధ, టి. జీవిత, స్వాతి, హెచ్ వరమ్మ, వి.హరిత, ఎం. విజయ, పి.కమల, యు.సంధ్యలు బోర్డు ఆఫ్ డైరెక్టర్లుగా ఉన్నారు.


కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ కార్యాలయంలో కందిపప్పు స్టాల్ విక్రయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ (ఫైల్)

త్వరలో ప్రాసెసింగ్ యూనిట్...

ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయడానికి ఇప్పటికే సెర్ప్‌తో ఇక్రిసాట్ ఒప్పందం చేసుకున్న క్రమంలో హనుమకొండ జిల్లాలో ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు ఇక్రిసాట్, డీఆర్‌డీఏ అధికారులు సంయుక్తంగా డీపీఆర్ సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. పప్పు, గానుగ నూనె, ఫుడ్ ఐటమ్స్, పశువుల దానా మిశ్రమంగా ఏర్పాటు చేసే ప్రాసెసింగ్ యూనిట్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు ప్రయత్నిస్తుండగా ఉత్పత్తులను తయారుచేయడంలో మహిళలను ప్రతిభావంతులుగా సిద్ధం చేసేందుకు మరోవైపు కార్యాచరణ జరుగుతోంది. తొలి ప్రయత్నంలో కందులను పప్పుగా మార్చే దిశగా చేసిన పనిలో మహిళలు సక్సెస్ కావడంతో కలెక్టర్ స్నేహ శబరీష్ ప్రశంసలు అందించడంతో పాటు ప్రాసెసింగ్ యూనిట్ వేగంగా అందుబాటులోకి తెచ్చేందుకు కార్యాచరణ రూపొందించాలని డీఆర్‌డీఏ అధికారులను ఆదేశించారు.

కలెక్టర్ ఆలోచనలే ఉత్పత్తుల వైపు నడిపించాయి

పల్లెల్లో కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తున్న తమను కలెక్టర్ స్నేహ శబరీష్ ఆలోచనలే ప్రాసెసింగ్ యూనిట్ వైపు నడిపించాయి. ధాన్యం కొనుగోలు చేయడమే కాదు వాటి ద్వారా ఉత్పత్తులు చేసి నాణ్యమైన ఆహార పదార్థాలను ప్రజలకు అందించాలనే మంచి ఆలోచనను రేకెత్తించింది. స్వతహాగా ప్రాసెసింగ్ యూనిట్ నెలకొల్పే ధైర్యాన్ని మాకు కల్పించారు.

\- చైర్‌పర్సన్ పిన్నింటి పావని


మాట్లాడుతున్న ఆకుల రాజేందర్

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి..

టీఎన్‌జీఓస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్

హనుమకొండకలెక్టరేట్, అక్టోబర్ 28 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని టీఎన్‌జీఓస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ప్రభుత్వాన్ని కోరారు. హైదరాబాద్ నాంపల్లిలోని టీఎన్‌జీఓస్ భవన్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో ఆకుల రాజేదర్ మాట్లాడారు. రిటైర్డ్ అయిన ఉద్యోగులు వారికి రావాల్సిన రిటైర్మెంట్ బకాయిలు రాక చాలా ఇబ్బందులు పడుతున్నారని, వారికి రావాల్సిన బెన్‌ఫిట్స్ వెంటనే అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సీపీఎస్ సాధన, ఉద్యోగుల సమస్యల సాధన కోసం త్వరలోనే హనుమకొండ జిల్లాలో సభ ఏర్పాటు చేయాలని కేంద్ర సంఘం నాయకత్వం ఇచ్చిన పిలుపుమేరకు త్వరలోనే జిల్లాలో పెద్ద ఎత్తున ఉద్యోగులతో సభ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సమావేశంలో హనుమకొండ జిల్లా ఉద్యోగ సంఘాల నాయకులు నామునాయక్, లక్ష్మీప్రసాద్ పాల్గొన్నారు.

రేపు, ఎల్లుండి అథ్లెటిక్ ఎంపికలు

కేయూక్యాంపస్ అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని అంతర్ కళాశాలల స్త్రీ, పురుషుల అథ్లెటిక్ క్రీడా పోటీలను గురు, శుక్రవారాల్లో అక్టోబరు 30, 31 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రెటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య తెలిపారు.

కేయూ క్రీడామైదానంలో జరిగే అథ్లెటిక్ మీట్‌కు ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల క్రీడావిద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. ఎంపికలకు సంబంధించిన ట్రాక్ సెక్టార్స్ మార్కింగ్ పూర్తిచేసినట్లు ఆర్గనైజింగ్ సెక్రెటరీ డాక్టర్ ఎస్.కుమారస్వామి తెలిపారు.

తాగునీటి సమస్యపై బల్దియా ఎదుట నిరసన

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ఎదుట ప్రజలు ధర్నాకు దిగారు. వరంగల్ మునిసిపాలిటీకి తాము అన్ని రకాల పన్నులు చెల్లిస్తున్నా తమకు అందించే మంచినీరు మురికినీరుగా వస్తున్నాయని ఇంజనీరింగ్ అధికారులు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం 19వ డివిజన్‌కు చెందిన పలువురు కాలనీవాసులు ఖాళీ బాటిళ్లతో బల్దియా కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. పైపుల ద్వారా వచ్చిన రంగుతో కూడిన మురికినీరును ప్లాస్టిక్ బాటిళ్లతో కార్యాలయానికి తీసుకుని వచ్చి ఇంజనీరింగ్ అధికారులు చూపించారు. వెంటనే తమ నీటిసమస్య పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. తాగునీటి నాణ్యతను నిర్ధారించి శుభ్రమైన నీటిని అందించే విధంగా అధికారులు చొరవ చూపాలని తెలిపారు. కమిషనర్ వచ్చేవరకు ధర్నా విరమించమని బీష్మించుకు కూర్చుని రెండు గంటల పాటు నిరసన వ్యక్తం చేశారు. ఇంజనీరింగ్ అధికారులు వచ్చి సమస్య పరిష్కరిస్తామని చెప్పడంతో ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో 19వ డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.



బల్దియా కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ప్రజలు

జస్టిస్ గవాయ్‌పై దాడిని ఖండించాలి

కేయూక్యాంపస్ అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడిని అందరూ ఖండించాలని కేయూ ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షకార్యదర్శులు ప్రొఫెసర్ ఈసం నారాయణ, డాక్టర్ పుల్లా శ్రీనివాస్‌లు పిలుపునిచ్చారు.మంగళవారం కేయూ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఈసం నారాయణ, పుల్లా శ్రీనివాస్‌లు మాట్లాడారు. జస్టిస్ గవాయ్‌పై దాడిని నిరసిస్తూ నవంబరు 1న హైదరాబాద్‌లో నిర్వహించనున్న నిరసనలకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు ప్రకటించారు. ఈ సమావేశంలో కేయూ ఎస్సీఎస్టీ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు నమిండ్ల కిరణ్‌కుమార్, పులిశేరు భాస్కర్, జాయింట్ సెక్రెటరీ భూక్యరాజునాయక్, నరేశ్, కోశాధికారి దామెర ఆనందం, ఈసీ మెంబర్లు బొల్నేపాక ప్రభాకర్, జి.సేవ్య, అయితా శ్రీకాంత్, ఎస్.మహర్షి,ఎం. బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఈసం నారాయణ

కేయూలో నిరసన పోస్టర్ ఆవిష్కరణ

నవంబరు 1న హైదరాబాద్‌లో నిర్వహించే దళితుల ఆత్మగౌరవ నిరసన ర్యాలీ పోస్టర్‌ను మంగళవారం కేయూలో ఆవిష్కరించారు. తెలంగాణ క్రాంతిదళ్ అధ్యక్షుడు సంగంరెడ్డి పృథ్వీరాజ్‌యాదవ్, కుమ్మరి శ్రీనాథ్, తోకల చిరంజీవి, మంద భాస్కర్, వడ్డెపల్లి మధు, మదాసి రమేశ్, చింతం సిద్ధూ, రాణా ప్రతాప్, తిలక్, వేణు తదితరులు పాల్గొన్నారు. ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణ మాదిగ సభలో పాల్గొంటారని తెలిపారు.


మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య

వైద్యులు నిబంధనలు పాటించాలి

వరంగల్ మెడికల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పీఎన్‌డీటీ, ఎంటీపీ చట్టం నియమ నిబంధనలు వైద్యులు తప్పనిసరిగా పాటించాలని హనుమకొండ డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య సూచించారు. మంగళవారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో జిల్లాస్థాయి అడ్వయిజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. జిల్లాలో నిర్వహించిన తనిఖీలు, నోటీసుల గురించి, లింగ నిష్పత్తి గురించి వివరించారు. నియమాలు, నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. చట్ట విరుద్ధంగా, లింగ నిర్ధారణ అబార్షన్లు నిర్వహించే వారి గురించి అనుమతి లేని ఆస్పత్రులు, ఇళ్లలో స్కానింగ్ మిషన్లు వినియోగించే వారిపై అనుమానం ఉంటే 6300030940కు సమాచారం అందించాలన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ మంజుల, డాక్టర్ నిర్మల, డాక్టర్ కవిత, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళ పీజీ కళాశాలలో కమిటీ విచారణ షురూ..

కేయూక్యాంపస్ అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సుబేదారిలోని యూనివర్సిటీ మహిళ పీజీ కళాశాలలో మంగళవారం విచారణ కమిటీ సందర్శించి ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎస్ఎల్ సౌజన్య, కాంట్రాక్టు అధ్యాపకురాలు డాక్టర్ జి.మధుశ్రీ మధ్య తలెత్తిన వివాదంపై విచారణ చేపట్టింది. మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కమిటీ ఛైర్మన్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి, సభ్యులు ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్, ప్రొఫెసర్ సీజే శ్రీలత, ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, కన్వీనర్, మెంబర్ ఏఆర్ శ్రీలతలతో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం కమిటీ నియమించిన విషయం విదితమే. కాగా, కమిటీ బాధ్యులు ప్రిన్సిపాల్ సౌజన్య, అధ్యాపకురాలు మధుశ్రీలతో వాదనలను విన్నారు. మరో దఫా కమిటీ కళాశాలను సందర్శించి తుది నివేదికను అందచేయనుంది.

'కుడా' భూముల అమ్మకాలను విరమించుకోవాలి

కలెక్టర్‌కు వామపక్ష పార్టీల వినతి

హనుమకొండ కలెక్టరేట్, అక్టోబర్ 28 (ఆంధ్రజ్యోతి): 'కుడా' భూముల అమ్మకాలను విరమించుకుని ప్రభుత్వ కార్యాలయాలకు ఉపయోగించాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్‌కు మంగళవారం వామపక్ష పార్టీల నాయకులు వినతిపత్రం అందజేశారు. బాలసముద్రంలోని ప్రభుత్వ భూమిని నవంబరు 3న బహిరంగ వేలం వేయడాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని, ప్రభుత్వ స్థలాలను రక్షించాల్సిన ప్రభుత్వమే ఇలాంటి వైఖరి తీసకోవడం దారుణమని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో వామపక్ష పార్టీల నాయకులు సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, సీపీఎం జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, ఎంసీపీఐ(యూ) నాయకులు ఎన్‌రెడ్డి హంసరెడ్డి, ఆర్ఎస్‌పీ నాయకుడు కౌడగాని శివాజీ, సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆదరి శ్రీనివాస్, ఎంసీపీఐ(యూ) రాష్ట్ర నాయకులు గడ్డం నాగార్జున, కర్ర రాజిరెడ్డి, సీపీఎం, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.


కలెక్టర్ స్నేహ శబరీష్‌కు వినతిపత్రం అందజేస్తున్న వామపక్ష పార్టీల నాయకులు



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన

వరంగల్ మెడికల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా మహిళల్లో వ్యాప్తి చెందుతున్న క్యాన్సర్‌లలో రొమ్ము క్యాన్సర్ అగ్రస్థానంలో ఉందని రొమ్ము క్యాన్సర్‌పై మంగళవారం అవగాహన ర్యాలీని నిర్వహించారు. యేటా అక్టోబరు నెలను రొమ్ము క్యాన్సర్ అవగాహన నెలగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంలో సీఎం విఫలం

- నేడు కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలి
- బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల శరత్‌చంద్ర

హనుమకొండ టౌన్, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంలో సీఎం రేవంత్‌రెడ్డి విఫలమయ్యారని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల శరత్‌చంద్ర మంగళవారం ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 29న 'హలో విద్యార్థి చలో కలెక్టరేట్' ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నా.. రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు, నిరుద్యోగ భృతి కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు.



వెల్వెట్‌తో ట్రెండీ మెరుగులు

చలికాలంలో వెచ్చని అనుభూతినిస్తూ అందంగా మెరిసే వెల్వెట్ చీరలు ట్రెండింగ్‌లోకి వచ్చేశాయి. నీలం, ఎరుపు, ఆకుపచ్చ, గులాబీ లాంటి ముదురు రంగులతో పాటు లేత రంగులు, పేస్టల్ కలర్స్‌లో కూడా రకరకాల వెల్వెట్ చీరలు లభ్యమవుతున్నాయి. ఈ చీరలు సుతిమెత్తగా ఉంటూ ఎలాంటి శరీరాకృతి ఉన్నవారికైనా చక్కగా నప్పుతాయి. చీర జారిపోతుందన్న భయం ఉండదు. అందుకే మహిళలు... ముఖ్యంగా యువతులు వివాహాది శుభకార్యాలు, పార్టీలకు వెళ్లేటప్పుడు వెల్వెట్ చీరలను కట్టుకోవడానికే ఎక్కువగా ఇష్టపడుతున్నారు. ఇలా అన్ని వర్గాలవారిని ఆకర్షిస్తున్న వెల్వెట్ చీరలపై ఓ లుక్కేద్దామా...





వెల్వెట్ చీరలు కట్టుకున్నప్పుడు చక్కగా నగలు పెట్టుకోవచ్చు. బంగారు, వెండి ఆభరణాలతోపాటు ముత్యాలు, వజ్రాలు, కెంపులు, పచ్చలు, బీడ్స్‌తో రూపొందించిన నగలన్నీ బాగా నూటవుతాయి. నగలు, మేకప్ లేకపోయినా వెల్వెట్ చీర కట్టుకుని చేత్తో క్లచ్ పట్టుకుంటే చాలు... గ్రాండ్‌గా మెరిసిపోవచ్చు.

వెల్వెట్ చీరల్లో చాలా రకాలు అందుబాటులో ఉన్నాయి. క్రష్డ్ వెల్వెట్, సిల్క్ వెల్వెట్, కాటన్ వెల్వెట్, పాలిస్టర్ వెల్వెట్ రకాలను మహిళలు ఎక్కువగా ఆదరిస్తున్నారు. ఈ చీరలమీద ఎంబ్రాయిడరీ, జర్దోసి, లేస్, కుందన్, నక్కీ, ప్యాచ్ వర్క్‌లు అందంగా కనిపిస్తాయి. జరీ బోర్డర్లు జతచేసి అందమైన బుటీ వర్క్ చేసిన చీరలను పెళ్లి సమయంలో ధరించడానికి యువతులు ఎక్కువగా ఎంపిక చేసుకుంటున్నారు. చిన్నపాటి ఈవెంట్లు, పార్టీలకు వెళ్లేటప్పుడు మాత్రం ప్లెయిన్ వెల్వెట్ చీరతోపాటు చక్కని డిజైనర్ బ్లౌజ్ ధరించి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు.



వెల్వెట్ చీరలను జాగ్రత్తగా సంరక్షించుకోవాలి. వీటిని నీళ్లతో ఉతకకూడదు. డ్రైక్లీనింగ్ చేయించడం మంచిది. ఈ చీరలను నేరుగా ఇస్త్రీ చేయకూడదు. చీరను లోపలివైపునకు తిప్పి, పైన ఓ కాటన్ క్లాత్‌ను పరిచి, దాని మీద తక్కువ వేడితో ఇస్త్రీ చేయాలి. వెల్వెట్ చీరల మీద ఏవైనా మరకలు పడితే వాటి మీద కొద్దిగా లిక్విడ్ డిటర్జెంట్ రాసి చేతి రుమాలుతో మెల్లగా రుద్దాలి. తరువాత తడి గుడ్డతో తుడిచేస్తే సరిపోతుంది. ఆపైన నీడలో గాలికి ఆరనివ్వాలి.



స్ఫూర్తి

ఎనభైలో ఎమ్‌బిఎ

దృఢసంకల్పం ఉన్నప్పుడు విద్యకు వయసు అడ్డంకి కాదని నిరూపించారు లక్నోకి చెందిన ఉష రే! 80 ఏళ్ల వయసులో ఎంబీఏ పూర్తి చేసిన ఉష... క్యాన్సర్ మీద ఏకంగా రెండుసార్లు విజయం సాధించిన ధీశాలి కూడా! ఈ నిత్య విద్యార్థి గురించిన మరిన్ని ఆసక్తికరమైన విశేషాలు...

పుణెకు చెందిన డాక్టర్ డి.వై. పాటిల్ విద్యాపీఠ్ సెంటర్ ఫర్ ఆన్‌లైన్ లెర్నింగ్‌లో ఎంబీఏ కోసం దరఖాస్తు చేసుకున్నప్పుడు ఉషకు 77 ఏళ్లు. ఈ ఏడాది ఆగస్టులో 80వ పుట్టినరోజు జరుపుకొన్న రెండు వారాలకు, చివరి సెమిస్టర్ పరీక్షలకు హాజరయ్యారు ఉష. పెద్ద వయసులో ఎంబీఏ చదవాలనే ఉష నిర్ణయం వెనక కూడా ఒక ఆసక్తికరమైన కారణం ఉంది. లక్నో విశ్వవిద్యాలయం నుంచి ఎమ్మెస్సీ పూర్తి చేసిన ఉష... దశాబ్దాల తరబడి ఉపాధ్యాయ వృత్తికే పరిమితమైపోయారు. భారతదేశంతో పాటు బ్రిటన్, యెమెన్ దేశాల్లోని అంతర్జాతీయ పాఠశాలల్లో సైతం విద్యార్థులకు బయాలజీ బోధించారు. 2009లో పదవీ విరమణ పొందిన తర్వాత, లఖ్‌నవూ గోమతినగర్‌లోని లోహీ శుభ్ హాస్పిటల్ సిఇఒగా సేవలందించడం మొదలుపెట్టారు.

ఎమ్‌బిఎ ఆలోచన వెనక...

అయితే అక్కడే ఆగిపోవడం ఆమెకు ఇష్టం లేదు. ఏదో ఒకటి నేర్చుకోవాలనే తపన ఆమెను వేధించడం మొదలుపెట్టింది. ఆ క్రమంలో 2023లో ఆస్పత్రి సిఇఒగా ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులను ఇంటర్వ్యూ చేసే సమయంలో, వాళ్లలో ఎకువ మంది ఎంబీఏ అర్హత కలిగి ఉన్న విషయాన్ని గ్రహించారామె. ఆ సందర్భం గురించి వివరిస్తూ... 'ఎంబీఏ... ఎంబీఏ... ఏ దరఖాస్తులో చూసినా అదే డిప్లొమా. 'ఏంటీ ఎంబీఏ? ఇంతమంది దీన్నే ఎందుకు ఎంచుకున్నారు?' అనే ఆసక్తితో దాని గురించి తెలుసుకోవడం మొదలుపెట్టాను. తెలిసిన ఆ తరువాత... ప్రస్తుత వృత్తికి సహాయపడేలా 2023 ఏప్రిల్‌లో, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్స్ అండ్ హెల్త్ సర్వీసెస్ విభాగంలో ఎంబీఏకి దరఖాస్తు చేసుకున్నాను. ఆలస్యంగానైనా ఎంబీఏ చదువుతున్నందుకు సంతోషించాను. కానీ ఆ సంతోషం ఎక్కువ కాలం నిలవలేదు. అసలా కోర్సును చదవగలనా? అనే అనుమానం మొదలైంది. సబ్జెక్టులన్నీ నాకు పూర్తిగా కొత్త. నేనేమో ఎమ్మెస్సీ బయాలజీ చదివాను. ఏళ్ల తరబడి ఆ విద్యనే బోధించాను. కానీ ఇప్పుడు కొత్తగా ఎకనామిక్స్, స్టాటిస్టిక్స్ నేర్చుకోవడం కష్టంగా అనిపించింది.

అదొక పెద్ద సవాలుగా మారింది. కానీ నాకు సవాళ్లంటే చాలా ఇష్టం" అని వివరిస్తున్న ఉష... కంప్యూటర్ వాడకాన్ని కూడా నేర్చుకున్నారు. అయితే ఆమెది ఊపిరి సలుపుకోని వృత్తి. అయినప్పటికీ సాయంత్రం ఆస్పత్రి నుంచి ఇంటికి రాగానే, ఆన్‌లైన్ తరగతులకు హాజరవుతూ, రాత్రి పొద్దుపోయే వరకూ చదువుకుంటూ సబ్జెక్టుల మీద పట్టు సాధించారు. పాఠాలు నేర్చుకోవడం కోసం తానెదుర్కొన్న ఇబ్బందులను గుర్తు చేసుకుంటూ...

"పాఠాలు నేర్చుకోడానికి నా వయసు, జ్ఞాపకశక్తి సహకరించలేదు. అందు కోసం నాలుగు రెట్లు ఎక్కువ కష్టపడవలసి వచ్చింది. అయినా ఆ కష్టాన్ని ఇష్టంగా స్వీకరించాను. కాబట్టే పరీక్షల్లో 80 శాతం మార్కులు సాధించగలిగాను. కానీ ప్రయత్నాన్ని విరమించుకోవాలనే ఆలోచన నాకెప్పుడూ రాలేదు. ఏదైనా చేయాలని నిర్ణయించుకున్న తర్వాత, వెనకడుగు వేసే అలవాటు నాకు లేదు. అనునిత్యం పోరాడి, అంతిమంగా విజయం సాధించడాన్నే నేను లక్ష్యంగా పెట్టుకుంటాను" అంటూ వివరించారు ఉష.



క్యాన్సర్‌పై రెండు సార్లు విజయం

పట్టుదలతో పోరాడడం ఆమెకు కొత్త కాదు. 2003లో యెమెన్‌లో పని చేసేటప్పుడు ఛాతీ క్యాన్సర్ బారిన పడ్డారామె. 8 నెలల పాటు కీమోథెరపీ, రేడియోథెరపీ తీసుకున్న తర్వాత పూర్తిగా కోలుకున్నారు. అయినప్పటికీ 2020లో ఆ వ్యాధి మళ్లీ తిరగబెట్టింది. అప్పుడు కూడా ఉష క్యాన్సర్‌తో ధైర్యంగా పోరాడి విజయం సాధించారు. ఆ చేదు అనుభవాన్ని గుర్తు చేసుకుంటూ..."సమస్య మీద విజయం సాధించిన తర్వాత, మనం మరింత దృఢంగా, అప్రమత్తంగా మారిపోతాం. నేనొక ఇనుప మహిళగా మారిపోయాను. ఆ వ్యాధి మీద విజయం సాధించాను కాబట్టి ఈ ప్రపంచంలో ఏ పోరాటంలోనైనా విజయం సాధించగలుగు తాననే నమ్మకం నాలో పెరిగింది" అంటున్న ఉష... తన విజయం వెనక కుటుంబసభ్యులు, సాటి ఉద్యోగుల అండదండలున్నాయని అంటున్నారు. "ఈ వయసులో నేను పోగొట్టుకునేదేమీ ఉండదు. ఎంబీఏ పూర్తి చేయలేకపోయినా నేనేమీ బాధపడను. కానీ ప్రయత్నం చేయకుండా ఉండిపోవడం మాత్రం నా నైజం కాదు' అని చెప్పారు. ఆసక్తి ఉన్న పనిని ఎంచుకోవాలనీ, మన దృష్టి మరల్చే అంశాలు అనేకం ఉన్నప్పటికీ, ఏకాగ్రతనే కీలకంగా మలచుకోవాలనీ, అప్పుడు ఎలాంటి విజయమైనా సాధ్యపడుతుందనీ నేటి యువతకు ఉష సందేశమిస్తున్నారు.



ఉన్న ఊరును కన్నతల్లిగా భావించారు. గ్రామ శ్రేయస్సే ధ్యేయంగా... ఎన్నో కార్యక్రమాలు చేపట్టారు. ఇటీవల 'సర్పంచ్ సంవాద్' పోటీల్లో జాతీయస్థాయిలో ప్రథమ బహుమతిని అందుకున్నారు. జనంతో మమేకమై, వారి సంక్షేమానికి పాటుపడుతున్న ఏలూరు జిల్లా చేబ్రోలు సర్పంచ్ రాంధే లక్ష్మీ సునీత ప్రయాణం గురించి ఆమె మాటల్లోనే...

గ్రామాభ్యున్నతే ఆశయంగా..

"మాది ఏలూరు జిల్లాలోని ఉంగుటూరు మండలం చేబ్రోలు గ్రామం. మా నాన్న వెంకట్రావు టైలర్, అమ్మ చెల్లమ్మ గృహిణి. ఇంటర్ చదువుతుండగానే నాకు వివాహం అయ్యింది. చదువుపై మక్కువతో... పెళ్లయిన 15 ఏళ్ల తర్వాత ఏఎన్‌యూలో దూరవిద్య ద్వారా బీఏ పూర్తి చేశాను. 2021 ఎన్నికల్లో బీసీ మహిళకు మా గ్రామ సర్పంచ్ పదవి రిజర్వ్ అయ్యింది. ఎన్నికల్లో 900 ఓట్ల మెజార్టీతో మాజీ సర్పంచ్ భార్యను ఓడించాను. నా భర్త రాజారావు గతంలో రెండుసార్లు సర్పంచ్‌గా, ఒకసారి ఎంపీటీసీగా పనిచేశారు. ఎప్పుడూ ఆయన పాలన వ్యవహారాల గురించి నేను పట్టించుకోలేదు. సర్పంచ్ అయ్యాక... కన్నతల్లిలాంటి మా ఊరును ఉన్నతంగా తీర్చిదిద్దాలనుకున్నాను. సమస్యల పరిష్కారంపై దృష్టి నిలిపాను. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, డంపింగ్‌యార్డు నిర్వహణ, పారిశుధ్య పనులు... ఇలా ప్రతిదాన్ని నేనే స్వయంగా పర్యవేక్షిస్తున్నాను.

ప్లాస్టిక్‌పై సమరం...

పదవిని స్వీకరించిన తొలి ఏడాది ప్లాస్టిక్ వినియోగంతో కలిగే అనర్థాలపై ప్రచారం చేశాను. సామర్లకోటలో ఈ అంశంపై ఇచ్చిన శిక్షణ కార్యక్రమాలకు హాజరై, సంబంధిత అంశాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాను. అది గ్రామస్తుల్లో మరింత చైతన్యం నింపింది. దాంతో మా ఊరిని జిల్లాస్థాయి శిక్షణ కేంద్రంగా ఎంపిక చేశారు. జిల్లావ్యాప్తంగా చేపట్టే అవగాహన కార్యక్రమాలకు ఇప్పటికీ ఇక్కడినుంచే శ్రీకారం చుడుతున్నారు. ప్రతిరోజూ ఐదు టన్నుల చెత్తను డంప్‌యార్డుకు తరలించి, అక్కడికక్కడే జీరో వేస్టేజ్‌గా మారుస్తున్నాం. ప్రధానంగా బయోడిగ్రేడబుల్ (సీసాలు, ఇనుము) వస్తువులను పాత సామాన్ల వారికి విక్రయిస్తున్నాం. తడి చెత్తను సేంద్రియ ఎరువుకు, పొడి చెత్తను కంపోస్టుకు వినియోగిస్తున్నాం. గ్రామంలోని పూలమొక్కలు, పంట అవసరాలకు ఆ వ్యర్థాల్లో చాలావరకూ వినియోగించేలా చర్యలు చేపట్టాను.

చేయాల్సింది ఎంతో ఉంది...

'సర్పంచ్ సంవాద్ పురస్కారంతో నేను తృప్తి చెందను. ఇంకా చేయాల్సింది చాలా ఉంది. మా గ్రామానికి రూ.60 లక్షల ఆదాయం వస్తోంది. వివిధ ప్రాంతాల్లో మరిన్ని సీసీ డ్రెయిన్ల ఏర్పాటు, ఇతర పనులు చేయాల్సి ఉంది. ఉత్తమ పంచాయతీగా ఎంపికైన మా గ్రామాన్ని కలెక్టర్ వెట్రిసెల్వి దత్తత తీసుకున్నారు. ఉర్దూ స్కూల్ కాంపౌండ్ వాల్‌కు రూ.4 లక్షలు కేటాయించారు. పిల్లలకు ప్రత్యేకంగా ఒక పార్కు, మరికొన్ని రోడ్ల నిర్మాణం నా పదవీకాలంలోగా పూర్తి చేసేందుకు ప్రయత్నం చేస్తాను.

ప్రత్యేకంగా మహిళా దినోత్సవాలు...

గ్రామంలోని మహిళలను ప్రోత్సహించడం కోసం ప్రతి మహిళా దినోత్సవాన్ని ఒక్కో థీమ్‌తో నిర్వహించడం ప్రారంభించాను. 2021లో వర్కింగ్ ఉమెన్స్, టీచర్లు, ఇతర మహిళల సాధక బాధలను తెలుసుకునేందుకు భారీ సమావేశం ఏర్పాటు చేశాను. అక్కడ బృంద చర్చల ద్వారా వారిలో చైతన్యం కలగడానికి దోహదం చేశాను. 2022లో కిశోర బాలికల ఆరోగ్య సంరక్షణ, నేప్‌కిన్స్ వాడకం తదితర అంశాలపై కార్యక్రమాలు నిర్వహించాను. 2023లో... భర్త మరణించిన తర్వాత కుటుంబాలను నడుపుతున్న ఒంటరి మహిళలను సత్కరించాను. అలాగే 2024లో డ్వాక్రా రుణాలను, బ్యాంకు లింకేజి రుణాలను సకాలంలో కట్టిన వారిని సన్మానించి, అందరూ ఆ దిశగా సాగేలా ప్రేరణ కలిగించాను. ఈ ఏడాది 'ఇల్లాలి ఆరోగ్యం- ఇంటి రక్షణ' అనే థీమ్‌తో... వైద్యుల ద్వారా వివిధ సమస్యలపై అవగాహన కల్పించడంతోపాటు చికిత్సలు కూడా చేయించాను. ఆ తరువాతే ప్రభుత్వం 'స్వశక్తి- నారీ సశక్తి అభియాన్'ను చేపట్టింది.

తొలి ప్రయత్నంలోనే పురస్కారం..

'భారత నాణ్యతా మండలి' (క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా), 'జల్ జీవన్' మంత్రిత్వశాఖ ఆరు నెలలు క్రితం 'సర్పంచ్ సంవాద్' పేరిట ఒక యాప్‌ను రూపొందించి, దేశవ్యాప్తంగా ఉన్న లక్షమంది సర్పంచులను అందులో చేర్చాయి. ప్రతినెలా ఒక థీమ్‌తో, ఆన్‌లైన్ విధానంలో సర్పంచ్‌లకు పోటీలు నిర్వహించి ప్రోత్సహిస్తున్నాయి. ఈ ఏడాది జూలై నెలలో పోటీలకు ఎంట్రీలను ఆహ్వానించారు. గ్రామంలో చేపట్టిన మెరుగైన పాలన, గ్రామాభివృద్ధి, సమన్వయం, సాంకేతికత, సమాచార మార్పిడి... అందులో ప్రధానాంశాలు. దీనికోసం నేను 80 సెకన్ల వీడియోను పంపాను. ఆ తరువాత నన్ను ఢిల్లీకి ఆహ్వానించారు. సెప్టెంబర్ 15న నిర్వహించిన జాతీయ సదస్సులో 15 మంది సర్పంచ్‌లకు డిబేట్ నిర్వహించారు. నేను నా వీడియో క్లిప్పింగ్స్‌ను ప్రదర్శిస్తూ, తెలుగులోనే వివరించాను. అందులో మహిళా సాధికారిత, డంప్‌యార్డులోనే సేకరించిన చెత్తను జీరో చేయడం, బాల్య వివాహాలను అరికట్టడం తదితర అంశాలపై ప్రస్తావించాను. నేను చెప్పిన అంశాలను ఒక ట్రాన్స్‌లేటర్ హిందీలోకి అనువదించారు. నా క్లిపింగ్స్ మొదటి బహుమతి సాధించాయి. నగదు పురస్కారంగా



రూ. 35 వేలు లభించింది. అనంతపురం జిల్లా పి నారాయణపురం సర్పంచ్ కె హనుమంతరావు, గుజరాత్‌లోని ఉమ్రా సర్పంచ్ హెచ్. ధర్మేంద్రభాయ్‌లు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. కాగా... ఈ ఏడాది ఆగస్టు 15న ఉత్తమ సర్పంచ్‌గా పురస్కారం పొందాను. ఇటీవల 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'లో ఉత్తమ పంచాయతీగా మా గ్రామానికి కలెక్టర్ వెట్రిసెల్వి ప్రశంసాపత్రాలను అందజేశారు. ఇవన్నీ పంచాయతీ ఈవోలు, పారిశుధ్య సిబ్బంది సహకారం వల్లనే సాధ్యమయింది."

• ఈశ్వర్ నెట్టెం

పిల్లలను ఇలా పెంచాలి..!

తల్లిదండ్రుల పెంపకం మీదనే పిల్లల భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. అందుకే చిన్నప్పటి నుంచీ పిల్లలకు క్రమశిక్షణ, మంచి అలవాట్లు నేర్పించాలి. పిల్లలను పెంచడంలో తల్లిదండ్రులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందాం...

- పిల్లలతో స్నేహపూర్వకంగా మెలగాలి. వాళ్లమీద కోపంతో అరవకూడదు. పిల్లలకు తప్పు, ఒప్పులను వివరించి చెబుతూ జాగ్రత్తగా వ్యవహరించాలి. ఇంట్లో ఎప్పుడూ సంతోషకరమైన వాతావరణం ఉండేలా చూసుకోవాలి.
- పిల్లలను ఇతరులతో పోల్చకూడదు. వారి అభిరుచులను గుర్తించి తగిన ప్రోత్సాహం అందించాలి.



- చెప్పిన పనులు చేయకుండా ఒక్కోసారి పిల్లలు మొండికేస్తూ ఉంటారు. అలాంటి సమయాల్లో పిల్లలను దగ్గర కూర్చోపెట్టుకుని బుజ్జగింపు ధోరణిలో పనులు చెప్పి చేయించాలి. ఆ పనులు పూర్తిచేసిన తరవాత కృతజ్ఞతా పూర్వకంగా మాట్లాడితే పిల్లలు సంబరపడతారు. మరోసారి చెప్పిన వెంటనే పనులు చేసేస్తారు కూడా!
- పిల్లలకు రోజూ పోషకాహారం తినిపించాలి. సమయానుసారం నిద్రించేలా చూడాలి. వ్యాయామం, సైకిల్ తొక్కడం, ఈత లాంటివి అలవాటు చేయాలి.
- తోటివారితో స్నేహంగా ఉండడం, అవసరమైతే సహాయ సహకారాలు అందించడం లాంటివాటిని పిల్లలకు నేర్పించాలి. కష్టపడడం, నాయకత్వ లక్షణాలు, సమష్టి కృషి ఆవశ్యకతలను వివరించాలి.
- మన సొంత అభిరుచులు, ఆశయాలను పిల్లలమీద రుద్దకూడదు. దీనివల్ల పిల్లల్లో ఒత్తిడి పెరిగి వారి సృజనాత్మక శక్తి దెబ్బతింటుంది. పిల్లల అభిప్రాయాలను అడిగి తెలుసుకోవాలి. వాళ్లకు ఇష్టమైన రంగంలో ఎదిగేలా తోడ్పాటును అందించాలి.

జీన్స్ కొత్తగా...

మనం సాధారణంగా నీలం, నలుపు లాంటి ముదురు రంగుల జీన్స్‌ను ఎక్కువగా ధరిస్తూ ఉంటాం. వీటిని ఉతికేటప్పుడు చేసే కొన్ని పొరబాట్ల వల్ల అవి త్వరగా రంగులు వెలిసిపోతుంటాయి. అలాకాకుండా జీన్స్ చాలాకాలంపాటు కొత్తగా కనిపించాలంటే ఏ జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందాం...




- జీన్స్‌ను మొదటిసారి ఉతికేటప్పుడు సబ్బు, ఇతర డిటర్జెంట్లు ఉపయోగించకూడదు. మామూలు నీళ్లలో ముంచి ఆరేయడం మంచిది. మరీ మురికిగా అనిపిస్తే ఉప్పు, వెనిగర్ కలిపిన నీళ్లలో కొద్దిసేపు ఉంచి తీస్తే సరిపోతుంది.
- జీన్స్‌ను లోపలికి తిప్పి ఉతకడం వల్ల వాటి రంగు ఎక్కువకాలం నిలిచి ఉంటుంది. అరగంటకు మించి నీళ్లలో నానబెట్టకూడదు. వాషింగ్ మెషిన్‌లో వేయకూడదు. జీన్స్‌ను వేడినీళ్లతో ఉతకకూడదు.
- త్వరగా ఆరాలంటూ జీన్స్‌ను ఎండలో ఆరేయకూడదు. నీడలో గాలి తగిలేలా మాత్రమే ఆరేయాలి.
- వర్షాకాలంలో తరచూ జీన్స్ మీద బురద మరకలు పడుతుంటాయి. అలాంటప్పుడు జీన్స్‌ను వెంటనే ఉతకడానికి వేయకుండా గాలి తగిలేలా ఆరేయాలి. బురద మరకలు బాగా ఎండిన తరువాత వాటి మీద కొద్దిగా బేకింగ్ సోడా చల్లి పాత టూత్‌బ్రష్‌తో గట్టిగా రుద్దితే బురద పూర్తిగా రాలిపోతుంది. తరువాత జీన్స్‌ను లిక్విడ్ డిటర్జెంట్ కలిపిన నీళ్లలో అయిదు నిమిషాలు నానబెట్టి చేత్తో ఉతికితే సరిపోతుంది.
- జీన్స్ మీద నూనె లేదా గ్రీజ్ మరకలు పడితే వాటి మీద కొద్దిగా ఉప్పు చల్లి పది నిమిషాల తరువాత దూదితో రుద్దాలి. ఆపైన తేలికపాటి షాంపూ కలిపిన నీళ్లతో ఉతికితే మరకలు పూర్తిగా పోతాయి.

అందాన్ని పెంచే ఫేస్‌ప్యాక్‌లు

ముఖం అందంగా కనిపించాలని అమ్మాయిలు రకరకాల ప్రయత్నాలు చేస్తుంటారు. ఖరీదైన క్రీమ్‌లు, సీరమ్‌లు ఉపయోగిస్తూ ఉంటారు. అలాకాకుండా అందుబాటులో ఉండే పండ్లతో ఫేస్‌ప్యాక్‌లు తయారుచేసుకుని వాడితే ముఖం మరింత అందంగా మారుతుంది. ఆ వివరాలు...

- ఒక గిన్నెలో నాలుగు చెంచాల ద్రాక్షరసం, అరచెంచా బాదం పొడి, రెండు చెంచాల పాలు, అరచెంచా తేనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి అరగంటసేపు ఆరనివ్వాలి. ఆపైన గోరువెచ్చని నీళ్లతో శుభ్రం చేసుకుంటే ముఖం మృదువుగా మెరుస్తుంది.
- ఒక యాపిల్‌ను తీసుకుని ముక్కలుగా కోసి మిక్సీలో వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. అందులో అరచెంచా తేనె కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి పావు గంట తరువాత మంచినీళ్లతో శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తూ ఉంటే చర్మం మీద పేరుకున్న మృతకణాలు తొలగిపోతాయి. చర్మ రంధ్రాలు శుభ్రమవుతాయి. ముఖం ఆకర్షణీయంగా కనిపిస్తుంది. యాపిల్‌కు బదులు అరటిపండు లేదా అవకాడోను కూడా వాడుకోవచ్చు.
- గుప్పెడు దానిమ్మ గింజలను మిక్సీలో వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. అందులో రెండు చెంచాల పెరుగువేసి



బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి పావుగంట తరువాత మంచినీళ్లతో కడిగేసుకుంటే మంచి ఫలితం కనిపిస్తుంది.

- ఒక గిన్నెలో పావు కప్పు నారింజ రసం, ఒక చెంచా పసుపు, ఒక చెంచా తేనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి, మెడకి పట్టించి ఆరనివ్వాలి. తరువాత గోరువెచ్చని నీళ్లతో కడిగేసుకుంటే చర్మం తేమతో నిండి ముఖం నిగారిస్తుంది.
- చిన్న గిన్నెలో అరకప్పు బొప్పాయి గుజ్జు, కోడిగుడ్డు తెల్లసొన వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి పావుగంటసేపు ఆరనివ్వాలి. తరువాత గోరువెచ్చని నీటితో కడిగేసుకుంటే ముఖం మీద నల్ల మచ్చలు, మొటిమలు తగ్గిపోతాయి. చర్మం బిగుతుగా మారుతుంది.

యూఏఈలో తెలుగోడికి
రూ.240 కోట్ల లాటరీ



(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యేకం. మా అమ్మ పుట్టినరోజునే ఆ నంబరుగా ఎంచుకున్నాను" అంటూ లాటరీ సంస్థ తనకు చెక్కు అందజేసిన సందర్భంగా అనిల్ తన విజయం వెనుక ఉన్న రహస్యాన్ని చెప్పారు. "జాక్‌పాట్ గెలిచారంటూ కాల్ వచ్చినప్పుడు వెంటనే నమ్మలేకపోయాను. ఈ రోజుకూ ఇది నిజమా కాదా అనిపిస్తోంది" అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ బహుమతి మొత్తాన్ని ఎలా ఖర్చు చేయబోతున్నారని అడగ్గా, అనిల్ కొన్ని ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. "ఈ డబ్బును సరైన పద్ధతిలో పెట్టుబడిగా పెట్టాలనుకుంటున్నా. ఒక సూపర్ కారు కొని అందులో జాలీగా తిరగాలనే కోరిక ఉంది. ఇప్పుడు ఆ కోరిక తీర్చుకుంటా. ఓ పెద్ద స్టార్ హోటల్‌లో పార్టీ చేసుకోవాలనుంది. అన్నిటి కన్నా ముఖ్యంగా, నా కుటుంబాన్ని యూఏఈకి తీసుకువచ్చి, వారితో కలిసి జీవితాంతం ఇక్కడే ఆనందంగా గడపాలనుకుంటున్నా. అమ్మానాన్నలకు ఏవైనా కోరికలుంటే వాటిని నెరవేరుస్తా. అలాగే ఈ డబ్బులో కొంత భాగాన్ని చారిటీలకు విరాళమిస్తా" అని అనిల్ తన దాతృత్వాన్ని చాటుకున్నారు. అనిల్‌కుమార్‌తో పాటు మరో 10 మంది కూడా 10 వేల దిర్హామ్ (రూ.24 లక్షలు) చొప్పున గెలుచుకోవడం విశేషం.

గెలిచిన మొత్తంలో ఎంత పన్ను చెల్లించాలి?

యూఏఈలో లాటరీ బహుమతిపై ఎలాంటి ఆదాయపు పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. దీంతో అనిల్ ఎటువంటి పన్ను కట్టకుండానే మొత్తం రూ.240 కోట్లను అందుకుంటారు. అదే భారత్‌లో అయితే లాటరీ బహుమతులపై 30% వరకు ఫ్లాట్ పన్ను విధిస్తారు. ఆపై పన్ను మొత్తంపై 15% సర్‌చార్జ్ (రూ.1 కోటి కంటే ఎక్కువ గెలిస్తే) దీంతో పాటు మొత్తంపై 4% ఆరోగ్యం, విద్య సెస్‌ను విధిస్తారు. అంటే మన దగ్గర ఎవరైనా రూ.240 కోట్లు గెలిస్తే, వారు మొత్తం పన్నుల రూపంలో రూ. 86 కోట్లకు పైగా ప్రభుత్వానికి చెల్లించాల్సి వచ్చేది. అన్ని తగ్గింపుల తర్వాత సుమారు రూ. 154 కోట్లు మాత్రమే బహుమతిదారుకు లభిస్తుంది.

భారత సైనిక స్థావరాలపై పాక్ కాల్పులు

- ఆపరేషన్ సిందూర్ తర్వాత ఇదే ప్రథమం

న్యూఢిల్లీ, అక్టోబర్ 28: జమ్మూకశ్మీర్‌లోని నియంత్రణ రేఖ వెంబడి పాకిస్థాన్ కాల్పులు జరిపింది. ఈ విషయాన్ని విశ్వసనీయ వర్గాలు ధ్రువీకరించాయి. అక్టోబర్ 26-27 తేదీల మధ్య అర్ధరాత్రి.. ఎల్‌వోసీ వెంబడి వ్యూహాత్మక ప్రాంతమైన లీపా లోయలో భారత సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని, పాక్ సైన్యం కాల్పులు జరిపినట్లు పేర్కొన్నాయి. అప్రమత్తమైన భారత సైన్యం దీటుగా బదులిచ్చిందని సైనిక వర్గాలు తెలిపాయి. మే 10 ఆపరేషన్ సిందూర్ తర్వాత పాకిస్థాన్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించడం ఇదే తొలిసారి. గత ఆగస్టులో జమ్మూకశ్మీర్‌లోని పూంఛ్ ప్రాంతంలో పాకిస్థాన్ కాల్పులకు పాల్పడిదంటూ వచ్చిన కథనాలను భారత సైన్యం ఖండించింది.

గాజాకు 20,000 మంది పాక్ సైనికులు!

న్యూఢిల్లీ, అక్టోబరు 28: పాకిస్థాన్ తమ దేశానికి చెందిన 20,000 మంది సైనికులను గాజాకు పంపేందుకు సిద్ధమవుతోంది. ఈ సైనికులంతా ఐఎస్ఎఫ్(ఇంటర్నేషనల్ స్టేబిలైజేషన్ ఫోర్స్)లో పని చేయనున్నారు. ఇందుకు సంబంధించి అమెరికా సీఐఏ, ఇజ్రాయెల్ మొసాద్‌కు చెందిన ఉన్నతాధికారులతో పాక్ ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్ రహస్య చర్చలు కూడా జరిపారని అంతర్జాతీయ మీడియా పేర్కొంది. ట్రంప్ నేతృత్వంలో ఇజ్రాయెల్-హమాస్ మధ్య జరిగిన శాంతి ఒప్పందంలో భాగంగా ఐఎస్ఎఫ్‌కు పలుదేశాలు తమ బలగాలను పంపుతున్నాయి. నిజానికి, ఇజ్రాయెల్‌ను పాక్ ఇప్పటిదాకా గుర్తించలేదు. కానీ, అమెరికా తమకు ఇచ్చిన పలు హామీల అమలు కోసం పాక్ తన సైన్యాన్ని గాజాకు పంపడానికి సిద్ధమైంది.

మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ

ఇద్దరు అగ్రనేతలు పోలీసుల ఎదుట లొంగుబాటు.. జనజీవన స్రవంతిలోకి పుల్లూరి ప్రసాదరావు, బండి ప్రకాశ్



పుల్లూరి ప్రసాదరావు, బండిప్రకాశ్

హైదరాబాద్/పెద్దపల్లి/మంచిర్యాల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీలో లొంగుబాట్ల పరంపర కొనసాగుతోంది. మంగళవారం మరో ఇద్దరు అగ్రనేతలు పోలీసుల ఎదుట లొంగిపోయారు. కేంద్ర కమిటీ సభ్యుడు పుల్లూరి ప్రసాదరావు అలియాస్ శంకరన్న అలియాస్ చంద్రన్న, రాష్ట్ర కమిటీ సభ్యుడు బండి ప్రకాశ్ అలియాస్ ప్రభాత్ అలియాస్ బండి దాదా తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి సమక్షంలో లొంగిపోయి జనజీవన స్రవంతిలోకి వచ్చారు. మావోయిస్టులు ఆయుధాలను వీడి జనజీవన స్రవంతిలో కలవాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు వీరిద్దరు లొంగిపోయారని డీజీపీ తెలిపారు. పుల్లూరి ప్రసాదరావు పేరిట రూ.25 లక్షల రివార్డు, బండి ప్రకాష్ పేరిట రూ.20 లక్షల రివార్డు ఉండగా.. ఆ మొత్తానికి సంబంధించిన డీడీలను వారికి డీజీపీ అందజేశారు. తెలంగాణలో ఈ ఏడాది ఇప్పటివరకు 427 మంది మావోయిస్టులు లొంగిపోయారని శివధర్‌రెడ్డి వెల్లడించారు. తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయిన వారిలో ఇద్దరు కేంద్ర కమిటీ సభ్యులు, ఎనిమిది మంది రాష్ట్ర కమిటీ సభ్యులు, ఇద్దరు డివిజనల్ కమిటీ కార్యదర్శులు, 8 మంది డివిజనల్ కమిటీ సభ్యులు, 35 మంది ఏరియా కమిటీ సభ్యులు ఉన్నారని తెలిపారు. ఇంకా మావోయిస్టు పార్టీలో తెలంగాణకు చెందిన 64 మంది వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. కేంద్ర కమిటీ సభ్యులుగా ఐదుగురు, రాష్ట్ర కమిటీ సభ్యులుగా 10 మంది, డివిజనల్, ఏరియా కమిటీల్లో 34 మంది, దళ సభ్యులుగా మరో 10 మంది ఉన్నారని వెల్లడించారు. కేంద్ర కమిటీలో ఇంకా మిగిలిన 9 మందిలో తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ, ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి, పాక హన్మంతు అలియాస్ ఉకే గణేష్, మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్, నరహరి అలియాస్ విశ్వనాథ్ మాత్రమే తెలంగాణకు చెందినవారని తెలిపారు.

ఆర్ఎస్‌యూ నుంచి అజ్ఞాతంలోకి..

45 ఏళ్లపాటు మావోయిస్టు పార్టీలో కొనసాగిన పుల్లూరి ప్రసాదరావు అలియాస్ చంద్రన్న స్వస్థలం పెద్దపల్లి జిల్లా వడ్కాపూర్ గ్రామం. ప్రభుత్వ ఉపాధ్యాయుడు పుల్లూరి శ్రీనివాసరావు, వరలక్ష్మి దంపతులకు రెండో సంతానంగా 1961లో ప్రసాదరావు జన్మించారు. 1979లో పెద్దపల్లి జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ చదువుతున్న సమయంలో ప్రసాదరావుకు రాడికల్ స్టూడెంట్ యూనియన్(ఆర్ఎస్‌యూ)తో పరిచయాలు ఏర్పడ్డాయని, అప్పటి ఆర్ఎస్‌యూ ఆర్గనైజర్ దగ్గు రాజలింగుతో కలిసి అందులో చేరి పనిచేయడం ప్రారంభించారని డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. అదే క్రమంలో నాటి పీపుల్స్‌వార్ సీనియర్ నేత కిషన్‌జీకి కొరియర్‌గా పనిచేశారని వెల్లడించారు. హైదరాబాద్, కరీంనగర్ ప్రాంతాల్లో పనిచేస్తున్న నాటి పీపుల్స్‌వార్‌లోని కొండపల్లి సీతారామయ్య వర్గానికి చెందిన నాయకులకు సమాచారాన్ని అందించడంలో ప్రసాదరావు కీలకపాత్ర పోషించారని పేర్కొన్నారు. 1981లో పీపుల్స్‌వార్ కేఎస్ గ్రూపు ఇతర రాష్ట్రాల్లోని మార్క్సిస్టు, లెనినిస్టు వర్గాలతో విలీనమై.. సీపీఐ(ఎంఎల్-పీపుల్స్‌వార్)గా ఏర్పడిందని, అప్పటినుంచి సిర్పూర్, చెన్నూరు దళాల్లో పనిచేసిన చంద్రన్న 1995లో రాష్ట్ర కమిటీ సభ్యుడయ్యారని పేర్కొన్నారు. పార్టీకి చెందిన ఫ్రంటల్ ఆర్గనైజేషన్లను సమన్వయం చేసుకుంటూ, నార్త్ తెలంగాణ స్పెషల్ జోనల్ కమిటీ, ఆ తర్వాత తెలంగాణ రాష్ట్ర కమిటీగా మారిన పార్టీలో కేంద్ర కమిటీ సభ్యుడిగా కార్యకలాపాలు నిర్వహించారని శివధర్‌రెడ్డి వివరించారు. అనారోగ్యం, పార్టీలో సిద్ధాంతపరమైన విభేదాలు ఆయన జనజీవన స్రవంతిలోకి రావడానికి కారణమయ్యాయని తెలిపారు.

సికాస ద్వారా బండి ప్రకాష్..

లొంగిపోయిన మరో మావోయిస్టు నేత బండి ప్రకాశ్ స్వస్థలం మంచిర్యాల జిల్లా మందమర్రి. సింగరేణి కార్మికుడు బండి రామారావు, అమృతమ్మ దంపతులకు రెండో సంతానం. 1982-84 మధ్య ఆర్ఎస్‌యూలో పనిచేస్తూ సింగరేణి కార్మిక సమాఖ్య (సికాస) ఆవిర్భావం తరువాత మావోయిస్టు పార్టీలో చేరారు. తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రెస్‌టీం ఇన్‌చార్జిగా, సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ బాధ్యుడిగా మావోయిస్టు పార్టీలో పలు కీలక బాధ్యతలు నిర్వహించిన బండి ప్రకాష్ 1984లో పుల్లూరి ప్రసాదరావు ద్వారా సిర్పూర్ సాయుధ దళంలో చేరారని డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. ఆ తర్వాత కొన్నాళ్లకే ఇంటికి చేరుకున్నారని, 1984లో ఏఐటీయూసీ నాయకుడు వీటీ అబ్రహంను హత్య చేసిన ముఠాలో ఉన్నారని, అప్పటినుంచి మళ్లీ పార్టీలోకి వెళ్లి దీర్ఘకాలం పనిచేశారని వెల్లడించారు. పార్టీలోని అంతర్గత విభేదాలు, అనారోగ్యం ఆయన లొంగుబాటుకు కారణమని తెలిపారు. కాగా, లొంగిపోయే మావోయిస్టులకు పూర్తి భద్రత కల్పిస్తామని, ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని డీజీపీ స్పష్టం చేశారు. లొంగిపోయిన వారిని ఏ విధంగా కాపాడుకోవాలో తమకు తెలుసునన్నారు. ఈ కార్యక్రమంలో శాంతి భద్రతల విభాగం అదనపు డీజీపీ మహేష్ భగవత్, ఇంటెలిజెన్స్ చీఫ్ విజయ్‌కుమార్, ఎస్ఐబీ చీఫ్ సుమతి పాల్గొన్నారు.

లొంగుబాటు తప్పంటూనే..!

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

మావోయిస్టు అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ సోనూ లొంగుబాటును తీవ్రంగా తప్పుబట్టి, ఆయుధం వదిలేదే లేదంటూ ప్రకటనలు చేసిన మావోయిస్టుల్లో పుల్లూరి ప్రసాద్‌రావు అలియాస్ చంద్రన్న కూడా ఒకరు. మల్లోజుల లొంగుబాటు సమయంలో పార్టీ క్యాడర్‌కు 23 పేజీల లేఖ రాశారు. సాయుధ పోరాట విరమణపై అందరి అభిప్రాయాలు కోరారు. దానికి స్పందనగా తెలంగాణ పార్టీ అధికార ప్రతినిధి జగన్ పేరిట పుల్లూరి ప్రసాదరావు ఓ ప్రకటన విడుదల చేశారు. సోనూ ఉద్యమ ద్రోహి అంటూ మండిపడ్డారు. లొంగిపోవాలనుకునేవారు పార్టీకి ఆయుధాలు అప్పగించాలని ఆదేశించారు. కానీ ఇప్పుడు పుల్లూరి ప్రసాదరావుతోపాటు బండిప్రకాశ్ కూడా లొంగిపోవడం చర్చనీయాంశంగా మారింది. అయితే తమకన్నా ముందే వీరిద్దరూ తెలంగాణ ప్రభుత్వ పెద్దలతో టచ్‌లో ఉన్నారని మల్లోజుల వర్గానికి చెందినవారు పేర్కొంటుండటం గమనార్హం.

ప్రజాక్షేత్రంలో పనిచేయడానికే వచ్చాం

తమది లొంగుబాటు కాదని పుల్లూరి ప్రసాదరావు అన్నారు. మారిన పరిస్థితుల నేపథ్యంలో ప్రజాక్షేత్రంలో ప్రజల పక్షాన పోరాటం చేయడానికి వచ్చామని తెలిపారు. ఆయన 'లాల్ సలామ్' అంటూ నినదించి మీడియాతో మాట్లాడారు. 45 ఏళ్లు జనం కోసం పనిచేసిన తాము ఇకపై జనంలోనే ఉండి పోరాటం చేస్తామన్నారు. అనారోగ్య సమస్యలతో తాము బయటకు వచ్చామని పేర్కొన్నారు. మావోయిస్టు పార్టీ భావజాలాన్ని ఓడించడం ఎవరి తరమూ కాదని, ప్రస్తుత పరిస్థితుల్లో నష్టాలు జరిగే అవకాశం ఉందని అన్నారు. తమ సిద్ధాంతం ఓడిపోలేదని, మళ్లీ జనంలో పుట్టుకొస్తుందని వ్యాఖ్యానించారు. పార్టీలో అంతర్గత చీలిక వచ్చిందని, ఆయుధాలతో లొంగిపోవాలని కొందరు, ఆయుధాలు వదిలి బయటకు వెళదామని మరికొందరు అనుకున్నారని చెప్పారు. ఇందులో తమ పార్టీ కార్యదర్శి తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ పక్షానే తాము ఉంటామని, ఆయనకే తమ మద్దతు ఉంటుందని తెలిపారు. ఇటీవల ఆయుధాలతో లొంగిపోయిన మల్లోజుల వేణుగోపాల్ విధానాలకు తాము వ్యతిరేకమన్నారు. మరికొన్ని రోజుల్లో తాము మీడియా సమావేశం ఏర్పాటు చేసి మావోయిస్టు పార్టీలో జరిగిన అంతర్మథనాన్ని ప్రజలకు వివరిస్తామని అన్నారు.

ఢిల్లీ యువతి అల్లిన
యాసిడ్ దాడి కథ!

- ఓ వ్యక్తి, మరో ఇద్దరు యువకులను ఇరికించేందుకు ప్రణాళిక
- ముగ్గురిలో ఒకరి భార్యపై యువతి తండ్రి లైంగిక వేధింపులు.. యువతి తండ్రి అరెస్టు



చేతికి కట్టుతో యువతి

న్యూఢిల్లీ, అక్టోబరు 28: "ఆదివారం అయినా అదనపు తరగతులు ఉండటంతో కాలేజీకి వెళుతున్నాను. రోడ్డు మీద వెళుతున్న నాపై ద్విచక్రవాహనం మీద వచ్చిన ఓ ముగ్గురు యాసిడ్ మాదిరి ద్రావణాన్ని పోశారు. ముఖానికి చేతులు అడ్డుపెట్టుకోవడంతో ఆ ద్రావణం చేతుల మీద పడి గాయాలయ్యాయి".. ఇదీ.. ఢిల్లీలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్న ఓ 19 ఏళ్ల యువతి పోలీసులకు చేసిన ఫిర్యాదు! జితేంద్ర అనే వ్యక్తి తనను కొన్నాళ్లుగా వెంబడిస్తున్నాడని.. ఆ రోజు ఆ వ్యక్తే ద్విచక్రవాహనాన్ని నడుపుతుండగా.. ఇషాన్, అర్మాన్ అనే ఇద్దరు అన్నదమ్ములు వెనుక కూర్చున్నారని.. ఇషాన్, అర్మాన్‌కు ఓ బాటిల్ ఇవ్వగా అతడు అందులోని ద్రావణాన్ని తనపై చల్లాడని ఘటనను పూసగుచ్చినట్లు వివరించింది. యువతి రెండు చేతులకు కాలిన గాయాలయ్యాయి. టీవీ చానళ్లలో ప్రసారం కావడంతో ఈ వార్త తీవ్రకలకలం సృష్టించింది. నిందితుల ఆట కట్టించాలని రంగంలోకి దిగిన పోలీసులకు విచారణలో నోరెళ్లబెట్టేలా చేసే పరిణామాలు తెలిశాయి. యాసిడ్ దాడి అంటూ యువతి చెబుతున్నదంతా కట్టుకథ అని పోలీసులు తేల్చారు.


బయటపడ్డ యువతి తండ్రి లీలలు

ఎవరైతే ముగ్గురిపై ఆమె ఆరోపణలు చేసిందో వారిలో జితేంద్ర అనే వ్యక్తి భార్యను యువతి తండ్రి అఖిల్ ఖాన్ లైంగిక వేధింపులకు గురిచేసినట్లు ఆరోపణలు వ్యక్తమయ్యాయి. దీనిపై ఓ రెండ్రోజుల ముందే జితేంద్ర భార్య పోలీసులకు అఖిల్ ఖాన్‌కు వ్యతిరేకంగా ఫిర్యాదు చేసింది. తాను 2021-24 మధ్య అఖిల్‌ఖాన్ ఫ్యాక్టరీలో పని చేశానని.. అక్కడ ఓసారి అతడు తనపై దాడి చేసి, అభ్యంతరకర రీతిలో ఫొటోలు, వీడియోలు తీశాడని.. బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొంది. మరి.. ఇషాన్, అర్మాన్‌లపై ఆ యువతి ఎందుకు ఫిర్యాదు చేసినట్లు? అంటే.. తమ తల్లిపైనా అఖిల్ ఖాన్ వేధింపులకు పాల్పడ్డారంటూ ఇషాన్, అర్మాన్ కేసు పెట్టారు. ప్రతీకారం తీర్చుకునేందుకే జితేంద్ర, ఇషాన్, అర్మాన్‌పై అఖిల్ ఖాన్ కూతురైన యువతి ఇలా ఫేక్ స్టోరీ అల్లిందని విచారణలో పోలీసులు తేల్చారు. అఖిల్‌ఖాన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. విచారణలో అతడు నేరాన్ని అంగీకరించాడు. తన కూతురు చేతులపై పడింది యాసిడ్ కాదని.. టాయిలెట్ క్లీనర్ ద్రావణం అని, దాన్ని ఆమే తనకు తానుగా చల్లుకుందని చెప్పాడు. తనపై యాసిడ్ దాడి జరిగినట్లుగా యువతి చెబుతున్న ప్రాంతంలో సీసీటీవీ ఫుటేజీని పోలీసులు పరిశీలించగా అందులో దాడి జరిగినట్లుగా కనిపించలేదు. దాడి జరిగిన రోజు.. జితేంద్ర మరోచోట ఉన్నాడని.. ఇషాన్, అర్మాన్ అసలు ఢిల్లీలోనే లేరని తేలింది.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

కొత్త తేదీన ఆర్యన్



విష్ణు విశాల్ కథానాయకుడిగా నటించిన 'ఆర్యన్' చిత్రం విడుదల కొత్త తేదీకి మారింది. ముందు ప్రకటించిన విధంగా ఈ నెల 31న ఈ చిత్రం విడుదలవ్వడం లేదు. ఒక వారం ఆలస్యంగా నవంబర్ 7న 'ఆర్యన్' చిత్రాన్ని విడుదల చేయాలని నిర్ణయించుకున్నట్లు విష్ణు విశాల్ తెలిపారు. 'రవితేజ నటించిన 'మాస్ జాతర', 'బాహుబలి: ది ఎపిక్' చిత్రాలు కూడా ఈ నెల 31న విడుదలవుతున్నాయి. రవితేజతో నాకున్న స్నేహం, రాజమౌళిపై గౌరవంతో ఈ నిర్ణయం తీసుకున్నాం' అని ఆయన తెలిపారు. అయితే 'ఆర్యన్' తమిళ వెర్షన్ మాత్రం ఈ నెల 31నే విడుదలవనుంది. ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన 'ఆర్యన్' చిత్రానికి ప్రవీణ్ కె దర్శకుడు. శుభ్ర, ఆర్యన్ రమేశ్ నిర్మించారు. శ్రద్ధా శ్రీనాథ్ కథానాయిక. సెల్వ రాఘవన్ కీలకపాత్ర పోషించారు. శ్రేష్ఠ మూవీస్ అధినేత సుధాకర్ రెడ్డి ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తున్నారు.



ఉగాదిన విడుదల

అడివి శేష్ కథానాయకుడిగా షానియల్ డియో తెరకెక్కిస్తోన్న రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ 'డెకాయిట్'. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ తెలుగు, హిందీ భాషల్లో నిర్మిస్తున్నారు. సునీల్ నారంగ్ సహ నిర్మాత. మొదట డిసెంబరు 25న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. కానీ కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా పడింది. తాజాగా మేకర్స్ కొత్త తేదీని ప్రకటించారు. 2026 ఉగాది పండగ సందర్భంగా మార్చి 19న థియేటర్లలోకి రానున్నట్లు తెలిపారు. ఈ మేరకు సంబంధిత పోస్టర్‌ని అడివి శేష్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. 'ఈసారి మామూలుగా ఉండదు. ముందుకి వెళ్లడమే తప్ప వెనక్కి చూడాల్సిన అవసరమే లేదు' అని క్యాప్షన్ పెట్టారు. కాగా, అడివి శేష్ సరసన కథానాయికగా మృణాల్ ఠాకూర్ నటిస్తున్నారు. బాలీవుడ్ దర్శకుడు, నటుడు అనురాగ్ కశ్యప్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు.

శ్రీకాంత్ తివారి వచ్చేస్తున్నాడు



ఓటీటీ ప్లాట్‌ఫామ్‌పై ఓ సరికొత్త ఒరవడిని సృష్టించిన వెబ్ సిరీస్ 'ది ఫ్యామిలీ మ్యాన్'. ఇప్పటి వరకూ రెండు సీజన్లు విజయవంతంగా పూర్తి చేసుకున్న ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్ సిరీస్‌లో మూడో భాగం సిద్ధమైంది. మనోజ్ బాజ్‌పాయ్, ప్రియమణి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సిరీస్‌ను రాజ్ అండ్ డీకే తెరకెక్కించారు. ఈ ప్రాజెక్టును ప్రకటించినప్పటి నుంచి స్ట్రీమింగ్ వివరాల కోసం అభిమానులు ఎంతగానో ఆసక్తిగా ఎదురుచూడసాగారు. తాజాగా మేకర్స్ స్ట్రీమింగ్ తేదీని ప్రకటించారు. అమెజాన్ ప్రైమ్‌లో నవంబరు 21 నుంచి అందుబాటులోకి రానున్నట్లు వెల్లడించారు. దీనికి సంబంధించిన ఓ వీడియోను కూడా షేర్ చేశారు. థ్రెట్ అనాలిసిస్ అండ్ సర్వైవలెన్స్ సెల్(టాస్క్) సీనియర్ ఆఫీసర్ శ్రీకాంత్ తివారి పాత్రలో మనోజ్ బాజ్‌పాయ్ మరోసారి అలరించనున్నారు. రెండు సీజన్లలో మనోజ్ బాజ్‌పాయ్ నటనకు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు లభించాయి. ఇప్పుడు మూడో భాగంలో ఆయన నటనపై అభిమానుల్లో అంచనాలు పెరిగాయి. తెలుగు, హిందీ, తమిళం, మలయాళం భాషల్లో ఈ సిరీస్ అందుబాటులో ఉంటుంది.

చట్టమా? విశ్వాసమా?



యామీ గౌతమ్, ఇమ్రాన్ హష్మీ ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'హక్'. ముస్లిం మహిళల హక్కుల పోరాటంలో మైలురాయిగా నిలిచిన 'మొహమ్మద్ అహ్మద్ ఖాన్ వర్సెస్ షా బానో బేగం' కేసు ఆధారంగా రాసుకున్న కథతో దర్శకుడు సుపర్ణ్ వర్మ ఎస్ తెరకెక్కించారు. నవంబర్ 7న ఈచిత్రం విడుదలవుతోంది. హర్మాన్ బవేజా, విశాల్ గుర్నాని నిర్మించారు. మేకర్స్ మంగళవారం ట్రైలర్‌ను విడుదల చేశారు. చట్టం, విశ్వాసం, న్యాయం మధ్య సంఘర్షణ ప్రధానాంశంగా దర్శకుడు కథను మలచిన తీరు ఆకట్టుకుంటోంది. షాబోనో బేగం పాత్రలో యామీ గౌతమ్, ఆమె భర్తగా ఇమ్రాన్ హష్మీ తమదైన శైలిలో నటించి మెప్పించారు.

నా కోసం ఆ వెన్నెల



ప్రేమలోని విభిన్న కోణాలను ఆవిష్కరిస్తూ తెరకెక్కిస్తోన్న చిత్రం 'ఓ చెలియా'. నాగప్రణవ్, కావేరి కర్ణిక, ఆద్య రెడ్డి ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఇందిరా దేవి ప్రొడక్షన్స్ పతాకంపై రూపాశ్రీ కొపురు నిర్మిస్తున్నారు. ఎం. నాగ రాజశేఖర్‌రెడ్డి దర్శకుడు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. 'నా కోసం ఆ వెన్నెల' అంటూ సాగే ప్రేమగీతాన్ని నటుడు జేడీ చక్రవర్తి చేతుల మీదుగా మేకర్స్ విడుదల చేశారు. హీరో హీరోయిన్ల అనుబంధాన్ని వివరిస్తూ సాగే ఈ గీతానికి శివ సాహిత్యం అందించగా, ఎం.ఎం కుమార్ స్వరపరిచారు. మేఘన, మనోజ్ ఆలపించారు.

నటులకూ ఎనిమిది గంటల షిఫ్ట్ కావాలి



దేశవ్యాప్తంగా సినీ రంగంలో చర్చనీయాంశమైన పనివేళల అంశంపై కథానాయిక రష్మిక మందన్న స్పందించారు. వరుస పాన్ ఇండియా చిత్రాలతో బిజీగా ఉన్న రష్మిక తాను కూడా అధిక పని ఒత్తిడిని అనుభవిస్తున్నట్లు అంగీకరించారు. 'ది గర్ల్‌ఫ్రెండ్' చిత్రం ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఆమె మాట్లాడుతూ... రోజుకు పది పన్నెండు గంటలకు మించి పనిచేయడం ఎంత కష్టమో, కుటుంబ, వ్యక్తిగత జీవితానికి సమయం కేటాయించడం ఎంత అవసరమో ఆమె వివరించారు. 'నేను కూడా ఎక్కువగంటలు పనిచేస్తున్నాను. ఇది ఆరోగ్యానికి మంచిది కాదు. ఇలా చేయవద్దని అందరికీ చెబుతున్నాను. ఆఫీసులో ఉద్యోగులకు ఉన్నట్లే నటీనటులకూ ఎనిమిది గంటల షిఫ్ట్ ఉండాలి' అని రష్మిక అభిప్రాయపడ్డారు. ఒక షెడ్యూల్ పెట్టుకోని రోజుకు 8 గంటలు కంటినిండా నిద్రపోవాలి, వృత్తిని వ్యక్తిగత జీవితాన్ని బేలన్స్ చేసుకోవాలని ఆమె సూచించారు. నిర్ణీత పనివేళల డిమాండ్‌తో దీపికా పదుకొనే కొన్ని సినిమాల నుంచి వైదొలగినప్పటి నుంచి పలువురు నటీనటులు ఈ అంశంపై భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

రెహమాన్ సంగీత విభావరి



ప్రముఖ సంగీత దర్శకుడు ఏ.ఆర్.రెహమాన్ తన సంగీత విభావరితో మరోసారి హైదరాబాద్ ప్రేక్షకులను అలరించబోతున్నారు. 'హైదరాబాద్ టాకీస్' ఆధ్వర్యంలో నవంబరు 8న రామోజీ ఫిలిం సిటీలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా తెలుగు ప్రేక్షకులతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేస్తూ ' తెలుగు సినిమాలు చేస్తూనే పెరిగాను. 'ఏ మాయ చేశావే' మొదలు ఇటీవల రామ్ చరణ్ సినిమా వరకు ఇక్కడి ప్రేక్షకులు నన్ను ఎంతగానో ఆదరించారు. ఇప్పుడు హైదరాబాద్ ప్రజలు నా కచేరీని గొప్పగా ఆస్వాదిస్తారని భావిస్తున్నా.' అని అన్నారు. కచేరీలో తన బాణీల గురించి వివరిస్తూ 'నాకు పాత స్వరాలను అనుసరించే సమయం లేదు. కొత్త అనుభూతి కోసం 'రోజా' లాంటి క్లాసిక్స్‌ని డాల్బీ అట్మోస్‌లో రీమిక్స్ చేస్తున్నాను. ఇప్పుడు సంగీతం గ్లోబల్ అయిపోయింది. ఎవరు ఏ భాషలో ఆస్వాదిస్తున్నారో ఎవరూ చెప్పలేరు. సంగీతంలో కొత్తదనం, స్పష్టత ముఖ్యం. అది ప్రేరేపించే భావోద్వేగం అన్నింటి కంటే మరీ ముఖ్యం' అని వివరించారు. కాగా, 2017లో హైదరాబాద్‌లో నిర్వహించిన ఓ భారీ కచేరీలో రెహమాన్ ప్రేక్షకులను 'మా తుజే సలామ్' పాటతో ఉర్రూతలూగించారు. మళ్లీ ఇన్నేళ్లకు సంగీత ప్రియులను అలరించబోతున్నారు.

ప్రపంచ బాక్సింగ్ కప్ — బరిలో నిఖత్

న్యూఢిల్లీ: ప్రపంచ బాక్సింగ్ కప్‌లో పాల్గొనే భారత బృందాన్ని జాతీయ బాక్సింగ్ సమాఖ్య వెల్లడించింది. మహిళల 51 కిలోల విభాగంలో ప్రపంచ మాజీ చాంపియన్ నిఖత్ జరీన్ బరిలోకి దిగుతోంది. ఈ పోటీల గురించి నిఖత్ మాట్లాడుతూ వచ్చే ఆసియా, కామన్వెల్త్ క్రీడల్లో బరిలోకి దిగడానికి కావాల్సిన ర్యాంకింగ్ పాయింట్లకు ఈ ప్రపంచ బాక్సింగ్ కప్ ఫైనల్స్ పోటీలు ముఖ్యమైనవని, ఇందులో ఎక్కువ పాయింట్లు సాధించి సీడింగ్‌ను మెరుగు పర్చుకోవాల్సి ఉందని తెలిపింది. నిఖత్‌తో పాటు మొత్తం ఇరవై మంది భారత బాక్సర్లు వివిధ విభాగాల్లో తలపడనున్నారు. ఈ పోటీలు వచ్చే నెల 14 నుంచి 21 వరకు గ్రేటర్ నోయిడాలో జరగనున్నాయి. మొత్తం 18 దేశాల నుంచి 140 మందికి పైగా బాక్సర్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు.

'ఆసియా అథ్లెటిక్స్' ఈవెంట్లకు భారత్ బిడ్‌లు!

న్యూఢిల్లీ: ఒలింపిక్స్ లాంటి మెగా క్రీడలకు ఆతిథ్యం ఇవ్వాలనుకొంటున్న భారత్ అందుకు సన్నాహకంగా పలు ఈవెంట్ల నిర్వహణకు ఆసక్తిని ప్రదర్శిస్తోంది. తాజాగా 2028 ఆసియా ఇండోర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్, 2026 ఆసియా రిలే ఆతిథ్య హక్కుల కోసం భారత్ బిడ్‌లు దాఖలు చేసింది. ఇండోర్ అథ్లెటిక్స్ ఈవెంట్‌ను భువనేశ్వర్‌లో నిర్వహించాలనుకొంటున్నట్టు భారత అథ్లెటిక్స్ సమాఖ్య తెలిపింది. అయితే, ఆసియా రిలే విషయంలో మాత్రం చర్చలు జరుగుతున్నట్టు పేర్కొంది.



లారా వొల్వార్ట్
బ్రంట్
మ. 3 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

ఫైనల్ బెర్త్ ఎవరిదో?

- దక్షిణాఫ్రికాకు స్పిన్ గండం
- ఫేవరెట్ ఇంగ్లండ్
- నేడు తొలి సెమీస్
- మహిళల వన్డే వరల్డ్‌కప్

గువాహటి: వరుసగా రెండోఫైనల్‌పై ఇంగ్లండ్ గురిపెట్టగా.. దక్షిణాఫ్రికా తొలిసారి వన్డే వరల్డ్‌కప్ తుది పోరుకు చేరి చరిత్ర సృష్టించాలనుకొంటోంది. ఈ క్రమంలో బుధవారం జరిగే తొలి సెమీఫైనల్లో నాలుగుసార్లు చాంపియన్ ఇంగ్లండ్‌తో దక్షిణాఫ్రికా తలపడనుంది. లీగ్ దశలో సఫారీలను చిత్తుగా ఓడించిన ఇంగ్లండ్ ఈ మ్యాచ్‌లో ఫేవరెట్‌గా కనిపిస్తోంది. అయితే, మెరుగైన బ్యాటింగ్ ప్రదర్శనతో బదులు తీర్చుకోవాలని దక్షిణాఫ్రికా వ్యూహాలు రచిస్తోంది. ముఖ్యంగా స్పిన్ బౌలింగ్‌ను ఎదుర్కోవడంలో ఘోరంగా తడబడుతున్న లారా వొల్వార్ట్ సేన ఆ బలహీనతకు చెక్ చెప్పాలనుకొంటోంది. ఇంగ్లండ్‌తో మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా కేవలం 69 పరుగులకే కుప్పకూలింది. కానీ, ఆ తర్వాత ఒత్తిడిని అధిగమిస్తూనే ఐదు మ్యాచ్‌లు గెలిచి నాకౌట్ బెర్త్‌ను సొంతం చేసుకొంది. కానీ, ఆఖరి లీగ్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా చేతిలో మరోసారి ఘోరంగా ఓడడం ఆ జట్టు ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసేదే. కెప్టెన్ లారా వొల్వార్ట్, తన్జిమ్ బ్రిట్స్, మరిజానె కాప్, డి క్లెర్క్ జట్టు బ్యాటింగ్‌కు ప్రధాన బలం. బౌలింగ్‌లో క్లో ట్రయాన్, ఎమ్‌లాబా, క్లాస్, కాప్‌పై జట్టు ఆధారపడింది. మరోవైపు ఇంగ్లండ్ ఫుల్ జోష్‌లో ఉంది. అమీ జోన్స్, బ్యూమాంట్, హీథర్ నైట్ బ్యాట్‌తో అదరగొడుతున్నారు. సారథి సివర్ బ్రంట్ ఆల్‌రౌండ్ ప్రదర్శన జట్టుకు ప్లస్‌గా మారింది. వికెట్ స్పిన్‌కు సహకరించే అవకాశాలుండడంతో సోఫీ ఎకెల్‌స్టోన్, లిండ్సే స్మిత్, చార్లీ డీన్ నుంచి దక్షిణాఫ్రికా సవాల్ ఎదురయ్యే అవకాశం ఉంది. అయితే, గాయంతో బాధపడుతున్న ఎకెల్‌స్టోన్ ఫిట్‌నెస్‌పై ఇంకా స్పష్టత రాలేదు. మ్యాచ్‌కు వర్షం ఆటంకం కలిగించే అవకాశాలు లేవు.

కోలుకుంటున్న శ్రేయాస్



సిడ్నీ: ఆస్ట్రేలియాతో మూడో వన్డేలో తీవ్రంగా గాయపడిన శ్రేయాస్ అయ్యర్ వేగంగా కోలుకుంటున్నాడు. ప్రస్తుతం సిడ్నీలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్న అతడికి చిన్నపాటి శస్త్రచికిత్స చేసినట్టు సమాచారం. మూడో వన్డేలో అలెక్స్ క్యారీ క్యాచ్ పట్టే క్రమంలో కిందపడిన అయ్యర్ పక్కటెముకలకు గాయమైంది. స్కానింగ్‌లో ప్లీహం రక్తస్రావానికి గురైందని తేలడంతో రెండురోజులు ఐసీయూలోనే ఉంచి, ఆ తర్వాత స్పెషల్ వార్డుకు మార్చారు. మంగళవారం తీసిన స్కానింగ్‌లో రక్తస్రావం ఆగినట్టు తేలిందని, అతను వేగంగా కోలుకుంటున్నట్టు బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా పేర్కొన్నారు. డాక్టర్లు ఊహించినదాని కంటే అత్యంత వేగంగా అయ్యర్ కోలుకుంటున్నాడన్నారు. టీమ్ డాక్టర్ రిజ్వాన్ ఖాన్ శ్రేయాస్ వెంటే ఉండి పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. అటు టీ20 కెప్టెన్ సూర్యకుమార్ సైతం శ్రేయాస్ ఆరోగ్య పరిస్థితి ఆశాజనకంగా ఉందని, ఇప్పటికే పలుమార్లు అతడితో ఫోన్‌లో మాట్లాడానని చెప్పాడు. మరో వారంరోజుల విశ్రాంతి తర్వాత శ్రేయాస్‌ను డిశ్చార్జి చేసే అవకాశముందని బోర్డు వర్గాలు పేర్కొన్నాయి.

'పొట్టి' సిరీస్ లక్ష్యంగా..

- బరిలోకి టీమిండియా
- కెప్టెన్ సూర్య ఫామ్‌పై ఆందోళన
- పేసర్ బుమ్రా రాక
- ఆస్ట్రేలియాతో తొలి టీ20

మ.1.45 గం. నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో



ప్రాక్టీస్‌లో కోచ్ గంభీర్‌తో కెప్టెన్ సూర్య

కాన్‌బెర్రా: మూడు వన్డేల సిరీస్‌ను 1-2తో కోల్పోయిన టీమిండియా ఇక ధనాధన్ పోరుపై దృష్టి పెట్టింది. తాజా టీ20 జట్టులోకి యువ ఆటగాళ్ల చేరికతో పాటు ఆల్‌రౌండర్ల అండతో సూర్యకుమార్ సేనలో ఆత్మవిశ్వాసం తొణికిసలాడుతోంది. దీనికి తోడు ఇటీవలే ఆసియాకప్ గెలిచిన జోష్‌లో ఉన్న వరల్డ్ నెంబర్‌వన్ టీమిండియా.. బుధవారం నుంచి ఆస్ట్రేలియాతో జరిగే ఐదు టీ20ల సిరీస్‌ను శుభారంభం చేయాలనుకుంటోంది. అటు ఇరు జట్లు కూడా తమ ప్రత్యర్థులపై ఆడిన చివరి 10 టీ20ల్లో ఎనిమిది గెలిచి, ఒక ఓటమితో సమవుజ్జీగా ఉన్నాయి. వచ్చే ఏడాది టీ20 వరల్డ్‌కప్‌నకు ముందు భారత్ 15 మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. అందుకే ఈ సిరీస్‌ను చక్కటి సన్నాహకంగా ఉపయోగించుకోవాలనుకుంటోంది. మరోవైపు ఇప్పటికే వన్డే సిరీస్‌ను గెలిచిన ఆసీస్ ఈ ధనాధన్ పోరులోనూ తమదే పైచేయి కావాలనుకుంటోంది.

సూర్య పుంజుకునేనా?: భారత జట్టులోని ఇతర బ్యాటర్లతో పోలిస్తే కెప్టెన్ సూర్య పేలవ ఫామ్‌పై టీమ్ మేనేజ్‌మెంట్ ఆందోళనగా ఉంది. తన కెప్టెన్సీలో ఆడిన 29 మ్యాచ్‌ల్లో భారత్ 23 గెలిచినప్పటికీ బ్యాటర్‌గా మాత్రం అతడు విఫలమవుతున్నాడు. ఈ ఏడాది ఆడిన 10 ఇన్నింగ్స్‌లో సూర్య కేవలం 100 రన్స్ మాత్రమే చేయగలిగాడు. గిల్‌తో కెప్టెన్సీ విషయంలో పోటీ ఉండడంతో ఈ సిరీస్ ద్వారా బ్యాట్ ఝుళిపించి విమర్శకులకు సమాధానమివ్వాల్సిన అవసరం ఉంది. ఆసియాకప్‌లో అదరగొట్టిన ఓపెనర్ అభిషేక్ శర్మ ఎప్పటిలాగే మెరుపు ఇన్నింగ్స్‌తో శుభారంభం అందించాలనుకుంటున్నాడు. మరో ఓపెనర్ గిల్ వన్డే సిరీస్‌లో విఫలమై ఒత్తిడిలో ఉన్నాడు. సూర్య, తిలక్, శాంసన్‌లతో మిడిలార్డర్ బలంగా కనిపిస్తోంది. గాయం నుంచి కోలుకుంటున్న నితీశ్‌కుమార్ ఈ మ్యాచ్‌లో ఆడేది సందేహమే. అలాగే బుమ్రా రాకతో బౌలింగ్ విభాగం పటిష్ఠంగా మారింది. పేస్‌లో అర్ష్‌దీప్ అతడికి జత కానున్నాడు. ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి దిగే ఆలోచన ఉంటే కుల్దీప్, వరుణ్ చక్రవర్తి, అక్షర్‌పటేల్ ఆడేది ఖాయమే.

పటిష్ఠంగా ఆసీస్: గతేడాది టీ20 వరల్డ్‌కప్ ఓటమి తర్వాత ఆసీస్ టీ20 జట్టు అత్యంత పటిష్ఠంగా రూపొందింది. మిచెల్ మార్ష్ నేతృత్వంలో ఆడిన చివరి 20 మ్యాచ్‌ల్లో రెండు మాత్రమే ఓడడం వీరి దూకుడైన ఆటతీరుకు నిదర్శనం. ఓపెనర్లు హెడ్, మార్ష్ ఆరంభం నుంచే బౌలర్లపై విరుచుకుపడుతూ ఒత్తిడి తేగలరు. ఇక తాజాగా జట్టులోకి ఇన్‌గ్లిస్, స్టొయినిస్, డేవిడ్, మ్యాక్స్‌వెల్ లాంటి హిట్టర్లు చేరడం భారత్‌కు సవాల్‌గా మారనుంది. తొలి రెండుమ్యాచ్‌లు మాత్రమే ఆడే పేసర్ హాజెల్‌వుడ్ ఈసారి కూడా భారత్‌ను ఇబ్బందిపెట్టాలనుకుంటున్నాడు.

తుది జట్లు (అంచనా)

భారత్: అభిషేక్, గిల్, సూర్యకుమార్ (కెప్టెన్), తిలక్, శాంసన్, రింకూ సింగ్, అక్షర్, దూబే/హర్షిత్, కుల్దీప్/వరుణ్, అర్ష్‌దీప్, బుమ్రా.

ఆస్ట్రేలియా: మిచెల్ మార్ష్ (కెప్టెన్), హెడ్, ఇన్‌గ్లిస్, డేవిడ్, ఫిలిప్, ఓవెన్, స్టొయినిస్, ఎబాట్/బార్ట్‌లెట్, ఎలిస్, కునేమన్, హాజెల్‌వుడ్.

పిచ్, వాతావరణం

ఇక్కడి మనూకా ఓవల్ మైదానంలో బౌండరీ విస్తీర్ణం ఎక్కువగా ఉండడంతో స్వల్ప స్కోర్లే నమోదవుతుంటాయి. వికెట్ స్పిన్‌కు అనుకూలంగా ఉండనుంది. ఇక చల్లటి వాతావరణం ఉండి రోజులో చిరు జల్లులకు ఆస్కారం ఉన్నప్పటికీ మ్యాచ్‌కు ఎలాంటి ఆటంకం ఉండదు.



మిచెల్ మార్ష్



ఎలిమినేటర్-3లో పట్నాపై తెలుగు టైటాన్స్ గెలుపు

అదరగొట్టిన భరత్

న్యూఢిల్లీ: తెలుగు టైటాన్స్ స్టార్ ఆల్‌రౌండర్ భరత్ హుడా 23 పాయింట్లతో చెలరేగడంతో ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్)లో ఆ జట్టు ట్రోఫీని ముద్దాడేందుకు రెండు విజయాల దూరంలో నిలిచింది. మంగళవారం జరిగిన ఎలిమినేటర్-3లో టైటాన్స్ 46-39తో బలమైన పట్నా పైరేట్స్‌ను ఓడించి క్వాలిఫయర్-2 పోరుకు అర్హత సాధించింది. టైటాన్స్ స్టార్ ఆటగాడు భరత్ విజృంభణతో పట్నా ఆత్మరక్షణలో పడిపోయింది. భరత్‌తో పాటు టైటాన్స్ కెప్టెన్ మాలిక్ (5 పాయింట్లు), డిఫెండర్లు అజిత్, శుభమ్ రాణించారు. ఇక, బుధవారం జరిగే క్వాలిఫయర్-2లో పుణెరి పల్టన్‌తో టైటాన్స్ తాడోపేడో తేల్చుకోనుంది. ఇందులో నెగ్గిన జట్టు శుక్రవారం జరిగే ఫైనల్లో దబాంగ్ ఢిల్లీతో ట్రోఫీ కోసం పోటీ పడనుంది.

హైదరాబాద్‌కు 3 పాయింట్లు

- పుదుచ్చేరితో రంజీ డ్రా
- ఆంధ్ర మ్యాచ్‌కు తుఫాన్ దెబ్బ

పుదుచ్చేరి: ఊహించినట్టే హైదరాబాద్, ఆంధ్ర రంజీ మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. అయితే, హైదరాబాద్‌కు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించగా.. తుఫాన్ కారణంగా ఆంధ్ర మ్యాచ్‌లో మంగళవారం ఆట కూడా ఒక్క బంతి కూడా పడకుండానే తుడిచిపెట్టుకుపోయింది. ఆటకు నాలుగో, ఆఖరి రోజు మొదటి ఇన్నింగ్స్‌లో 126 పరుగులకే ఆలౌటైన పుదుచ్చేరి ఫాలో ఆన్‌లో పడింది. 309 పరుగుల లోటుతో రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన పుదుచ్చేరి మంగళవారం ఆట ఆఖరుకు 97/5 స్కోరు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ 435 పరుగులు చేసింది. మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యం ఆధారంగా హైదరాబాద్‌కు మూడు పాయింట్లు.. పుదుచ్చేరికి ఒక్క పాయింట్ లభించాయి. కాగా, విజయనగరంలో బరోడాతో ఆంధ్ర మ్యాచ్ కూడా డ్రాగా ముగిసింది. వర్షం కారణంగా ఆఖరి రోజు ఆట కూడా రద్దయి...తొలి ఇన్నింగ్స్ కూడా పూర్తికాకపోవడంతో ఇరు జట్లకూ చెరో పాయింట్ దక్కింది. తొలి ఇన్నింగ్స్‌లో బరోడా 363 పరుగులు చేయగా.. ఆంధ్ర 43/2 స్కోరు సాధించింది.

ఐసీసీని ఆడిస్తున్న భారత్?

ఇంగ్లండ్ మాజీ రెఫరీ బ్రాడ్ ఆరోపణ

న్యూఢిల్లీ: ఐసీసీని భారత క్రికెట్ బోర్డు తన చెప్పుచేతల్లో పెట్టుకొందని ఇంగ్లండ్‌కు చెందిన మాజీ మ్యాచ్ రెఫరీ క్రిస్ బ్రాడ్ సంచలన ఆరోపణలు చేశాడు. భారత్ ఆడే మ్యాచ్‌ల్లో ఆ జట్టుకు కొంత అనుకూలంగా వ్యవహరించాలనే ఒత్తిడి తీవ్రంగా ఉండేదని ఓ ఇంటర్వ్యూలో చెప్పాడు. 'ఒక మ్యాచ్‌లో నిర్ణీత సమయంలో బౌల్ చేయాల్సిన ఓవర్ల కన్నా టీమిండియా 3-4 ఓవర్లు తక్కువగా వేసింది. నిబంధనల ప్రకారం జరిమానా విధించాలి. అయితే, సరిగ్గా ఆ సమయంలోనే ఫోన్ వచ్చింది. ఆడేది భారత్ కాబట్టి చూసీచూడనట్టు వెళ్లాలని సూచించారు. సమయాన్ని ఏదో విధంగా సరిచేయాలని చెప్పడంతో.. తప్పలేదని చెప్పాడు. కానీ, ఆ తర్వాతి మ్యాచ్‌లో స్లో ఓవర్ రేట్ గురించి కెప్టెన్ సౌరవ్ గంగూలీని హెచ్చరించినట్టు తెలిపాడు. అయినా.. అతడు పట్టించుకోక పోవడంతో నిబంధనల ప్రకారం నడుచుకోవాల్సి వచ్చిందని బ్రాడ్ చెప్పాడు.

బిజినెస్

యాపిల్.. 4 లక్షల కోట్ల డాలర్లు

Apple

ఐఫోన్ తయారీ దిగ్గజం యాపిల్ మార్కెట్ విలువ తొలిసారిగా 4 ట్రిలియన్ డాలర్ల (నాలుగు లక్షల కోట్ల డాలర్లు)కు చేరింది. ఈ ఏడాది సెప్టెంబరులో విడుదల చేసిన ఐఫోన్ 17 మోడళ్ల ప్రపంచవ్యాప్తంగా జోరుగా అమ్ముడవుతుడంటంతో కంపెనీ షేరు గడిచిన 3 నెలల్లో 25 శాతం మేర పుంజుకుంది. పైగా ఈ గురువారం కంపెనీ త్రైమాసిక ఆర్థిక ఫలితాలు ప్రకటించనుంది. కంపెనీ పనితీరుపై ఆశాజనక అంచనాలతో మంగళవారం షేరు ధర మరింత పెరిగి 269.87 డాలర్ల వద్ద సరికొత్త ఏడాది గరిష్ఠాన్ని నమోదు చేసింది. యాపిల్‌తోపాటు మైక్రోసాఫ్ట్ మార్కెట్ క్యాపిటలైజేషన్ సైతం 4 లక్షల కోట్ల డాలర్లు దాటింది. అయితే, ఈ జూలైలోనూ మైక్రోసాఫ్ట్ ఈ మార్క్‌ను తాకింది. కాగా, ఏఐ చిప్‌ల తయారీ దిగ్గజం ఎన్‌విడియా 4.6 లక్షల కోట్ల డాలర్ల మార్కెట్ క్యాప్‌తో ప్రపంచంలోనే అత్యంత విలువైన కంపెనీగా కొనసాగుతోంది.

నోకియాలో ఎన్‌విడియా 100 కోట్ల డాలర్ల పెట్టుబడి
టెలికాం నెట్‌వర్క్, పరికరాల తయారీ దిగ్గజం నోకియాలో ఎన్‌విడియా 100 కోట్ల డాలర్ల (రూ.8,829 కోట్లు) పెట్టుబడులు పెడుతోంది. ఇందుకు గాను ఎన్‌విడియాకు నోకియా 16.6 కోట్ల కొత్త షేర్లను జారీ చేయనుంది. ఈ డీల్ నేపథ్యంలో నోకియా షేరు ఏకంగా 18% పెరిగింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

29వ తేదీ			
హైదరాబాద్	570	విజయవాడ	575
వరంగల్	572	గోదావరి	575
చిత్తూరు	593	విశాఖపట్నం	565
		దజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	117	విజయవాడ	123
వరంగల్	117	గుంటూరు	126
కరీంనగర్	117	ఒంగోలు	126
మహబూబ్‌నగర్	117	చిత్తూరు	114
కర్నూలు	117	నెల్లూరు	119
విశాఖపట్నం	119	అనంతపురం	119
గోదావరి	123		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,22,460 ▼	1,12,500 ▼	1,65,000 ▼
విజయవాడ	1,25,000 ▼	1,18,000 ▼	1,45,000 ▼
విశాఖపట్నం	1,21,860 ▼	1,14,100 ▼	1,65,000 ▼
రాజమండ్రి	1,20,820 ▼	1,10,750 ▼	1,47,000 ▼
ప్రొద్దుటూరు	1,20,000 ▼	1,10,400 ▼	1,47,000 ▼
ముంబై	1,18,043 ▼	1,08,127 ▼	1,41,896 ▼

జోరుగా డేటా సెంటర్లు

2030 నాటికి దేశంలో ఐదింతలు పెరుగుతాయ్

- 4,500 కోట్ల డాలర్ల పెట్టుబడులు
- మక్వేరీ ఈక్విటీ రీసెర్చ్ వెల్లడి



న్యూఢిల్లీ: దేశంలో డేటా కేంద్రాల (డీసీ) ఏర్పాటు జోరందుకుంది. ఇప్పటికే భారత్‌లో 1,400 మెగావాట్ల సామర్థ్యం ఉన్న డీసీలు ఏర్పాటయ్యాయి. వీటి సామర్థ్యం 2027 నాటికి రెట్టింపై, 2030 నాటికి ఐదు రెట్లు పెరుగుతుందని మక్వేరీ ఈక్విటీ రీసెర్చ్.. 'రాక్స్ టు రిచెస్: ఇండియా డేటా సెంటర్స్' పేరుతో రూపొందించిన నివేదికలో తెలిపింది. దేశంలో ఇప్పటికే 1,400 మెగావాట్ల సామర్థ్యం గల డేటా సెంటర్లు కార్యకలాపాలు సాగిస్తుండగా మరో 1,400 మెగావాట్ల సెంటర్లు నిర్మాణంలో ఉన్నాయి. వీటితో పాటు దాదాపు 5,000 మెగావాట్ల సామర్థ్యం గల డేటా సెంటర్లను ఏర్పాటు చేసేందుకు పలు కంపెనీలు ప్రణాళికలు రచిస్తున్నట్లు నివేదిక వెల్లడించింది. సర్వర్ల ఖర్చులు పక్కన పెట్టినా ఒక మెగావాట్ సామర్థ్యం ఉన్న డేటా కేంద్రం ఏర్పాటుకు 40 లక్షల నుంచి 70 లక్షల డాలర్లు ఖర్చవుతుంది. దీంతో 2030 నాటికి డేటా సెంటర్ల ద్వారానే మన దేశం 3,000 కోట్ల డాలర్ల నుంచి 4,500 కోట్ల డాలర్ల (సుమారు రూ.4 లక్షల కోట్లు) పెట్టుబడులను ఆకర్షించే అవకాశం ఉందని ఆ నివేదిక పేర్కొంది. ఇందులో గూగుల్ కంపెనీ ఒక్కటే అదానీ గ్రూప్‌తో కలిసి ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం వద్ద 1,500 కోట్ల డాలర్ల పెట్టుబడితో 1,000 మెగావాట్ల డేటా కేంద్రం, ఏఐ ఆధారిత మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయనుంది. దేశంలో డేటా కేంద్రాల ఏర్పాటుకు దోహదం చేసే అంశాలేమిటంటే..

- డేటా లోకలైజేషన్ చట్టాలు
- కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల సానుకూల విధానాలు, రాయితీలు
- కంపెనీలు వేగంగా క్లౌడ్ కంప్యూటింగ్‌కు మారడం
- ఓటీటీ కంటెంట్, మొబైల్ డేటాకు పెరుగుతున్న డిమాండ్
- పెరుగుతున్న డిజిటల్ నేటివ్ వ్యాపారాలు

ఆర్‌సీపీఎల్‌తో సాంప్రే న్యూట్రిషన్స్ జట్టు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): తెలంగాణకు చెందిన సాంప్రే న్యూట్రిషన్స్.. రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ (ఆర్‌సీపీఎల్)తో జట్టు కట్టింది. ఒప్పందంలో భాగంగా ఆర్‌సీపీఎల్ కోసం పోషకాహార ఉత్పత్తుల తయారీ, సరఫరాను సాంప్రే చేపట్టనుంది. ఈ ఒప్పంద కాలపరిమితి మూడేళ్లు. ఆర్‌సీపీఎల్ భాగస్వామ్యంతో ఏటా రూ.12 కోట్ల నుంచి రూ.15 కోట్ల వ్యాపారం లభిస్తుందని అంచనా వేస్తున్నట్లు సాంప్రే వెల్లడించింది. కాగా సాంప్రే ఇటీవల వివిధ కంపెనీలతో రూ.45 కోట్ల విలువైన తయారీ, సరఫరా ఒప్పందాలను కుదుర్చుకుంది. ఫారిన్ కరెన్సీ కన్వర్టబల్ బాండ్ల జారీ ద్వారా రూ.355 కోట్లు సమీకరించేందుకు బోర్డు ఆమోదం తెలిపింది.

కేఫిన్ టెక్ లాభం రూ.93 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): కేఫిన్ టెక్నాలజీస్.. సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రూ.309.20 కోట్ల ఆదాయంపై రూ.93.31 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే ఆదాయం 10.3 శాతం పెరగగా లాభం 4.5 శాతం వృద్ధి చెందింది. సమీక్షా త్రైమాసికంలో కొత్తగా 597 కార్పొరేట్ క్లయింట్లను చేర్చుకున్నట్లు కంపెనీ పేర్కొంది. కాగా భారత్ కోకింగ్ కోల్, యశోద హాస్పిటల్స్, జునిపర్ గ్రీన్ ఎనర్జీ సహా మరి కొన్ని పబ్లిక్ ఇష్యూలను దక్కించుకున్నట్లు తెలిపింది.

భారీగా తగ్గిన బంగారం

- ఢిల్లీ మార్కెట్లో రూ.4,100 తగ్గుదల
- రూ.1,21,800కు దిగివచ్చిన 10 గ్రాముల ధర
- ఆల్‌టైం రికార్డుతో పోలిస్తే రూ.13,000 డౌన్
- రూ.1.45 లక్షలకు పడిపోయిన కిలో వెండి
- అంతర్జాతీయంగా 4,000 డాలర్ల దిగువకు..

న్యూఢిల్లీ: బంగారం, వెండి ధరలు భారీగా తగ్గాయి. ఢిల్లీ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత బంగారం ధర 10 గ్రాములపై రూ.4,100 తగ్గి రూ.1,21,800కు దిగివచ్చింది. ఈ నెల 17న నమోదైన ఆల్‌టైం రికార్డు స్థాయి రూ.1,34,800తో పోలిస్తే.. గడిచిన 11 రోజుల్లో మేలిమి బంగారం రేటు రూ.13,000 తగ్గింది. 99.5 శాతం స్వచ్ఛత లోహం కూడా రూ.4,100 తగ్గుదలతో రూ.1,21,200కు పరిమితమైంది. కిలో వెండి ఏకంగా రూ.6,250 తగ్గి రూ.1,45,000 స్థాయికి పడిపోయింది. అమెరికా-చైనా మధ్య నెలకొన్న వాణిజ్య ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడంతో అనిశ్చితుల్లో భద్రమైన పెట్టుబడి సాధనాలుగా పేరున్న ఈ విలువైన లోహాలకూ డిమాండ్ తగ్గిందని విశ్లేషకులు పేర్కొన్నారు. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ రేటు మళ్లీ 4,000 డాలర్లకు దిగువకు పడిపోయింది. ఒక దశలో 94 డాలర్లకు పైగా తగ్గి 3,887 డాలర్లకు దిగివచ్చింది. వెండి సైతం 2.85 శాతం తగ్గుదలతో 45.56 డాలర్లకు జారుకుంది.

5-10 శాతం తగ్గొచ్చు..

బంగారం, వెండి ధరల్లో దిద్దుబాటు ముున్ముందూ కొనసాగవచ్చని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్‌కు చెందిన సౌమిల్ గాంధీ అన్నారు. వీటి ధరలు 5-10 శాతం మేర తగ్గే అవకాశాలున్నాయని ఆయన అంచనా వేశారు. ఈ ఏడాదిలో బంగారం, వెండి ధరలు 50 శాతానికి పైగా పెరిగాయి. అలాంటి సందర్భాల్లో బడా ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు పాల్పడుతుంటారని బులియన్ విశ్లేషకులు పేర్కొన్నారు.

వెండిపై తగ్గిన దిగుమతి సుంకం

15% నుంచి 6 శాతానికి తగ్గింపు

వెండి నగల దిగుమతులకు మాత్రం చెక్

వెండి లేదా వెండితో చేసిన నగలు, నాణేలు కొనాలనుకునే వారికి శుభవార్త. ఇప్పటి వరకు వెండిపై 15 శాతంగా ఉన్న దిగుమతి సుంకాన్ని ప్రభుత్వం 6 శాతానికి కుదించింది. దీంతో దేశంలో వెండి ధర మరింత దిగి రానుంది. అయితే వెండి నగలు, వెండి నగల్లో వాడే భాగాలపై విధించే దిగుమతి సుంకాన్ని మాత్రం 25 శాతం నుంచి 20 శాతానికి మాత్రమే తగ్గించింది. దేశీయ వెండి నగల తయారీ పరిశ్రమ రక్షణ కోసమే ప్రభుత్వం ఈ చర్య తీసుకుందని భావిస్తున్నారు.

10 కిలోల వరకు తెచ్చుకోవచ్చు

విదేశాల నుంచి వచ్చే భారతీయులు లేదా ప్రవాస భారతీయులు (ఎన్ఆర్ఐ) 10 కిలోల వరకు వెండిని తెచ్చుకునేందుకు కూడా ప్రభుత్వం అనుమతించింది. అయితే దీనిపైనా డీజీఎఫ్‌టీ ఎప్పటికప్పుడు జారీ చేసే టారిఫ్ రేటు ప్రకారం దిగుమతి సుంకం చెల్లించాలని స్పష్టం చేసింది. పూర్తి ఎగుమతుల కోసం మాత్రం కంపెనీలు ఎన్ని వెండి నగలనైనా పైసా డ్యూటీ లేకుండా అనుమతించే విధానం కొనసాగుతుందని కూడా ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే ఎగుమతిదారులు లేదా ఎగుమతి సంస్థలు ఈ నగలను దేశీయ మార్కెట్లో విక్రయించేందుకు మాత్రం అనుమతించరు.

2030 నాటికి రూ.35.32 లక్షల కోట్లు

భారత ఐటీ రంగంపై బెస్సెమెర్ అంచనా



న్యూఢిల్లీ: భారత ఐటీ, కృత్రిమ మేధ (ఏఐ) సేవల మార్కెట్ 2030 నాటికి 400 బిలియన్ డాలర్లకు (40,000 కోట్ల డాలర్లు= రూ.35.32 లక్షల కోట్లు) చేరుకోవచ్చని బెస్సెమెర్ వెంచర్ పార్ట్‌నర్స్ నివేదిక అంచనా వేసింది. వ్యాపారాల వృద్ధికి ఏఐ సేవల వినియోగం విరివిగా పెరుగుతుండటంతో పాటు అంతర్జాతీయంగా ఐటీ సేవల ఔట్‌సోర్సింగ్ భారీగా పెరగనుండటం ఇందుకు దోహదపడనుందని నివేదిక పేర్కొంది. భారత ఐటీ పరిశ్రమ 2021-22 ఆర్థిక సంవత్సరం నుంచి 2024-25 ఆర్థిక సంవత్సరం వరకు ఏటేటా 8.1 శాతం చొప్పున వృద్ధి చెందుతూ 26,400 కోట్ల డాలర్లకు చేరుకుందని బెస్సెమెర్ నివేదికలో ప్రస్తావించింది. 2025-30 ఆర్థిక సంవత్సరాల మధ్య కాలంలో ఏటేటా 8.7 శాతం చొప్పున వృద్ధి చెంది 40,000 కోట్ల డాలర్లకు చేరుకోవచ్చని అంచనా వేసింది. ఐటీ రంగం నిర్మాణాత్మక మార్పులకు లోనవుతున్న తరుణంలో ఈ నివేదిక అత్యంత ఆశావహ అంచనాలను విడుదల చేయడం గమనార్హం. ఏఐ, డిజిటల్ టెక్నాలజీలతో ఐటీ రంగంలో క్లయింట్ల ప్రాధాన్యాలు, వ్యయాల తీరులో గణనీయ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఏఐతో ఐటీ కంపెనీలు క్లయింట్ల నుంచి వసూలు చేసే చార్జీలపై ఒత్తిడి పెంచనున్నప్పటికీ, మరిన్ని కొత్త మార్కెట్లు అందుబాటులోకి రానుండటం వాటి ఆదాయ పెరుగుదలకు దోహదపడనుందని బెస్సెమెర్ వెంచర్ పార్ట్‌నర్స్ సీఓఓ నితిన్ కైమల్ అన్నారు.

టాటా ట్రస్ట్స్ నుంచి మెహ్లీ మిస్త్రీ ఔట్

అడ్డుకున్న నోయెల్ టాటా!

న్యూఢిల్లీ: టాటా గ్రూప్ దాతృత్వ సంస్థ టాటా ట్రస్ట్స్‌లో ఇంటి పోరు మరింత ముదిరింది. మెహ్లీ మిస్త్రీని తిరిగి ట్రస్టీగా నియమించే తీర్మానానికి ట్రస్ట్స్ చైర్మన్ నోయెల్ టాటా, అతనికి సన్నిహితులైన మరో ఇద్దరు ట్రస్టీలు టీవీఎస్ గ్రూప్ గౌరవ చైర్మన్ వేణు శ్రీనివాసన్, రక్షణ మంత్రిత్వ శాఖ మాజీ కార్యదర్శి విజయ్ సింగ్ వ్యతిరేకించడంతో తీర్మానం వీగిపోయినట్టు సమాచారం. దీంతో రతన్ టాటాకు వీర విధేయుడైన మిస్త్రీని మరోసారి టాటా ట్రస్ట్స్ జీవిత కాల ట్రస్టీగా పునర్నియమించే ప్రయత్నాలు బెడిసికొట్టాయి. కాగా మెహ్లీ మిస్త్రీ పదవీ కాలం మంగళవారంతో ముగిసింది.

మార్కెట్లో లాభాల స్వీకరణ

ముంబై: ఆసియా మార్కెట్ల బలహీన ట్రెండ్ నేపథ్యంలో ఐటీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్, రియల్టీ రంగ షేర్లలో మదుపరులు లాభాల స్వీకరణకు పాల్పడటంతో ప్రామాణిక ఈక్విటీ సూచీలు మంగళవారం నష్టపోయాయి. ఒక దశలో 560 పాయింట్ల వరకు క్షీణించిన సెన్సెక్స్.. చివరికి 150.68 పాయింట్ల నష్టంతో 84,628.16 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 29.85 పాయింట్లు కోల్పోయి 25,936.20 వద్దకు జారుకుంది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 21 నష్టపోయాయి.

ఎంసీఎక్స్‌లో సాంకేతిక సమస్య: మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో సాంకేతిక సమస్య కారణంగా మంగళవారం ట్రేడింగ్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎక్స్ఛేంజ్‌లో ట్రేడింగ్ 4 గంటలకు పైగా ఆలస్యంగా (మధ్యాహ్నం 1.25 గంటలకు) ప్రారంభమైంది. ట్రేడింగ్ కార్యకలాపాలను డిజాస్టర్ రికవరీ సైట్‌కు బదిలీ చేయాల్సి వచ్చింది. దాంతో గోల్డ్, సిల్వర్, ముడి చమురుతో పాటు కాపర్, జింక్, అల్యూమినియం సహా ఇతర కమోడిటీ కాంట్రాక్టుల ట్రేడింగ్‌పై ప్రభావం పడింది.

రేవంత్ రెడ్డి, కవిత బిజినెస్ పార్టనర్స్

» అందుకే రాజీనామాను ఆమోదించడంలేదు

» ఆమెతో పార్టీ పెట్టించే ఆలోచనలో రేవంత్: అర్వింద్

నిజామాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్సీ కవిత బిజినెస్ పార్టనర్స్ అని, అందువల్లే ఆమె రాజీనామాను ప్రభుత్వం ఆమోదించడం లేదని బీజేపీ ఎంపీ అర్వింద్ ధర్మపురి ఆరోపించారు. మంగళవారం నిజామాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి డైరెక్షన్‌లోనే కవిత నడుస్తోందని, ఆమె చేస్తున్న జాగృతి జనం బాట నేరుగా తీహార్ జైలుకు వెళుతుందని విమర్శించారు. బీజేపీ ఎంపీలు రాజీనామా చేస్తే బీసీ రిజర్వేషన్ల బిల్లు వస్తుందనే కవిత వ్యాఖ్యలకు అరవింద్ తనదైన శైలిలో సమాధానమిచ్చారు. మొదట తన బిజినెస్ పార్ట్‌నర్ రేవంత్‌తో సీఎం పదవికి కవిత రాజీనామా చేయిస్తే బీసీ రిజర్వేషన్ బిల్లు వస్తుందన్నారు. కవితతో రేవంత్ రెడ్డి ఓ పార్టీ కూడా పెట్టించే ఆలోచనలో ఉన్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ కవిత రాజీనామాను ఆమోదించాలని మండలి చైర్మన్‌కు బీజేపీ తరఫున లేఖ పంపిస్తున్నామని ఆయన చెప్పారు.


మహబూబ్‌నగర్ జిల్లా ఉదండాపూర్ గ్రామంలో మాట్లాడుతున్న కవిత

పాలమూరు ప్రాజెక్టు పూర్తి చేయరా?

» కాంగ్రెస్ సర్కార్ పట్టించుకోవడంలేదు: కల్వకుంట్ల కవిత

జడ్చర్ల/భూత్పూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పాలమూరు జిల్లాకు తాగు, సాగునీరు అందించే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని (పీఆర్ఎల్ఐ) పూర్తి చేస్తారా..? చేయరా..? అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. జాగృతి జనం బాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలంలోని ఉదండాపూర్ రిజర్వాయర్, భూత్పూర్ మండలంలోని కర్వెన రిజర్వాయర్లను ఆమె పరిశీలించారు. అనంతరం ఉదండాపూర్ గ్రామంలో నిర్వాసితులను కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పాటు తర్వాత కొన్ని మంచి పనులు జరిగాయన్నారు. పాలమూరు ప్రాజెక్టు పనులు 80% పూర్తయ్యాయని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలు అయినా మిగిలిన పనులుపూర్తి చేయడంలేదని ఆమె ఆరోపించారు.


నకిరేకల్ - అర్వపల్లి జాతీయ రహదారిపై మాదారం వద్ద పత్తి తగులబెడుతున్న రైతులు

తేమ సాకుతో కొర్రీలు పెట్టొద్దు

» పత్తి బస్తాలు తగులబెట్టి రైతుల నిరసన

శాలిగౌరారం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తేమ శాతం సాకుతో కొనుగోలుకు కొర్రీలు పెడుతున్నారని పత్తి రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ రోడ్డెక్కారు. మంగళవారం నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం నకిరేకల్-అర్వపల్లి జాతీయ రహదారిపై మాదారం వద్ద రాస్తారోకో చేశారు. కొన్ని పత్తి బస్తాలకు నిప్పు పెట్టి నిరసన వ్యక్తం చేశారు. మాదారంలోని టీటీఆర్ కాటన్ మిల్లులో సీసీఐ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. పత్తిని విక్రయించేందుకు 51మంది రైతులు స్లాట్ బుక్ చేసుకోగా, ఆరుగురు రైతులు తెచ్చిన పత్తిని సీసీఐ సిబ్బంది కొనుగోలు చేశారు. పత్తి తేమ శాతం 20కి పైగా ఉందని మంగళవారం ఉదయం పత్తి కొనుగోళ్లను నిలిపివేశారు. 12% తేమ ఉంటేనే పత్తిని కొనుగోలు చేస్తామని సిబ్బంది చెప్పటంతో ఆగ్రహించిన రైతులు రోడ్డుపై బైఠాయించారు. సీఐ కొండల్‌రెడ్డి, మార్కెటింగ్ ఏడీ ఛాయాదేవి, తహసీల్దార్ వరప్రసాద్ అక్కడికి చేరుకుని పత్తి కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని సర్దిచెప్పటంతో ఆందోళన విరమించారు.

అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వులకు దేశవ్యాప్త ప్రత్యేక గుర్తింపు: పీసీసీఎఫ్ సువర్ణ

హైదరాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వులకు దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు లభిస్తోందని తెలంగాణ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ (పీసీసీఎఫ్) డాక్టర్ సువర్ణ చెప్పారు. పర్యావరణం అటవీ వాతావరణ మార్పు మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో దూలపల్లిలోని రాష్ట్ర అటవీ అకాడమీలో 'పర్సనల్ ఎఫెక్టివ్‌నెస్ అండ్ మేనేజ్‌మెంట్'పై 3 రోజుల వర్క్‌షాప్‌ను మంగళవారం ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా సువర్ణ మాట్లాడుతూ.. తెలంగాణలో ఎకో టూరిజం అభివృద్ధి చెందుతోందన్నారు. రాష్ట్రంలోని అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వులు, అర్బన్ పార్కులు దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందుతున్నాయని, అధికారులు తమ సమయానుకూలంగా 'రైజింగ్ వైబ్రంట్ తెలంగాణ'ను సందర్శించాలని సువర్ణ సూచించారు. ఈ కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్ ఎస్‌జే ఆశా, డిప్యూటీ డైరెక్టర్ ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక

» అధ్యక్షురాలిగా జయలక్ష్మి ఎంపిక


పి.జయలక్ష్మి

చిక్కడపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర నూతన కమిటీని మహబూబ్‌నగర్ జిల్లాలో ఈనెల 26, 27 తేదీల్లో జరిగిన నాలుగో రాష్ట్ర మహాసభల్లో ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షురాలిగా పి.జయలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా ఆర్.నీలాదేవి, కోశాధికారిగా పి.గంగమణి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా కె.సునీత, మెట్టు కొండాలక్ష్మి, ఎస్.పద్మ, టి.యాదమ్మ, పి.కళావతి, ఎ.సునీత, సహాయ కార్యదర్శులుగా ఎం.శ్రీలత, వై.యశోద, డి.ధనలక్ష్మి, ఎం.బాలమణి, ఎం.రేవతి, టి.వెంకటమ్మ ఎన్నికయ్యారు. నలుగురు కో-ఆప్షన్ సభ్యులతో కలిపి మొత్తం 19 మంది ఆఫీస్ బేరర్లను, 33 జిల్లాల నుంచి 58 మంది రాష్ట్ర కమిటీ సభ్యులను మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుందని అధ్యక్షురాలు పి.జయలక్ష్మి తెలిపారు.

సమాచారం ఇవ్వని అధికారులకు జరిమానా

(మొదటిపేజీ తరువాయి)

ఇవ్వాల్సి ఉండగా.. ఏడాది దాటినా ఇవ్వకపోవడంతో ఆయన కమిషన్‌ను ఆశ్రయించారు. దీనిపై కమిషన్ కార్యాలయం డీఈఈ రమణా నాయక్‌కు షోకాజ్ నోటీసు జారీచేసింది. గత నెల 22న స్వయంగా హాజరు కావాలని నోటీసు పంపింది. కానీ, ఆయన గైర్హాజరు అయ్యారు. దీంతో ఆయనకు రూ. 5 వేల జరిమానా విధిస్తూ ఆర్టీఐ కమిషనర్ పీవీ. శ్రీనివాసరావు ఇటీవలే ఆదేశాలు జారీచేశారు. మరో కేసులో.. మునిసిపాలిటీకి సంబంధించిన సమాచారం కావాలని జగిత్యాలకు చెందిన ఏ.చంద్రశేఖర్ అనే వ్యక్తి 2022 జనవరిలో దరఖాస్తు చేశారు. దీనిపై కమిషన్ పలుమార్లు ఆదేశించినా సమాచారం ఇవ్వకపోవడంతో దరఖాస్తుదారుకు రూ.2 వేలు పరిహారంగా చెల్లించాలని జగిత్యాల మునిసిపాలిటీ ప్రజా సమాచార అధికారికి కమిషనర్ పివి.శ్రీనివాసరావు ఆదేశాలు జారీ చేశారు. సమాచార హక్కు చట్టం అమలులో నిర్లక్ష్యం వహించే అధికారులపై తీవ్ర చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత.. సమాచార కమిషనర్ ప్రభుత్వ అధికారులకు రూ. 5వేల జరిమానా విధించడం ఇదే ప్రథమం.

మొంథా బీభత్సం!

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

ఏపీ ప్రజలను రెండు రోజులుగా భయపెడుతున్న తీవ్ర తుఫాన్ మొంథా బీభత్సం సృష్టించింది! హోరుగాలులు, జోరు వానలతో వణికించింది! మంగళవారం అర్ధరాత్రి తర్వాత తీరం దాటింది. ఈ సమయంలో 90 నుంచి 100 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీచాయి. అప్పుడప్పుడు వాయువేగం 110 కిలోమీటర్లకూ చేరింది. తీవ్ర తుఫాన్ కారణంగా మంగళవారం తీర ప్రాంతమంతా రాకాసి అలలు ఉవ్వెత్తున ఎగసిపడ్డాయి. ప్రధానంగా ఏడు జిల్లాల్లో పెనుగాలులు బీభత్సం సృష్టించాయి. భారీ వృక్షాలు కూకటివేళ్లతో సహా కూలిపోయాయి. తీవ్ర గాలుల తీవ్రతకు కరెంటు స్తంభాలు పడిపోవడంతో కృష్ణా జిల్లా తీర ప్రాంతమంతా అంధకారం అలుముకుంది. తుఫాన్ ప్రభావంతో కోస్తాలోని అనేక ప్రాంతాల్లో భారీవర్షాలు కురుస్తున్నాయి. ఇవి బుధవారం తెల్లవారుజాము వరకూ కొనసాగుతాయి. పెనుగాలుల ధాటికి చెట్లు, హోర్డింగ్‌లు, విద్యుత్ స్తంభాలు, సెల్ టవర్లు విరిగిపడతాయని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. తీవ్ర తుఫాన్ ప్రభావంతో శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం, పశ్చిమ గోదావరి నుంచి నెల్లూరు జిల్లాలకు ఫ్లాష్ ఫ్లడ్స్ వస్తాయని హెచ్చరిక జారీచేశారు.

కడలి కల్లోలం...

మంగళవారం మధ్యాహ్నం వరకు ప్రశాంతంగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. కమ్ముకొచ్చిన మేఘాలతో చీకట్లు అలుముకున్నాయి. వానకు గాలులు కూడా తోడయ్యాయి. తుఫాన్ ప్రభావంతో సముద్ర తీర ప్రాంతాల్లో 50 నుంచి 80 కిలోమీటర్ల వేగంతో వీసిన గాలులతో తీరప్రాంతవాసులు భయాందోళనకు గురయ్యారు. మధ్యమధ్యలో విరామమిస్తూ, ఒక్కసారిగా వర్షం విరుచుకుపడింది. దీంతో లోతట్టు ప్రాంతాలు వాన నీటితో నిండిపోయాయి. శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు భారీవర్షాలు కురుస్తుండడంతో పంటలు దెబ్బతింటున్నాయి. గాలులకు చాలాప్రాంతాల్లో భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. రాష్ట్ర రహదారులపై చెట్లు పడటంతో ఇతర జిల్లాలతో రాకపోకల బంధం తెగిపోయింది. పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండలం ఏలూరుపాడు వద్ద రాష్ట్ర రహదారిపై భారీ వృక్షం విరిగిపడడంతో విజయవాడకు వెళ్లాల్సిన బస్సులు నిలిచిపోయాయి. కృష్ణా జిల్లా పరిధిలో సముద్రం అల్లకల్లోలంగా మారి రెండు నుంచీ మూడు మీటర్ల మేర అలలు ఎగిసిపడ్డాయి. మంగినపూడి బీచ్ వద్ద సముద్రం 300 మీటర్లు ముందుకువచ్చింది. మొంథా తుఫాన్ విశాఖపట్నం జిల్లాపై తీవ్ర ప్రభావం చూపించింది. ఎక్కడికక్కడ చెట్లు మొదళ్లతో సహా నేలకు ఒరిగిపోయాయి. కొన్నిచోట్ల చెట్లు పడి కార్లు ధ్వంసమయ్యాయి. బీచ్ రోడ్డులో సీతకొండపైనుంచి బండరాళ్లు జారి పడ్డాయి. వర్షాలకు కొండలపై నుంచి నీటితోపాటు కొండచిలువ కూడా కొట్టుకురావడంతో ఆరిలోవలో కలకలం రేగింది. బంగాళాఖాతాన్ని ఆనుకుని ఉండటంతో శ్రీకాకుళం జిల్లాపై మొంథా తుపాను తీవ్ర ప్రభావం చూపింది. మంగళవారం జిల్లా అంతటా వర్షం కురుస్తూనే ఉంది. ఒడిశా నుంచి వరద నీరు ప్రాజెక్టుల్లోకి చేరడంతో మహేంద్రతనయ, బహుదా, వంశధార, నాగావళి నదులు ఉధృతంగా ప్రవహించాయి. బందరువానిపేట, కళింగపట్టణం, కొవ్వాడ తీరాలవద్ద సముద్రం మరింత ముందుకొచ్చేసింది. తీరం గతంకంటే ఎక్కువగా కోతకు గురైంది. ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి నియోజకవర్గంలో సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం ఉదయం 8.30 గంటల వరకు కుండపోతగా వర్షం కురిసింది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఒక మోస్తరు నుంచి భారీవర్షాలు కురుస్తున్నాయి. గెడ్డలు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. విజయనగరం జిల్లా అంతటా ఎడతెరిపి లేకుండా వానలు పడుతున్నాయి. అలలు సాధారణం కంటే ఎక్కువ ఎత్తులో ఎగసి పడుతున్నాయి. నెల్లూరు జిల్లాలోని ఉలవపాడు, కావలిలో 17 సెం.మీ. వర్షం కురిసింది. వాగులో ఒకరి గల్లంతయ్యారు. పునరావాస కేంద్రాలకు 75 వేల మందిని తరలించారు.

నేడూ భారీ వర్షాలు...

మొంథా తుఫాన్ తీరం దాటిందని విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. కాకినాడకు 90 కిలోమీటర్లు, మచిలీపట్నానికి 90 కిలోమీటర్లు, విశాఖపట్నానికి 220 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమైన తీవ్ర తుఫాన్ క్రమంగా బలహీన పడుతుందని తెలిపింది. దీని ప్రభావంతో బుధవారం శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయని ప్రకటించింది. కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు నుంచి భారీ వర్షాలు; ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు నుంచి భారీ వర్షాలు పడతాయని పేర్కొంది. కోస్తాంధ్ర, యానాం తీరప్రాంతంలో మంగళవారం రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు గరిష్ఠంగా గంటకు 90-110 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని తెలిపింది. బుధవారం మధ్యాహ్నానికి 60-80కిలోమీటర్లు, సాయంత్రానికి 45-55కిలోమీటర్లు వేగంతో వీచి, తర్వాత క్రమంగా గాలి తీవ్రత తగ్గుతుందని తెలిపింది. మత్స్యకారులు గురువారం వరకు సముద్రంలోకి వెళ్లవద్దని సూచించింది. మొంథా తుఫాను నిర్దిష్టంగా ఎక్కడ తీరాన్ని తాకింది... ఎక్కడ దాటిందనే అంశంపై స్పష్టత లేదు. యానాం- నర్సాపురం మధ్య అంతర్వేది సమీపంలో తీరం దాటిందని కొందరు చెబుతుండగా... అది కాకినాడకు దక్షిణాన తీరాన్ని తాకినట్లు కొందరు అంచనా వేశారు. ఇవేవీ కాదు... మచిలీపట్నం - హంసలదీవి మధ్య తీవ్ర తుఫాన్ తీరం దాటిందని మరొకరు చెప్పారు. మొత్తానికి... మంగళవారం రాత్రి ఎనిమిది గంటలకు తుఫాను తీరాన్ని తాకింది.


నీటమునిగిన ఒంగోలులోని కర్నూలు రోడ్డు


ఉప్పాడ వద్ద అల్లకల్లోలంగా సముద్రతీరం


శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలం జగన్నాథపురంలో నీటమునిగిన వరిపంట

శంషాబాద్‌లో విమాన రాకపోకలకు అంతరాయం

హైదరాబాద్, శంషాబాద్ రూరల్ (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో విమానాల రాకపోకలకు మంగళవారం తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఉదయం నుంచి విజయవాడ, విశాఖపట్నం, రాజమండ్రికి వెళ్లిరావాల్సిన 18 విమాన సర్వీసులు రద్దయ్యాయి. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వచ్చే రెండు మూడు రోజుల్లో ఎవరు కూడా ఈ మూడు ప్రాంతాలకు విమాన టికెట్లు బుక్ చేసుకోవొద్దని ఎయిర్‌లైన్స్ అధికారులు ప్రయాణికులకు విజ్ఞప్తి చేశారు. ఇక ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ 3 విమానాలు, ఇండిగో 15 విమాన సర్వీసులు రద్దయ్యాయి. ప్రయాణికులకు టికెట్ డబ్బులు వాపస్ ఇస్తామని ఎయిర్‌లైన్స్ ప్రకటించారు. తుఫాన్ తీవ్రతను ముందుగానే అంచనా వేసిన దక్షిణమధ్యరైల్వే అధికారులు జోన్ పరిధిలోని 92 రైళ్లను మంగళవారం నుంచే రద్దు చేయగా, తాజాగా బుధ, గురువారాల్లో మరో మూడు ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ముంబై నుంచి హైదరాబాద్ మీదుగా విశాఖపట్నం వెళ్లే (18520) ఎక్స్‌ప్రెస్‌తో పాటు ముంబై-భువనేశ్వర్ మధ్య నడిచే (11019) కోణార్క్, విశాఖపట్నం-మహబూబ్‌నగర్ మార్గంలో నడిచే (12861) ఎక్స్‌ప్రెస్ కూడా రద్దయ్యాయని సీపీఆర్వో శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొంథా తుపాను ప్రభావంతో బుధవారం మంచిర్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం తెలిపింది. ఇక ఆసిఫాబాద్, జగిత్యాల, కరీంనగర్, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, జనగాం, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది.

22 జిల్లాలు..403 మండలాలు.. తుఫాన్ ప్రభావంపై ఏపీ ప్రభుత్వ అంచనా

రాష్ట్రవ్యాప్తంగా 22 జిల్లాల్లోని 403 మండలాలపై మొంథా తుఫాన్ ప్రభావం ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. దానికి తగినట్టే చర్యలు తీసుకుంటున్నారు. అనంతపురం, శ్రీసత్యసాయి, అన్నమయ్య, కర్నూలు జిల్లాలను మినహాయిస్తే తక్కిన రాష్ట్రమంతా ప్రభావం ఉంటుందని భావిస్తున్నారు. రాష్ట్రంలో మొత్తం 1,204 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. 75,802 మందిని ఈ కేంద్రాలకు తరలించారు. 219పైగా మెడికల్ క్యాంపులను వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. అత్యవసర సమాచార వ్యవస్థ కోసం 81 వైర్‌లెస్ టవర్లను ఏర్పాటుచేశారు. 21పైగా భారీ సైజు ఆస్కా ల్యాంపులను సిద్ధంచేసింది. జేసీబీలు, ప్రొక్లెయినర్లు, క్రేన్లు 1,447, 321 డ్రోన్లను సిద్ధంగా ఉంచింది. తుఫాన్ ప్రభావంపై ఇప్పటి వరకు 3.6కోట్ల మంది మొబైల్ ఫోన్ల ద్వారా సంక్షిప్త సమాచారంగా హెచ్చరికలు జారీ చేసింది.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రకాశ్ కారత్

ఎన్నికల సంఘానివి రాజకీయ నిర్ణయాలు

» ఎస్ఐఆర్ అమలు చేయాలన్న నిర్ణయం సరికాదు

» ఆర్ఎస్ఎస్, బీజేపీకి వ్యతిరేకంగా పోరాటం చేస్తాం

» సీపీఎం నేత ప్రకాశ్ కారత్

» లౌకిక శక్తులన్నింటినీ ఏకం చేస్తాం

» పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు

» విద్యార్థి సంఘాల బంద్‌కు మద్దతు: జాన్ వెస్లీ

హైదరాబాద్, రాంనగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ రాజకీయ ఉద్దేశంతో నిర్ణయాలు తీసుకుంటున్నదని సీపీఎం మాజీ ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ కారత్ ఆరోపించారు. హైదరాబాద్‌లో ఈ నెల 23న ప్రారంభమైన సీపీఎం అఖిల భారతస్థాయి రాజకీయ శిక్షణ తరగతుల ముగింపు సమావేశంలో మంగళవారం ఆయన ప్రసంగించారు. 12 రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ అమలు చేయాలని నిర్ణయించడం సరికాదని, లౌకిక ప్రతిపక్ష పార్టీలన్నీ ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశాయని అన్నారు. ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తూ కేరళ అసెంబ్లీ తీర్మానం చేసిందని చెప్పారు. ఎస్ఐఆర్‌పై సుప్రీం కోర్టు మధ్యంతర ఉత్తర్వులు మాత్రమే ఇచ్చిందని, ఇంకా తుది తీర్పు ఇవ్వలేదన్నారు. ఈసీ స్వతంత్రంగా వ్యవహరించి, ప్రజలు స్వేచ్ఛగా ఓటేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పుడు అధికారంలో ఉన్న పార్టీ గతంలో ఈసీ తీసుకున్న నిర్ణయాలను వ్యతిరేకించిందని గుర్తు చేశారు. ప్రస్తుత ఈసీ తీరుపై అనుమానాలు వస్తున్నాయని, అధికార పార్టీకి అనుకూలంగా నిర్ణయాలు తీసుకోవడం సరైంది కాదన్నారు. దేశవ్యాప్తంగా సీపీఎంను బలోపేతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ, హిందుత్వ శక్తులకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో బీజేపీ, ఆర్ఎస్ఎస్‌కు వ్యతిరేకంగా జరిగే పోరాటాలకు పార్టీ శ్రేణులను సంసిద్ధం చేస్తామన్నారు. లౌకిక శక్తులన్నీ ఒకే వేదిక మీదకు తేవడం తమ లక్ష్యమన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30న విద్యార్థి సంఘాలు నిర్వహిస్తున్న రాష్ట్ర బంద్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు.

ఏరో ఇంజిన్ రాజధానిగా తెలంగాణ

2030 నాటికి తీర్చిదిద్దేలా రోడ్ మ్యాప్: మంత్రి శ్రీధర్‌బాబు.. ఆదిభట్లలో ఏరో ఇంజిన్ రొటేటివ్ కాంపొనెంట్స్ తయారీ

» కేంద్రాన్ని వర్చువల్‌గా ప్రారంభించిన మంత్రి

హైదరాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఐదేళ్లలో (2030 నాటికి) తెలంగాణను దేశ 'ఏరో ఇంజిన్' రాజధానిగా తీర్చిదిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఈ లక్ష్య సాధనకు అంతర్జాతీయ, జాతీయ దిగ్గజ ఏరో సంస్థలు రాష్ట్రంలో కొత్తగా పెట్టుబడులు పెట్టేలా సమగ్ర 'రోడ్ మ్యాప్'ను సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. 'టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్'.. అంతర్జాతీయ వాణిజ్య, మిలిటరీ ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్ల తయారీ దిగ్గజం 'శాఫ్రాన్ ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్స్' భాగస్వామ్యంతో ఆదిభట్లలోని టాటా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఏరో ఇంజిన్స్‌లో ఏర్పాటు చేసిన అధునాతన 'ఏరో ఇంజిన్ రొటేటివ్ కాంపొనెంట్స్ తయారీ కేంద్రాన్ని మంత్రి మంగళవారం వర్చువల్‌గా ప్రారంభించారు. రెండు దిగ్గజ సంస్థలు రూ.425 కోట్ల పెట్టుబడితో సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ తయారీ కేంద్రం ద్వారా 500 మందికి ఉపాధి లభిస్తుందని.. తెలంగాణ బ్రాండ్ విశ్వవ్యాప్తమవుతుందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రాన్ని గ్లోబల్ 'ఏరోస్పేస్-డిఫెన్స్, స్పేస్ టెక్నాలజీ హబ్‌'గా మార్చేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు. హైదరాబాద్ అంటే కేవలం 'సిటీ ఆఫ్ పెరల్స్' మాత్రమే కాదని.. ఈ నగరాన్ని తాము 'సిటీ ఆఫ్ ప్రొపల్షన్, ప్రెసిషన్, ప్రోగ్రెస్'గా తీర్చిదిద్దేందుకు, ఏరోస్పేస్-డిఫెన్స్ కేంద్రంగా మార్చేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ఏరోస్పేస్, రక్షణ రంగాల ఎగుమతులు 2023-24లో రూ.15,900 కోట్లు ఉండగా, 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొదటి 9నెలల్లోనే రూ.30,742 కోట్లకు పెరిగాయన్నారు. ఇవి కేవలం అంకెలు మాత్రమే కాదని, తమ ప్రభుత్వ హ యాంలో ఈ రంగం సాధించిన వృద్ధి రేటుకు నిదర్శనమని చెప్పారు. ఈ కొత్త తయారీ కేంద్రంలో ఎయిర్‌బస్, బోయింగ్ సంస్థలు లీప్ ఇంజిన్ల తయారీలో వినియోగించే బేరింగ్ హౌసింగ్(స్టేషనరీ కాంపోనెంట్), లో ప్రెషర్ టర్బైన్ షాఫ్ట్(రొటేటివ్ కాంపోనెంట్) తయారవుతాయని తెలిపారు. ఇక.. "ఏరోస్పేస్ టెక్నాలజీకి సంబంధించి రొటేటివ్ ఏరో ఇంజిన్ విడిభాగాలు చాలా కీలకమైనవి. భారత్‌లో అధునాతన తయారీ కేంద్రాలను ఏర్పాటు చేయడంపై మా నిబద్ధతకు, మా సామర్థ్యానికి ఈ అంతర్జాతీయ స్థాయి కేంద్రం నిదర్శనంగా నిలుస్తుంది" అని టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, మేనేజింగ్ డైరెక్టర్ సుకరన్ సింగ్ అన్నారు. ఈ కార్యక్రమంలో టాటా అడ్వాన్స్ సిస్టమ్స్ లిమిటెడ్ ఈడీ మసూద్ హుస్సేన్, టీజీఐఐసీ ఎండీ శశాంక తదితరులు పాల్గొన్నారు.


ఏరో ఇంజిన్ రొటేటివ్ కాంపొనెంట్స్ తయారీ కేంద్రాన్ని వర్చువల్‌గా ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

సానుభూతితో ఓట్లేస్తే.. మన భవిష్యత్తుకు కష్టమే

» కాంగ్రెస్, బీఆర్ఎస్‌లవి మోసపు హామీలు

» మూసీ ప్రక్షాళన పేరిట దోపిడీకి ప్రణాళిక

» జూబ్లీహిల్స్ అభివృద్ధి కోసం బీజేపీ గెలవాలి

» మహాపాదయాత్రలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో సానుభూతి కోసమని ఓట్లు వేస్తే.. మన భవిష్యత్తుకు కష్టమేనని, ఇతరుల సానుభూతి పొందాల్సి వస్తుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్‌రెడ్డి మాటలు కోటలు దాటుతున్నాయే తప్ప జరిగిన అభివృద్ధేమీ లేదని విమర్శించారు. జూబ్లీహిల్స్‌లో కబ్జాలు, అక్రమాలు, రౌడీయిజం, నేరాలు విపరీతంగా పెరిగిపోయాయని.. ఈ పరిస్థితిని చక్కదిద్ది, నియోజకవర్గాన్ని అభివృద్ధి చెందాలంటే బీజేపీ గెలవాలని పేర్కొన్నారు. మంగళవారం బీజేపీ మహాపాదయాత్రలో భాగంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని ఎల్లారెడ్డిగూడ పరిధిలో కిషన్‌రెడ్డి ఇంటింటి ప్రచారం చేశారు. బీజేపీ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ తెలంగాణను మోసం చేసిందని, 'బంగారు తెలంగాణ' చేస్తానన్న కేసీఆర్ తన కుటుంబాన్ని మాత్రమే బంగారం చేసుకున్నారని ఆరోపించారు. బోరబండ, రహ్మత్‌నగర్‌లలో గంట పాటు పాదయాత్ర చేయగలవా అని కేసీఆర్‌ను సవాల్ చేశారు. ఇక హైదరాబాద్ అభివృద్ధి పట్ల కాంగ్రెస్‌కు ఎలాంటి చిత్తశుద్ధి లేదని, మూసీ ప్రక్షాళన పేరిట దోచుకుకోవాలని చూస్తోందని కిషన్‌రెడ్డి ఆరోపించారు. ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీ చేస్తున్నది కాంగ్రెస్ అభ్యర్థి కాదు. మజ్లిస్ మాజీ అభ్యర్థి. ఒవైసీలు చెబితేనే కాంగ్రెస్ ఆయనను ఎంపిక చేసింది. గతంలో కేసీఆర్ మజ్లి‌స్‌ను భుజాలపై మోశారు. ఇప్పుడు కాంగ్రెస్ అదే పని చేస్తోంది" అని ఆయన విమర్శించారు.


పాదయాత్రలో కిషన్‌రెడ్డి

డబుల్ ఇంజన్ ప్రభుత్వానికి మార్గం సుగమం: ఎన్.రాంచందర్ రావు

ఎర్రగడ్డ డివిజన్‌లోని పలు బస్తీల్లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు మహాపాదయాత్ర చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక తెలంగాణ రాజకీయ ముఖచిత్రంలో మార్పులు తీసుకువచ్చే అవకాశం ఉందని చెప్పారు. బీఆర్ఎస్‌ను గెలిపించడం వృథా అని, కాంగ్రెస్‌ను నిలదీయాలంటే బీజేపీ గెలవాలని.. అది తెలంగాణలో డబుల్ ఇంజన్ సర్కారుకు మార్గం సుగమం చేస్తుందని పేర్కొన్నారు. ఇక శ్రీనగర్ కాలనీలో బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో అవినీతి, అరాచకాలు పెరిగిపోయాయని.. కమీషన్లు, అవినీతి మీద ఉన్న శ్రద్ధ ప్రజా సంక్షేమం పట్ల లేదని ఆరోపించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉండగా తనపై 20-30 అక్రమ కేసులు బనాయించారని, వాటిలో వాస్తవాలు ఉంటే రాజకీయాలు వదిలేసేందుకు తాను సిద్ధమని.. మరి కేటీఆర్, హరీశ్‌రావు వదిలేస్తారా అని జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ సవాల్ విసిరారు. బీజేపీ పాదయాత్రలో ఎంపీ కె.లక్ష్మణ్, ఈటల రాజేందర్, సీనియర్ నాయకుడు మురళీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు. కాగా, బీజేపీ మాత్రమే దివ్యాంగుల హక్కులను కాపాడుతుందని ఆ పార్టీ రాష్ట్రశాఖ అధ్యక్షుడు రాంచందర్‌రావు చెప్పారు. వారికి మోదీ సర్కారు ఉచితంగా ట్రై సైకిళ్లు, వినికిడి పరికరాలు పంపిణీ చేస్తోందన్నారు. మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాంచందర్‌రావును కలుసుకున్న కొందరు దివ్యాంగులు.. తమ సంక్షేమం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. తమకు ప్రతి నెలా రూ.6,000 పెన్షన్ ఇస్తామని అసెంబ్లీ ఎన్నికల్లో హామీనిచ్చిన కాంగ్రెస్ ఇప్పటి వరకూ అమలు చేయడం లేదన్నారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడుతూ దివ్యాంగులను మోసం చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదన్నారు. దివ్యాంగులకు సమాన హక్కులను కల్పించడంతో పాటు గౌరవం అందించడానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన చెప్పారు.

నియోజకవర్గాల్లో అంబేడ్కర్ నాలెడ్జ్ సెంటర్లు

» స్థానికంగానే కోచింగ్‌కు ఏర్పాట్లు: భట్టి



మధిర, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువత పోటీ పరీక్షల కోచింగ్ కోసం హైదరాబాద్ వెళ్లే అవసరం లేకుండా అన్ని నియోజకవర్గాల్లో అంబేడ్కర్ నాలెడ్జ్ సెంటర్లను ఏర్పాటు చేస్తామని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. మంగళవారం ఖమ్మం జిల్లా మధిరలోని తన క్యాంపు కార్యాలయంలో విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణాతో కలిసి మధిరలో విద్యాశాఖ పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం తొలిప్రాధాన్యంగా విద్య, వైద్యాన్ని తీసుకుందన్నారు. ఒకేసారి 78 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ స్కూళ్లల్లో కార్పొరేట్ సంస్థలను సంప్రదించి వారికి ఉపయోగపడేలా ప్రతీ విద్యార్థికి ఉపాధి లభించేలా సిలబస్‌ను రూపొందిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని ఐటీఐలను మారిన పరిస్థితులకు అనుగుణంగా, ఉపాధి కల్పనే ధ్యేయంగా అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేయనున్నామని ఆయన తెలిపారు.

10 రోజుల్లో అంగన్‌వాడీ నియామకాలు

» సుప్రీం స్టే ఎత్తివేతకు చర్యలు తీసుకోవాలి

» అధికారులకు మంత్రి సీతక్క ఆదేశం

హైదరాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్ల నియామకాలకు ఆటంకంగా మారిన సుప్రీంకోర్టు స్టే ఉత్తర్వుల ఎత్తివేతకు చర్యలు తీసుకోవాలని అధికారులను రాష్ట్ర మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ ధనసరి సీతక్క ఆదేశించారు. ఈ విషయమై సచివాలయంలో మహిళా శిశు సంక్షేమశాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ శృతి ఓజా, న్యాయశాఖ కార్యదర్శి పాపిరెడ్డి, రిటైర్డు ఐఏఎస్- పీఆర్సీ చైర్మన్ శివశంకర్ తదితరులతో మంగళవారం సమావేశమైన సీతక్క.. అంగన్‌వాడీ టీచర్ల నియామకాల్లో న్యాయపరమైన చిక్కులను అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఏజెన్సీ ప్రాంతాల్లోని కేంద్రాల్లో అంగన్‌వాడీ టీచర్లను ఎస్టీలకే రిజర్వు చేసిన సంగతిని అధికారులు మంత్రి దృష్టికి తెచ్చారు. తదనుగుణంగా సుప్రీంకోర్టులో స్టే వెకేట్ చేయడానికి పిటిషన్ దాఖలు చేయాలని అధికారులను మంత్రి సీతక్క ఆదేశించారు. 10 రోజుల్లో నియామక ప్రక్రియకు మార్గం సుగమం చేయాలని సూచించారు.

మొగిలిగిద్ద పాఠశాలకు రూ. 10 కోట్లు

» సీఎం హామీ మేరకు ఉత్తర్వులు జారీ

హైదరాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : రంగారెడ్డి జిల్లా ఫారూక్‌నగర్ మొగిలిగిద్ద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ. 10 కోట్లు కేటాయించింది. ఇది రాష్ట్రంలోనే అత్యంత పురాతన పాఠశాలగా పేరుగాంచింది. ఈ ఏడాది జనవరి 31న ఆ పాఠశాలలో నిర్వహించిన 150వ వార్షికోత్సవ వేడుకలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. శిథిలావస్థలో ఉన్న భవనం స్థానంలో కొత్త భవనం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా నిధులు విడుదల చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పత్తిలో తేమ శాతం తగ్గించండి

» సీసీఐ చైర్మన్‌ను కోరిన మంత్రి కోమటిరెడ్డి



సీసీఐ చైర్మన్ లలిత్ కుమార్ గుప్తాను కలిసిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పత్తిలో తేమ శాతం తగ్గించాలని, తెలంగాణలో పత్తి రైతుల కష్టాలను తీర్చాలని కోరుతూ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి.. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) చైర్మన్ లలిత్‌కుమార్ గుప్తాకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ముంబై వెళ్లిన మంత్రి సీసీఐ చైర్మన్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పత్తిలో 8-12 తేమ శాతంతో కొనుగోలు అసాధ్యమని, దానిని 14% వరకు సడలించాలని కోరారు. మంత్రి చేసిన విజ్ఞప్తులను కేంద్ర ప్రభుత్వంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని సీసీఐ చైర్మన్ చెప్పారని మంగళవారం మంత్రి కార్యాలయం ఓ ప్రకటనలో పేర్కొంది. కాగా మంత్రి వెంట ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఉన్నారు.

ఇండియన్ రోడ్ కాంగ్రెస్ సదస్సు తెలంగాణలో!

» ప్రభుత్వానికి ఆర్ అండ్ బీ ఈఎన్సీ ప్రతిపాదనలు

» కేంద్రానికి లేఖ రాసిన మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ రోడ్ కాంగ్రెస్ (ఐఆర్‌సీ) 85వ సదస్సును తెలంగాణలో నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధంగా ఉంది. వచ్చే ఏడాది ఈ సదస్సును తెలంగాణలో జరిపేందుకు అవకాశం కల్పించాలని, తద్వారా కలిగే లాభాలను తెలుపుతూ రోడ్లు,భవనాల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ మోహన్‌నాయక్ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. వాటిని పరిశీలించిన ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీంతో 85వ ఐఆర్‌సీని తెలంగాణలో జరిపేందుకు సిద్ధంగా ఉన్నామని, అందుకు అవకాశం కల్పించాలని కోరుతూ ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తాజాగా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి లేఖ రాసినట్టు తెలిసింది. ప్రస్తుతం 84వ ఇండియన్ రోడ్ కాంగ్రెస్ సదస్సును ఈ ఏడాది నవంబరులో ఐదు రోజుల పాటు ఒరిసా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో నిర్వహిస్తున్నారు. నవంబర్ 5 నుంచి 10వరకు జరిగే ఆ సదస్సుకు తెలంగాణ నుంచి దాదాపు 30 మంది వరకు ప్రతినిధులు హాజరవుతున్నారు. వచ్చే ఏడాది తెలంగాణలో ఐఆర్‌సీ సదస్సును నిర్వహించేందుకు కేంద్రం ఆమోదం తెలిపితే.. భువనేశ్వర్‌లో జరిగే ఐఆర్‌సీ ముగింపు కార్యక్రమంలోనే 2026 సదస్సు తెలంగాణలో నిర్వహిస్తున్నట్టు ప్రకటించే అవకాశం ఉందని సమాచారం.

గురుకులాల పనుల్లో ఇంత జాప్యమెందుకు?!

» అధికారులను ప్రశ్నించిన సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి

హైదరాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): 'గిరిజన గురుకులాల భవన నిర్మాణాల్లో ఎందుకింత జాప్యం జరుగుతోంది. 2016లో మంజూరైన పనులూ ఇప్పటి వరకు పూర్తి కాలేదన్న సంగతి నా దృష్టికి ఎందుకు తేలేదు' అని సంబంధిత శాఖ అధికారులను రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి, గిరిజన, మైనారిటీల సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రశ్నించినట్లు సమాచారం. 'వెంటనే ఈ పనులను పర్యవేక్షిస్తున్న ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించి కారణాలపై విశ్లేషణతో కూడిన నివేదిక పంపండి' అని అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. మంత్రి ఆదేశాలతో బుధవారం గిరిజన సంక్షేమశాఖ ఇంజనీర్లతో ఆ శాఖ ఉన్నతాధికారులు సమావేశం కానున్నారు. ఈ మేరకు గిరిజన సంక్షేమశాఖ ఇంజనీర్లను గిరిజన గురుకులాల సంస్థ కార్యదర్శి సీతాలక్ష్మి ఆదేశించారు. ఈ విషయమై సీఎంవో సైతం సంబంధిత అధికారులనడిగి వివరాలు తెలుసుకున్నట్లు వినికిడి.

'అరణ్యంలో కాదు... అందరి మధ్యలో ఉండాలి'

» మావోయిస్టు అగ్రనేత తిరుపతికి తమ్ముని కూతురు లేఖ

కోరుట్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): 'మీరు అరణ్యంలో కాదు.. అందరి మధ్యలో ఉండాలి' అని కోరుతూ మావోయిస్టు అగ్ర నేత, జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణ వాసి తిప్పిరి తిరుపతి(58)కి అతని తమ్ముడు కూతురు సుమ మంగళవారం లేఖ రాసింది. " మీరు ఇప్పటికే గెలిచేశారు. మీ నుంచి ఎంతో నేర్చుకోవాలి అని ఎదురు చూసే సమాజం కోసం, ఒక మార్పు కోసం అందరి మధ్యలోని రావాలి. ఇది లొంగుబాటు కాదు.. లోకానికి మీ తెలివి అవసరం." అని లేఖలో పెదనాన్నను అభ్యర్థించింది.

డివిజన్‌కు ఇద్దరు మంత్రులు

» జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసం బాధ్యతలు అప్పగించిన మహేశ్‌గౌడ్, మీనాక్షి



హైదరాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న అధికార కాంగ్రెస్ పార్టీ.. పోలింగ్ తేదీ సమీపిస్తున్న కొద్దీ మరింతగా దృష్టి సారిస్తోంది. ఇప్పటిదాకా ఈ ఉప ఎన్నిక ఇన్‌చార్జి బాధ్యతలను ముగ్గురు మంత్రులే పర్యవేక్షిస్తుండగా.. ఇకపై క్యాబినెట్ మొత్తాన్ని రంగంలోకి దించాలని నిర్ణయించింది. నియోజకవర్గంలోని మొత్తం ఏడు డివిజన్లకుగాను ఒక్కో డివిజన్‌కు ఇద్దరు మంత్రుల చొప్పున కేటాయించి.. వారికి ఎన్నికల పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించింది. తమకు కేటాయించిన డివిజన్లలో ఎన్నికల ప్రచారంతో పాటు స్థానిక సమస్యలపై ఓటర్లకు తగిన భరోసా ఇచ్చే బాధ్యత కూడా వారిదేనని పేర్కొంది. ఇందులో భాగంగా యూసుఫ్‌గూడ డివిజన్‌ను మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌కు, రహమత్‌నగర్ డివిజన్‌ను కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి, వెంగళ్‌రావునగర్ డివిజన్‌ను తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరికి, సోమాజిగూడ డివిజన్‌ను శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్‌కు, షేక్‌పేట్ డివిజన్‌ను కొండా సురేఖ, వివేక్ వెంకటస్వామికి, ఎర్రగడ్డ డివిజన్‌ను మంత్రులు దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావుకు కేటాయించారు. ఇక బోరబండ డివిజన్ బాధ్యతలను మంత్రి సీతక్కతోపాటు నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవికి అప్పగించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక బాధ్యులతో సోమవారం రాత్రి వరకూ టూరిజం ప్లాజాలో జరిగిన సమావేశంలో టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ ఈ విషయాన్ని ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకత్వం వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రాన్ని నమూనాగా చూపించి ఎన్నికలకు వెళ్లాలనుకుంటోందని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్ అన్నారు. ఈ పరిస్థితుల్లో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలుపు చాలా కీలకమన్నారు. నిర్లక్ష్యానికి తావు లేకుండా పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. కాగా, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో సర్వేలు కాంగ్రెస్ అభ్యర్థికే సానుకూలంగా ఉన్నాయని మంత్రి వివేక్ తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రచారానికి దిగిన తర్వాత ఈ సానుకూలత పెరుగుతుందని చెప్పారు.

మైనారిటీ నేతలతో మహేశ్ భేటీ

టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ మంగళవారం కాంగ్రెస్ పార్టీకి చెందిన మైనారిటీ నేతలతో సమావేశమయ్యారు. గోల్కొండ హోటల్‌లో జరిగిన ఈ సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అజరుద్దీన్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, వివిధ సంస్థల చైర్మన్లు రియాజ్, కొత్వాల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. ముస్లిం ఓటర్లను ఆకట్టుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపై నేతల నుంచి అభిప్రాయాలు స్వీకరించారు.

టికెట్ల పెంపు ఆదాయంలో కార్మికులకు 20%!

(మొదటిపేజీ తరువాయి)



సీఎం రేవంత్‌కు జ్ఞాపికను అందజేస్తున్న ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు, సినీ కార్మిక సంఘాల నేతలు

జీవో ఇస్తుందని స్పష్టం చేశారు. దీంతోపాటు.. సినీ కార్మికుల పిల్లలకు కృష్ణానగర్‌లో కార్పొరేట్ స్థాయిలో పాఠశాల నిర్మిస్తామన్నారు. ఇందుకోసం మూడు, నాలుగు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని చూడాలని అధికారులను ఆదేశించారు. భారత ఫ్యూచర్ సిటీలోనూ సినీ పరిశ్రమకు ప్రాధాన్యం ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. మంగళవారం సాయంత్రం సినీ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో యూసఫ్‌గూడ పోలీస్ గ్రౌండ్‌లో సీఎం రేవంత్‌రెడ్డికి అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఒకప్పుడు తెలుగు చిత్ర పరిశ్రమను 'మదరాసి' అని పిలిచేవారని, ఆనాటి ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి ఈ పరిశ్రమను హైదరాబాద్‌కు తరలించడానికి ఎంతో కృషి చేశారని తెలిపారు. ఎన్టీ రామారావు, అక్కినేని నాగేశ్వరరావు వంటి దిగ్గజ నటుల సహకారంతోనే పరిశ్రమ హైదరాబాద్‌లో స్థిరపడిందన్నారు. కళాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతోనే తక్కువ ధరకే భూములు ఇచ్చారని, చిత్రపురి కాలనీ అభివృద్ధిలో నాటి నాయకుల కృషిని మరిచిపోకూడదని అన్నారు. నటుడు ప్రభాకర్ రెడ్డి సినీ కార్మికుల కోసం తన 10 ఎకరాల సొంత భూమిని ఇచ్చారని గుర్తు చేశారు. తెలుగు సినిమా నేడు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందుతూ.. ఆస్కార్ స్థాయికి ఎదుగుతోందంటే దాని వెనుక నటులు, డైరెక్టర్లే కాకుండా సినీ కార్మికుల కష్టం, శ్రమ ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. సినీ కార్మికుల శ్రమ తనకు తెలుసునని, అధికారంతో తన కళ్లు మూసుకుపోలేదని చెప్పారు. కృష్ణానగర్‌లో నిర్మించే స్కూల్లో సినీ కార్మికుల పిల్లలకు నర్సరీ నుంచి 12వ తరగతి వరకు కార్పొరేట్ స్థాయిలో ఉచితంగా చదువు చెప్పించే బాధ్యత తాను తీసుకుంటానన్నారు. వారికి ఉదయం బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్నం లంచ్ కూడా పెట్టే ఏర్పాటు చేస్తామని తెలిపారు. సినీ కార్మికులకు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్య సౌకర్యం కల్పిస్తామన్నారు. హాలీవుడ్ సినిమా షూటింగ్‌లు హైదరాబాద్‌లో జరగాలని, హైదరాబాద్ నగరం ప్రపంచ సినీ పరిశ్రమకు వేదిక కావాలన్నదే తన ఆలోచన అని తెలిపారు. పదేళ్ల ఆగిపోయిన నంది అవార్డుల స్థానంలో గద్దర్ అవార్డులను అందిస్తున్నామని గుర్తుచేశారు. సినీ పరిశ్రమను చిన్న చూపు చూసే ప్రసక్తే లేదని, ఐటీ, ఫార్మాలాగే సినీ పరిశ్రమకూ తమ ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందని స్పష్టం చేశారు. చిత్రపురి కాలనీ, ఫిలింనగర్, కృష్ణానగర్‌లాగే.. కొత్తగా నిర్మించుకుంటున్న భారత్ ఫ్యూచర్ సిటీలో సినీ రంగానికి పాత్ర ఉంటుందన్నారు.

కార్మికుల కష్టం వల్లే కనకవర్షం...

"ప్రభుత్వం సినిమా టికెట్ల ధరలు పెంచితే హీరోలకు, నిర్మాతలకు ఆదాయం వస్తుంది. కార్మికులకు ఒక్క రూపాయి కూడా రావడం లేదు. సినిమా నుంచి వచ్చే ఆదాయంలో 20 శాతం కార్మికులకు ఇస్తేనే ఇకపై జీవో ఇస్తాం. సినిమా గొప్పగా రాణిస్తుందన్నా, కనకవర్షం కురుస్తుందన్నా అది కార్మికుల భాగస్వామ్యంతోనే. సినీ కార్మికులకు నిర్మాతలతో ప్రతిష్టంభన వచ్చినప్పుడు నిర్మాతల మండలిని పిలిచి.. కార్మికులు కష్టపడితేనే నిర్మాతలుగా నిలదొక్కుకుంటారని గుర్తు చేశాను. కార్మికులను కుటుంబ సభ్యులుగా చేసుకుంటేనే దర్శకులుగా, నిర్మాతలుగా రాణిస్తారని చెప్పాను. మీ కష్టాలను వంద శాతం తీర్చుతానని చెప్పడానికి నేను దేవుడిని కాదు. కానీ, వీలైనంత వరకు ప్రభుత్వం చేయగలిగిన పనులు తప్పకుండా చేస్తాను" అని సీఎం అన్నారు. సినీ కార్మికుల ఇళ్ల విషయంలో ఎలాంటి సహాయం చేయగలనో అంచనా వేసుకుంటానని తెలిపారు. కార్మికసంఘాల అసోసియేషన్ భవన్‌కు స్థలం కేటాయించి నిర్మాణానికి ఆర్థిక సాయం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఇక భారత్ ఫ్యూచర్ సిటీలో సినీ ఫైటర్స్ శిక్షణకు స్థలం కేటాయిస్తామని ప్రకటించారు. కార్మికులకు ఎప్పుడు ఆపద వచ్చినా తాను అండగా నిలబడతానన్నారు. ఇంకేమైనా సమస్యలుంటే నవంబరు చివరి వారంలో సంఘం నాయకులతో మరోసారి సమావేశమవుదామని, డిసెంబరు 9న సినీ కార్మికులకు ఏమేమి చేయబోతున్నామో ఆదేశాలిస్తామని చెప్పారు. అందరూ అండగా నిలబడితే హాలీవుడ్‌ను ఇక్కడికి తీసుకువచ్చే బాధ్యత తనదని అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ పాల్గొన్నారు.

1200 మంది హెల్త్ అసిస్టెంట్ల కాంట్రాక్టు ఉద్యోగాలు పదిలం

తెలంగాణ హైకోర్టు తీర్పును కొట్టివేసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, అక్టోబర్ 28 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ల నియామకానికి సంబంధించి తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును మంగళవారం సుప్రీంకోర్టు కొట్టివేసింది. కారుణ్య నియామకాల కింద భర్తీ అయిన 1200 మందిని కాంట్రాక్టు ఉద్యోగులుగా కొనసాగడానికి అనుమతి ఇచ్చింది. 2002లో అప్పటి ఉమ్మడి ఏపీ ప్రభుత్వం మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఉద్యోగాల భర్తీ ప్రక్రియపై కొంతమంది న్యాయస్థానాలను ఆశ్రయించారు. ట్రిబ్యునల్, హైకోర్టుల్లో పిటిషన్లు దాఖలయ్యాయి. ఎస్ఎస్సీతోపాటు గుర్తింపు పొందిన సంస్థ నుంచి డిప్లొమా ఇన్ హెల్త్ అసిస్టెంట్ అర్హతగా పేర్కొంటూ మెరిట్ జాబితాను సిద్ధం చేయాలని హైకోర్టు తీర్పు ఇచ్చింది. ఆ తీర్పును కొందరు సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు సైతం సమర్థించింది. ఈ క్రమంలో కారుణ్య నియామకాల కింద భర్తీ అయిన 1200 మందికి తగిన అర్హతలు లేవని చెప్పి వారిని ఉద్యోగాల్లో నుంచి తొలగిస్తూ 2012లో రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది. తమకు న్యాయం చేయాలని బాధితులు కోరడంతో వారిని కాంట్రాక్టు పద్ధతిన మళ్లీ ఉద్యోగాల్లోకి తీసుకుంటూ 2013లో మరో జీవో జారీ చేసింది. కాంట్రాక్టు పద్ధతిలోకి తీసుకుంటూ ఇచ్చిన జీవో చెల్లదని మరికొందరు మళ్లీ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఆ నియామకాలు చెల్లవని తెలంగాణ హైకోర్టు తీర్పునిస్తూ జీవోను రద్దు చేసింది. 90 రోజుల్లో తగిన అర్హులతో కూడిన మరో జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించింది. హైకోర్టు తీర్పును బాధితులు సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. హైకోర్టు తీర్పును అనుసరించి 1,200 మందిని ఉద్యోగాల నుంచి తొలగించాలని ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు ఉత్తర్వులు జారీచేశాయని తెలిపారు. గతంలో విచారించిన ధర్మాసనం తదుపరి ఉత్తర్వులు జారీ చేసేవరకు ఉద్యోగాల్లో కొనసాగించాలని స్పష్టం చేసింది. తాజాగా వాదనలు విన్న జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ అంజారియాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఆ 1200 మందిని కాంట్రాక్టు ఉద్యోగులుగా కొనసాగించాలని తీర్పు ఇచ్చింది.

సీఎం రేవంత్‌కు విధుశేఖర భారతీస్వామి ఆశీస్సులు

» వేములవాడ ఆలయ అభివృద్ధి వివరాలను ఆయనకు తెలిపిన ముఖ్యమంత్రి

రాంనగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ధర్మవిజయ యాత్రలో భాగంగా హైదరాబాద్‌లోని నల్లకుంట శంకరమఠానికి వచ్చిన శృంగేరి శారదా పీఠం ఉత్తరాధికారి విధుశేఖర భారతీ స్వామిని సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌లు మంగళవారం ఉదయం కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. సంప్రదాయ దుస్తులలో స్వామి వద్దకు వెళ్లిన సీఎం రేవంత్.. వేములవాడ ఆలయ అభివృద్ధి వివరాలను ఆయనకు వివరించారు. అలాగే.. శంకరమఠంలో జరిగిన పలు పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. శంకర మఠం పూజారులు ఆయనకు ఆశీర్వచనాలు పలికి, తీర్థప్రసాదాలు అందజేశారు.

హైదరాబాద్‌లో 'మెక్‌డొనాల్డ్స్ గ్లోబల్ ఆఫీస్'

» నేడు ప్రారంభించనున్న సీఎం రేవంత్

హైదరాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలో ఏర్పాటు కానున్న 'మెక్‌డొనాల్డ్స్ గ్లోబల్ ఆఫీస్'ను బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పాల్గొంటారు. ఫైనాన్స్, హ్యూమన్ రిసోర్స్, డేటా అనలిటిక్స్, ఏఐ టెక్నాలజీ వంటి గ్లోబల్ విభాగాల బృందాలకు ఈ కొత్త కార్పొరేట్ ఆఫీస్ నెలవుగా మారనుంది. హైటెక్ సిటీలోని ఆర్ఎంజడ్ నెక్సిటీలో 1.56లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ కార్యాలయం ఏర్పాటు కానుంది. ఈ గ్లోబల్ ఆఫీస్‌లోని మెక్‌డొనాల్డ్స్ సిబ్బంది.. ప్రతిరోజూ ప్రపంచంలోని 43,000 రెస్టారెంట్లు, 65 మిలియన్ల కస్టమర్లపై ప్రభావం చూపే సొల్యూషన్లపై పని చేయనున్నారు. ఇతర రాష్ట్రాలు పోటీ పడినా మెక్‌డొనాల్డ్స్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ హైదరాబాద్‌కు రావడంపై రాష్ట్ర ప్రభుత్వం హర్షం వ్యక్తం చేసింది.

జూబ్లీహిల్స్‌లో కుల సమీకరణం!

కులాల వారీగా ఓట్లపై దృష్టిపెట్టిన ప్రధాన పార్టీలు.. గంపగుత్తగా ఓట్లను మళ్లించేందుకు యత్నాలు

» వర్గాల వారీగా నేతలను రంగంలోకి దింపిన బీఆర్ఎస్

» మైనారిటీ ఓట్లను మళ్లించడానికి కాంగ్రెస్ తీవ్ర కసరత్తు

» కార్తిక భోజనాలకు పార్టీల ప్రణాళికలు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను అధికార కాంగ్రెస్‌తో పాటు బీఆర్ఎస్, బీజేపీ కూడా ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. ఓటర్లకు ఎడాపెడా హామీలు, తాయిలాలు మాత్రమే ఇస్తే సరిపోదని.. సామాజికవర్గాల వారీగా కూడా సంతృప్తిపర్చాలని భావిస్తున్నాయి. కులాలకు పెద్దపీట వేసి, ఓటర్లకు గాలం వేయాలని చూస్తున్నాయి. ఇందుకోసం కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు తీవ్రంగా కసరత్తులు చేస్తున్నాయి. కులాల వారీగా ఆకర్షించి, గంపగుత్తగా ఓట్లు వేయించుకోవడానికి శ్రమిస్తున్నాయి. ఇందులో భాగంగా కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు ఇప్పటికే కీలకమైన నేతలను రంగంలోకి దించాయి. బీజేపీ కూడా వివిధ సామాజిక వర్గాల ఓటర్లను ఏకతాటిపైకి తీసుకొచ్చే ప్రయత్నాలు ప్రారంభించింది. ఎన్నికల వేళ కార్తిక మాసం కూడా రావడంతో కులాల వారీగా పసందైన విందులకు ఆయా పార్టీలు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నాయి. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మొత్తం 4,01,365 మంది ఓటర్లు ఉండగా.. వారిలో పురుషులు 2,08,561, మహిళలు 1,92,779, ఇతరులు 25 మంది ఉన్నారు. సామాజిక వర్గాల వారీగా ఓటర్లను ఆకర్షించేందుకు ప్రధాన పార్టీలు అన్ని రకాల ప్రయత్నాలూ చేస్తున్నాయి. ఓటర్లలో బీసీలు 1.34 లక్షల మంది ఉండగా, ముస్లింలు 1.20 లక్షల మంది ఉన్నారు. కమ్మ సామాజిక వర్గ ఓట్లు 22,746 ఉన్నాయి. ఎస్సీ ఓట్లు 28,350 ఉండగా.. అందులో మాదిగ 15,693, మాల 12657 ఓట్లు ఉన్నాయి. రెడ్డి 17,641, లంబాడీ 11364, క్రైస్తవులు 19,396 మంది ఓటర్లున్నారు. ఆయా ఓట్లను దక్కించుకోవడానికి పార్టీల నేతలు కుల పెద్దలతో చర్చిస్తున్నారు. తమ పార్టీల్లో ఉన్న ఆయా కులాల నేతలను ఇన్‌చార్జిలుగా నియమించి, ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు తీవ్ర కసరత్తులు చేస్తున్నారు.

గంపగుత్తగా ఓట్లు వేయించుకునేందుకు..

బీఆర్ఎస్ అభ్యర్థిగా ఉన్న మాగంటి సునీత కమ్మ కులస్థురాలు కావడంతో ఆ సామాజికవర్గం ఓట్లు తమకు గంపగుత్తగా వస్తాయని బీఆర్ఎస్ భావిస్తోంది. పార్టీకి చెందిన కమ్మ నేతలు పువ్వాడ అజయ్, ఇతరులను రంగంలోకి దించి సమావేశాలు జరుపుతోంది. కమ్మ ఓటర్లను తమ వైపు తిప్పుకోవడానికి ఇప్పటికే కాంగ్రెస్ అదే సామాజికవర్గానికి చెందిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావును రంగంలోకి దించింది. నియోజకవర్గానికి ఆనుకొని ఉన్న శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ కూడా తెరవెనక ప్రయత్నాలు మొదలుపెట్టినట్లుగా తెలుస్తోంది. ఇక కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ తన సామాజికవర్గ ఓట్లన్నీ తనకే పడతాయనే ధీమాలో ఉండగా.. బీఆర్ఎస్ మాత్రం ఆ ఓట్లను గండికొట్టేందుకు మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను రంగంలోకి దించింది. నవీన్‌యాదవ్‌కు బంధువైన తలసాని తన కులానికి చెందిన ఓట్లను ఏ మేరకు బీఆర్ఎస్‌కు పడేలా చేస్తారనే అంశం ఆసక్తికరంగా మారింది. బీజేపీ తరఫున లంకెల దీపక్‌రెడ్డి బరిలో ఉన్నారు. నియోజకవర్గంలో రెడ్డి ఓటర్లు కూడా పెద్ద సంఖ్యలో ఉండడంతో ఆయా ఓట్లను దక్కించుకోవడానికి కిషన్‌రెడ్డి దృష్టి సారించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ కూడా రెడ్డి ఓటర్లను తమ వైపు తిప్పుకునే ప్రయత్నాలు మొదలుపెట్టాయి. అయితే సీఎం రేవంత్‌రెడ్డికి ఉప ఎన్నిక ప్రతిష్ఠాత్మకంగా మారిన నేపథ్యంలో.. రెడ్ల ఓట్లు వన్‌సైడ్‌గా ఉంటాయా? లేక చీలిపోతాయా? అనే సందేహాలు నెలకొన్నాయి. మునుగోడు ఉప ఎన్నిక తరహాలోనే బీఆర్ఎస్ పార్టీ కులాల వారీగా తమ నేతలు, ఎమ్మెల్యేలను రంగంలోకి దింపి సంప్రదింపులు జరుపుతోంది. కాంగ్రెస్ కూడా మూడు నెలల నుంచి ఇన్‌చార్జిలుగా ముగ్గురు మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, వివేక్‌లతో పాటు 18 మంది కార్పొరేషన్ల చైర్మన్ల ద్వారా సామాజిక వర్గాల వారీగా పూర్తిస్థాయిలో వివరాలు సేకరించింది. ప్రస్తుతం కార్తిక మాసం కావడంతో కులాల వారీగా వన భోజనాలకు, సహపంక్తి భోజనాలకు అధిక ప్రాధాన్యం ఇస్తారు. ఈ కార్యక్రమాలను నిర్వహించడానికి కూడా ప్రధాన పార్టీలు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నాయి.

మైనారిటీల ఓట్లపై దృష్టి

నియోజకవర్గంలో మొత్తం ఓటర్లలో 1.20 లక్షల మంది ముస్లింలే ఉండడంతో వారి ఓట్లను గంపగుత్తగా దక్కించుకోవడానికి కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. ప్రస్తుతం కాంగ్రెస్ అభ్యర్థిగా ఉన్న నవీన్ యాదవ్ గతంలో మజ్లిస్ తరఫున పోటీ చేసి 40 వేలకు పైగా ఓట్లను సాధించారు. ప్రస్తుతం మజ్లిస్ కూడా కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తుండడంతో ముస్లిం ఓట్లన్నింటినీ దక్కించుకునే ప్రయత్నాలు మొదలుపెట్టారు. బీఆర్ఎస్ అభ్యర్థిగా గతంలో గెలిచిన మాగంటి గోపీనాథ్‌కు ముస్లిం ఓట్లు గంపగుత్తగా పడేవి. ఆయన మరణించిన నేపథ్యంలో ఆ సానుభూతితో ఓట్లను దక్కించుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే మజ్లిస్ నేతలను పార్టీలో చేర్చుకునే ప్రయత్నాలు మొదలుపెట్టారు. మాజీ మంత్రి మహమూద్ అలీ, సోహెల్ తదితర నేతలను రంగంలోకి దించారు.

మా మద్దతు కాంగ్రెస్‌కే

» సీఎం రేవంత్ మనకు గౌరవం ఇస్తున్నారు

» అలాంటి వ్యక్తిని ఆదరించడం మన బాధ్యత

» రేవంత్‌తో భేటీలో కమ్మ సంఘాల నేతలు

» కాంగ్రెస్ అభ్యర్థికే కృష్ణ, మహేశ్‌సేన మద్దతు



కమ్మ సంఘం నేతలనుద్దేశించి మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో మంత్రి తుమ్మల తదితరులు

హైదరాబాద్/బర్కత్‌పుర, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో తమ సంపూర్ణ మద్దతు కాంగ్రెస్ పార్టీకేనని కమ్మ సంఘాల నేతలు ప్రకటించారు. మంగళవారం సాయంత్రం జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో రాష్ట్ర, జిల్లాల కమ్మ సంఘాల నేతలంతా రేవంత్‌రెడ్డితో సమావేశమయ్యారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌ను భారీ మెజారిటీతో గెలిపిస్తామని సంఘం నేతలు చెప్పారు. ఈ సందర్భంగా కమ్మ సంఘాల నేతలు తమ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అమీర్‌పేటలోని మైత్రీవనంలో మాజీ సీఎం ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. నామినేటెడ్ పదవుల్లో కమ్మ సామాజికవర్గానికి తగిన ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మంత్రులు తుమ్మల, పొన్నం, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, కమ్మ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొడ్డు మధు, ఉపాధ్యక్షుడు బిక్కసాని నాగేశ్వరరావు, కమ్మ సంఘాల సమాఖ్య గౌరవ సలహాదారు కలగర శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. సీఎం రేవంత్‌తో భేటీకి ముందుగా కమ్మ సంఘాల నేతలు అంతర్గతంగా సమావేశమయ్యారు. అందులో 'సీఎం రేవంత్ మనకు గౌరవం ఇస్తున్నారు. అలాంటి వ్యక్తిని ఆదరించడం మన బాధ్యత' అనే అభిప్రాయం వ్యక్తం చేశారు. దీనికి సంఘం నేతలంతా ఏకీభవించడంతో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్‌కే మద్దతిస్తామని సీఎం రేవంత్‌కు చెప్పినట్లు సంఘం నేత ఒకరు చెప్పారు. కాగా, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌కు సూపర్‌స్టార్ కృష్ణ, మహేశ్ సేన సంపూర్ణ మద్దతు ప్రకటించింది.

తప్పుదోవ పట్టించే స్థిరాస్తి ప్రకటనలకు చెక్!

- పారదర్శకంగా రియల్ ఎస్టేట్ ప్రకటనలు
- టీజీ రెరా, ఏఎస్‌సీఐ మధ్య అవగాహన ఒప్పందం

హైదరాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థిరాస్తి వ్యాపార ప్రకటనల్లో పారదర్శకతను పెంచేందుకు తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ(టీజీ రెరా) రంగంలోకి దిగింది. ఈ విషయమై అడ్వర్టైజింగ్ స్టాండర్డ్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఏఎస్‌సీఐ)తో మంగళవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. కొనుగోలుదారుల క్షేమం కోసమే ఈ ఒప్పందం చేసుకున్నట్లు రెరా చైర్మన్ సత్యనారాయణ తెలిపారు. ఈ ఒప్పందంలో భాగంగా.. డిజిటల్ మాధ్యమాల్లో వస్తున్న అసత్య ప్రచారాలను, తప్పుదారి పట్టించే రియల్ ఎస్టేట్ ప్రకటనలను గుర్తించడం, పర్యవేక్షించడంతో పాటు తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కొనుగోలుదారుల సంరక్షణ, రెరా నిబంధనలు పాటించని రియల్ ఎస్టేట్ సంస్థలను నిలువరించేందుకు ఈ ఒప్పందం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఏఎస్‌సీఐ ఆధునిక సాంకేతికతతో తప్పుదారి పట్టించే ప్రకటనలను గుర్తించి, అప్రమత్తం చేస్తుందని తెలిపారు. ఆయా ప్రకటనలను రెరా అథారిటీకి పంపి చర్యలు తీసుకునేలా సిఫారసు చేస్తుందన్నారు.

డెవలపర్‌కు రెరా జరిమానా.. రద్దు చేసిన ట్రైబ్యునల్

హైదరాబాద్, అక్టోబరు 28(ఆంధ్ర జ్యోతి): ఓ రియల్ ఎస్టేట్ సంస్థకు రెరా విధించిన జరిమానాను అప్పీలేట్ ట్రైబ్యునల్ రద్దు చేసింది. షేక్‌పేటలో డెవలపర్‌కు, భూ యజమానికి మధ్య వివాదం తలెత్తింది. జీహెచ్‌ఎంసీ అనుమతులు, రెరా గుర్తింపు లేకుండా అమ్మకాలపై ప్రచారం చేస్తున్నారంటూ సనాలి హౌసింగ్ ప్రాజెక్టు ప్రైవేట్ లిమిటెడ్‌పై భూయజమాని ఫిర్యాదు చేశారు. పరిశీలించిన రెరా.. సనాలి సంస్థకు రూ.4.27లక్షల జరిమానా విధించింది. తక్కువ జరిమానా విధించారంటూ భూయజమాని, జరిమానా చట్టవిరుద్ధమని డెవలపర్.. రెరా అప్పీలేట్ ట్రైబ్యునల్‌ను ఆశ్రయించారు. విచారణ చేపట్టిన ట్రైబ్యునల్ చైర్‌పర్సన్ ఎ.సంతోష్‌రెడ్డి, సభ్యులు ప్రదీప్‌కుమార్‌రెడ్డి, చిత్రరామచంద్రన్ రెరా విధించిన జరిమానాను రద్దు చేస్తూ ఆదేశాలిచ్చారు. డెవలపర్ జమ చేసిన మొత్తాన్ని తిరిగి చెల్లించాలని..వివాదాన్ని సివిల్ కోర్టులో తేల్చుకోవాలని సూచించారు.

జాతీయ కెనోస్ప్రింట్ పోటీలు ప్రారంభం

- పాల్గొన్న వివిధ రాష్ట్రాల క్రీడాకారులు

హైదరాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ, తెలంగాణ గిరిజన సాంస్కృతిక పరిశోధనా సంస్థ, గిరిజన సంక్షేమశాఖలు సంయుక్త ఆధ్వర్యంలో హుస్సేన్‌సాగర్ వద్ద జాతీయ కెనోస్ప్రింట్ పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, అసోం, పంజాబ్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల ప్రతినిధులు, క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీలను మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు గిరిజన యువత స్వావలంబనకు మార్గం చూపుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడా రంగాన్ని ప్రోత్సహిస్తోందని చెప్పారు.

సౌదీలో సిద్దిపేట వాసి అనుమానాస్పద మృతి

- ఉరేసుకున్నాడని మిత్రుడి ఫోన్


ఎల్లయ్య (ఫైల్)

కొమురవెల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలంలోని కిష్టంపేట గ్రామానికి చెందిన కొయ్యడ ఎల్లయ్య (57) సౌదీ అరేబియాలో అనుమానాస్పదంగా మృతిచెందాడు. ఏడాదిన్నర క్రితం జీవనోపాధి కోసం సౌదీ వెళ్లిన ఎల్లయ్య ఈ నెల 25న చివరి సారిగా కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడాడు. ఈనెల 27న ఎల్లయ్యతో పాటు ఒకే గదిలో ఉంటున్న తోటి మిత్రుడు కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి ఎల్లయ్య ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని తెలియజేశాడు. మృతదేహపు ఫొటోలు కూడా పంపాడు. అయితే ఎల్లయ్య తమతో బాగానే మాట్లాడాడని, ఎలాంటి సమస్య లేదని చెప్పాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియక, ఎల్లయ్య మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

చేనేత మగ్గంపై 'క్యూఆర్ కోడ్'

- స్కాన్ చేస్తే మోదీ హయాంలో అభివృద్ధి ఫొటోలు
- నేత కళాకారుడు విజయ్ ప్రతిభ


మగ్గంపై క్యూఆర్ కోడ్ నేస్తున్న విజయ్

సిరిసిల్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్లకు చెందిన నేత కళాకారుడు నల్ల విజయ్ 'మోదీ మన నాడి' పేరుతో మరో అద్భుత రూపకల్పన చేశాడు. మోదీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను తెలిపే మొబైల్ యాప్‌ను హైదరాబాద్‌కు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సహకారంతో రూపొందించడంతో పాటు దానికి క్యూఆర్ కోడ్‌ను చేనేత మగ్గంపై నేసి తన అభిమానం చాటుకున్నాడు. కేంద్ర మంత్రి బండి సంజయ్ మంగళవారం కరీంనగర్‌లో ఈ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. విజయ్ చేనేత మగ్గంపై 32 అంగుళాల పొడవు, వెడల్పుతో పట్టు శాలువాపై క్యూఆర్ కోడ్‌ను నేశాడు. స్మార్ట్ ఫోన్‌తో క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే ఆ యాప్‌లో అయోధ్య రామ మందిరం, ఆపరేషన్ సిందూర్, డిజిటల్ ఇండియా, వందే భారత్ ఎక్స్‌ప్రెస్, చంద్రయాన్-3, స్వచ్ఛభారత్ తదితర కార్యక్రమాల ఫొటోలు కనిపిస్తాయి. విజయ్‌ను అభినందించిన బండి సంజయ్.. త్వరలోనే శాలువాను ప్రధాని మోదీకి అందజేస్తానని తెలిపారు.

విద్యుదాఘాతంతో టెకీ మృతి

ఆత్మకూరు(ఎం), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి విధులు నిర్వహిస్తున్న ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి విద్యుదాఘాతంతో మృతిచెందారు. ఆయన తండ్రి గాయాలతో బయటపడ్డారు. మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం లింగరాజుపల్లి గ్రామంలో ఈ ఘటన జరిగింది. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం లింగరాజుపల్లికి చెందిన భూషి నర్సింహ, శోభ దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు గణేశ్ (26) బెంగళూరుకు చెందిన సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఆరు నెలలుగా ఉద్యోగం చేస్తున్నారు. ప్రస్తుతం ఇంటి నుంచే విధులు నిర్వహిస్తున్నారు. నర్సింహ తన ఇంటికి ఇటీవల మరమ్మతులు చేయించారు. మంగళవారం ఇంటికి వెనుకభాగంలోని గోడకు ఉన్న 22 అడుగుల ఎత్తుగల ఇనుప పైపులను గణేశ్, నరసింహ అక్కడి నుంచి తీయబోయారు. ఈ క్రమంలో పట్టు తప్పి ఓ పైపు సమీపంలో ఉన్న ఎల్టీ విద్యుత్తు వైరుపై పడింది. ఈ ఘటనలో ఇద్దరూ విద్యుదాఘాతానికి గురయ్యారు. నరసింహకు చేతులు కాలాయి. తీవ్ర గాయాలతో అపస్మారక స్థితికి చేరుకున్న గణేశ్‌ను వలిగొండ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

టీసీఎస్ అయాన్‌తో అంబేడ్కర్ వర్సిటీ ఎంవోయూ

- అంబేడ్కర్ విశ్వవిద్యాలయ వీసీ ఘంటా చక్రపాణి

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ నైపుణ్యాల బోధనతో తమ విద్యార్థులకు ప్రఖ్యాత సంస్థల్లో ఉద్యోగాలు కల్పించడమే తమ లక్ష్యమని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ఘంటా చక్రపాణి చెప్పారు. ఆయన సమక్షంలో మంగళవారం యూనివర్సిటీలో టాటా కన్సల్టెన్సీ అయాన్ డైరెక్టర్ కృష్ణా దుండిగల్ల, వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎల్వీకే రెడ్డి అవగాహనా ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ఘంటా చక్రపాణి మాట్లాడుతూ టీసీఎస్ ఐఓఎస్‌తో అవగాహనా ఒప్పందంతో 2025-26 విద్యా సంవత్సరంలో బీఏ, బీఎస్సీ, బీకాం కోర్సుల్లో అడ్మిషన్ పొందిన విద్యార్థులంతా 'బీఆర్ఏఓయూ-టీసీఎస్ఐఓఎన్ ఇంటిగ్రేటెడ్ అచీవ్‌మెంట్ ప్రోగ్రామ్'లో చేరడానికి అవకాశమిస్తున్నట్లు తెలిపారు. కోర్సు పూర్తిచేసిన వారిలో 70% కంటే ఎక్కువ మంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు.

జానా మాటిచ్చారు.. రేవంత్ అమలు చేశారు

బలిమెల ఘటనలో అమరులైన గ్రేహౌండ్స్ కానిస్టేబుళ్లకు ఇళ్ల స్థలాల పట్టాలు అందజేత

- బాధిత కుటుంబాల 17 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెర
- ఇందల్వాయిలో మరో 9 మంది కుటుంబాలకు కేటాయింపు

హైదరాబాద్,అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి) బలిమెల ఘటనలో అమరులైన గ్రేహౌండ్స్ కానిస్టేబుళ్లకు చెందిన కుటుంబాల 17 ఏళ్ల కల నెరవేరింది. 2008లో ఏపీలోని బలిమెల రిజర్వాయర్ వద్ద గ్రేహౌండ్స్ బలగాలపై మావోయిస్టులు జరిపిన దాడిలో మృతిచెందిన 33 మంది కానిస్టేబుళ్ల కుటుంబసభ్యులకు 200 గజాల ఇళ్ల స్థలాల తాలూకు పట్టాలు అందాయి. ఈ నెల 21న అమర వీరుల దినోత్సవం సందర్భంగా ఆ కుటుంబాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందచేశారు. వాస్తవానికి గ్రేహౌండ్స్ పోలీసులు మరణించిన సమయంలో హోంమంత్రిగా ఉన్న జానారెడ్డి ఆ ఘటనలో మృతిచెందిన పోలీసుల కుటుంబసభ్యులకు 200 గజాల చొప్పున ఇళ్ల స్థలాలు ఇస్తామని అప్పట్లోనే ప్రకటించారు. నాటి నుంచి పలు ప్రభుత్వాలు మారినా ఆ హామీ పెండింగ్ ఫైళ్లకే పరిమితమైంది. ఈ క్రమంలో ఇటీవల డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన బి.శివధర్ రెడ్డి బలిమెల ఘటనలో మరణించిన పోలీసుల కుటుంబాలకు పెండింగ్‌లో ఉన్న ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. గాజులరామారాం వద్ద ఉన్న ప్రభుత్వ స్థలంలో 33మంది బాధిత పోలీసు కుటుంబాలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి వీలవుతుందన్న విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి శివధర్ రెడ్డి తీసుకెళ్లారు. దీనిపై సానుకూలంగా స్పందించిన సీఎం ఇళ్లస్థలాలు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలోనే రాష్ట్రవ్యాప్తంగా అమరులైన పోలీసు కుటుంబాలకు ఇంకా అందని ఇళ్ల స్థలాల ఫైళ్లను ఉన్నతాధికారులు పరిశీలించడం ప్రారంభించారు. దీంతో నిజామాబాద్ జిల్లాలో 1989 నుంచి ఇప్పటి వరకు 18మంది అమర పోలీసు కుటుంబాలు ఇళ్ల స్థలం కోసం నిరీక్షిస్తున్న ఫైనాన్ని గుర్తించి ఇటీవల అందులో 9 కుటుంబాలకు ఇందల్వాయి సమీపంలోని గన్నారంలో 200 గజాల ఇంటి స్థలం పట్టాను డీజీపీ శివధర్ రెడ్డి అందచేశారు. బలిమెల సంఘటన జరిగినపుడు తాను ఎస్ఐబీ డీఐజీగా ఉన్నానని అప్పటి ఆయా కుటుంబాల బాధ తాను మర్చిపోలేనని, అమర పోలీసుల ఇళ్ల స్థలాల సమస్యను మానవీయకోణంలో చూడాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సమస్యను వివరించగానే క్లియరెన్స్ ఇచ్చారని శివధర్‌రెడ్డి తెలిపారు. ఇలాగే త్వరలో ఇతర జిల్లాల్లోనూ పెండింగ్‌లో ఉన్న పోలీసు అమరవీరుల ఇళ్ల స్థలాల సమస్యను ముగిస్తామని ఆయన వివరించారు. ఈ క్రమంలో అన్ని జిల్లాల ఎస్పీలు, కమిషనర్లు తమ పరిధిలో అమర పోలీసులకు సంబంధించిన ఇళ్ల స్థలాల సమస్యలు పెండింగ్‌లో ఉంటే ఆ విషయాన్ని తెలియచేయాలని డీజీపీ కార్యాలయం నుంచి ఇటీవల ఆదేశాలు జారీ అయినట్లు తెలుస్తోంది.

80 టీఎంసీలు తరలించేలా తుమ్మిడి హెట్టి

(మొదటిపేజీ తరువాయి)


నీటి పారుదల ప్రాజెక్టులపై సమీక్షిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల పరిస్థితిపైనా ఆరా తీశారు. బ్యారేజీల మరమ్మతులకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ బాధ్యత సంబంధిత ఏజెన్సీలదేనని, ఆ మేరకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీని 149 మీటర్ల ఎత్తుతో కడితేనే 88.72 టీఎంసీల నీటిని తరలించడానికి అవకాశం ఉంటుందని సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ (సీడీవో) సీఈ ఎం.సత్యనారాయణరెడ్డి సీఎంకు తెలిపారు. 149.50 మీటర్ల ఎత్తుతో నిర్మిస్తే 108.58 టీఎంసీలు, 150 మీటర్ల ఎత్తుతో కడితే 129.23 టీఎంసీల దాకా తరలించడానికి వీలుంటుందని వివరించారు. దీనిపై రేవంత్‌రెడ్డి స్పందిస్తూ.. 148 మీటర్ల ఎత్తుతో కట్టడానికి మహారాష్ట్రతో సంప్రదింపులు చేయాల్సిన అవసరం లేదని, ఇదివరకే అంగీకారం తెలిపిందని గుర్తుచేశారు. నిర్దేశిత లక్ష్యం మేరకు నీటిని తరలించాలంటే కచ్చితంగా తుమ్మిడి హెట్టి బ్యారేజీని 150 మీటర్లతో కట్టడానికి వీలుగా ప్రణాళికలు సిద్ధం చేయాలని, ఆ తర్వాతే మహారాష్ట్ర సీఎంను కలిసి, ఆమోదం కోసం ప్రయత్నించాలని అధికారులకు స్పష్టం చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సాగు, తాగునీరు అందించేలా ఈ ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. పాత పనులను ఉపయోగించుకుంటూ ముందుకెళ్లేందుకు వీలుగా అంచనాలను రూపొందించాలని సూచించారు. తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లికి నేరుగా నీటిని తరలించాలా? లేక సుందిళ్ల నుంచి ఎల్లంపల్లికి తరలించాలా? అనే దానిపైనా చర్చ జరిగింది. తుమ్మిడి హెట్టి నుంచి నేరుగా ఎల్లంపల్లికి నీటిని తరలించాలంటే మైలారం వద్ద 30 మెగావాట్ల సామర్థ్యంతో 12 మోటార్లతో పంప్‌హౌస్ కట్టాల్సి ఉంటుందని, ఆ తర్వాత మంచిర్యాల మీదుగా గ్రావిటీ కెనాల్ వెళుతున్నందున, భూసేకరణకు భారీగా నిధులు అవసరం అవుతాయని అధికారులు నివేదించారు. అలా కాకుండా తుమ్మిడిహెట్టి నుంచి మైలారం దాకా గ్రావిటీతో వచ్చే నీటిని 20.6 కిలోమీటర్ల మేర టన్నెల్ తవ్వి.. టేకుమట్ల వాగులో పోస్తే, సుందిళ్లకు చేరతాయని.. అక్కడి నుంచి నీటిని తరలించడానికి వీలుగా కాసిపేటలో పంప్‌హౌస్ ఉందని, సుందిళ్లలో సీపేజీల కట్టడికి గ్రౌటింగ్ చేసుకుంటే బ్యారేజీ సిద్ధమవుతుందని అధికారులు తెలిపారు. ఇందుకు అవసరమైన ప్రణాళికలు, అంచనాలు సిద్ధం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణం కోసం సాంకేతిక ప్రణాళికలు రూపొందించి, నవంబరులో మహారాష్ట్ర సీఎంను కలవడానికి వీలుగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి ప్రధానమంత్రి కృషి సించాయ్ యోజన (పీఎంకేఎస్‌వై-ఏఐబీపీ) కింద సహాయం అందుకోవడానికి వీలుగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సీఎం రేవంత్ అధికారులను ఆదేశించారు. ఇప్పటికే చనకా-కొరాటా, చిన్నకాళేశ్వరం, మొడికుంటవాగు, సీతారామ ఎత్తిపోతల పథకానికి సాంకేతిక సలహా కమిటీ (టీఏసీ) అనుమతులు వచ్చాయని, పెట్టుబడుల అనుమతులు పొందడానికి వీలుగా దరఖాస్తులు సమర్పించినట్లు చెప్పగా.. పెండింగ్ ప్రాజెక్టులన్నింటికీ సాయం అందుకునేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సీఎం నిర్దేశించారు.

సమగ్ర నివేదిక సిద్ధం చేయండి

జాతీయ ఆనకట్టల భద్రత చట్టం-2021లోని సెక్షన్-38(1) ప్రకారం ప్రాజెక్టులు ఏ విధంగా ఉన్నాయనే దానిపై నివేదికలు సిద్ధం చేసి, నిర్ణీత వ్యవధిలోగా కేంద్ర వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని సీఎం ఎ.రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఏ ప్రాజెక్టులో ఏయే సమస్యలు ఉన్నాయనేదానిపై నిపుణులతో మూల్యాంకనం జరిపించాలన్నారు. సమగ్ర ప్రాజెక్టుల రక్షణ మూల్యాంకనం (సీడీఎస్ఈ)పై కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ రాసిన లేఖపైనా సీఎం సమీక్ష చేశారు. ఎన్‌డీఎస్‌ఏ చట్టంలోని సెక్షన్-38(1) ప్రకారం నిర్దిష్ట డ్యామ్ పరిస్థితి ఎలా ఉందనే దానిపై డ్యామ్ సేఫ్టీ రివ్యూ ప్యానెల్ (డీఎస్ఆర్‌పీ) ద్వారా మూల్యాంకనం చేయించాల్సి ఉంటుందని, డ్యామ్ ఎలా ఉందో గుర్తించడంతో పాటు దాని రక్షణకు పనులు చేపట్టడం దీని బాధ్యత అని, ఈ చట్టం అమల్లోకి వచ్చిన ఐదేళ్ల లోపు ప్రతి డ్యామ్‌కు సంబంధించిన రక్షణ నివేదికలు అందించాల్సి ఉంటుందని, ఈ గడువు 2026 డిసెంబరు కల్లా పూర్తికానుందని, రాష్ట్రంలో నివేదికలు సంతృప్తికర స్థాయిలో లేవని కేంద్ర మంత్రి పాటిల్ ఈ నెల 17న సీఎం రేవంత్‌కు లేఖ రాశారు. రాష్ట్రంలో 173 ప్రాజెక్టులు స్పెసిఫైడ్ డ్యామ్‌ల జాబితాలో ఉన్నాయని.. నివేదికలు అందించడానికి ఇంకా 15 నెలల సమయమే ఉందని గుర్తు చేశారు. సమగ్ర డ్యామ్ భద్రత మూల్యాంకనానికి అవసరమైన వివరాలు కావాలంటే అందిస్తామని, సాంకేతిక నైపుణ్యం సమకూర్చడానికి ఎన్డీఎస్ఏ సిద్ధంగా ఉందని సీఎంకు గుర్తు చేశారు. ఈ క్రమంలో కేంద్ర మంత్రి ప్రస్తావించిన అంశాలపై రేవంత్ స్పందించారు. స్పెసిఫైడ్ డ్యామ్‌ల జాబితాలోని ప్రాజెక్టుల కట్టలు ఎలా ఉన్నాయి? గేట్ల పరిస్థితేంటి? నిర్వహణ..? వంటి అంశాలపై సమగ్ర వివరాలతో నివేదికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. సమస్యలపై వచ్చే నెలలో సమీక్షించి, తగిన చర్యలు తీసుకుందామని స్పష్టం చేశారు. సింగూరు ప్రాజెక్టు మరమ్మతుల కోసం ఏడాదిపాటు క్రాప్ హాలిడే ప్రకటించాల్సి ఉంటుందని, దీనిపై కమిటీ వేయాలని ఆదేశించారు. నివేదిక వచ్చాక మరమ్మతులు చేయించాలన్నారు.

ప్రభుత్వ భూములపై జీఐఎస్ ఫోకస్

- కోటికిపైగా ఎకరాలకు డిజిటల్ రికార్డులు
- శాటిలైట్, డ్రోన్ వినియోగంతో భూమి ఆకృతి, విస్తీర్ణంపై స్పష్టత
- మూడు నెలల్లో పూర్తి చేయాలని అధికారులకు సీసీఎల్ఏ లోకేశ్‌కుమార్ ఆదేశం

హైదరాబాద్, అక్టోబరు 28 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ భూములకు మూడు నెలల్లో జియోగ్రఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (జీఐఎస్) ఆధారిత డిజిటల్ రికార్డులను సిద్ధం చేయాలని అధికారులను భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) డీఎస్ లోకేశ్‌కుమార్ ఆదేశించారు. అన్ని జిల్లాల పరిధిలో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించి.. వాటి సరిహద్దులు, కో-ఆర్డినేట్స్‌తో మ్యాప్‌లను రూపొందించి, డిజిటలైజ్ చేయాలని ఇటీవల అదనపు కలెక్టర్ల (రెవెన్యూ)తో జరిగిన సమీక్షలో సూచించారు. ఇప్పటికే యాదాద్రి జిల్లాలో దీనికి సంబంధించిన ప్రక్రియను ప్రారంభించగా.. మిగతా జిల్లాల్లో కార్యచరణ ప్రారంభించారు. ప్రతి సోమవారం ఈ అంశంపై రెవెన్యూ కార్యదర్శి సమీక్షించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా దేవాదాయ, వక్ఫ్, అటవీ భూములను విభాగాల వారీగా గుర్తించి.. వాటికి సంబంధించిన రికార్డులన్నీ డిజిటలైజ్ చేయనున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 12,39,485 భాగాలుగా ప్రభుత్వ భూములు ఉన్నాయి. మొత్తంగా 1.09 కోట్ల ఎకరాల మేర భూమి ఉన్నట్టు రెవెన్యూ శాఖ గుర్తించింది. జీఐఎస్ ఆధారిత రికార్డులలో భూమి వివరాలు, సర్వే నంబర్లు, సరిహద్దుల వివరాలు, వాటి యాజమాన్య వివరాలన్నీ డిజిటల్ రూపంలో భద్రపరుస్తారు. శాటిలైట్, డ్రోన్లతో ప్రతి ఎకరానికి సంబంధించి సర్వే మ్యాప్‌లను డిజిటలైజ్ చేయడం, ప్రతి సర్వే నంబరు హద్దుల కో-ఆర్డినేట్స్‌ను సేకరించి డిజిటలైజ్ చేయనున్నారు. దీనితో అటవీ, రెవెన్యూ శాఖల మధ్య, రైతులకు, అటవీ శాఖకు ఉండే వివాదాలకు పరిష్కారం లభిస్తుందని అధికారులు చెబుతున్నారు. ఆయా జిల్లాల్లో ప్రభుత్వ ల్యాండ్ బ్యాంక్ వివరాలను వెంటనే తెలుసుకునే అవకాశం ఉంటుందని అంటున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో వ్యవసాయ భూములు 1,52,95,077 ఎకరాలు, పాస్ పుస్తకం లేని సాగు భూములు 18,29,133ఎకరాలు, నాలా భూములు 2,75,392 ఎకరాలు, ప్రభుత్వ భూములు 1.09కోట్ల ఎకరాలు ఉన్నాయి.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గౌతమ్

వివిధ దశల్లో 2.25 లక్షల ఇందిరమ్మ ఇళ్లు

- లబ్ధిదారులకు రూ.2,526 కోట్ల సాయం
- హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ గౌతమ్ వెల్లడి

హైదరాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడతలో అనుమతించిన 3 లక్షల ఇందిరమ్మ ఇళ్లలో 2.25 లక్షల నివాసాలు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వి.పి.గౌతమ్ పేర్కొన్నారు. వీటికోసం రూ.2,526 కోట్లను లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం పురోగతిపై మంగళవారం హైదరాబాద్‌లోని హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో ఎండీ గౌతమ్ మీడియాతో మాట్లాడారు. ఇసుక సమస్యలకు పరిష్కారంగా మైనింగ్ శాఖ ఆధ్వర్యంలోని సాండ్ ట్యాక్స్ యాప్‌తో ఇందిరమ్మ ఇళ్ల యాప్‌ను అనుసంధానం చేయనున్నట్టు తెలిపారు. ఇల్లు మంజూరై, పునాది దశ వరకు నిర్మించుకునేందుకు ఆర్థికంగా ఇబ్బందిపడే 21,993 మంది లబ్ధిదారులకు స్వయం సహాయక సంఘాల ద్వారా రూ.237 కోట్ల మేర సాయం అందించామన్నారు. జీహెచ్ఎంసీలో ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు విధానంపై నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. రెండుపడక గదుల ఇళ్లను లబ్ధిదారులకు అందించే ప్రక్రియను త్వరలో పూర్తి చేయనున్నట్టు చెప్పారు. మూసీ రివర్ ఫ్రంట్‌లో ఇళ్లు కోల్పోయే వారికి మంజూరు చేసిన 15వేల ఇళ్ల కేటాయింపులపై సంబంధిత అధికారులు నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. ఇళ్లనిర్మాణానికి అవసరమైన ఉక్కు, సిమెంటు ధరల విషయంలో కంపెనీలతో చర్చిస్తున్నామన్నారు. ధరల నియంత్రణతో పాటు సామాగ్రి ధరలను పెంచకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో సీఈ చైతన్య, కన్సల్టెంట్ ఈశ్వరయ్య పాల్గొన్నారు.

బిల్లుల చెల్లింపునకు 'పెనీడ్రాప్' విధానం

రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు దశల వారీగా బిల్లుల చెల్లింపునకు కొత్త విధానాన్ని అవలంబిస్తోంది. వారు నమోదుచేసిన బ్యాంకు ఖాతా ఆధార్‌తో అనుసంధానమైందా లేదాఅని ముందుగా పరిశీలిస్తారు. ఆ తరువాత నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ)తో పాటు మరో సంస్థతో చేసుకున్న ఒప్పందం మేరకు లబ్ధిదారుని ఖాతాకు మొదటగా 'ఒక్క రూపాయి'ని జమచేస్తారు. అది వారికి చేరిందని నిర్ధారించుకున్న తరువాత మిగిలిన సొమ్ము జమచేస్తున్నామని, దీనిని 'పెనీడ్రాప్' విధానం అంటారని గౌతమ్ తెలిపారు. దీంతో నిధుల జమ విషయంలో అవినీతికి ఆస్కారం ఉండదన్నారు.

గ్లోబల్ రిఫైనింగ్ హబ్‌గా భారత్

- రానున్న దశాబ్దాల్లో ప్రపంచ ఇంధన గిరాకీలో 30% అవసరాలను తీర్చనున్నది మన దేశమే: కేంద్రమంత్రి హర్దీప్ సింగ్
- హైదరాబాద్‌లో ప్రారంభమైన ఎనర్జీ టెక్నాలజీ మీట్‌లో వెల్లడి



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరీ

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): భారత పెట్రోలియం, ఇంధన రంగం విప్లవాత్మక మార్పు దిశగా పయనిస్తోందని.. అంతర్జాతీయ ఇంధన భవిష్యత్తును మలచడంలో కీలకపాత్ర పోషించబోతోందని, ప్రపంచ రిఫైనింగ్, ఇంధన కేంద్రంగా మనదేశం ఎదగబోతోందని కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పురీ అన్నారు. ప్రపంచ ఇంధన మార్కెట్ రాబోయేకాలంలో నిదానంగా పెరుగుతుందని.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న 420 రిఫైనరీలలో 101 రిఫైనరీలు 2035 నాటికి మూత పడే పరిస్థితి ఉందని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో భారత్ రిఫైనింగ్ రంగంలో కీలకంగా మారుతుందని, రానున్న దశాబ్దాల్లో ప్రపంచ ఇంధన గిరాకీలో 30 నుంచి 33 శాతాన్ని భారతదేశమే తీరుస్తుందని ఆయన వివరించారు. మాదాపూర్‌లోని హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ (హెచ్ఐసీసీ)లో మూడురోజులపాటు జరిగే 28వ ఎనర్జీ టెక్నాలజీ మీట్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడినాయన.. రిఫైనింగ్ రంగంలో మనం 4వ స్థానంలో ఉన్నామని, మనం 40 దేశాల నుంచి ముడి చమురు దిగుమతి చేసుకుని 50 దేశాలకు పెట్రో ఉత్పత్తులను ఎగుమతులు చేస్తున్నామని, 45 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని ఆర్జిస్తున్నామని వెల్లడించారు. అంతర్జాతీయంగా టాప్-7 ఎగుమతిదారులలో నాలుగో స్థానంలో నిలిచామని.. త్వరలోనే టాప్ 3లోకి చేరబోతున్నామని చెప్పారు. ప్రస్తుతం ఏడాదికి 258 మిలియన్ టన్నులుగా ఉన్న మన రిఫైనింగ్ సామర్థ్యం.. 2030 నాటికి 310 మిలియన్ టన్నులకు పెరగనుందని అంచనా వేశారు. దీర్ఘకాలంలో ఆ సామర్థ్యాన్ని 400 నుంచి 450 మిలియన్ టన్నులకు చేర్చేలా ప్రణాళికలు రచిస్తున్నామని చెప్పారు. దేశంలో పెట్రోలియం వినియోగం పెరుగుతోందని.. ప్రస్తుతం రోజుకు 5.6 మిలియన్ బారెళ్లుగా ఉన్న వినియోగం త్వరలోనే 6 మిలియన్ బ్యారెళ్ల స్థాయికి చేరనుందని తెలిపారు. అనంతరం రిఫైనరీలకు సంబంధించి పలు విభాగాలలో అవార్డులను ఆయన అందజేశారు. బీపీసీఎల్, ఇండియన్ ఆయిల్ తో పాటుగా హెచ్‌పీ, నయారా కంపెనీలు అధిక శాతం అవార్డులను గెలుచుకున్నాయి.

హెల్త్ హబ్‌గా భారత్



- 2025నాటికి భారత వైద్య రంగం విలువ రూ.54.67 లక్షల కోట్లు
- 6.3 మిలియన్ కొత్త ఉద్యోగాలు
- ఐబీఈఎఫ్ నివేదిక వెల్లడి

హైదరాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): దేశ ఆరోగ్య సంరక్షణ రంగం అనూహ్య వృద్ధిని నమోదు చేస్తోందని ఇండియా బ్రాండ్ ఈక్విటీ ఫౌండేషన్ (ఐబీఈఎఫ్) తాజా నివేదిక వెల్లడించింది. భారీ డిమాండ్, ఆకర్షణీయమైన పెట్టుబడి అవకాశాలు, పెరుగుతున్న మానవ వనరులు, ప్రభుత్వ విధానాలు ఈ రంగం వృద్ధికి కారణమని పేర్కొంది. 2016లో రూ.9.42 లక్షల కోట్లు ఉన్న ఈ రంగం విలువ 2023 నాటికి ఏకంగా రూ.31.87 లక్షల కోట్లకు చేరిందని తెలిపింది. ఇది 17.5 నుంచి 22.5 శాతం వార్షిక వృద్ధి రేటుతో ఈ ఏడాది చివరి నాటికి రూ.54.67 లక్షల కోట్లకు చేరుకుంటుందని అంచనా వేసింది. 2022లో జీడీపీలో 3.3 శాతం ఉన్న ఆరోగ్య సంరక్షణ వ్యయం 2030 నాటికి 5 శాతానికి పెరుగుతుందని పేర్కొంది. 'దేశీయంగా, అంతర్జాతీయంగా భారత వైద్య నిపుణుల కోసం డిమాండ్ 2030 నాటికి రెండింతలుకానుంది. ప్రస్తుతమున్న సిబ్బంది కొరతను అధిగమించేందుకు అదనంగా 15.4లక్షల మంది డాక్టర్లు, 24లక్షల మంది నర్సులు తక్షణమే అవసరం. ప్రతీ వెయ్యి మందికి మూడు పడకల లక్ష్యాన్ని చేరుకోవాలంటే 2025నాటికి 30 లక్షల అదనపు పడకలు అవసరమవుతాయ'ని వివరించింది.

పెట్టుబడుల ప్రవాహం

వైద్య రంగంలో ప్రభుత్వ వ్యయం కొంత తగ్గిందని ఐబీఈఎఫ్ నివేదిక వెల్లడించింది. అదే సమయంలో ప్రైవేటు పెట్టుబడులు మాత్రం రికార్డు స్థాయిలో వస్తున్నట్లు పేర్కొంది. 'వచ్చే ఏడాది చివరి నాటికి ప్రైవేటు ఆస్పత్రుల్లో రూ.11,500 కోట్ల పెట్టుబడులతో కొత్తగా 4,000 పడకలు అందుబాటులోకి రానున్నాయి. 2000-25 మధ్య కాలంలో డ్రగ్స్ ఫార్మాస్యూటికల్స్ రంగంలో రూ.2.10 లక్షల కోట్లు, ఆస్పత్రులు, డయాగ్నస్టిక్ కేంద్రాల్లో రూ.1.04 లక్షల కోట్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు వచ్చాయి. ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో ఔషధ, హెల్త్‌కేర్ రంగంలో స్పెషాలిటీ ఫార్మా, బయోటెక్, డిజిటల్ హెల్త్ వంటి కీలక రంగాల్లో 71 ఒప్పందాల ద్వారా రూ.22,279 కోట్ల విలువైన లావాదేవీలు జరిగాయి. గత ఏడాది చివరి నాటికి దేశంలో హెల్త్‌కేర్ సిబ్బంది సంఖ్య 60 లక్షలు దాటింది. 2030 నాటికి అదనంగా మరో 63 లక్షల ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం ప్రతీ 811 మందికి ఒక వైద్యుడు ఉన్నారు. దేశవ్యాప్తంగా 1,18,190 ఎంబీబీఎస్ సీట్లు, 74306 పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ) సీట్లు అందుబాటులో ఉన్నాయ'ని వివరించింది. గత ఏడాది రూ.75,658 కోట్లు ఉన్న భారతీయ డిజిటల్ హెల్త్ మార్కెట్ విలువ 2033 నాటికి రూ.4.11లక్షల కోట్లకు చేరుతుందని ఐబీఈఎఫ్ అంచనా వేసింది. టెలిమెడిసిన్ రంగం 2025 నాటికి రూ.47,130 కోట్లు విలువ దాటుతుందని పేర్కొంది. 'గత ఏడాది 7.69 బిలియన్ డాలర్లు ఉన్న మెడికల్ టూరిజం విలువ 2029 నాటికి 14.31బిలియన్ల డాలర్లకు చేరుకుంటుంది. 2023లో దాదాపు 6.34లక్షల మంది విదేశీయులు వివిధ చికిత్సల కోసం భారత్‌కు వచ్చారు. ఆరోగ్య బీమా ప్రీమియంలు స్థిరంగా పెరుగుతున్నాయి. ఈ ఏడాది మొత్తం ప్రీమియం రూ.1,18,688 కోట్లుగా నమోదైంది'అని పేర్కొంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.